పరమసంత్ పరమ దయాల్
పండిత్ ఫకీర్ చంద్‌జీ మహారాజ్

# సత్సంగ సుధ

(తొమ్మిదవ భాగం)

హిందీ మూలం

**సంత్‌మతం - ఆత్మానుభూతి**

అనువాదం

**జ్యోతిరాణి**

ప్రోత్సాహకులు

**దయాల్ ఆనందరావు మహారాజ్**
**దయాల్ శివమంగళ్ సింగ్ మహారాజ్**

ప్రకాశకులు
**శివ సాహిత్య ప్రకాశన మండలి**
రాధాస్వామి సత్సంగ భవనం
ప్లాట్ నెం. 7, ఏ.ఓ.సి. గేట్
వెస్ట్ మారేడ్ పల్లి, సికింద్రాబాద్.

# పరమ సంత్ పరమ దయాళ్ పండిత్ ఫకీర్ చంద్‌జీ మహారాజ్ సందేశం

1. నీ నడవడిని, ప్రవర్తనను పవిత్రంగా ఉంచుకో! మనిషివి కా!
2. సదా ఆశావాదివై ఉండాలి.
3. స్మరణ మనసును శాంతింపచేస్తుంది.
4. మనసు, వాక్కు, కర్మల ద్వారా పరిశుద్ధంగా ఉండాలి.
5. నీ వ్యక్తిగత స్వార్థం కోసం ఇతరులను మోసగించకు.
6. నీ శరీరం హరిమందిరం. ప్రభువు స్వయంగా ఇందులో కొలువై ఉన్నాడు. ఆయన్ని అన్వేషించు. అవశ్యం లభిస్తాడు.
7. ఆత్మ-పరమాత్మల కలయికలో మనసే ఆటంకం అవుతుంది. మనసును వశం చేసుకో. ఆత్మ తనకు తానుగా పరమాత్మ వైపు ఆకర్షింపబడుతుంది.
8. సాధారణమైన, సరళమైన జీవనం గడుపుతూ ఉన్నతంగా ఆలోచించు.
9. అసహ్యాన్ని అసహ్యంతో తొలగించటం అసాధ్యం.
10. నీవిచ్చిన మాటను నిలబెట్టుకో. అదే మానవత.
11. కర్మ నియమం నుండి ఎవరూ తప్పించుకోలేరు.
12. నీ కోసం నీవు ఆచరించని అంశాన్ని ఇతరులకు ఎన్నటికీ వర్తింపచేయకు. నీవు పాటించని సూత్రం ఇతరులు పాటించాలని అనుకోకు.
13. నీ భారం ఇతరులపై పడదోసే ప్రయత్నం చేయకు.
14. సదా శుభసంకల్పం చేయాలి.
15. నీకు ఎవరిమీద విశ్వాసం కుదిరితే వారిని ఒక్కరినే పరిపూర్ణంగా నమ్ముకో. ఈ రోజు దేవిని, రేపు రాముణ్ణి, ఎల్లుండి కృష్ణుణ్ణి, ఆ తరువాత బాబాజీని విశ్వసించి పూజిస్తే నీ పరిస్థితి రెంటన చెడిన రేవడిలా ఉంటుంది.
16. ఇతరుల సొమ్మును ఆశించకు.
17. ఎవరి భోజనం వారే సంపాదించుకుని తినాలి.
18. స్త్రీలే జాతి నిర్మాతలు. సత్సంతానానికి జన్మనివ్వండి.

19. సత్యమైన సత్పురుషుడైన సద్గురువు శరణు వేడుకో. మోసగించే గురువుల బారి నుండి తప్పించుకో.

20. నామం జపించే ముందు నిష్కల్మషుడవు, నిజాయితీ పరుడవు కావటం తప్పనిసరి. మనసులో భేద భావాలకు, ఈర్ష్యా ద్వేషాలకు చోటివ్వకు. దానిని పవిత్రంగా ఉంచుకో. ఒకవైపు నామం జపిస్తూ, మరొక వైపు హానికరమైన ఆలోచనలు, కర్మలు చేస్తే ఆ నామమే నీకు హానిని కలిగిస్తుంది.

21. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం అభ్యాసం చేయి.

22. గురుచరణాలే ప్రకాశం. బుద్ధి, జ్ఞానం, వివేకములే గురునామం. అంతరంలో ప్రకాశాన్ని దర్శించుకో.

23. ప్రతిరోజూ దానం చేయి. నీ పేదరికం తొలగిపోతుంది.

24. ఇళ్ళల్లో శాంతి ఉండేలా చూడు. కలహాలు జరిగే ఇంట్లో ఏదో ఒక ఆపద, నష్టం సంభవించి తీరుతుంది.

25. ఎలాంటి కర్మచేస్తావో అలాంటి ఫలితం అనుభవించక తప్పదు.

26. పూర్వజన్మలోనో, ఈ జన్మలోనో నీవు చేసిన కర్మల ఫలితమే నీకు లభిస్తుంది. అంతే! నిన్నెవరూ కష్టపెట్టరు. సుఖపెట్టరు.

27. సంపూర్ణ విశ్వాసంతో నీ గురువును అంతరంలో సాక్షాత్కరింపచేసుకుని జనన మరణాల చక్రం నుండి విముక్తి పొందడానికీ, నిజగృహానికి చేరుకోవడానికి ప్రయత్నించాలి.

28. నేనెవరిని? ఎక్కడి నుండి వచ్చాను? ఎక్కడికి వెళ్తాను? అసలైన భగవంతుడెవరు? ఎక్కడుంటాడు? నిజగృహానికి ఎలా చేరుకోగలను? అని ప్రతి మనిషీ ఆలోచించాలి.

29. గురువును మనిషి అనుకోకు. ఆయన సర్వాధారుడైన పరమాత్ముడని విశ్వసిస్తేనే నీవు ఇహపరాలలో జయం పొందుతావు.

30. మానసిక, శారీరిక బ్రహ్మచర్యాన్ని విధిగా పాటించు.

31. క్షమ, ప్రేమ, శుభ సంకల్పం, శరణాగతి, నిష్కామకర్మ, బ్రహ్మచర్య పాలన నిన్ను ఉద్ధరిస్తాయి.

32. సంత్ మతంలోకి రావాలనుకంటే ముందుగా నీవు చేయవలసిన పని

ఒకటుంది. మాంసభోజనం, మద్యపానం, వ్యభిచారం, దొంగతనం ఈ నాలుగు అలవాట్లనూ వదిలితీరాలి. లేకుంటే సాధన జరగదు.

33. నీవు ఎవరికైనా ఋణపడి ఉంటే వెంటనే చెల్లించు. ఎదుటివారు మరిచిపోతేనో, అడగకపోతేనో నీవు తిరిగి ఇవ్వకుంటే నిన్ను ఏ భగవంతుడూ, ఏ గురువూ, ఏ సంత్ మహాత్ముడూ రక్షించలేడు. ఆ ఋణం తీర్చడం కోసమైనా నీవు మరో జన్మ ఎత్తవలసి వస్తుంది.

34. సదా సజ్జన సాంగత్యములో ఉండాలి.

35. మనం అందరం ప్రకాశస్వరూపులమే!

36. పరమతత్వాధారుణ్ణి కలుసుకోవాలనే తపన కలిగినవారే దుఃఖజీవులు. అలాంటి వారిని గురుదేశానికి తీసుకుపొమ్మని నా గురువు నన్ను ఆదేశించాడు.

37. ఏదైనా పనిని ప్రారంభించదలుచుకుంటే అది తప్పక విజయవంతం అవుతుందన్న ప్రగాఢ విశ్వాసంతో మొదలుపెట్టు. అవుతుందో, కాదోననే సంశయాలను వదలి దానిని ప్రారంభిస్తే జయం కలుగుతుంది.

38. గురుధారణ చేయడమంటే గురువు కాళ్ళకు తలవంచి మొక్కడం కాదు. గురువచనాలను ఆచరించడం!

39. సత్యమార్గాన్ని చూపించడం, వాస్తవాన్ని బోధించడం నా కర్తవ్యం. చెప్పటం వరకే నా బాధ్యత. ఆచరించే వంతు మీదే!

40. ఈ భవసాగరం నుండి నిన్ను బయటికి లాగగలిగే సమర్థుడు సద్గురువే.

41. మనిషి తన భారాన్ని ఇతరులపై వేయకూడదు. ఇదే మానవత. మీ స్వార్థం కోసం మీ సంబంధితులను వేధించటం అపరాధం.

42. జనన మరణాల చక్రం నుండి, 84 లక్షల చక్రం నుండి తప్పించుకోవాలనుకున్నవారే నా వద్దకు రావాలి. గురు సేవ చేయాలి. గురువును సేవించకుంటే ఏమీ లభించదు.

43. గురు సేవ ఎలా చేయాలి? గురువును దర్శించుకుని ఆయన వచనాలను శ్రద్ధగా వినాలి. ఆ తరువాత మననం చేసుకోవాలి. వాటిలోని సారాన్ని జీర్ణించుకోవాలి. ఆచరించాలి. అప్పుడే నీ పడవ తీరం చేరుతుంది. ప్రతి రోజూ సత్సంగం చేయాలి. గురువచనాలను వినాలి.

# విషయ సూచిక

**"సంత్ మతం - ఆత్మానుభూతి"** పుస్తకంలోని కొన్ని సత్సంగాలు : 1. సత్సంగం ద్వారా జ్ఞాన ప్రాప్తి 2. భక్తితో ముక్తి లేదు 3. స్మరణ ధ్యానం భజన ద్వారా బ్రహ్మలోక ప్రాప్తి 4. సత్యమైన రహస్యం 5. సత్యమేవ జయతే శీర్షిక గల సత్సంగాలను "సత్సంగ సుధ" ఏడవభాగంలో ప్రచురించటం జరిగింది. మిగిలినవి ఇందులో . . .


| | | | |
|---|---|---|---|
| 1. | గురువే అన్నీ అంతా | 28-1-1973 | 1 |
| 2. | శబ్ద మహిమ | 09-2-1973 | 12 |
| 3. | నిర్వాణపదం | 10-2-1973 | 18 |
| 4. | గురు కృప | 11-2-1973 | 23 |
| 5. | భజన ఏమిటి? | 16-4-1973 | 33 |
| 6. | గురువిచ్చే కానుక | 13-5-1973 | 40 |
| 7. | గురుమతం మహిమ | 14-10-1973 | 50 |
| 8. | సంత్ మతంలోని అసలైన శిక్షణ | 21-10-1973 | 76 |
| 9. | కర్మ విచారం | 28-10-1973 | 100 |
| 10. | భజన ఎందుకు అవశ్యకం | 16-11-1973 | 119 |
| 11. | అజ్ఞానంతో కూడిన ఆవేశం | 25-11-1973 | 127 |
| 12. | సత్య సాధన | 09-12-1973 | 134 |
| 13. | మంగళం అశబ్ద అరూప | 15-4-1973 | 149 |

# సత్సంగ సుధ 7వ భాగం
## ప్రచురణకు ఆర్థిక సహకారం అందించినవారు.

| | | | |
|---|---|---|---|
| 1. | శ్రీ వేముల మార్కండేయగారు | **హన్మకొండ** | రూ.500=00 |
| 2 | శ్రీ ఎం. రామదాసుగారు | **నిజామాబాద్** | రూ.254=00 |
| 3. | శ్రీ టి. ప్రభాకర్‌గారు | **బొమ్మనపల్లి** | రూ. 121=00 |
| 4. | శ్రీ గోగుల కర్మవీర్‌గారు | **హుజూరాబాద్** | రూ. 116=00 |
| 5. | శ్రీ మాడా వీరభద్రయ్యగారు అండ్ సన్స్ | **మెట్‌పల్లి** | రూ. 116=00 |
| 6. | శ్రీ జాలి రాజిరెడ్డిగారు | **కన్నాపురం** | రూ. 116=00 |
| 7. | శ్రీ శద్ధానంద్-నిర్మల గార్లు | **సికింద్రాబాద్** | రూ.116=00 |
| 8. | శ్రీ బుద్దెవారు మాధవరావు-సరోజన గార్లు | యడపల్లి | రూ. 101=00 |
| 9. | శ్రీ కాశయ్య, భవానీ దంపతులు | కరీంనగర్ | రూ. 100=00 |
| 10. | శ్రీ వ్యామసాని కైలాసపతిగారు | కరీంనగర్ | రూ. 100=00 |
| 11. | శ్రీ చింతిరెడ్డి లక్ష్మారెడ్డిగారు | కన్నాపురం | రూ. 100=00 |
| 12. | శ్రీ దిలీప్, దినేష్ గార్లు | హుజూరాబాద్ | రూ. 58=00 |
| 13. | శ్రీ తిరుపతిరెడ్డి - విమల గార్లు | హుజూరాబాద్ | రూ. 58=00 |
| 14. | శ్రీ రాజిరెడ్డి - అనురాధ గార్లు | హుజూరాబాద్ | రూ. 51=00 |
| 15. | శ్రీ భీమనాత్ని లక్ష్మీకాంతం, కమల దంపతులు | కరీంనగర్ | రూ. 51=00 |
| 16. | శ్రీ వి. గంగ నర్సయ్యగారు, ఖానాపూర్ | నిజామాబాద్ | రూ. 51=00 |
| 17. | శ్రీ వంగా శ్రీనివాసరెడ్డి - అనిత గార్లు | సిద్ధిపేట | రూ. 50=00 |
| 18. | శ్రీ కోటగిరి శ్రీనివాస్‌గారు | కరీంనగర్ | రూ. 50=00 |
| 19. | శ్రీ పాపయ్య, రామలక్ష్మి దంపతులు | గంగిపల్లి | రూ. 50=00 |
| 20. | శ్రీమతి కోటగిరి ప్రమీలా వెంకటేశంగారు | కరీంనగర్ | రూ. 50=00 |
| 21. | కుమారి కోటగిరి సురతిగారు | కరీంనగర్ | రూ. 50=00 |
| 22. | కుమారి కోటగిరి శోభ గారు | కరీంనగర్ | రూ. 50=00 |
| 23. | కుమారి కోటగిరి శివలక్ష్మి గారు | కరీంనగర్ | రూ. 50=00 |
| 24. | శ్రీ నడిమెట్ల శంకరయ్యగారు | వల్లంపహాడ్ | రూ. 25=00 |
| 25. | శ్రీమతి అరుంధతిగారు | బొమ్మకల్లు | రూ. 21=00 |

# సత్సంగం

## 28–01–1973

# గురువే అన్నీ! అంతా !!

గురు బిన్ జ్ఞాన్ న ఉపజే గురు బిన్ మిలే న మోక్ష ।
గురు బిన్ లఖే న సత్ కో, గురు బిన్ మిటే న దోష్ ॥

హరిసేవా యుగ్ చార్ హై, గురుసేవా పల్ ఏక్ ।
తాకే పట్ తర్ నా తులే, సంతన్ కియోం వివేక్ ॥

* * *

అబ్ కీ బార్ ఉబారియే, మేరీ అరజీ దీన్ దయాల్ హో,
ఆయీ థీ వా దేశ్ సే, భయీ పరదేసన్ నార్ ॥
వహ మారగ్ మోహే భూల్ గయో, జానోం విసర్ గయో నిజనామ్ హో
జుగన్ జుగన్ భ్రమత్ ఫిరీ, జమ్ కీ హాథ్ వికాయ్ ।
కర్ జోడే వినతీ కరూం, మిల్ విఛుడన్ నహీం హోయ్ హో ॥

విషమ్ నదీ వికరాల్ హై, మన్ హర్ కర్‌యా ధార్ ।
మోహ మగర్ వాకేం ఘాట్ మే, జిన్ ఖాయో సుర్ నర్ ఝూర్ హో ॥

శబ్ద జహాజ్ కబీర్ కే, సత్‌గురు ఖేవన్ హార్ ।
కోయీ కోయీ హంసా ఉతరే హైం, పల్ మే దయో ఛుడాయే హో ॥

రాధాస్వామి !

"ఫకీర్ చంద్! నీవు సత్సంగాలు చేయిస్తూ ఉంటావు. గురువువయ్యావు. మొదట నీ ఆత్మను నిలదీసి ప్రశ్నించు. ఆ తరువాత ఇతరులకు ఉపదేశమివ్వు. నీవు తరించావా? నీవు ధృవపద ధామానికి చేరుకున్నావా? ఒకవేళ నీవు చేరకుంటే ఇతరులకు ఉపదేశం ఇచ్చే అర్హత నీకెక్కడిది?" అని నా ఆత్మను, ప్రశ్నిస్తుంటాను. నేను 1905లో సంత్ మతంలోకి వచ్చాను. భగవంతుని లేదా ఈశ్వరుని సంస్కారాలు నాకు లభించాయి. నేను వాటిని జ్ఞాపకం చేసుకునేవాణ్ణి.

వాటిని ప్రేమించేవాణ్ణి. నా అదృష్టమో, దైవేచ్ఛనో నన్ను హుజూర్ దాతాదయాల్ మహర్షి శివవ్రత్ లాల్ జీ మహారాజ్ చరణాలలోకి తీసుకువెళ్ళింది. ఆయన గురుమతాన్ని ఎంతగానో ప్రశంసించి 'ఉన్నదంతా ఆ గురువే' అని శలవిచ్చారు. ఒక శబ్దం ఆయన నా పేరిట రాశారు.

"ఫకీరా సోచ్ సమఝ్ పగ్ ధార్"

"ఫకీరా! ఆలోచించి అర్థంచేసుకుని అడుగువెయ్!" ఈ శబ్దంలో దీని తరువాత ఆయన రాశారు. జ్ఞానపశువులు పుస్తకాలలో చిక్కుకుని ఉన్నారు. భక్తిమార్గపు వారు అంధకారంలో ఉన్నారు. యోగులు యోగాసనం వేసుకుని కూర్చున్నారు. "గురుసేవక్ హువా భవపార్" గురుసేవకుడే భవసాగరం దాటుతాడని చివరగా రాశారు. నా జీవిత అనుభవాలను చెప్పిపోతానని శపథం చేశాను. అందుకే నేను నాకర్మ అనుభవిస్తున్నాను. ఎవరిపైనా ఏ దయా, కృతజ్ఞతా చూపటం లేదు. నేతగాడు తన పొట్టకోసం బట్టలునేసి దాని వలన కొంత సంపాదిస్తాడు. వ్యాపారస్తుడు ఆ బట్టలను అమ్మి అతను కూడా కొంచెం సంపాదిస్తాడు. దర్జీ ఆ బట్టల్ని కుట్టి అతడూ కొంత సంపాదిస్తాడు. ఆ బట్టల్ని తొడుక్కునే వారు చలి, ఉష్ణాల నుండి తమను తాము రక్షించుకుంటారు. ఆ గుడ్డ చినిగి పోయినపుడు కాగితాలు తయారు చేసేవారు కాగితాలను తయారుచేసి దానినుండి కొంత సంపాదిస్తారు. నేతగాడు తన పొట్ట నింపుకోవడం కోసం బట్ట నేశాడు. కాని దానివలన ఇతరులు చాలా మంది వ్యక్తులు లాభం పొందారు. అలాగే నా ఈ కర్మ వలన ఎవరికైనా లాభం కలిగితే చాలామంచిది! నీవు గురు భక్తి నుండి తరించిపోయావా?

సోచ్ సమఝ్ కర్ యతన్ ఫకీర్వా, ఛిన్ ఛిన్ ఉమర్ ఘటత్ దిన్ రాతీ ।
కభీ సాంఝ్ హై కభీ ప్రభాతీ,
మాయా మోహ మహా ఉత్పాతీ, ఇన్ సే లగా మత్ లగన్ ఫకీరవా ।
సుఖ సంపతి ధన్ మాల్ ఖజానా, ఇన్సే దేఖ్ క్యోం జియా లల్చానా
ఝూటే హైం సబ్ నామ్ నిశానాం, తాసోం ఉపజే తపన్ ఫకీరవా ।
గురు భక్తీ హై సబ్ కా సారా, దేఖా సోచా సమఝ్ విచారా ।
జానే గా కోయీ గురు ముఖ్ ప్యారా, మాన్ మానీయే వచన్ ఫకీర్ వా
రాధాస్వామి చరణ్ శరణ బలిహారీ, అబ్ బుఝీ మన్ కీ తపన్ ఫకీరవా ।

హుజూర్ దాతాదయాల్ జీ మహారాజ్ ఈ శబ్దం నా పేరిట రాశాడు. కబీర్ సాహబ్ ఈ శబ్దంలో ఒక కొత్త విషయం చెప్పారు.

గురు బిన్ జ్ఞాన న ఉపజే, గురు బిన్ మిలే న మోక్ష ।
గురు బిన్ లఖే న సత్త్ కో, గురు బిన్ మిటే న దోష్ ।

హరిసేవా యుగ్ చార్ హై, గురు సేవా పల్ ఏక్
తాకీ పట్ తర్ నా తులే, సంతన్ కియో వివేక్ ।

హరిసేవ నాలుగు యుగాలలోనూ ఉందని ఆయన రాస్తున్నారు. ఒక్క క్షణం గురుసేవ చేసినా అది వ్యక్తిని తరింపచేస్తుంది. గురు మతంలోకి రావటం వలన నీకేం లభించింది అని నా ఆత్మను అడుగుతుంటాను. అనుభవం, వివేకముల పేరే గురునామం. నేను గురువును బాహ్యంగా సేవించాను. కిరీటం చేయించాను. సింహాసనం చేయించాను. పువ్వులర్పించాను. వెండి హుక్కా చేయించాను. ఎంతో చేశాను. కానీ దీనివలన నాకేం లభించింది? ప్రేమ, ఆనందం, మనానందం, ప్రసన్నత. ఇతడు చాలా గొప్ప భక్తుడని లోకులనుకోసాగారు. కానీ నాకు జ్ఞానం లభించలేదు. గురుమతాన్ని నాకు బోధించాలని హుజూర్ దాతాదయాల్ జీ మహారాజ్ చాలా ప్రయత్నం చేసేవాడు. కానీ నాకు బోధపడేదికాదు. అందుకే ఆయన నాకీ గురుపదవిని ఇచ్చాడు. గురు పదవిలోకి రాగానే నాకు గురు మతపు వాస్తవిక రహస్యం బోధపడింది. ఎలా? కేవలం ఒక్క విచారం వలన! నా రూపం కొందరి అంతరంలో ప్రగటమై ఔషధాల్ని సూచిస్తుంది, కొందరి సురత్‌ను ఊర్ధ్వముఖమయ్యేలా చేస్తుంది, కొందరి పరీక్ష పేపరు రాస్తుంది, మరి కొందరికి అంత్యసమయంలో వెళ్ళి వారిని తీసుకువెళ్తుంది. కానీ నాకీ విషయాలేవీ తెలియవు. వ్యక్తి అంతరంలో జరిగే ఈ లీలంతా అతని మనసు విశ్వాసం, శ్రద్ధల ఫలితమేనని నాకు తెలిసిపోయింది. చదవటం వలన, వినటం వలన, ప్రారబ్ధకర్మల ననుసరించి వ్యక్తి మేధస్సుపై పడి ఉన్న సంస్కారాలు ఆకృతులు ఏర్పర్చి నీ సమక్షంలోకి వస్తాయి. ప్రపంచం ఏర్పడినప్పటి నుండి లోకంలో కొందరు రాముని రూపంలో, మరికొందరు కృష్ణుని రూపంలో, కొందరు బుద్ధుని రూపంలో ఆ భగవంతుణ్ణి పూజిస్తూ వస్తున్నారు. వీరంతా ఎవరిని పూజిస్తున్నారు?

తమ మనసునే పూజిస్తున్నారు. ఎవరు ఎలా విశ్వసిస్తే వారు అలాగే భగవంతుణ్ణి కొలిచారు. ఎందుకంటే వారు తమ మనసుతో పూజించసాగారు కనుక వారు తమ అసలైన ఇంటికి వెళ్ళజాలరు. మన నిజగృహం మనసును దాటి, మనసుకు అతీతంగా ఉంది.

మనసు ఆకారాలను తయారుచేస్తుంది. మనసుతో ఆకారాన్ని ఏర్పర్చుకుని భగవంతుణ్ణి పూజించే వ్యక్తి తన ఇంటికి అనగా పరబ్రహ్మ - శబ్ద బ్రహ్మలోకి వెళ్ళజాలడు. హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్ నాకు ఎంతో నచ్చచెప్పేవాడు. కానీ నాకు బోధపడేది కాదు. ఈ జ్ఞానం నాకు గురుభక్తి వలన లభించింది. గురుభక్తి ఏమిటి? సత్సంగంలోకి వెళ్ళి గురువచనాలను ఏకాగ్రతతో వినటం, దానిని అమలుచేయటమే గురు భక్తి. కానీ ఇది మీలో త్వరగా రాదు. ఎందుకంటే మీలో సాంసారిక ఇచ్ఛలు ఉన్నాయి.

తన నిజగృహానికి వెళ్ళాలనే ఇచ్ఛయే లేనివారికి గురుజ్ఞానం అవసరం లేదు. మనకు లభిస్తున్నదంతా మన ప్రారబ్ధ కర్మల ననుసరించే లభిస్తుంది.

మాస్టర్ మోహన్ లాల్ మనవడి జన్మపత్రిక ఒక భృగుసంహిత పండితుడు చూశాడు. ఈ జ్యోతిష్యుడు బయటి నుండి వచ్చాడు. అతని దగ్గర దొరికిన జన్మకుండలి దాదాపు ఇరవై పేజీలది. దానిపై జీవన స్థితి గతులు ఉన్నాయి. అందులో మాస్టర్ మోహన్ లాల్‌కు గత జన్మలో ఈ కుర్రవాడితో ఎలాంటి సంబంధం ఉన్నదనేది కూడా రాసి ఉంది. అందులో నా ప్రస్తావన కూడా వచ్చింది. నాకూతురు పిచ్చిది కావటం గురించి కూడా రాసి ఉంది. మన ఋషులు ఎంతటి విద్వాంసులోనని ఆశ్చర్యపోతుంటాను. ఈ ప్రపంచంలో మన జీవన సంఘటనలు మన ప్రారబ్ధ కర్మలపై ఆధారపడి ఉన్నాయని దీనివలన రుజువవుతున్నది. గత కర్మల ఇచ్చిపుచ్చుకోవడాలను అనుసరించి ఒకరు కొడుకు అవుతారు. మరొకరు సోదరుడవుతారు. ఇంకొకరు తండ్రి అవుతారు. ఈ కుండలినిని అనుసరించి ఈ కుర్రవాడు గత జన్మలో మాస్టర్ మోహన్ లాల్ సోదరుడట. ఇవన్నీ గత జన్మల ఇచ్చి పుచ్చుకునేవేనని నాకు తెలిసినప్పటి నుండి నేను నిశ్చింతుడనయ్యాను. ఎందుకంటే ఏది జరగవలసి ఉందో జరిగే తీరుతుంది. ఇక భయం దేనికి? హాహా కారాలెందుకు? "మహారాజ్! నేను వృథా ఖర్చుచేసే వ్యక్తిని కానుగానీ నా ఇద్దరు మనవలు

ఏది అడిగినా వాళ్ళకవి తెచ్చిస్తుంటాను. ఇది లేకున్నా వాళ్ళకు పనిజరుగుతుందని తెలిసినా నేను కాదని వారి కోరికను నిరాకరించలేకపోతుంటాను" అన్నాడు సేఠ్ దుర్గాదాస్. ఇదీ ప్రారబ్ధకర్మ.

సంత్ మతంలో నుండి నాకు లభించినదానిని లోకానికి చెప్పిపోతానని ప్రతిజ్ఞచేశాను. కానీ దావా ఏం లేదు. నాకు బోధపడిన దాని వలన నాకు శాంతి లభించింది. ఈ ప్రపంచం మోహమాయల చక్రం. వలయం. మరి మనమేం చేయాలి?

**అబ్ కీ బార్ ఉబారియే, మేరీ అరజీ దీన దయాల్ హో।**
**ఆయీ థీ వా దేశ్ సే, భయీ పర్ దేసన్ నార్ ॥**

వహ మారగ్ మోహే భూల్ గయో, జాసో౯ బిసర్ గయో నిజ నామ్ హో ।

మనం ఆ మార్గాన్ని మరిచిపోయాం. ఎలా? అజ్ఞానం కారణంగా మనం మనసు ఆశలలో ఉన్నాం. మన ఇంటిని మరిచిపోయాం. గురువు లభించి, సత్సంగంలో ఆయన రహస్యాన్ని విప్పి చెప్పనంతవరకు జీవునికి తన వాస్తవిక గృహపు చిరునామా తెలియదు. గురువేం చేస్తాడు? సత్సంగంలో సత్యమైన బుద్ధినిస్తాడు. సత్సంగానికి వెళ్ళి శ్రద్ధగా, నిష్ఠగా వచనాలను వినటమే అసలైన, సత్యమైన గురుసేవ. ధనసంపదలనివ్వటం ప్రాపంచిక వ్యవహారం. ఎంత ఇస్తావో అంత లభిస్తుంది. నీవు సేవ చేస్తే సేవ లభిస్తుంది. ఎవరికైనా సహాయపడితే నీకు కూడా సహాయం అందుతుంది. గురువు వచనాలను నిష్ఠగా వినటం, అర్థం చేసుకోవటం, వాటిని ఆచరించటమే అసలైన గురుసేవ. కానీ ఇది ఇలా కష్టం. నా దగ్గరికి ఎందరో వస్తుంటారు. కానీ జ్ఞానం ప్రాప్తించుకోవడానికి ఎవరొస్తారు? వచ్చిన వాళ్ళలో ఒకరు కోర్టుకేసు గురించి, మరొకరు తమ వ్యాధి నివారణ గురించి, పరీక్షల్లో పాస్ కావాలనే కోరికతోనో లేదా పిల్లలు కావాలనే కోరికతోనో వస్తుంటారు. కానీ నేనెవరినీ మోసగించను. చూడండి! నా దగ్గరికి పిల్లలు వస్తారు. ప్రసాదం తీసుకువెళ్తారు. చాలా మంది పాసవుతుంటారు. నేను వాళ్ళను ఉత్తీర్ణులను చేస్తానా? ఇది వారి విశ్వాసం.

అమృతసర్‌లో భట్‌నాగర్ గారు తమ కొడుకును డాక్టర్‌ను చేయాలనుకుంటున్నారు. ఆ కుర్రవాడిని నేను కూడా ప్రేమిస్తాను. "అబ్బాయ్! శ్రమపడు.

పాసవుతావని" అన్నాను. కానీ అతడు ఫెయిలయ్యాడు. అతడు ఉత్తీర్ణుడు కావాలని నేను కోరుకున్నాను కూడా! నేనొకవేళ ఏమైనా చేయగలిగితే ఆ కుర్రవాడు ఫెయిలెందుకవుతాడు? కర్తార్ సింహ చెల్లెలు పరీక్ష రాయడానికి వెళ్ళినప్పుడల్లా నా నుండి ప్రసాదం తీసుకువెళ్తుంది. కానీ ఫెయిలైంది. ఇవన్నీ ప్రాపంచిక విషయాలు. ఎవరికి ఏది దొరికినా అది వారి విశ్వాసం లేదా కర్మ ఫలమే!

ఎందుకంటే నాకు నా కర్మను అనుభవించే అవకాశం లభిస్తుంది. మీరొస్తుంటారు. కనీసం నా మాటలను వినండి. అర్థంచేసుకొనండి. వాటిని విచారించండి.

దర్శన్ కరే, బచన్ పుని సునే, సున్-సున్ కర్ నిత్ మన్ మే గునే ।
గున్ గున్ కాడ్ లియే తిస్ సారా, కాఢ్ సార్ తిస్ కరే అహారా ।
కర్ ఆహార్ పుష్ట హువా భాయీ! జగ్ భవ భయ్ సబ్ గయీ నసాయీ ॥

ఇది గురు సేవ! నేనెవరి అంతరంలోకీ వెళ్ళననే ఒకే మాట వల్ల రహస్యం తెలిసిపోయింది. తమ లోపల ఎవరికి ఏం కన్పించినా అదంతా సంస్కారం, సలహాలు, సూచనలు, ఒప్పించటం, అంగీకరింపచేయటం! నాకు జ్ఞానోదయమైంది. ఇప్పుడు నేను సాధనా సమయంలో ఈ దృశ్యాలలో చిక్కుపడను. మనసును దాటి వెళ్ళి పోతాను. ఇదే సంత్ మతపు తాళంచెవి. హుజూర్ బాబా సావన్ సింగ్ జీ మహారాజ్ "పదవ ద్వారం దాటి వెళ్ళండి. అక్కడ నీకు సద్గురువు లభిస్తాడు" అని చెప్పేవాడు. అక్కడ గడ్డం, మీసాల తెల్లని పగ్డీ ఉన్న బాబాసావన్ సింగ్ జీ మహారాజ్ ఉంటాడు కాబోలని లోకులనుకున్నారు.

సమస్త జీవనం ఇందులోనే ఉండిపోయారు. తమ ఇంటికి ఎవరూ. చేరుకోలేదు. ఎందుకంటే మనసు చంచలమైనది. నిలువదు. దీని చంచలత్వాన్ని దూరం చేయడానికి పదవ ద్వారం చేరుకోవడానికి సహాయపడుతుందని గురుసేవ, భోజనశాలలో సేవ, మరోసేవగానీ ఇవ్వబడుతుంది. దీనివలన మనసు ఏకాగ్రత చెందాలని, మనసు చంచలత్వం దూరంకావాలని! అభ్యాస సమయంలో నీ మనసు భిన్న భిన్నమైన ఆకృతులను ఏర్పరుస్తుంది. నీవు

వాటిని విడువజాలవు. ఎందుకు? ఎందుకంటే నీకు బయట త్యాగం చేసే అలవాటు లేదు. దానం, పుణ్యం, నిష్కామ కర్మ, పరోపకారం, పేదలకు, రోగులకు సేవలుచేయాలని ఆదేశించటం జరిగింది. నీవు ఎవరైనా రోగగ్రస్తులకు, బాధితులకు 10-20 రూపాయలు సహాయార్థం ఇస్తే నీకు త్యాగబుద్ధి అలవడిందని అనుకో! ఒకవేళ నీవు బయట నీ ధనం, నీ విశ్రాంతి, నీ సమయాన్ని త్యాగం చేయలేకుంటే నీ మనసు అంతరంలో నిమగ్నం కాదు. బయట ప్రేమ, త్యాగం, బలిదానం చేసే అలవాటున్నవారు తమ అంతరంలో మనసు యొక్క తలపులను, ఆలోచనలను త్యాగంచేయటంలో సఫలురవుతారు. మనసు స్థిరం కాదని చాలా మంది ఫిర్యాదు చేస్తుంటారు. ఎలా స్థిరమవుతుంది? ఎలా నిమగ్నమవుతుంది? నీకు బయట త్యాగం, బలిదానం చేసే అలవాటే లేదు. నీవు లోపలి భావాలను, ఆలోచనలను ఎలా త్యజించగలవు? ఆలోచనా విచారాలు ఆగిపోనంతవరకు మనసు అటువైపు నిమగ్నం కాదు. మనసును దాటిపోవడానికి, మనసుకు అతీతంగా, మనసుకు ముందుకుపోవడానికి మంచితనం, నిష్కామకర్మ, వైరాగ్యం, త్యాగం ఆవశ్యకాలు. ఆశ్రమాలలో, మందిరాలలో ఉండేవారికి ఏమీ లభించదు. ఎందుకంటే వారు పొట్టకోసం, ధనంకోసం, గౌరవాలకోసం, లేదా మరో స్వార్థం కోసం అక్కడికి వెళ్తారు. త్యాగం చేయాలని వాళ్ళు అక్కడికి వెళ్ళలేదు. అందుకే వాళ్ళు ఖాళీగా మిగిలి పోతారు. దుఃఖితులను, బాధపడుతున్నవారిని తమ దగ్గర ఉంచుకుని సేవచేస్తున్న మహాత్ములకు శుభాకాంక్షలు. నిజనామం అంటే ఏమిటి? మనసు సంకల్పాల నుండి వేరయ్యాక, సంకల్ప రహితమయ్యాక అంతరంలో కనిపించే ప్రకాశం, వినిపించే శబ్దం నిజ నామం. అదే మన దేశం. మనసును విడిస్తేనే నీవు అక్కడికి వెళ్ళగలవు. మనసు వెంట ఉన్నంత వరకు నీవు ఆ నామాన్ని అందుకోజాలవు. ఎవరినో అనటం ఎందుకు? నేను కూడా ఈ మనస్సనే వలయం నుండి బయట పడలేకపోయాను. గత కాలపు సంతులు సైగల్లో గుప్తంగా మాట్లాడేవారు. ఎందుకంటే ప్రపంచానికి ఆ మాటలు వినే అర్హత లేదు. రెండవది స్పష్టంగా చెప్పటం వలన డబ్బులు రావు. నా రూపం ఎవరిలోనైనా ప్రకటమైతే, ఎవరిపనైనా చేస్తే వాళ్ళు నా దగ్గరికి వస్తారు. కానుక లిస్తారు. ప్రపంచం అజ్ఞాన వశాన ఇస్తుంది. జ్ఞానంతో కాదు. నేను 1942లో

హుజూర్ బాబా సావన్ సింగ్ జీ మహారాజ్ దర్బార్‌కు వ్యాస్‌కు వెళ్ళాను. "మహారాజ్! నా గురుమహారాజ్ నన్ను సత్సంగంచేయించమని అనుజ్ఞనిచ్చాడు. నేను స్పష్టంగా చెబుతాను. అలా స్పష్టం చేయటంవలన ప్రపంచం నాకు వ్యతిరేకమవుతున్నది. అందుకే మీరు నాకు ఆజ్ఞ ఇస్తే ఈ సత్సంగం ఇవ్వటం మానేస్తాను". అని ప్రార్థించాను - "వాస్తవం ఏమిటంటే సత్యాన్ని నేను కూడా చెప్పలేదు. ఎందుకంటే జీవులు ఇందుకు అర్హులు కారు. రెండవ కారణం నాకు ఆశ్రమం ఉంది" అన్నారాయన. నేను ఆశ్రమాన్ని వదిలేశాను. కేవలం సత్యాన్నే తీసుకున్నాను. నాకు లెక్కలేదు. నా సత్సంగంలోకి రాదలచుకున్న వారురానీ! ఇష్టం లేకుంటే రాకపోనీ! మందిరానికి రానీ రాకపోనీ. మందిరానికి ఇష్టమైతే నాలుగు పైసలివ్వనీ, లేకుంటే లేదు. ఎవరికైనా ఇష్టమైతే నా పుస్తకాలు చదవనీ. ఇష్టం లేకుంటే చదవక పోనీ! నా పైన గురు రుణం ఉంది. నేను నిష్కపటినై దానిని తీర్చుకున్నాను.

అబ్ కీ బార్ ఉబారియే, మేరీ అర్జీ దీన్ దయాల్ హో,
ఆయీ థీ వా దేశ్ సే, హోగయీ పరదేసన్ నార్ ।
వహ మారగ్ మోహే భూల్ గయో, జాసీ విసర్ గయో నిజ నామ్ ॥

అందరు సంతులూ ఒకే మాట చెప్పారు. కానీ చెప్పిన పద్ధతిలో తేడా ఉంది. నా వ్యాఖ్యానం పూర్తిగా తేట తెల్లమై ఉంది. నీవు పరబ్రహ్మ, శబ్ద బ్రహ్మ నుండి ముందుకు వెళ్ళకుంటే మోక్షం లేదని గరుడపురాణం సైతం చెప్పింది. మరి ఇక సనాతన ధర్మానికీ, రాధాస్వామి మతానికీ తేడా ఏముంది?

నేను రామకృష్ణులను, దేవీదేవతలను విశ్వసించేవాడిని. భగవంతుణ్ణి మనిషి రూపంలో చూడాలనే కోరిక, కుతూహలం ఉద్భవించింది. దైవేచ్ఛ నన్ను హుజూర్ దాతా దయాల్ జీ చరణాలలోకి తీసుకువెళ్ళింది. ఆయన రాధాస్వామి మతం ఇచ్చాడు. ఈ మార్గం నాకు పూర్తిగా కొత్తది. చదవమని 'సారబచన్' ఇచ్చారాయన. అసలైన స్థానానికి రాముడు చేరుకోలేదు. కృష్ణుడు చేరుకోలేదు. బౌద్ధులు, జైనులు, సూఫీలు, వేదాంతులు చేరుకోలేదని అందులో రాసి ఉంది. నేను ఆశ్చర్యపోయాను. నా మస్తిష్కం గిర్రున తిరిగినట్లనిపించింది. ఎక్కడికి వచ్చి చిక్కుకున్నానాఅని ఎంతగానో ఏడ్చాను. హుజూర్ దాతాదయాల్

జీ మహారాజ్ నేను ఏడుస్తున్న కారణం ఏమిటని అడిగారు. చెప్పాను. పోథీ చదవటం ఆపి అభ్యాసం చేయమని ఆయన అజ్ఞాపించారు. 1916లో నేను బసరా బగ్దాద్‌కు బయల్దేరేటప్పుడు ఆయన మళ్ళీ నాకు చదవడానికి సార్‌బచన్ ఇచ్చారు. అప్పుడు నాకళ్ళు తెరుచుకున్నాయి. అందులో రాసినదంతా పదహారణాలా సత్యమని ఇప్పుడంటాను. నేనెవరి లోపలా ప్రగటం కాలేదని తెలిశాక నాకు సంత్‌మతంపై విశ్వాసం కుదిరింది.

అందరూ తమ మందిరాల్లోకి, మసీదులలోకి, డేరాలలోకి చేరుస్తారు. అసలైన విషయం ఎవరైనా గురువు దీనదయాలుడే చెబుతాడు. కానీ ఈ అవసరం కోసం వచ్చేవారే నా మాటలను అర్థం చేసుకోగలరు. ప్రపంచం కోసం వచ్చేవారికి నేనిచ్చే సలహా ఒక్కటే! వేదమార్గంపై నడవండి. మీ విశ్వాసం ఎవరిపై ఉంటే వారి రూపాన్ని నమ్మండి. పూజించండి. కానీ ఒక్కరినే విశ్వసించండి. మీ రెండు కనుబొమ్మల మధ్య ఆ రూపాన్ని ఏర్పర్చుకొనండి. దానిని సత్యహృదయంతో అడగండి. మీకు లభిస్తుంది. ఇవాళ ఒకరిని విశ్వసించి, అంగీకరించి రేపు మరొకరిని, ఎల్లుండి వేరొకరిని నమ్మి కొలిస్తే చాకలివాడి కుక్క ఇంటికీ, రేవుకూ చెందకుండా పోయినట్లవుతుంది మీ పరిస్థితి. మీకు దొరికేదంతా మీ మనసు ఆశననుసరించి లభిస్తుంది. దీనికి ఏదో ఒక ఆధారం, సహాయం ఇవ్వవలసి ఉంటుంది. రాముడు లేదా కృష్ణుడు, లేదా గురువు ఎవరి సహాయం, ఆధారం ఇవ్వాలనుకుంటారో అది మీ ఇష్టం. తరించి, దాటి పోవాలనుకుంటే ప్రకాశం, శబ్దాలలోకి వెళ్ళాల్సి ఉంటుంది. ఇది వినీ ఎవరూ తమ ఇంటికి వెళ్ళజాలరు. కానీ మన ఇంటికి చేరుకోవటం కూడా మన కర్మ లేదా భగవంతుని దయపై ఆధారపడి ఉంటుంది.

నిన్ను నీవు సంత్ సతగురు వక్తనని చెప్పుకుంటున్నావ్! నీవు అహంకారివి కాలేదా? అని చాలాసార్లు నా మనసులో ఆలోచనా విచారం వస్తుంది. లేదు. సత్యమైన జ్ఞానంపేరే సతగురువు. ఆ జ్ఞానాన్ని నేనిస్తుంటాను.

హరి సేవా యుగ్ చార్ హై, గురు సేవా పల్ ఏక్ ।
తాకీ పట్ తర్ న తులే, సంతన్ కియో వివేక్ ॥

హరిసేవకంటే గురుసేవ శ్రేష్ఠమైనదని సంతులు అనుభవంలో చూశారు. హరిసేవ నిన్ను జనన మరణాలనుండి దాటించజాలదు. ఎందుకంటే నీవు ద్వైతంలో ఉన్నావు. హరిని మరొకరు అనుకుంటావు. ద్వైతంలో ఉన్నంతవరకు మోక్షమెక్కడిది?

నా దగ్గరికి చాలామంది దుఃఖితులు వస్తుంటారు. "వెళ్ళి నా ధ్యానం చేయండి" అని చెబుతుంటాను. ఎందుకంటే ధ్యానం వలన వారి ఇచ్ఛాశక్తి దృఢతరమవుతుంది. వారి ప్రాపంచిక పనులు నెరవేరుతాయి. నేను బయటికి సత్సంగమివ్వడానికి వెళ్తుంటాను. గత సంవత్సరం కలిసిన వ్యక్తులు మళ్ళీ కలుస్తుంటారు. "బాబాజీ! మీ దయవలన నా పని నెరవేరింది" అని ఒకరు చెబుతారు. "ఇదంతా నీ విశ్వాసమే" అని చెబుతుంటాను. "మీ రూపం నా లోపల ప్రకటం కావటంలేదని" మరొకరు చెబుతారు. నేనెవరి అంతరంలోకీ వెళ్ళను. నీవు స్వయంగా నన్ను నీ లోపల ఉత్పన్నం చేసుకోవాల్సి ఉంది. ఏ గురువూ ఎవరిలోకీ వెళ్ళడు. ఇది నాకు అనుభవమైంది. కనుక నీ లోపల రూపం ఏర్పర్చుకునే ప్రయత్నం చేయి. రూపం ఏర్పడకుంటే :-

కుఛ్ కర్‌నీ, కుఛ్ కర్మ గత్, కుఛ్ పూర్వ లే లేఖ్ ।
దేఖో భావ కబీర్ కే, లేఖ సే భయా అలేఖ్ ॥

ఏ వ్యక్తి ఈ మార్గంలోకి వచ్చినా అతడు తన ప్రారబ్ధ కర్మలననుసరించి వస్తాడనే పరిణామంపైకి వచ్చాను. ఇది మన వశంలోని మాటకాదు. లోకులు అభ్యాసం చేస్తూ చేస్తూ చాలా కాలమైపోయింది. కానీ శబ్దం ప్రకాశం ప్రకటం కాదు. రూపం ప్రకటం కాదు. ఇదంతా గురువుల అపరాధం. ప్రతివారినీ తమ శిష్యులుగా చేసుకుని, తమ పరిధిని పెంచుకోవడానికి నామం ఇస్తారు. అర్హత, సంస్కారాలను చూడరు.

నిన్న ఒక జ్యోతిష్యుడు వచ్చాడు. అబద్ధం చెబితే కుష్టురోగి అయి మరణిస్తాడు. ప్రస్తుతం ప్రపంచంలో మోసం, దగా ఉన్నాయి. ఈ సాధువులు, మహాత్ములు, జ్యోతిష్యులూ ప్రపంచాన్ని చాలా దోచుకున్నారు. వారు ధనం, సంపాదించటం కోసం పరదాలు పెట్టారు. ఆ జ్యోతిష్యుడు నా గ్రహాలు చూసి, "మీ అమ్మాయి ఉన్మత్తురాలు అయి ఉంటుంది. మీ గ్రహాలననుసరించి మీ రూపం ఇతరులలో సాక్షాత్కరించాలి." అన్నాడు. "నాకు తెలియదు"

అన్నాను. నా రూపం లోకుల అంతరంలో ప్రకటమైందనే అనుకుందాం. ఇది ఎలాంటి గొప్పదనం? ఇది ప్రకృతివరం. ఉదాహరణకు శకుంతలా దేవి గణితంలో కఠినాతి కఠినమైన ప్రశ్నలను కూడా తక్షణం పరిష్కరిస్తుంది. ఈ విషయాలు నేర్చుకోవటం, నేర్పించడాల వలన రావు. ఇవి భగవంతుడిచ్చిన వరాలు. నా రూపం ప్రకటమైతే నాకా సంగతే తెలియదు. ఇక నాకు అహంకారం ఎందుకు?

మనసు చంచలంగా ఉండి స్మరణ, ధ్యానాలు కుదరకపోతే సత్పురుషుల సత్సంగానికి వెళ్ళు. లా ఆఫ్ రేడియేషన్ పనిచేస్తుంది. సత్పురుషుల సాంగత్యం పనిచేస్తుంది. సాంగత్య ప్రభావం వలన మెల్ల మెల్లగా నీ మనసులో పరివర్తన వస్తుంది. సత్సంగం వలన అధిక లాభం కలుగుతుంది. అందుకే :-

కర్ ప్రేమీ జన్ కా సంగ్, తేరా నర్ జన్మ బనే
లోన్ కీ ఖాన్ మే వస్తు పడే జబ్, లోన్ సహజ హో జావే ।

ప్రేమీ జిస్ కా సంగ్ కరే జో, ప్రేమ ప్రీతి గతి పావే ।
పత్థర్ లోహ జల్ మే బూడే, కాఠ్ కా బేడా తైరే ।

లదే లోహ పత్థర్ జబ్ బేడా, నీర్ కే ఊపర్ హై రే ।
సంగత్ కర్ ఉత్తమ సజ్జన్ కీ, సజ్జనతా చిత్ ఆవే ॥

పడే అసజ్జన్ కీ జో సంగత్, విరథా జనమ్ గఁవావే ।
తోతా మైనా భక్త్ కే ఘర్ మే, రామ నామ నిత్ గాతే ॥

వహీ అభక్త్ అసాధ్ కీ సంగత్, అనుచిత్ బైన్ సునాతే ।
యహ విచార్ కర్ సంగ్ గురు కా, గురు గమ్ లే పహచానీ ॥

రాధాస్వామీ కీ శరనాయీ, హో జా జ్ఞానీ ధ్యానీ ॥

అందుకే మంచి సాంగత్యం చేయండి. మీ ఇళ్ళలో ప్రేమ పంచుకోండి. ఏ ధర్మంలో, ఏ మతంలో నీవుంటే అదే ధర్మం-అదేమతంవారు ఒక చోట చేరి కథా-కీర్తన చేయండి. ఏ ఇంట్లో ఏదో ఒక విచార ధార ప్రతి రోజూ పనిచేస్తుంటే ఆ ఇంట్లో పవిత్రత ఉంటుంది. సౌభాగ్యం, వృద్ధి ఉంటాయి.

*అందరికీ రాధాస్వామి*

# సత్సంగం

## 09–02–1973

## శబ్ద మహిమ

గురు కా దరస్ తూ దేఖ్ రీ, తిల్ ఆసన్ డార్ ।
శబ్ద గురు నిత్ సునో రీ, మిల్ బాసన్ జార్ ॥

గురు రూప సుహావన్ అతి లగే, ఘట్ భాన్ ఉజార్ ।
కమల్ ఖిలత్ సుఖ పావయీ, భౌఁరా కర్ ప్యార్ ॥

గురు జ్ఞాన్ న పాయా హే సఖీ, జిన్ ఘట్ అంధియార్ ।
పూరా సత్‌గురు నా మిలా, భరమత్ భవ జార్ ॥

మై తో సతగురు పాయియా, జావూఁ బలిహార్ ।
జ్యోఁ చకోర్ చందా గహే, రహూఁ రూప నిహార్ ॥

సత్ గురు శబ్ద స్వరూప హై, రహే అర్శ్ మంఝార్ ।
తూ భీ సురత్ స్వరూప హై, రహో గురు కీ లార్ ॥

నైనన్ మే గురు రూప్ హై, తూ నైన్ ఉఘార్ ।
సర్‌బన్ మే గురు శబ్ద హై, సున్ గగన్ పుకార్ ॥

రాధాస్వామీ కహ రహే, యహ మారగ్ సార్ ।
జో జో మానేఁ భాగ్ సే, సో ఉతరేఁ పార్ ॥

రాధాస్వామీ! (ఒకవ్యక్తి వైపు చూపించి)

"మీరు ఎక్కడి నుంచి వచ్చారు?"

"హుజూర్ నేను అమృతసర్ నుండి వచ్చాను"

అప్రతిష్టపాలయ్యే వాళ్ళలో నేను చేరను. జీ హుజూర్ అనటం నాకు తెలియదు. నేను హిందువును. బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాను. భిన్న విభిన్నవాణిలను చదివాను. కొందరు విష్ణుపూజ చేస్తారు. కొందరు శివుని

ఉపాసన చేస్తారు. కొందరు రాముడికీ, మరికొందరు అల్లాకూ ప్రార్థనలు చేస్తారు. ఒకరు సాకార పూజ, మరొకరు నిరాకారపూజలు నిర్వహిస్తారు. అసలైన భగవంతుని క్రమంలో నా అదృష్టం నన్ను హుజూర్ దాతా దయాల్ మహర్షి శివబ్రత్‌లాల్ జీ మహారాజ్ చరణ కమలాల లోనికి తీసుకువెళ్ళింది. ఆయన నాకు రాధాస్వామి మతం లేదా కబీర్ మతం లేదా సంత్ మత శిక్షణ ఇచ్చారు. ఆ వాణిలో అన్ని మతాల ఖండన- విమర్శ చదివాక నేనీ మార్గంలో సత్యవంతుడనై నడుస్తాను. నా అనుభవంలోకి వచ్చిన అంశాలను ప్రపంచానికి చెప్పి పోతానని ప్రతిజ్ఞ చేశాను. నేను అర్థం చేసుకున్నదంతా పొరపాటు కావచ్చు కూడా! ప్రకృతి అంతం ఎవరూ చూడలేదు. ఈ అనుభవాన్ని చెప్పినా ఏం లాభం అని చాలాసార్లు ఆలోచిస్తాను. నా భావం, నా కర్మ, నా కోరిక వలన నా అనుభవాన్ని లోకానికి చెబుతుంటాను.

కొందరి అంతరంలో రూపం సాక్షాత్కరిస్తుంది. ఒకరికి రాముడు, మరొకరికి కృష్ణుడు, వేరొకరికి దేవి, ఇంకొకరికి గురుపు రూపం ప్రకటమవుతుంది.

ఎవరిపై విశ్వాసం వుంటే వారి రూపమే మనలో ప్రకటమవుతుంది. తన అంతరాన రూపం సాక్షాత్కరించినందువలన ఇక తన జీవనంలో సంఘర్షణలు రావనుకుంటే లేదా అశాంతి ఉండదనుకుంటే పొరపాటే! నా అనుభవంలోకి ఈ విషయం రాలేదు. ప్రేమభావ ప్రభావానికిలోనై ధ్యానం చేయటంవలన వారికి ఆనందం లభిస్తుంది. వారికి సిద్ధిశక్తి కూడా రావచ్చు. ఎందుకంటే మనసు ఏకాగ్రత వలన సిద్ధిశక్తి వస్తుంది. రామునిపైనైనా కృష్ణునిపైనైనా, ఓం పైనైనా, అల్లాపైనైనా ఏకాగ్రత ఎవరిపైనైనా చేయవచ్చు. ఏకాగ్రతకు ఫలితం లభిస్తుంది.

చిన్న వయసులో నేను రాముడిని ధ్యానించేవాడిని. తరువాత కృష్ణుడిని ధ్యానం చేసేవాడిని. తరువాత హుజూర్ దాతా దయాల్ జీ ధ్యానం చేయసాగాను. నా సమస్త ఆయువు ఈ ధ్యాసలోనే గడిచింది. నేను నా వ్యక్తిగత అనుభవ ఆధారంపైనే చెబుతాను. మనసును విడిచి లేదా మనసుకు అతీతంగా పైకి వెళ్ళాక సుఖశాంతులు లభిస్తాయి. మనసు సంకల్పం వలన ఆనందం లభిస్తుంది. సిద్ధిశక్తి లభిస్తుంది. మనోకామనలు పూర్తి కాగలుగుతాయి. కానీ జనన మరణాల చక్రం నుండి విముక్తి లభించజాలదు. ఎందుకు? పద్నాలుగు

లోకాల్లో మనసు నివసిస్తుంది. మనసే అన్నీ చేస్తుంది. మనసు తరువాత స్థితిని సంతులు పరిశోధించారు. ప్రపంచం దానిని వెదుకుతూ వస్తోంది. జ్యోతిషంలో ముందు ఏడుగ్రహాలు ఉండేవి. తరువాత తొమ్మిది గ్రహాలయ్యాయి. ఇప్పుడు మరో రెండు గ్రహాలు ప్రకటమయ్యాయి. ఇప్పుడు పదకొండు గ్రహాలయ్యాయి. ఇప్పుడు కనిపించిన మరో రెండు గ్రహాల వర్ణన శాస్త్రాల్లో కూడా లేదు. మానవీయ జీవన అన్వేషణలో మనిషి ఉన్నతి పొందుతున్నాడని దీని అర్థం. మెడికల్ సైన్స్ కూడా చాలా ఉన్నతిని సాధించింది. మనిషి ఉన్నతిని సాధించి, లోకం దేవుడని నమ్మే ఆ చంద్రుని పైకి తోలు చెప్పులు వేసుకుని అధిరోహిస్తాడని ఏ జ్యోతిషగ్రంథంలోనూ, వేదాల్లోనూ రాయలేదు. ఈ ప్రపంచంలో సదా పరివర్తన వస్తుంటుంది. నేడు ప్రపంచంలో కొత్త కొత్త అవగుణాలు పుట్టాయి. మోసాలు అనేక రకాలు కన్పిస్తున్నాయి.

నీవు మనసు వలయంలోనే ఉంటే జన్మమరణాల చక్రంనుండి బయట పడజాలవని సంతుల అన్వేషణ ఋజువు చేసింది. అంత్య సమయంలో రాముడో, కృష్ణుడో, గురువో, ఇష్టుడో అతని అంతరంలోకి వస్తే ఆ వ్యక్తికి ఇక జనన మరణాలుండవనుకుంటే అది శుద్ధ పొరపాటే! ఇది నా పరిశోధనా ఫలితం. మరణ సమయంలో తమను తీసుకువెళ్ళడానికి బాబా ఫకీర్ పల్లకీ తెచ్చాడని, విమానం తెచ్చాడని, గుర్రం తెచ్చాడని చెబుతుంటారట. కానీ నేను ఎక్కడికీ వెళ్ళను. ఈ సంఘటనలను గురించి నాకసలే తెలియదు. ఎవరికి ఎలాంటి కోరికలుంటే అవే మరణ సమయంలో వారి ఎదుట కన్పిస్తుంటాయని దీనివలన ఋజువవుతున్నది.

నిన్న వ్యాస్ నాకో సంఘటన వినిపించాడు. అతడు ఎవరో గురువు దగ్గర నామం తీసుకున్నాడు. ప్రకాశంలో శివుని ధ్యానం చేసేవాడు. తన లోపల నా రూపం సాక్షాత్కరించిందని అతడు చెప్పాడు. తలపైన టోపీ ఉందట. గీచిన గడ్డం ఉందట. ప్రకాశంలో అతడు ఈ రూపాన్ని తన లోపల చూశాడు. నిజమో అబద్ధమో అతనికే తెలుసు. ఈ సంఘటన గురించి నాకు తెలియదు. నేను వెళ్ళి అతనికి దర్శనమివ్వలేదు. వ్యాస్ తన గురువుకు ఈ విషయం చెప్పినప్పుడాయన నీ లోపలికి ఓ ముస్లిం వచ్చాడు. నీవు చెడిపోయావు. భ్రష్టుడవయ్యావు" అని ఇతణ్ణి అసహ్యించుకోసాగాడట. ఈ సంఘటన తర్వాత నేను ఆ నగరానికి సత్సంగ కార్యక్రమం గురించి వెళ్ళాను. అక్కడ పత్రికలో

నాదొక ఆర్టికల్ ప్రచురింపబడింది. దానిని ఇతడు చదివాడు. నేనెవరి లోపలికీ వెళ్ళలేదు. ఇతని అంతరాన ప్రకటమైనది ఎవరు? ఇక్కడికి వచ్చాక నా బుద్ధి విఫలమైంది. కానీ ఇదీ మనసు రూపం. జన్మ సంస్కారం వ్యక్తిపై ఉండి దానిని అనుసరించి ఈ జన్మలో సంఘటనలు జరుగుతాయి. మనస్సు రూప చక్రంనుండి వలయంనుండి బయట పడడానికి గురువుకావాలి. ముందుగా బాహ్యగురువు మొత్తం విషయం, రహస్యమును బోధిస్తాడు. నీ లోపల శబ్ద రూపంలో ఒక అసలైన గురువు ఉన్నాడు. శబ్దమే నీలో ఉన్న అసలు గురువు. అదే నామం. వేదం దానినే శ్రుతి, స్మృతి మార్గం అంటుంది. శ్రుతి అంటే వినబడేది. ఋషులు తమలోపల ఏ కేంద్రపు ధ్వని లేదా రాగం లేదా లయను విన్నారో దాని సంస్కారాలు వారి మేధస్సుపై పడ్డాయి. మొదట అది శ్రుతి, తరువాత స్మృతి అయింది. ధ్వని వినటం వలన ప్రభావం, ఇష్టం గానం వినటం వలన ప్రభావం మస్తిష్కంపై పడినట్లే ఆంతరిక ధ్వని ప్రభావం కూడా ఉంటుంది. మన మేధస్సులో విభిన్న కేంద్రాలున్నాయి. ఏ కేంద్రపు ధ్వనిని ఏ వ్యక్తి అయినా వింటే దాని ప్రభావం అతని మేధస్సుపై పడుతుంది. అందుకే ఈ ప్రపంచం నుండి దాటి పోవడానికి సంతులు శబ్దమహిమను చూపారు. ప్రతి ఒక శబ్దం వేరు వేరుగా ఉంటుంది. ఎంతదాకా మనసు ఉందో అంతదాకా శబ్దమును వినటం వలన జనన మరణ చక్రం సమాప్తం కాదు. ఘంట, శంఖముల ధ్వనిని వింటున్న చాలా మంది జీవితాలు మురికిగా ఉన్నాయి. వారు మోసం, దగా, చేస్తుంటారు. కనుక సంతులు అసలైన శబ్దం నామ మహిమను గానం చేశారు.

గురు కా దరస్ తూ దేఖ్ రీ, తిల్ ఆసన్ డార్ ।

మొదట యోగ్యుడైన గురువును బాహ్య దర్శనం చేసుకో. అతనిని ప్రేమించు. తరువాత ఆయన్ని అంతరంగంలో చూడాల్సి ఉంటుంది. కాని అసలైన గురువు శబ్దమే!

శబ్ద గురు నిత్ సునో రీ, మిల్ వాసన్ జార్ ।

నీ లోపల కోరికలు లేనప్పుడు లేదా శబ్దం వినటం వలన అసలైన గురు దర్శనం చేసుకోగలుగుతావు. మనసు శుద్ధిగా లేనంతవరకు నీవు "సారశబ్దం"ను వినజాలవు. జీవితమంతా అభ్యాసం చేసినా సాంసారిక ఇచ్ఛ,

లాలూచీ నశించి ధనంపట్ల వైరాగ్యం నీలో కలగనంతవరకు సారశబ్దం వినజాలవు.

గురు రూప సుహావన్ అతి లగే, ఘట్ భాన్ ఉజార్ ।

గురు రూపం ఏమిటి? బాబా గడ్డం, మీసాలు అంతరాన కనిపిస్తాయని ఒకరంటారు. హజూర్ బాబా సావన్ సింగ్ జీ పగ్‌డీ, కళ్ళు కనిపిస్తాయని మరొకరంటారు. ఇదంతా నీ మనసు ఏర్పరుచుకున్న రూపం. అసలైన గురువు రూపం ప్రకాశం. అదెంతో సుందరంగా అనిపించే గురు రూపం! నా పట్ల ఎవరికైనా వ్యతిరేకభావం ఉంటే వారికి నా రూపం చెడ్డగా తోచి ఉండచ్చు. ఒకవేళ అంతరంలో కనిపించే నా రూపమే గురువైతే ఇక వీరందరికీ బాగా సుందరంగా అనిపించాలి. అసలైన గురురూపం ప్రకాశం. అది అందరికీ సుందరంగా అనిపిస్తుంది. హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు అందరికీ హృద్యంగానే ఉంటుంది.

కమల్ ఖిలత్ సుఖ్ పావయీ, భౌఁరా కర్ ప్యార్

ఈ దృశ్యం కనిపించినప్పుడు మనసుకు ఆనందం, ప్రేమ, సుఖం, శాంతి లభిస్తాయి.

గురు జ్ఞాన్ న పాయా హే సఖీ, జిన్ ఘర్ అంధియార్

సత్సంగం నుండి నీవు అసలు విషయం అర్థం చేసుకోనంతవరకు నీ లోపల ప్రకాశం కాజాలదు.

పూరా సత్‌గురు నా మిలా, భ్రమత్ భవ జార్ ।

పూర్ణ జ్ఞానం వినా మనిషి భ్రమలో ఉంటాడు. ఒకసారి రాముడిని పూజిస్తాడు. మరోసారి కృష్ణుడిని పూజిస్తాడు. ఒకసారి బాబే ఫకీర్‌ను పూజించాడు. ఒకసారి మరొకరిని పూజిస్తాడు. బుద్ధి నిశ్చయాత్మకం కాలేదు.

మై తో సత్‌గురు పాయియా, జావూఁ బలిహార్ ।

బయటి పూర్ణ సత్‌గురువు లభిస్తే ఆయన "ఓ మనిషీ! అసలైన సత్ గురువు ప్రకాశమే. సార శబ్దమేననే" జ్ఞానం ఇస్తాడు.

జ్యోఁ చకోర్ చందా గహే, రహోఁ రూప నిహార్ ।

ఏ విధంగా చకోరం చంద్రుడిని చూసి సంతోషపడుతుందో అలాగే వ్యక్తి తన లోపల ప్రకాశ రూపి సత్‌గురువును చూసి ఆనంద మగ్నమవుతాడు.

సత్‌గురు శబ్ద స్వరూప హై రహూం అర్ప మంర్ఘూర్ ।
తూ భీ సురత్ స్వరూప్ హై రహో గురు కీ లార్ ॥

స్వామీజీ మహారాజ్‌కు ఎంతో సేవచేసిన హుజూర్ రాయ్ సాలిగ్ రామ్ జీ వాణి ఇది. ఆయన వాణిలో ఎక్కడా మోసం, దగా లేవు. ఓ మనిషీ! నీవు సురత్ స్వరూపానివి. సద్గురు లేదా భగవంతుడు నీ హృదయం లోపల నీ మస్తిష్కం లోపల ఉంటాడు. నీవు నీ సురత్‌ను ఆయనతో కలుపు" అని ఆయన రాస్తున్నారు.

నైనన్ మే గురు రూప్ హై । తూ నైన్ ఉధార్ ।
సరబన్ మే గురు శబ్దహై । సున్ గగన్ పుకార్ ।

రాధాస్వామి కహ రహే యహ మార్గ్ సార్ ।
జో జో మానే భాగ్ సే సో ఉతరే పార్ ॥

ఈ ప్రపంచంనుండి దాటిపోవడానికి సంతుల పరిశోధన ఇది. కలియుగంలో విశేషమేమిటంటే ప్రతి ఒక్కపని త్వరగా అవుతుంది. దేవతలు కూడా కలియుగంలో శరీరాన్ని పొందడానికి తపిస్తుంటారని శాస్త్రం చెబుతోంది. ఎందుకంటే మానవ శరీరాన్ని ధరించి త్వరగా ముక్తి ప్రాప్తించుకుందామని వారూ ఆశిస్తారు.

కలి కేవల్ ఇక్ నామ ఆధారా। శ్రుతి స్మృతి సంత్ మత్ సారా ।

కలియుగంలో నామ మహిమ అధికం. ప్రతి పనీ చాలా త్వరగా పూర్తవుతుంది. పూర్వం మరోరకపు సాధనాలు ఉండేవి. ఇప్పుడు ఆటంబాంబులు, హైడ్రోజన్ బాంబులు తయారయ్యాయి. ఒక్క బాంబుతో లక్షలాది జనం చనిపోతారు. మనిషి రెండు రోజుల్లో నేలపై నుండి చంద్రుని వరకు చేరుకుంటున్నాడు. నామం ఏమిటి? నీలోపల ధ్వనిస్తున్న శబ్దమే!

అందరికీ రాధాస్వామి

# సత్సంగం

## 10–02–1973

## నిర్వాణ పదం

లిఖ్ రే కోయీ బిర్‌లా పద్ నిర్వాణ్,
తీన్ లోక్ మే యహ యమరాజా, చౌథే లోక్ మే నామ నిశాన్ ।
జాహే లఖత్ ఇంద్రాది థక్ గయే, బ్రహ్మ థక్ గయే పఢత్ పురాన్ ।

గోరఖ దత్త్ వశిష్ఠ వ్యాస ముని, శంభు థక్ గయే ధర్ ధర్ ధ్యాన్,
కహే కబీర్ లఖే కోయీ బిర్‌లా, జిన్ పాయో సత్‌గురు కా జ్ఞాన్ ।

రాధాస్వామి! ఈ శబ్ద్ విన్నాను. మొదట్లో కూడా వినేవాడిని. ఇలాంటి రచనలను చదివి బాధపడని హిందువుంటాడా? ఆ అన్వేషణా క్రమంలో నేను దైవేచ్ఛ ప్రకారం, నా కర్మానుసారం హుజూర్ దాతాదయాల్ మహర్షి శివవ్రత్‌లాల్ జీ మహారాజ్ చరణకమలాలలోకి వెళ్ళాను. సనాతన మతధర్మ సంస్కారాలతో వెళ్ళాను. ఆ పరమాత్మ ఈ ప్రపంచంలో అవతరిస్తాడనే నమ్మకంతో వెళ్ళాను.

**నానా భాంతి రామ అవతారా, రామాయణ శత్ కోటి అపారా!**

పరమాత్ముని అవతారమని నేను భావించిన ఆ పవిత్ర విభూతి దాతాదయాల్ జీ నన్ను కబీర్ మతం లేదా రాధాస్వామి మతం-లేదా సంత్ మతం వైపు మళ్ళించాడు. ఆయన రచనలను, వాణిని చదివేవాణ్ణి. కబీర్ సాహబ్ వివరించిన ఆ నిర్వాణ పదమును చూడాలని నా మనసులో ప్రబలమైన కోరిక ఉండేది. ఆయువు గడిచి పోయింది. ఇప్పుడు నిర్వాణ పదం చిరునామా తెలిసిపోయింది. నిన్న హన్మకొండ నుండి గోపాల నాగోరీ రాసిన ఉత్తరం వచ్చింది. ఆయన నన్ను ప్రశంసిస్తూ నన్ను చాలా ప్రశ్నలు అడిగారు. "మీ రూపం సత్సంగీయుల అంతరంలో సాక్షాత్కరిస్తుంది. కానీ అలా మీరు వెళ్ళలేదని చెబుతారు మీరు. మీకు ఈ విషయం తెలిసి ఉండాలి' '... అని రాశారాయన.

ఓ ధార్మిక, పంథ ప్రాపంచికులారా! నేను కబీర్ సాహబ్ చెప్పిన నిర్వాణ పదమును అర్థంచేసుకున్నానంటే అది కేవలం నా రూపం ఇతరుల అంతరంలో సాక్షాత్కరించిన విషయం నాకు తెలియదన్న వాస్తవంతోనే తెలుసుకోగలిగాను. ఈ రూపం ఎలా సాక్షాత్కరిస్తుంది?

తీన్ లోక్ మే యహ యమరాజా, చౌథే లోక్ మే నామ నిశాన్ ।
జాహే లఖత్ ఇంద్రాది థక్ గయే, బ్రహ్మ థక్ గయే పఢత్ పురాన్ ॥

మూడు లోకాలలో యమరాజు ఉన్నాడు. తొలగింపబడడాన్ని, వేరు చేయబడడాన్ని, త్యాగం చేయడాన్ని, బయటికి తీసివేయడాన్ని 'యమ' అంటారు. మన మానసే మాయ. ఒకటి బ్రహ్మాండీ మనసు. అనగా బ్రహ్మాండ శరీరంలో పనిచేసే మనసు. కబీర్ సాహబ్, రాధాస్వామీ దయాల్, ఇతర సంతులు అన్నిటినీ విమర్శించారు. ఖండించారు. అలా విమర్శించడానికి వారికి ఎలాంటి హక్కుందో అర్థమయ్యేది కాదు.

గోరఖ్ దత్త్ వసిష్ఠ వ్యాస ముని, శంభు థక్ గయె ధర్ ధర్ ధ్యాన్
కహే కబీర్ లఖే కోయీ బిర్‌లా, జిన్ పాయో సత్‌గురు కా జ్ఞాన్ ।

వీళ్ళంతా ఎందుకు అలసిపోయారు? ప్రకటమవుతున్న రూపాలు ఏమిటి? కొందరు రాముణ్ణి పరమాత్ముడని భావించి పూజిస్తారు. మరికొందరు కృష్ణుడే దేవుడని నమ్మికొలుస్తారు. ఇంకొందరు దేవినీ, ఇతర దేవతలనూ, దేవుళ్ళనూ భగవంతుడని విశ్వసించి వారి పూజ చేస్తారు. మరికొందరు 'అహంబ్రహ్మ' అంటారు. ఎవరు పూజించినా అది వారి మనసు యొక్క సంకల్పమే! ఇలాంటి అనుభవాలు నా దగ్గరికి చాలా వచ్చాయి. ప్రతిరోజూ వస్తుంటాయి. నా రూపం తమ జాగ్రత స్థితి లోనో, సమాధి స్థితిలోనో లేక మృత్యు సమయంలోనో సాక్షాత్కరించి సహాయపడిందని అంటూ ఉంటారు. కానీ అలా సాయపడింది నేను కాదు. అలాంటి సంఘటన గురించి నాకు తెలియనే తెలియదు. దీనివలన నాకు విశ్వాసం కలిగిందేమిటంటే (Universal Mind) సార్వత్రిక విశ్వజనీన మేధ అనగా బ్రహ్మాండీ మనసు పధ్నాలుగు లోకాల్లో నిండి ఉంటుంది. నివసిస్తుంది. మనసు లహరులు ప్రతి ఒక శరీరం నుండి

వెలువడుతూ ఉంటాయి. బ్రహ్మాండంలో ఉంటాయి. రేడియో నియమానుసారం ఇక్కడ ఎవరికి ఏ వస్తువుపై కోరిక కలుగుతుందో అది ఆలోచనలో రూపాలు ధరించి, ప్రత్యేక సంస్కారాన్నిచ్చి ఆ వ్యక్తి అంతరంలో సాక్షాత్కరిస్తుంది. ఈ ప్రపంచంలో మంచివేకాదు చెడు ఆలోచనలు కూడా ఉంటాయి. అందుకే ఎలాంటి ఆలోచనల ఒత్తిడి ఎక్కువగా వుంటే అవి రెండవ రకపు ఆలోచనలను అణచిస్తాయి. దీనిని నిరూపించడానికి రామాయణంలోని ఒక ఉదాహరణ చెబుతాను. రామునికి పట్టాభిషేకం జరగబోతుంటే దేవతలలో కలకలం చెలరేగింది. రాముడు అయోధ్యకు రాజై ఇక్కడే స్థిరపడితే మరి రావణాసురుడెలా వధించబడతాడు? దుష్టసంహారం ఎలా జరుగుతుంది? అని అందరూ సందేహంలో పడ్డారు. అందుకే యోగమాయను అయోధ్యకు పంపారు. మంధర మెదడును యోగమాయ ప్రభావితం చేసింది. కైకేయికి వరాలు గుర్తుకు తెచ్చి, వాటిని ఇప్పించి రాముడికి పట్టాభిషేకం జరిగే బదులు వనవాసానికి వెళ్ళేలా చేసింది.

గోపాల్ నాగోరీ మరికొన్ని ప్రశ్నలడిగారు. దేశంలో ఆకలి ఉంది. అన్నం దొరకదు. తాగడానికి స్వచ్ఛమైన మంచినీరు దొరకదు. జగడాలు జరుగుతున్నాయి. దేశంలో అశాంతి వ్యాపించింది అని రాశారాయన. నేను ఏ పరమాత్ముడినో కాను. నాకు ఏ విషయాన్ని గురించిన పట్టుదలా లేదు. వ్యక్తులలో ఈర్ష్య, ద్వేషం, తిమ్మనిబమ్మి చేయటం, మోసం వంటివి పెచ్చు పెరిగాయి. అన్ని ఆలోచనా విచారాలూ బ్రహ్మాండంలో ఉంటాయి. అవి ఇతరుల మెదళ్ళపై కూడా ఇలాంటి ఆలోచనా విచారాలనే ఉత్పన్నం చేస్తాయి. ఇది త్రిలోకీ లీల. ఇక్కడ (కాలుడు అనగా) మనసు రాజ్యం చేస్తుంది. జరుగుతున్నదంతా కర్తాపురుషుని సంకల్ప విశ్వజనీన మేధ ప్రపంచ ఫలితమే! కాలుని సంకల్పంవల్లనే సూర్యుడు, చంద్రుడు, తారకలు ఉద్భవిస్తాయి. ఆకాశీయ రచన జరుగుతుంది. సూర్యుడు, చంద్రుడు నక్షత్రాల ధారలు లేక కిరణాల ద్వారా ఈ సృష్టి రచనలో పరివర్తన జరుగుతుంటుంది. ఇది ప్రకృతి రహస్యం. ఈ గ్రహాల ప్రభావం ఎలా ఉంటుందో, ఏ రాశులతో ఈ ఆట ఆడుతుందో ఆ రాశులపై దీని ప్రభావం పుడుతుంది. హిందూ శాస్త్రాలు "శివ

సంకల్పమస్తు"అని ఆజ్ఞాపించాయి. నిర్దేశించాయి. సదా కళ్యాణకరమైన, శుభకర విచారాలను పెట్టుకోమని శాస్త్రం చెబుతోంది. మనసు, వాక్కు, కర్మలతో శుద్ధిగా ఉండు. స్వార్థం, ఈర్ష్య, ద్వేషాదులను వదలిపెట్టు. మనం సత్యసనాతన ధర్మాన్ని, సత్ మానవధర్మమైన వేదమార్గాన్ని వదిలేశాం. అందుకే మనలోని మురికి విచారాలు, ఆలోచనలు బ్రహ్మాండంలోకి వెళ్ళి మనకు దుఃఖాన్ని కలిగిస్తుంటాయి.

హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్ జగత్ కళ్యాణ కార్యం నాకు అప్పగించారు.

తేరా రూప్ హై అద్భుత్ అచరజ్ తేరీ ఉత్తమ దేహీ ।
జగ కళ్యాణ జగత్ మేం ఆయా పరమ దయాల సనేహీ ।

నీదు రూపమే అద్భుత మాశ్చర్యం, నీదీ ఉత్తమ దేహం ।
జగతికి శుభమును కూర్చుట కొరకే ఏతెంచిన పరమ దయాళు ॥

నేను ఎలాంటి శుభం, కళ్యాణం చేయగలనా అని ఆలోచిస్తుంటాను. "ఓ మనిషీ! నీ లోపల ఉద్భవించే మంచి, చెడు రూపాలు, వర్ణాలు, ఆకారాలు రేడియేషన్ సిద్ధాంతాన్ని బట్టి ఉన్నాయి. ధారలు, సంస్కారాలు రేడియేషన్ ద్వారా ఒకరిపై మరొకరి ప్రభావం పడుతుంటుంది. ఒకరు మరొకరిని ప్రభావితం చేస్తుండటం ప్రకృతి నియమం. ఈ ఆలోచనతో నేను నా జీవన అనుభవం తరువాత మానవతా నినాదమిచ్చాను. కబీర్ సాహబ్ కూడా మానవతను గురించి చెప్పారు.

గురు పశు నర్ పశు త్రియా పశు వేద పశు సంసార్ ।
మానుష్ తాహి జానియో జామే వివేక్ విచార్ ॥

ఏ వ్యక్తికైనా బుద్ధి, వివేకాలు కలుగనంత వరకు, రహస్యం తెలియనంత వరకు సాధారణ భక్తివలన సంతోషం లభిస్తుంది. కానీ లాభం కలుగదు. రూపులు, వర్ణాలు ఉద్భవించటమంతా రేడియేషన్! గురు రూపం సాక్షాత్కరిస్తుందంటారు. కానీ కాదు. ఒక వ్యక్తి ఒక అందమైన స్త్రీని చూశాడు. ఒక స్త్రీ

మరో అందమైన పురుషుణ్ణి చూస్తుంది. వారి మనసుల్లో ఆకారాల చిత్రం ఏర్పడుతుంది. అప్పుడు ఒకరి మనసులో మరొకరి రూపం ముద్రితమవుతుంది. కళ్ళుమూసుకున్నా ఆ రూపం కళ్ళెదుట దర్శనమిస్తుంటుంది.

ఓ గోష్ఠాల్ నాగోరీ! నీవు బ్రాహ్మణుడవు. సంస్కారాల కారణంగా నీవు కమ్యూనిస్టువయ్యావు. నీ పూర్వ జన్మ సంస్కారాలు నిన్ను నా సమక్షంలోకి తెచ్చాయి. నీవు చాలా అంశాలను నీ అనుభవంలోనికి తెచ్చుకున్నావు. కమ్యూనిస్టు వయ్యావు. క్రైస్తవ, ముస్లింలను కూడా దత్తు తీసుకుని చూశావు. పూర్వ జన్మలోని ఋణాలు, ఇచ్చి పుచ్చుకోవడాలు తీర్చుకోవలసే ఉంటుంది. ఇప్పుడు నీవు నీ జన్మ సార్థకం చేసుకోవాలనుకుంటే నీ కాలుడు అనగా రేడియేషన్ లేదా చలనం యొక్క చక్రభ్రమణం, ఆలోచనా విచారాల భ్రమణంలో నుండి బయటపడడు. నీ ఆది స్థితి అనగా ఎక్కడి నుండి సురత్ వెలువడిందో అక్కడికి వెళ్ళు. నీలోపల ప్రకాశం, శబ్దం అనగా పారబ్రహ్మ, శబ్ద బ్రహ్మలవైపు నీ ఈ జన్మ సఫలమవడానికి ఏకాగ్రత చూపు, శ్రద్ధచూపు. ప్రపంచం పోకడను ఎవరూ బాగుచేయలేకపోయారు. లక్షలాది ధర్మాలు, మతాలు, గురువులు ఇక్కడికి వచ్చారు. తమ తమ పనులు చేసుకుంటున్నారు. కానీ అయినా చూడు! ప్రపంచంలో ఏం జరుగుతున్నదో!

ఓ నాగోరీ! నీవు నిన్ను తండ్రిగా భావిస్తావు. ఓ వెర్రివాడా! నీవు నీ జన్మను బాగుపరుచుకో! నీ లోపల ప్రకాశ, శబ్దసాధన చేయి. దీనికంటే ఎక్కువ నేనింకా ఏమీ చెప్పదలచుకోను. రానూపోనూ ఖర్చుకు జేబులో డబ్బులుంటే బైశాఖికి రా.

ఈ సత్సంగం చదివాక భాయీ నందూసింగ్ జీ మహారాజ్‌కు పంపించు. దీనిని ఆయన దయాల్, మనుష్యబనో తదితర పత్రికలలో ప్రచురిస్తారు.

*అందరికీ రాధాస్వామి*

# సత్సంగం.

## 11–02–1973

# గురు - కృప

గురు కే దరసన్ కర్‌నే హమ్ ఆయే అబ్ దూర్ సే,
ఆయే అబ దూర్ సే, చల్ ఆయే హమ దూర్ సే ॥

దీన్ అనాథ్ భిఖారీ దర్ కే, హుయే మంగతా
హమ్ ఘర్ ఘర్ కే । గురు మిలావే మూర్ సే ॥

ఔర్ ఆస్ విశ్వాస్ న కోయీ, చరణ గురు కే పక్‌డే
సోయీ, వహీ ఛుడావే కూడ్ సే ॥

సురత్ డోర్ చరణన్ మే లాగీ, చిత్త చంచలతా
సబ్ హీ భాగీ, వహీ లగావే తూర్ సే ॥

అనహద్ బాజే బజే గగన్ మే, సురత్ చఢీ
అవుర్ లగీ ధున్ మే, దృష్టి మిలీ అబ నూర్ సే ।

కాయర్‌తా అబ్ మన్ సే భాగీ, సురత్ శబ్ద మే
ఛిన్ ఛిన్ లాగీ, డరే కాల్ గురు సూర్ సే ।

సహస్ కమల్ తజ్ త్రికుటీ ఆయీ, సున్న పరే మహా
సున్న చఢాయీ, భేద్ మిలా గురు పూర్ సే ॥

భఁవర్ గుఫా కా తాలా తోడా, అమర్ నగర్ జా
సురత్ కో జోడా, మిల్ గయీ సత్త్ జహూర్ సే ॥

అలఖ పురుష్ కీ ప్రీత్ సమానీ, అగమ లోక
జా బైఠక్ ఠానీ, హుయీ పావన్ గురు ధూర్ సే ॥

రాధాస్వామీ చరణ్ తుమ్‌హారే, లగే మోహే అబ్
అతికర్ ప్యారే, ఆరత్ కరూఁ శవూర్ సే ॥

రాధాస్వామి! చిన్నప్పటి నుండీ నాలో ఒక అన్వేషణ ఉండేది. అది ఇప్పటికీ ఉంది. రాముడిని వెదుకుతూ ఏడ్చేవాణ్ణి. నా అదృష్టమో, దైవేచ్ఛనో నన్ను హుజూర్ దాతా దయాల్ శివవ్రత్ లాల్ జీ మహారాజ్ చరణ కమలాల లోనికి చేర్చింది. నాకాయన సంత్ మతం, కబీర్ మతం, రాధాస్వామి మతాల సంస్కారమిచ్చాడు. నా లోపలి భగవంతుణ్ణి కలుసుకునే మార్గాన్ని చూపించారు. వయసుగడిచిపోయింది. నాకు బోధపడిందే సత్యమని వాదించను. పలురకాల వచనాలు, సంత్‌ల రచనలు అర్థమయ్యేవి కావు. భ్రమలలో ఉండేవాణ్ణి. హుజూర్ దాతాదయాల్ జీ మహారాజ్‌ను ప్రార్థించే వాడిని. ఇప్పటికీ వేడుకుంటూనే ఉంటాను. ఈ మార్గంలో నడవటం వలన నాకు కలిగే అనుభవాలను లోకానికి చెప్పిపోతానని ప్రతిజ్ఞచేశాను. ఓ ప్రాపంచికులారా! నా అనుభవం తప్పుకావచ్చు! ఒప్పుకావచ్చు. నేను చెప్పేదే సరైనదని వాదించను. ఇప్పుడీ శబ్దం చదవబడింది.

గురుకే దర్శన్ కర్‌నే హమ్ ఆయే అబ్ దూర్‌సే ।

బస్రా బగ్దాద్‌లో ఉండే రోజుల్లో శలవు తీసుకుని లాహోర్‌కు గానీ, రాధాస్వామి ధామ్‌కు గానీ గురు దర్శనార్థం వెళ్ళేవాణ్ణి. ఆ దర్శనం వలన అనగా బాహ్య దర్శనం వలన నేను అన్వేషిస్తున్న వస్తువు దొరకలేదు. బాహ్యదర్శనం వలన ప్రసన్నత, ఆనందం, ప్రేమ, గౌరవం లభించాయి. కానీ అసలైన వస్తువు లభించ లేదు. సురత్ దేనినో కోరుతుండేది. స్వామీజీ మహారాజ్ రచనలో ఇలా వచ్చింది.

సురత్ సున్ బాత్ రీ, తేరా ధనీ బసే ఆకాశ రీ ।

ఆకాశం పైన ఉంది. ఒక ఆకాశం మన మేధస్సులో ఊర్ధ్వభాగాన ఉంది. ఒకటి ఆకాశ తత్వం. నేను నా అంతరంలోకి వెళ్ళేటందుకు ప్రయత్నిస్తుంటాను. హుజూర్ దాతా దయాల్ జీని ప్రేమించేవాణ్ణి. ఆయన అభ్యాసం చేయమన్నారు. కొందరు నన్ను గురువుగా భావించి ఎంతో దూరం నుండి వస్తారు. నా ఆత్మను శుచిగా, పవిత్రంగా ఉంచుకోవాలనుకుంటాను. ఇలా చేసుకుంటే గురువునైన దోషం నన్నంటదు.

సంతుల అనుభవ వాక్కులను సంతులు తప్ప ఇతరులెవరూ అర్థం చేసుకోజాలరు. ఇతరులు దాని అసలు అర్థాన్ని అనర్థం చేసి పెడతారు.

గురువు దర్శనం కోసం మేమెంతో దూరం నుండి వచ్చామని ఈ శబ్దంలో ఉంది. దూరం ఉంటే ఏమిటి? అదెలాంటి దూరం? గురువు మన మస్తిష్కంలో ఉంటాడు. ఆయనను దర్శించుకోవడానికి సురత్ పైకి వెళ్తుంది. మీరొస్తారు. మీకు బోధన అవసరంలేదనీ, ప్రాపంచిక కోరికలే మీరు కోరుతుంటారనీ నాకు తెలుసు. ఇందులో మీ తప్పేమీ లేదు. నేను సైతం ప్రపంచపు వల నుండి దూరం కాలేదు.

కొందరి వల పెద్దదీ, మరికొందరిది చిన్నదీ అంతే! కొందరికి ఎక్కువ మోహం, మరి కొందరికి తక్కువ! అంతే తేడా! నాపైన హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్ కృప పుష్కలంగా ఉంది. తిండికి లోటులేదు. సేవ చేసే వారున్నారు. కనుక నాకు తక్కువ దుఃఖం కలుగుతుంది. కానీ గృహస్థులందరికీ ఈ మాట వర్తించదు. ప్రతినిత్యం ఎవరో ఒకరు నా దగ్గరికి వస్తూనే ఉంటారు. ఉత్తరాలొస్తుంటాయి. ఒకరికి ఒక బాధ, మరొకరికి మరొక బాధ. దుఃఖం, సమస్యలు! ఈ ప్రపంచంలో ఎవరికీ సుఖం లేదని తెలుసుకున్న వారు అసలైన సుఖం కోసం అన్వేషిస్తుంటారు. అలాంటి వారి కోసమే సంత్ మతం. మిగతా వారి కోసం వేదమార్గం. 'శివసంకల్పమస్తు' ఎవరికేది లభించినా వారి కర్మఫలమే లభిస్తుంది. నా కళ్ళు తెరుచుకున్నాయి. మనం ఉంటున్న ప్రపంచం కాల పురుషునిది. ఇక్కడ సంకల్పం, ఆశ, వాసనలు పని చేస్తుంటాయి. భగవద్భక్తులను, సేవకులను ఎందరినో చూశాను. చివరికి వాళ్ళ స్థితి ఎలా అయిందో గమనించాను. చాలామంది సంతులు తమ అంత్యకాలంలో దుఃఖాలననుభవించారు. భగవంతుని భక్తులకు శారీరిక కష్టాలు ఎందుకు కలుగుతాయని ఆలోచిస్తుంటాను. తననే నమ్ముకున్న తన భక్తులకు దుఃఖం ప్రసాదిస్తున్న భగవంతుడు కఠినుడనుకోవాలి లేదా ఈ భక్తులు తమ తమ కర్మఫలములను శిక్షను అనుభవిస్తూ ఉన్నారనైనా భావించాలి. అందుకే నేను గురుపదవిలోకి వచ్చాక పరదాలు కప్పి వాస్తవాన్ని దాచలేదు. పదహారణాల సత్యం చెప్పాను. నేను కూడా తెరలు కప్పితే ఇతర మహాత్ములవలె లక్షలాది రూపాయలకు యజమానినై ఉండేవాడిని. నా రూపం కొందరి అంతరంలో సాక్షాత్కరించి మరణ సమయంలో తీసుకువెళ్తుంది. మరికొందరికి ఔషధాలు చెబుతుంది. కొందరికి పుత్రులనిస్తుంది. ఇంకొందరికి పరీక్షలో జవాబులు రాస్తుంది. కానీ ఇలా వీళ్ళందరికీ ఇన్ని రకాల

సహాయాలందించింది నేను కాను. కనుక నాకే అహంకారమూ కలుగదు. కర్మఫలమే లభించినప్పుడు అబద్ధపు గౌరవం, అబద్ధపు సంపదలకోసం నేనెందుకు అసత్యం చెప్పాలి? నా కర్మను చెడుగా ఎందుకు చేసుకోవాలి? కనుకనే నేనెవరి అంతరంలోనూ ప్రకటంకాలేదనీ, సహాయమందించలేదని పూర్తిగా స్పష్టం చేశాను.

దీన్ అనాథ భిఖారీ దర్ కే, హుయే మంగతా
హమ్ ఘర్ ఘర్ కే, గురు మిలావే మూర్ సే ॥

గురువు నన్ను మూలంతో ఎలా కలిపాడు? మీ లోపల నా రూపం ప్రకటమవుతుందని మీరు చెప్పినప్పుడు, అది నేను కాదు గనుక నాకు విశ్వాసం ఏర్పడింది. నా లోపల దర్శనమిచ్చిన రూపాలు, వర్ణాలు, మంచీ చెడులు అన్నీ నా మనసు ఆటలు, ఆశలే కనుక వాటిని విడిచి ఇప్పుడు కేవలం శబ్ద ప్రకాశాలలో ఉండేటందుకు ప్రయత్నిస్తాను. ఆకాశం గుణం అన్నిటికన్నా గొప్పదని శాస్త్రాలు సైతం అంగీకరించాయి. ఆకాశ గుణం శబ్దం. సైన్సు కూడా లైట్ అండ్ సౌండ్ - శబ్ద ప్రకాశాలతో సృష్టి ఉత్పన్నమైందని స్పష్టంచేసింది. మన మూలం శబ్దమే! దీనిని రాధాస్వామి మతంలో నామం, సత్ నామం అంటాం. అందులోకి వెళ్ళాక మళ్ళీ తిరిగి రాకూడదని కోరుకుంటాను. కానీ అక్కడ స్థిరంగా నిలబడలేను. మళ్ళీ తిరిగి వెనుకకు రావటంలో ఎలాంటి దుఃఖం ఉంది? ఇప్పుడు వృద్ధుడనయ్యాను. కడుపునొప్పో, మూత్రవ్యాధో, మరోరోగమో బాధిస్తుంటాయి. కనుకనే శరీరాన్ని వదిలివేయాలని కోరుకుంటాను. కానీ అది ఎవరి చేతిలోనూ లేదు. నిజ గృహానికి తరలిపోవాలనీ, మళ్ళీ తిరిగి రాకూడదనీ అనిపిస్తూనే ఉంటుంది.

అవుర్ ఆస్ విశ్వాస్ న కోయీ, చరణ గురుకే
పకడే సోయీ, వహీ ఛుడావే కూఢ్ సే ॥

మీరు నన్ను గురువుగా భావిస్తారు. అసలు విషయాన్ని నేను స్పష్టంగా విప్పి చెప్పకుంటే, మిమ్మల్ని నా వలలో పడేసుకోవడానికి ప్రయత్నించి నట్లవుతుంది. మీరు నా చరణాలను స్పృశిస్తే నేను అపరాధినవుతాను. నిజానికి గురువు శబ్ద స్వరూపుడు. ఆయన చరణాలు ప్రకాశం. దీనినే హుజూర్ మువల్లాముకద్దస్ రాయ్ సాలిగ్‌రామ్ మహారాజ్ 'కూఢ్ హై ఝూఢ్'

అని తన వాణిలో రాశాడు. నా మనసు లోపల సాక్షాత్కరించే రూపాలు సత్యమని నమ్మి వాటి వెంట పరుగెత్తేవాణ్ణి. అదొక వెర్రిబాగులతనం. మోసం. ఈ స్థితి నుండి విడిపించగల వారెవరు? గురుచరణాలు. గురుచరణాలంటే ప్రకాశం. దశమ ద్వారం నుండి దాటి ముందుకు, నీ సురత్ పైకి వెళ్ళిపోతే ఇక నీ లోపల ఏ రూపాలూ, ఆకారాలూ ఏర్పడవు. మోసం నుండి తప్పించుకోగలుగుతావు. ఈ మోసం, పిచ్చితనం తనకు తానుగా సమాప్త మవుతుంది. మీరు జీవితాంతం బాహ్యగురువు చరణాలలోనే చిక్కుకుని ఉంటారు. మోసం నుండి అమాయకత్వం నుండి బయటపడరు. అంతరంలోకి బాబా సావన్‌సింగ్ జీ మహారాజ్ వచ్చాడని కొందరు, కృపాల్ సింగ్ జీ మహారాజ్ వచ్చాడని ఇంకొందరు, బాబా ఫకీర్ వచ్చాడని మరికొందరు అంటూ ఉంటారు. ఇవన్నీ మోసాలే! నిన్న అమెరికా నుండి ఒక ఉత్తరం వచ్చింది. "బాబాజీ! నేను నా సాధనలో మిమ్మల్ని చూశాను" అని అందులో రాశారు. అతనిలోకి నేను వెళ్ళనిదే వెళ్ళానని అబద్ధమెలా చెబుతాను? ఈ మతాలు, పంథాలు మనల్ని అజ్ఞానంలో ఉంచి దోపిడీ చేశాయి. మన రక్తం, చెమటలు ధారబోసి సంపాదించిన డబ్బును ఈ మోసపు గురువులకు ఇవ్వక బాధితుల సేవకు వినియోగిస్తే వేయింతల ఫలితం లభిస్తుంది. మీ అంతరాన గురురూపం ప్రకటమవుతుంది గనుక మీరు గురువులకిస్తుంటారు. ఇదంతా మోసం. ఈస్థితిని చూసి మార్పు తేవాలని నేను ఫకీర్ శరీరంలో అనామీ ధామం నుండి దిగివచ్చాను, ప్రపంచానికి వాస్తవంచెప్పి, దోపిడీ నుండి రక్షించాలని వచ్చాను.

జగ్ మే ఘోర్ అంధేరా భారీ, తన్ మే తమ్ కా భండారా।
జాగ్రత స్వప్న సుషుప్తి దేఖా, భూల్ భులైయా ధర్ మారా ॥

రాధాస్వామి మతం సత్యమైన శిక్షణ ప్రపంచానికి చెప్పి పోవాలను కుంటున్నాను. నాకు కూడా డబ్బు అవసరమే! దీనికి నేను అతీతుడనేం కాదు. ఎందుకంటే ఇక్కడ మందిరం ఉంది. ఆసుపత్రి ఉంది. ఇక్కడ నుండి పేదవారికి సహాయం అందుతుంది. అనాథ పిల్లల పోషణ జరుగుతుంది. పేద పిల్లల చదువులకు ఖర్చవుతుంది. కానీ మీ కళ్ళలో కారం కొట్టి మీ నుండి పైసలు తీసుకోదలచుకోవటం లేదు. జ్ఞాన దృష్టితో నా బోధనలను

వ్యాపింపచేయడానికి ప్రచారం చేయడానికి, పేదల సహాయార్థం మీరేదైనా సహాయమందిస్తే సంతోషంగా ఇవ్వండి. మీకు నా శుభాకాంక్షలు.

మోసం నుండి, అమాయకత్వం నుండి మిమ్మల్ని ప్రకాశమే విడిపిస్తుంది. మీ సురత్ ప్రకాశంలోకి వెళ్ళిపోయాక వాస్తవాన్ని మీరు అర్థం చేసుకుంటే మనసు పరిభ్రమణంలోకి ఇక రారు.

సురత్ డోర్ చరనన్ మే లాగీ,
చిత్త చంచలతా సబ్ హీ భాగీ, వహీ లగావే తూర్ సే ॥

బాహ్యగురువుకు చాలా సేవచేశాను. ప్రేమ చేశాను. ఆయన చరణాలలో సురత్ నుంచాను. కానీ నా మనసు చాంచల్యం తొలగిపోలేదు. సురత్ ప్రకాశాన్ని చేరనంతవరకు చంచలత్వం పోదు. శరీరంనుండి మొదట సురత్ విడివడాలి. ఆ తరువాత మనసు నుండి బయట పడాలి. అప్పుడే అది ప్రకాశంలోకి వెళ్ళగలుగుతుంది.

అనహద్ బాజే బజే గగన్ మే, సురత్
చఢీ అవుర్ లాగీ ధున్ మే, దృష్టి మిలే అబ నూర్ సే ॥

ప్రకాశంలోకి సురత్ చేరుకున్న తరువాత శబ్దం (అనగా నామం-సత్‌నామం) వస్తుంది. మీరు జీవితమంతా గురువు గారి గడ్డం, మీసం, తలపాగా, టోపీలనే చూస్తుంటారు. ఇదంతా మాయా వలయం. మాయా పరిభ్రమణం. మాయ కావాలనుకున్న వారు ఈ రూపంలో తమ ప్రపంచాన్ని నిర్మించుకోవచ్చు. రాముని రూపమైనా, కృష్ణుని రూపమైనా, గురువు రూపమైనా ఏదో ఒక రూపమేర్పర్చుకొనండి. దీనివలన మీ కోరికలు ఫలిస్తుంటాయి. సిద్ధిశక్తులు వస్తుంటాయి. కానీ మీరు మీ అసలైన ఇంటికి చేరుకోలేరు. ఆ ఇంటికి చేరుకునే సాధనాలు కేవలం శబ్ద ప్రకాశాలే! జనన మరణాల చక్రం నుండి శాశ్వతంగా తప్పించుకోవాలనే వారు గురుస్వరూపాన్ని ధ్యానంచేస్తూ గాయత్రీ మంత్ర జపం చేస్తూ శబ్ద బ్రహ్మ, పారబ్రహ్మ నుండి ముందుకు వెళ్ళవలసి ఉంటుందని గరుడ పురాణంలో రాశారు. అందుకే సనాతన మతధర్మం, రాధాస్వామి మత బోధనలలో భేదమేదీ లేదని చెబుతుంటాను.

కాయరతా అబ్ మన్ సే భాగీ, సురత్

శబ్ద మే ఛిన్ ఛిన్ లాగీ, డరే కాల్ గురు సూర్ సే ॥

కాయరతా అనగా భయం. భయం సదా విచారంలో లేదా మనసులో పుడుతుంది. శబ్ద ప్రకాశాలలోకి వెళ్ళటం వలన పిరికిదనం సమాప్తమవుతుంది. కాలమే మనసు. నీవు మనసును దాటి ముందుకు వెళ్ళిపోతే ఇక భయం ఎలా ఉంటుంది? అండగా సత్‌గురువు నిలబడి ఉన్నాడు.

హుజూర్ బాబా సావన్ సింగ్ జీ మహారాజ్ కూడా జీవితమంతా ఇదే చెప్పాడు. తొమ్మిది ద్వారాలు దాటు! ముందు సత్‌గురువు ఉన్నాడు అన్నారాయన. కానీ ఈ మాటలను ఎవరూ అర్థం చేసుకోలేదు. గడ్డం ఉన్న, తలపాగా పెట్టుకున్న స్వరూపం ముందర ఉందేమో అనుకుంటుంది లోకం. ఇక్కడికి వచ్చాక సమస్త ప్రపంచం పొరబడింది. భ్రమల వల నుండి ఎవరూ బయటపడలేకపోయారు. పూర్ణ గురువు దొరకకుంటే ఎవరూ తరించలేరు. అందుకే "పూరా సత్‌గురు ఖోజరే తేరే భలే కీ కహూఀ" అని పదే పదే బోధించటం జరిగింది. పది, పదిహేను వేల మంది శిష్యులను వెంట బెట్టుకుని తిరిగే గురువునే గొప్ప వాడనుకుంటారు మీరు. ఇక్కడే మీరంతా పొరబడుతుంటారు. మీలోపల ప్రకటమయ్యే రూపులు, రంగులు మీ విశ్వాస పరిణామాలే! అసలైన జ్ఞానమే గురువు. యోగ్యుడైన వ్యక్తి వచనాలను విని, మననం చేసి, పదే పదే వాటిని తలచుకోవటం వలన ఈ జ్ఞానం లభిస్తుంది. అందుకే సంత్ మతంలో బాహ్యగురువు దర్శనం చేసుకుని ఆయన ప్రవచనాలను వినటం అవసరం! తప్పనిసరి!

సహస్ర కమల్ తజ్ త్రికుటీ ఆయీ, సున్న్ పరే
మహాసున్న్ చఢాయీ, భేద్ మిలా గురు పూర్ సే ॥

పూర్ణ గురువువలన ఆయనకు ఏ రహస్యం తెలిసిందో హుజూర్ మహారాజ్‌కే తెలుసు. ఇక నాకు లభించిన రహస్యం ఏమిటో చెబుతాను. సహస్రదళ కమలం, త్రికుటి, సున్న్, మహాసున్న్, భఀవర్‌గుఫా మున్నగు స్థానాలు మన జీవనపు మానసిక, ఆత్మిక బోధ జ్ఞానాలు! వాటి చేతనలు. కానీ ఇవన్నీ కాలం, మాయలని నాకు అర్థమైపోయింది. ఇక వారికి ఈ స్థానాలలో సాధన చేసే అవసరమే లేదు. వారు నేరుగా శబ్ద ప్రకాశాలను అనుభవంలోకి తెచ్చుకోగలుగుతారు.

కొన్ని రోజుల క్రితం నేను సత్సంగమివ్వడానికి మహత్ పూర్‌కు వెళ్ళాను. అక్కడ ఓ డాక్టరు నా సత్సంగం విన్నాడు. అతడు బాబా జగత్ సింగ్ జీ శిష్యుడు. సత్సంగం ముగిశాక ఆ డాక్టరు నా దగ్గరికి వచ్చి "మహారాజ్ జగత్‌సింగ్ జీ మహారాజ్ ఇలా అన్నారు. ఇప్పటి వరకు వచ్చిన సంతులంతా తమ అన్వేషణను చెప్పారు. భవిష్యత్తులో రానున్న సంత్ దీనికి తరువాత జరిగే విషయాన్ని చెబుతాడు అన్నారు" అన్నాడు. "భవిష్యత్తు లో సంత్‌లు అభ్యాసాన్ని నేరుగా సోహంగ్ నుండే ప్రారంభిస్తారని హజూర్ దాతాదయాల్ తనతో అన్నారని" గోరఖ్‌పూర్ నివాసి శ్రీ కాశీనాథ్ ప్రధాన్ అన్నారు. తను యుక్త వయస్కుడిగా ఉండే రోజుల్లో బాబా జైమల్ సింగ్ మహారాజ్ సత్సంగానికి వెళ్ళే వాడినని మిస్త్రీ భాన్ సింగ్ చెప్పారు. "ఒక సమయం వస్తుంది. పంజాబ్‌లో అగ్ని కురుస్తుంది. దాని తరువాత లోకంలోకి వచ్చే సంత్ సత్‌గురువు ఎవరికీ నామమివ్వడు. ఎవరినీ తన శిష్యులుగా స్వీకరించడు. తన వచనాలతో, దృష్టితో జీవులను ఉద్ధరిస్తాడు" అని జైమల్ సింగ్ మహారాజ్ చెప్పాడని అన్నాడు. ఈ మూడు ఉదంతాలు విన్నాక నా అనుభవంలోకి వచ్చినదంతా సరైనదేనని ధృవపడింది.

ప్రతి విషయం ఆయా వ్యక్తుల ప్రకృతిననుసరించి చెప్పబడుతుంది. సమయానుసారం జరుగుతుంది.

సహస్ర కమల్ తజ్ త్రికుటీ ఆయీ, సున్న్ పరే
మహాసున్న్ చఢాయీ, భేద్ మిలా గురు పూర్ సే ।

నేను పొరబడుతుండవచ్చు. నా మాటే వినమని నేననను. నాపైన నిబల, అబల, అజ్ఞానజీవుల సహాయత, జగత్కల్యాణ బాధ్యత ఉంది. నేను నా ప్రవర్తనను సంపూర్ణంగా, సత్య సంధతతో నెరవేర్చాను. దీనిని ఎవరైనా ఆలోచిస్తారా లేదా అనే విషయంపై నాకేం పట్టింపు లేదు. పూర్తి రహస్యం, పూర్తి జ్ఞానాన్ని ఇచ్చేవారే పూర్ణ గురువు అని నాకు బోధపడింది. నీకు దొరికే దంతా నీ కర్మ, అచరణ, సాధనల ఫలమే!

భంవర్ గుఫా కా తాలా తోడా, అమర్ నగర్ జా
సురత్ కో జోడా, మిల్ గయీ సత్త్ జహూర్ సే ॥

భంవర్ గుఫాలో ఏదైనా తాళం వేయబడి ఉందా? మరి తాళం

విరగొట్టాలి అనే పదాలకు అంతరార్థం ఏమిటి?, ఏ మాటనైనా అర్థంచేసుకోవటం, ఏ సమస్యనుండైనా బయటపడటం తాళం విరగొట్టటమవుతుంది. నా తాళాన్ని మీరు విరిచారు. దయ హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్‌దే! 1919లో ఆయన, "ఫకీర్ నీలో తొంభైతొమ్మిది లోపాలుండవచ్చు. కానీ సత్య ప్రియత్వమనే ఉత్తమగుణం నీలో ఉంది. ఈ ఒక్క గుణమే నిన్ను తీరం చేరుస్తుంది. తరింపచేస్తుంది. నా ఆజ్ఞను పాటించు. రాధాస్వామి దయాలుని దర్శనం నీకు సత్సంగీయుల రూపంలో లభిస్తుంది" అన్నారు. అలాగే జరిగింది! నేనెవరి అంతరంలోకీ వెళ్ళనని తెలిశాక నా అంతరంలోకి ప్రవేశించడానికి, నన్ను నేను శబ్ద ప్రకాశాలలో లయం చేయడానికి ప్రయత్నిస్తుంటాను. కానీ పడిపోతుంటాను. 'నేను' అనే భావం ఉన్నంతవరకు 'నీవు' అనేది ఉంటుంది. 'నేను-నీవు' రెండు ముగిశాక ఏం మిగులుతుంది? బుల్లేషాహ అన్నాడు.

మేరీ గయీ గవాచీమై, ఓ మైనూ కీ హోయా ।
ఓహ మై విచోఁ నికలీ తే, ఓ మైనూ కీ హోయా ॥

ఈ స్థితి వచ్చాక అతడు ప్రకాశమయమవుతాడు. ఇప్పుడిక సత్‌లోకం గురించి ఎలా వివరించను? బ్యాటరీలోనుండి కరెంట్ వెలువడింది. తన సర్క్యూట్ పూర్తి చేసి తిరిగి మళ్ళీ అదే స్థానంపైకి వచ్చింది. కానీ కరెంట్ వెలువడేటంతవరకు 'నేను' ఉంది. కానీ సర్క్యూట్ పూర్తయ్యాక అది తిరిగి బేటరీలోకి వచ్చేస్తుంది. ఇదే విధంగా మనలోని "నేను" అక్కడి నుండి వచ్చింది. ఇక్కడికి వచ్చి మనం చక్రంలో, వలయంలో చిక్కుపడ్డాం. మనం శాశ్వతంగా ఈ చక్రంనుండి, వలయంనుండి బయటపడడానికి రహస్యం చెప్పేగురువు లభించాలి. ఇదీ సత్ పదం.

అలఖ పురుష కీ ప్రీతి సమానీ, అగమ లోక్ జా
బైరక్ తానీ, హుయీ పావన్ గురు ధూర్ సే ॥

పావనం అంటే పవిత్రం. 'నేను' అనే మలినం మిగలలేదు. 'నీవు' అనేది పవిత్రమైపోయింది. అదీ మన మూలం. మనం అక్కడి నుండి వచ్చాం. అక్కడికే తిరిగి వెళ్ళాల్సి ఉంది.

రాధాస్వామీ చరణ్ తుమ్హారే, లగే మోహే అబ్
అతికర్ ప్యారే, ఆరత్ కరూఁ శవూర్ సే ॥

నాకు భగవంతుని చిరునామా తెలిసింది. అందుకే ఇప్పుడు నేను ఆసక్తితోనో, అజ్ఞానంతోనో ఆరతి చేయను. తెలివిగా ఆరతి చేస్తాను. నేను పైకి ఉన్నత స్థానానికి వెళ్ళిపోయాను. మీరు గృహస్థులు. ఈ ప్రపంచం కర్మక్షేత్రం. ఇక్కడ కర్మ పని చేస్తుంది. కర్మసంబంధం నడవడితో, ప్రవర్తనతో ఉంది. అందుకే నీ ప్రవర్తనను, నడవడిని, గుణాన్ని పవిత్రంగా ఉంచుకో! ఎవరినీ మోసం చేయకు. ఎవరి మనసునూ బాధపెట్టకు. ఇతరులకు హాని కలిగే పనిచేయకు. ఇతరుల మనసు గాయపడేలా ప్రవర్తించకు. మీ ఇళ్ళలో శాంతి నెలకొల్పు! విషయ వికారాలను తగ్గించు!

జహాఁ కామ్ తహాఁ నామ్ నహీ, జహాఁ నామ్ వహాఁ నహీఁ కామ్ ।
రవి రజనీ దోనూ నా మిలే, ఇక్ ఠౌర్ యిక్ యామ్ ॥

అధికంగా విషయ వికారాలనుభవించేవారికి, బ్రహ్మచర్యాన్ని కోల్పోయిన వారికి శాంతి ఎన్నటికీ దొరకదు. తక్కువ సంతానాన్ని కనండి. సంతానాన్ని కంటారు కానీ మున్ముందు ఆ పిల్లల స్థితి ఏమవుతోందో ఆలోచించరు. ఒకరికి క్షయ రావచ్చు. మరొకరు పేదరికంతో బాధపడవచ్చు. లేదా మరో వ్యాధితో పీడింపబడవచ్చు. మన లోపల వాసన, ఇచ్ఛ ఉంది. ఈ ఇచ్ఛా, వాసనల ప్రభావానికి లోనై మనం మన ప్రపంచాన్ని ఏర్పర్చుకుంటాం. ఇంతకంటే సుఖకరమైన స్థితికి రాగలమనుకుంటాం కానీ సుఖానికి బదులు దుఃఖం వస్తుంది. జనం నా దగ్గరికి రోజూ వస్తుంటారు. ఉత్తరాలు వస్తుంటాయి. ఒకరికి ఒక బాధ, మరొకరికి మరో బాధ. నాకు బోధపడిందే సరైనదని నేను వాదించను. నాకు అర్థమైంది పొరపాటు కూడా కావచ్చు. నాపైనా ఒక రుణం ఉండేది. కొంత నా ప్రారబ్ధ కర్మ ఉండేది. కనుక నేనీ పనులు చేశాను. నా బాధ్యత నిర్వహించాను. నిజానికి నేను సర్వేశ్వరుణ్ణి కలుసుకోవాలని బయలు దేరాను. దైవేచ్ఛ నన్ను సంత్ మతంలోకి తీసుకువచ్చింది. ఈ మతంలోని వాణిలో అన్నిటి ఖండన ఉంది. విమర్శ ఉంది. వశిష్ఠుడు మరిచాడు, బ్రహ్మ మరిచాడు, వ్యాసుడు మరిచాడు అని రాయబడి ఉంది. నా అనుభవం లోకానికి చెబుతానని అప్పుడే శపథం చేశాను. అందుకే నా కర్మానుసారం ఈ పని చేస్తుంటాను!

*అందరికీ రాధాస్వామి*

# సత్సంగం
# 16–04–1973
# భజన ఏమిటి?

మేరీ బీతీ ఉమరియా భజన బినా ।
పంథ మే ఆయే బనే పంథాయీ, పూరీ న డగరియా భజన బినా ।
భక్తి కా సౌదా నహి కీనా, బంద్ బజరియా భజన బినా ॥
మన్ హువా టూక్ కరేజా ఫాటే, మాయా కీ నజరియా భజన బినా ॥
అబహూఁ సోచ్ సమఝ్ అజ్ఞానీ, జా గురు కీ సేజరియా భజన బినా ॥
రాధాస్వామీ చరన్ కీ ఓట్ పకడ్ లే, నామ బిసరియా భజన బినా ॥

రాధాస్వామి! నేను మీకు సత్సంగం చేయంచను. నాకు నేనే సత్సంగం ఇచ్చుకుంటాను "నీకేం లభించింది?" అని నన్ను నేను ప్రశ్నిస్తాను. నీవు ఏ పని చేశావు? ఏం భజన చేశావు. పంథలోకి వచ్చి పంథాయి అయ్యారని ఇందులో రాయబడింది. నామం తీసుకున్నారు. కానీ భజన చేయలేదు. ఎందుకు?

మన్ హువా టూక్ కరేజా ఫాటే మాయా కీ నజరియా భజన్ బినా

నా సమస్త జీవితం గడిచిపోయింది. నేను హుజూర్ దాతా దయాల్ మహర్షి శివవ్రత్ లాల్ జీ మహారాజ్‌ను చాలా ప్రేమించాను. చివరికి ఏం రుజువైంది? నేను జీవితంలో చేసినదంతా, నేను నా అంతరంలో చూసిన దృశ్యాలన్నీ మాయేనని మనసు పరిభ్రమణమేనని తెలిసిపోయింది. అది భజనకాదని రుజువైపోయింది. దీనికి ప్రమాణం ఒకే మాటవల్ల లభించింది. నా రూపం ఎందరి అంతరాలలోనో దర్శనమిస్తుంది. వారికి అనేక రకాల పనులు చేస్తుంది కానీ అది నేను కాను. లోకులు చమత్కారాలు, అద్భుతాలు అంటూ నా రూపం వారికి సహాయపడిన ఉదంతాలు చెబుతుంటారు. వాటన్నిటినీ ఒకచోట చేర్చితే ఒక పెద్ద గ్రంథమవుతుంది. నేను ఎక్కడికీ వెళ్ళను అనే మాట వలన నాకు జ్ఞానం కలిగింది, విశ్వాసం కలిగింది. నేను అభ్యాసంలో చూసిన దృశ్యాలు, సూర్యచంద్రులు, నక్షత్రాలు, దేవీదేవతలు కూడా మనసు కల్పనలేననే నిజం ధృవపడింది. సత్యమైన మనిషిని కావటం వలన నాకు విశ్వాసం కలగాలికూడా!

హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్ నాకు గురుపదవిని ఇచ్చి నా కళ్ళు తెరిపించాడు. నాపై చాలా దయ చూపాడు. మనం మనసును విడిచి అన్ని రంగులను, రూపాలనూ వదలి మనం తప్ప మరేదీ ఉండని ఒక స్థితిలోకి వెళ్ళిపోతాం. ఆ మనలోని మన స్థితియే భజన. సహస్రదళ కమలం, త్రికుటి, సున్న్, మహాసున్న్, సోహంగం వరకు మనసు యొక్క ఆట, మనసు లీలయే ఉంది. భుః, భువః, స్వః, మహః, జనః, తపః వరకు ఇవన్నీ మనసు ఆటలే? అన్నమయ కోశం నుండి అనందమయ కోశం వరకు ఇది కూడా మనసుయొక్క లీలనే! రెండు వస్తువుల కలయిక వల్లనే ఆనందం కలుగుతుంది. మీ వల్లనే నాకు అసలు విషయం బోధపడింది కనుక మిమ్మల్ని నా సత్యమైన సద్గురువులుగా భావిస్తాను. మీరు మనానందాన్ని కోరుకుంటారు. మిమ్మల్ననటం దేనికి? నేను కూడా అలాగే కోరేవాడిని. కానీ సత్యమును అన్వేషిస్తున్నాను. కనుక భజన అంటే ఏమిటనేది ఇప్పుడు అర్థమైపోయింది. లీనత - విసమాధి ఏకాగ్రత - తనలోని తాను తనలో లీనం చెందటమే సమాధి. హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్ గారి ఈ శబ్దంలోని భావమేమిటో ఆయనకే తెలిసి ఉండాలి. నేను నా అనుభవం చెబుతాను. మనలోని మనం లేదా మన చేతన శక్తి మన శరీరం, మనసు, ఆలోచనలను విడిచి మన చేతన స్వరూపంలో విలీనం చెందటమే భజన. కానీ ఈ అంతస్థు వరకు వెళ్ళడానికి ప్రతి ఒక్క వ్యక్తికి శక్తి లేదు. మీరొచ్చారు. భజన కోసం వచ్చారా? భజనలోకి వెళ్లనంతవరకు ఈ సంకల్పవికల్పాలు కోరికలు పుడుతూ ఉంటాయి. ఈ సంకల్ప వికల్పాలు, కోరికలు ఏమిటి? వినటం వలన, చదవటం వలన బాహ్య ప్రభావం వలన ఏ చిత్రం మన మేధస్సుపై పడుతుందో ఇదే కోరిక, ఇచ్ఛ. ఇవి ప్రతి ఒక్క జీవి ప్రకృతిని అనుసరించి స్ఫురిస్తుంటాయి. దొంగకు దొంగతనానివీ, భక్తునికి భక్తికి సంబంధించినవీ ఆలోచనలు వస్తాయి. నాకు రైలు, తంతి, తల్లిదండ్రులు ఇప్పటికీ కలలోకి వస్తుంటారు. ఎందుకంటే తల్లిదండ్రులు నన్ను పెంచారు. చదివించారు. ఇక రైలు, తంతి శాఖలలో నేను నా పొట్టకోసం ఉద్యోగం చేశాను.

మీరొచ్చారు 'ఫకీర్ చంద్! నీవీ సాలెగూటిని ఎందుకు ఏర్పర్చుకున్నావ్' అని నన్ను నేను ప్రశ్నించుకుంటాను. నన్ను మంచి వాడని ఎందరన్నా తిట్టేవారు కూడా ఉంటారు. ఇది నా కర్మ ఫలం. చిన్న వయసులోనే ఆ భగవంతుణ్ణి కలుసుకోవడానికి బయల్దేరాను. రామాయణ పఠనం చేసేవాడిని.

అప్పుడే సంస్కారాలు లభించాయి. నా అదృష్టం నన్ను సంత్ మతంలోనికి తీసుకువచ్చింది. ఇక్కడ నేను సంతుల వాణీలను చదివాను. కబీర్ సాహెబ్ అన్నాడు.

సాధో కర్తా కర్మ సే న్యారా ।
ఆవే న జావే మరే నహిఁ జీవే, తాకో కరే విచారా ।
రామ కే పితా జో దశరథ కహియే, దశరథ కౌనే జాయా ॥
దశరథ పితా రామ కో దాదా, కహో కహఁ తే ఆయా ।
రాధా రుక్మిణి కృష్ణ కీ రాణీ, కృష్ణ దోవు కో మీరా ।
సోలహ సహస్ర గోపీ ఉన్ భోగీ, వహ భయో కామ్ కో కీడా ॥

ఇప్పుడిక మీరే ఆలోచించండి. ఇలాంటి రచనలను రాముణ్ణి, కృష్ణుణ్ణి నమ్మేవారికి వినిపిస్తే వాళ్ళ స్థితి ఎలా ఉంటుందో? ఈ రచనల ద్వారా సంతులు రామకృష్ణుల నుండి మన విశ్వాసాలన్ని తుంచేశారు. తమ ఒక కొత్త సర్వేశ్వరుడినే చూపించారు. ఈ రచనలు నా మనసులో అలజడి చెలరేపాయి. నేను భగవంతుడిని కలుసుకోవాలని బయలు దేరాను. ఎక్కడికి వచ్చి చిక్కుకున్నాను అని ఆలోచించేవాడిని. హుజూర్ దాతా దయాల్ మహారాజ్ పై నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. అది తొలగిపోలేదు. కనుక ఆ సమయంలోనే ప్రతిజ్ఞ చేశాను. సత్యవంతుడనై ఈ మార్గంలో నడుస్తాను. నా అనుభవం ఏదైనా, ఎలా ఉన్నా ఈ లోకానికి చెప్పిపోతాను అని శపథం చేశాను.

నా రూపం కొందరి అంతరంలో ప్రకటమవుతుంది. స్వప్నం పక్కన పెడదాం. జాగ్రదవస్థలోనే నా రూపాన్ని ఏర్పర్చుకుంటారు. దీనితో అనేక రకాల పనులు చేయించుకుంటారు. కానీ అలా వెళ్ళేదీ, చేసేదీ నేను కాదు. కనుక ఇదంతా మనసు ఆడే ఆటేనని నాకు విశ్వాసం కలిగింది. ఇవాళ కూడా ఒక స్త్రీ వచ్చింది. "మహారాజ్! నేను జబ్బుపడ్డాను. మిమ్మల్ని తలచుకున్నాను. మీరొచ్చారు. చింతించకు. నీకు తగ్గుతుంది అని చెప్పారు. ఇప్పుడు నేను పూర్తిగా కోలుకున్నాను" అంది. సర్వేశ్వరుడు ఆ భగవంతుడు భజన ద్వారాయే లభిస్తాడు. శరీరాన్ని, మనసును మరిచి మన చేతనలోకి వెళ్ళిపోవటం భజన. శరీరాన్ని మరచిపోవడానికి అజపాజపం. మనసును విడవడానికి నామ స్మరణ. మీరు నామంపేరిట కలహిస్తుంటారు. రాధాస్వామి పేరే నామమని కొందరంటారు. రామనామమే నామము అని మరికొందరంటారు. కృష్ణుడు

అని ఇంకొకరంటారు మరికొందరు నిరంకార్ అనీ, హంస అనే నామాలను చెబుతారు. సంత్ తారా చంద్ ఇలా చెప్పారు "నేనొక కబీర్ పంథాయి సాధువు ఆశ్రమానికి వెళ్ళాను. అక్కడ నేనొక స్త్రీని చూశాను. ఆమె తనలో తాను మగ్నమై ఉండేది. నేనడిగాను "అమ్మా! నీవే నామాన్ని స్మరిస్తావు! దేని వలన నీకీ స్థితి ప్రాప్తించింది?" అని అడిగాను. "మేకకు మూడు కాళ్ళు" అని చెప్పిందామె. విని ఆశ్చర్యచకితుడనయ్యాను. "ఏమిటిదని?" కబీర్ పంథి సాధువు నడిగాను. ఆయన ఇలా అన్నాడు. "ఆమె నామ మిమ్మని నన్ను ప్రతిరోజూ వేధించేది. ఒక రోజు ఈమెను వదిలించుకొనే ఉద్దేశ్యంతో "మేకకు మూడు కాళ్ళు" అని చెప్పాను. అంతే! ఆ వాక్యమే నామమనుకొని స్మరిస్తోంది. అంతే! దాని వల్ల ఆమెకీ స్థితి కలిగింది అని కబీర్ పంథి జవాబిచ్చాడు" అని చెప్పాడు సంత్ తారాచంద్.

దీనివలన ఏం రుజువైంది? ఇదంతా! మనుషుల వారివారి మనసు విశ్వాసమే అనే వాస్తవం ధృడపడింది. గురు గోవింద్ సింహ సాహబ్ జీ ని భాయీ బేలే నామం ఇమ్మని అడగ్గా,

భాయీ బేలా న దేఖే వక్త్ న దేఖే బేలా ॥

అన్నాడాయన. అతడు దానినే నామమనుకున్నాడు. కృషక్ జీ నా వాక్కునే నామం అని భావించాడు. గమ్యస్థానానికి చేరుకున్నాడు. అందుకే ఇదంతా విశ్వాసం, శ్రద్ధపై ఆధారపడి ఉంది. నామం వలన మనసు సంకల్పాలను విడిచిపెడుతుంది. తరువాత భజన వంతు వస్తుంది. మన చేతన శక్తిని తనలోని తనలో ఏకత్రితం చేయటం పేరే భజన. స్మరణ, ధ్యానం భజనలలో సహాయం చేస్తుంది.

మేరీ బీతీ ఉమరియా భజన బినా ।

వ్యక్తి తన సంకల్పమును సత్యమని అనుకునేంతవరకు, లీనత్వం, లేదా ఉన్మన్ స్థితి రానంతవరకు అతని జననమరణాలు విడిచిపోలేవు. ఎవరికైనా అంత్య సమయంలో ఎవరైనా గురువు, దేవీ, దేవతలు వస్తే వారు కూడా మళ్ళీ జన్మనెత్తవలసే ఉంటుంది.

ఎక్కడికి తన గురువు వెళ్తాడో అక్కడికి తను కూడా వెళ్ళగలడని మనిషికి విశ్వాసం కలిగితే బహుశా అతని విశ్వాసం అతణ్ణి ముందుకు

తీసుకువెళ్తుంది. కానీ అతనికేం తెలుసు? గురువు కూడా ముందర మేల్కొంటాడా లేదా అని. హరిద్వార్‌ను ప్రేమించేవారు హరిద్వార్‌లో చేపలై పుడతారని హుజూర్ సావన్ సింగ్ జీ మహారాజ్ అనేవారు. ఈ మాటలు నిజమే ఐతే వ్యాస్‌ను ప్రేమించేవారు వ్యాస్ నదిలో చేపలవుతారు. హరిద్వార్‌లో చేపలకు పిండి, పేడాలు తినడానికి దొరుకుతాయి. కానీ వ్యాస్‌లోని చేపలను జనం కాల్చుకుని తింటారు. వాళ్ళు చేపలవుతారా కాదా అని నేనన్నను. "అంత్ మత్ సో గతా" నియమం ప్రాకృతికం. అది తన పనిని అవశ్యం చేసుకుపోతుంది. ఒక వ్యక్తి నన్ను ప్రేమిస్తున్నాడనుకుందాం. అతని అంత్య సమయంలో నా రూపం అతని అంతరాన దర్శనమిస్తుంది. మరణించాక నేను పైకి వెళ్ళిపోతే అతడు కూడా నేను వెళ్ళిన చోటికే వస్తాడు. కానీ ఇది బౌద్ధికమైనమాట. దీనికి రుజువేదీ లేదు. అందుకే సంతులు రాకపోకలనుండి తప్పించుకోవడానికి భజన యొక్క పద్ధతి చెప్పారు. ఎన్ని రంగు రూపులు, ఆకారాలు నీ లోపలికి వస్తాయో, కనిపిస్తాయో అన్నీ కల్పితాలని నీకు దీనివలన నమ్మకం కలగాలి. నీకు నీలోని నీలో నిలచే అవకాశం లభించాలి.

విషయం ఏమిటో నాకు తెలీదు కానీ నేను ఇప్పుడు భజనను కూడా విడిచి వెళ్ళాను. కానీ శరీరం ఉన్నంతవరకు శరీరం, మనసులను అనుభవంలో చూస్తుంటాను. శబ్దము కూడా వింటుంటాను. ఆ అంతం లేని వస్తువును గురించి ఎవరికీ తెలియలేదు. ఈ రహస్యం ఎవరికీ తెలియదని అందరూ ఒకేమాట అన్నారు. నేను అన్ని వైపుల నుండి నిరాసక్తుడనై, నిష్పూచీనై, అన్నిటినీ వదిలి శరణాగతుడనయ్యాను. నీ సర్వాధారా! సర్వేశ్వరా!! నిన్ను చేరుకోవాలని బయలుదేరాను. నువ్వు ఏమిటో, ఏది కావో ఎవరికీ తెలియదు. ఎవరికీ నీ రహస్యం అంతుపట్టలేదు. అందుకే శరణాగతమ్. భజన లోపల అహంకారం ఉంటుంది. భజన తరువాత శరణాగత స్థితి వస్తుంది. అందులో అహంకారం ఉండదు. ఇవాళ మీరు వెళ్తున్నారు. మీకు మేలు జరగనీ. మీరు సుఖంగా ఉండండి. మీకు సత్‌లోకం దొరకాలని నేను కోరటం లేదు. ఇది మీకు ఇప్పుడే అవసరంలేదు. మీకు ప్రస్తుతం తిండి, గుడ్డ, ఇల్లు కావాలి. మీకు తినడానికి తిండి, తొడగడానికి గుడ్డ, ఉండడానికి ఇల్లు, మనసుకు శాంతి లభించాలని సత్యమైన మనసుతో కోరుకుంటున్నాను.

నేను ప్రపంచాన్ని చూశాను. స్మరణ, ధ్యానం, భజనలు కూడా చాలా చేశాను. చాలా సమయం ధ్యానంలో వినియోగించాను. శరీరం విడిచాక నా

ఏర్పాటు ఏం జరిగిందో చెప్పిపోవాలనీ, ఆ శక్తిని ప్రకృతి నాకివ్వాలనీ భావిస్తున్నాను.

భజన తన్మయ స్థితి, ధ్యానమగ్నత, తత్పరత కలిగించేస్థితి. ప్రేమతత్పరత, వైరాగ్యం లేనిదే తన్మయస్థితి, ధ్యానమగ్నత రాదు. శరీరం ఉన్నంత వరకు, శరీరంలో ఉంటావు. కనుక నీ ఆరోగ్యం గురించి శ్రద్ధతీసుకో. మనసులో ఉంటావు. కనుక నీ ఆలోచనా విచారాలు శుద్ధంగా, నిర్మలమైనవిగా, పవిత్రమైనవిగా ఉండేలా చూసుకో. ఇంకా పై స్థాయిలో, సాధనచేస్తే ప్రకాశ శబ్దాలలోకి వెళ్ళిపో.

పంథ మే ఆయే బనే పంథాయీ, సూఝీ న డగరియా భజన బినా ।

డగరియా అనగా మన ఆది గృహాన్ని గురించి నీవు ఏమీ ఆలోచించలేదని అర్థం. పంథలోకి వచ్చి కేవలం పంథాయివయ్యావు. స్వామీజీ తనవాణిలో ఒకచోట అన్నారు.

భజన్ కర్ మగన్ రహోమన్ మే,
జో జో చోర్ భజన్ కే ప్రాణీ, దుఃఖ్ సహే నిత్ తన్ మే ।
భక్తి కా సౌదా నహిఁ కీనా, బంద్ బజరియా భజన్ బినా ॥

మీరు నా దగ్గరకు వచ్చారు లేదా వేరే మరో గురువు వద్దకు వెళ్ళారు. మీరు బట్టలో, రూపాయలో ఇచ్చారు. అలా ఇచ్చారని నీవు మీరు భక్తులమైనా మనుకుంటున్నారా? ఈ భక్తి కింది స్థాయికి చెందినది. అసలు భక్తి ఏమిటి?

భక్తి సునాయీ సబ్ సే న్యారీ, వేద కతేబ న తాహి విచారీ ।
సత్ పురుష చౌథే పద బాసా, సంతన్ కా జహఁ సదా విలాసా ॥
సో ఘర్ దర్శాయా గురు పూరే, బీన్ బజే జహఁ అచరజ తూరే ।
ఆగే అలఖ పురుష దర్‌బారా, దేఖా జాయ్ సురత్ సే సారా ॥
తిస్ పర్ అగమ్ లోక్ ఇక్ న్యారా, సంత్ సురత్ కోయీ కరత్ విహారా ।
తఁహసే దర్‌సే అటల్ అటారీ, అద్భుత్ రాధాస్వామి మహల్ సఁవారీ ॥
సురత్ హుయీ అతికర్ మగనానీ, పురుష అనామీ జాయ్ సమానీ॥

సంతుల మార్గంలో ఇదే అసలైన భక్తి. కానీ బయట ప్రేమ చేయలేని వారు అంతరంలోనూ ప్రేమించజాలరు. ఎందుకంటే అతని మనసుకు ప్రేమించే అలవాటు లేదు. నా స్థానంపైకి వెళ్ళమని నేను చెప్పను. ఇది ఏ కొందరి భాగ్యంలోనో ఉంటుంది.

జిస్ పర్ దయా ఆద్ కర్తాకీ, సో యహ నేమత్ పావే ।

ఎవరైనా ఆ గమ్యానికి వెళ్ళగోరితే వారికి మార్గాన్ని నేను స్పష్టం చేశాను. ఇక ఆచరించటం మీవంతు.

మన్ హువా టూక్ కలేజా ఫాటే, మాయా కీ నజరియా భజన బినా ।

నేను గురుపదవిపైకి రాకుంటే నాకు ఈ రహస్యాన్ని గురించి ఏ మాత్రం తెలిసేది కాదు. నేను ద్వైతంలో ఉండేవాడిని.

అబహూం సోచ్ సమఝ్ అజ్ఞానీ, జా గురు కీ సేజరియా భజన బినా ।

గురువు గారి ఆసనం ఎక్కడుంది? ఒకరు హోషియార్‌పూర్‌లో, మరొకరు వ్యాస్‌లో, ఇంకొకరు ఆగ్రాలో, వేరొకరు ఆనందపూర్‌లో, మరొకరు మరోచోట చెబుతారు. కానీ గురువు ప్రతి వ్యక్తి మస్తిష్కంలో ఉంటాడు. గురువు శబ్ద స్వరూపుడు. నీలోని నీవే గురువు. నీలోని నిన్ను నీలోని నీలోకే తిరిగి వెనక్కి తీసుకు వెళ్ళటమే గురువుగారి సింహాసనం.

రాధాస్వామి చరణ్ కీ ఓట్ పకడ్ లే, నామ బిసరియా భజన్ బినా ।

బాహ్య గురువు చరణాలను పట్టుకుని మీరు రాధాస్వామి చరణాల శరణంలోకి వెళ్ళానని మీరనుకుంటారు. మీరు భ్రమలో ఉన్నారు. రాధాస్వామి మతాన్ని నడిపించిన హుజూర్ రాయ్ సాలిగ్ రామ్ సాహబ్ తన ప్రేమవాణిలో స్పష్టంగా చెప్పారు. సద్గురు శబ్ద స్వరూపి రాధాస్వామి దయాలుడు. ఆయన చరణాలు ప్రకాశం. ఆ ప్రకాశాన్నే శాస్త్రాలు సావిత్రి అన్నాయి.

భాగవతీ సుంతరీ! నన్ను ప్రేమిస్తే ఏం దొరుకుతుంది? మీరు పైసలిస్తారు కనుక నాకు లాభమే! కానీ నేను మిమ్మల్ని మోసం చేయదలచుకోను. దాతా దయాల్ నీలోని నీ రూపమే! అది అజరం, అమరం, అవినాశి అయి ఉంది. హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్ శరీరాన్ని విడిచారు. కానీ నీ లోని దాతా దయాలుడు జన్మించడు. మరణించడు. ఈ ప్రపంచంలో ఇచ్చిపుచ్చుకునే వ్యవహారం ఉంది. ఒకరు కొడుకై తీసుకుంటాడు. మరొకరు తండ్రి అయి తీసుకుంటాడు. ప్రతి ఒక్క వ్యక్తి తమ తమ ఋణాలు తీర్చుకుంటున్నారు. బాకీ తీర్చనిదే ఇక్కడ జరుగుబాటు లేదు.

*అందరికీ రాధాస్వామి*

# సత్సంగం

## 13–05–1973

## గురువిచ్చేదానం, బహుమానం

జగ్ మే గురు సమాన్ నహీఁ దాతా ॥
వస్తు అగోచర్ దియా సతగురు నే, భలీ బతాయీ బాతా ।
కామ క్రోధ కైద్ కర్ రాఖే, లోభ కో లీన్హో నాథా ।

కాల్ కరే సో హాల్ హీ కర్ లే, ఫిర్ న మిలే యహ సాథా ।
చౌరాసీ మే జాయ పడోగే, భుగతో దిన్ అవుర్ రాతా ।

శబ్ద పుకార్ పుకార్ కహత్ హైఁ, కర్ లే సంతన్ సాథా ।
సిమిర్ బందగీ కర్ సాహెబ్ కీ, కాల్ నచావే మాథా ।

కహత్ కబీర్ సునో హో ధర్ మన్, మానో బచన్ హమారా ।
పర్దా ఖోల్ మిలో సత్‌గురు సే, ఆవో లోక్ దయారా ।

రాధాస్వామి !

దైవేచ్ఛ లేదా నా అదృష్టం వలన ఏదో ఒక వస్తువు అన్వేషణాక్రమం నన్ను హుజూర్ దాతా దయాల్ మహర్షి శివవ్రత్‌లాల్ జీ చరణాలలోకి తీసుకువెళ్ళింది. నేనాయన్ని భగవంతుడు, రాముడు లేదా సృష్టికర్త అవతారమని విశ్వసించేవాణ్ణి. ఆయన నా ఆలోచనను నమ్మకాన్ని ఎంతో చాకచక్యంగా నెమ్మది నెమ్మదిగా గురు మతం వైపు మళ్ళించాడు. ఎందుకంటే గురుమతంలో అన్ని ధర్మాల, మతాల ఖండన-విమర్శ ఉంది. నా బుద్ధి దీనిని సహించేది కాదు. కానీ హుజూర్ దాతా దయాల్ మహారాజ్ పై విశ్వాసం తరగలేదు. ఈ మార్గంలో సత్యసంధతతో నడుస్తానని, నా అనుభవాలను లోకానికి చెప్పిపోతానని ఆనాడే ప్రమాణం చేశాను. అందుకే నేను నా కర్మను అనుభవిస్తున్నాను. ఈ అనుభవం సరైనదో కాదో తెలియదు. సరైనదేనని వాదించను కూడా!

"గురువుకు సమానులైన దాతా మరొకరు ఎవరూ లేరా?" అని నా

ఆత్మను ప్రశ్నిస్తాను. బుద్ధి, వివేకం, జ్ఞానం, అనుభవం, విశ్వాసం మొదలైన వాటి పేరే గురువు. ఎప్పుడైనా మనం జబ్బుపడితే డాక్టర్ దగ్గరికి వెళ్తాం. ఆయన రోగాన్ని నిర్ధారించి పాచనశక్తికి అనుకూలమైన ఔషధమిస్తాడు. దానితో పాటే పథ్యం చెబుతాడు. ఏం తినాలో, ఏం తినకూడదో, ఏ నియమాలు పాటించాలో చెబుతాడు. అవి పాటించటం వలన మనకు స్వస్థత చేకూరుతుంది. మరి ఆ డాక్టర్ దాతా అయ్యాడా లేదా? ఇలాగే ఈ ప్రపంచంలో జీవనాన్ని సుఖంగా గడపడానికి, ఈ ప్రపంచంనుండి దాటి వెళ్ళడానికి అవసరమైన శిక్షణనివ్వడానికి సమయానుసారం గురువు లేదా ఋషి లేదా జైన లేదా బుద్ధుడు, ముస్లింల ఫకీరు లేదా ఇతర మతాల పెద్దలు ఉద్భవించారు. మీ సంకల్పాలను సరైనవిగా ఉంచుకొమ్మని వాళ్ళు బోధించారు. నీ ఆలోచనా విచారాలను, కోరికలను శుద్ధిగా, పవిత్రంగా ఉంచుకొమ్మన్నారు. నీకు దొరికేదంతా నీ ఆలోచనా విచారాలు, నీ కోరికల ఫలమే! దీనిపేరే వేద మార్గం. ఈ నియమాన్ని నేను నా జీవనంలోనూ, మీ జీవనాలలోనూ చాలా వరకు పరికించాను. అందుకే చెబుతున్నాను. ఆశావాదివై ఉండు.

నా మాటలను విశ్వసించేవారు తమ ఆలోచనా విచారాలతో నా రూపం ఏర్పర్చుకుంటారు. ఆ రూపం వాళ్ళకు ఔషధాలు చెబుతుంది. అంత్య సమయంలో వారిని తీసుకుపోతుంది. వాళ్ళ పరీక్షా పత్రాలను దిద్దుతుంది. వారి అనేక రకాల పనులు చేస్తుంది. కానీ ఆ రూపంలో నేను వెళ్ళలేదు. అసలు నాకా విషయమే తెలియదు, అందుకే నాకు ఓ విశ్వాసం ఏర్పడింది. ప్రపంచంలో గురువు బుద్ధి, జ్ఞానాలను ప్రసాదిస్తాడు. ఎలాంటి జ్ఞానం ప్రసాదిస్తాడు? ఓ మనిషీ! ఈ సమస్త ప్రపంచం మనోమతమైనది. ఇది విచారాల, ఆలోచనల సృష్టి రచన. నీ ఆలోచనా విచారాలలో చాలా శక్తి ఉంది. "జైసా ఖ్యాల్ వైసా హాల్, జైసీ మతి వైసీ గతి; జైసీ కర్‌నీ వైసీ భర్‌నీ"! తులసీదాసు కూడా రామాయణంలో రాశాడు.

"కర్మ ప్రధాన్ విశ్వకర్ రాఖా-జో జస్ కీన్హ సు తస్ ఫల్ చాఖా"

అందుకే గురువుకు సమానమైన దాత (ఇచ్చేవాడు) లేడు. నియమమేమిటంటే శిష్యుడు గురువు మాటలను ఆచరించి తీరాలి. చాలామంది

తమ జీవనాలను మార్చుకోదలచుకుంటారు. కాని మార్చజాలరు. ఎందుకంటే మొదట్లో జీవనంలో చేసిన కర్మల ప్రభావం తగ్గిపోనంతవరకు వారు తమ కొత్త కోరికను ఎలా సఫలం చేసుకోగలుగుతారు? ఉన్నది కర్మ చక్రమే, చేసిన కర్మే! దానిని ముందు అనుభవించవలసి ఉంటుంది. మరొకరి గురించి ఎందుకు? నా గురించి నాకు తెలుసు. ఇప్పటికీ రైలు, తంతి వదలవు. రాత్రి అభ్యాసంలో ఎంతో అందమైన బంగారు రంగులో ప్రకాశాన్ని చూశాను. దానిని మళ్ళీ చూడాలనిపించినా ఆ ప్రకాశం మళ్ళీ రాలేదు. రాత్రి మూడున్నరకు మళ్ళీ ఆ ప్రకాశాన్ని చూసేటందుకు ప్రయత్నించాను. కానీ చూడలేకపోయాను. ఇప్పుడు కూడా సమాధిలో చాలా ప్రయత్నించాను. కానీ ఆ ప్రకాశం రాలేదు.

ఈ ప్రకాశం నాకెందుకు కనిపించింది? నిన్న సాయంకాలం ప్రకాశం, శబ్దములను గురించి సత్సంగమిచ్చాను. దాని ప్రభావం నా మేధస్సుపై ఉంది. లోకం గురువు ద్వారా దానాలు చేస్తుంది. మరి వారి జీవితాలు ఎందుకు మారటం లేదనే ఆలోచన వచ్చింది. దీనికి కారణమేమిటంటే పూర్వకర్మలు, వాటి ప్రభావాలు పూర్తిగా నశించేంతవరకు జీవనం మారదు. ఇందుకు సమయం పడుతుంది. నేను నిన్న మంచి ఆలోచనా విచారాల్ని స్వీకరించాను. ప్రకాశం గురించే సత్సంగమిచ్చాను. అందుకే అదే విచారం మేధస్సులో ఉండి రాత్రికి ప్రకాశం కన్పించింది.

తనువు, మనస్సు, ధనము గురువుకు ఇచ్చేయ్! గురువును సేవించు అని నిన్నటి సత్సంగంలో ఒక వాణి వచ్చింది. నిన్న ఇద్దరు మహిళలు 51-51 రూపాయలిచ్చారు. "మీరివి నా కిచ్చేశారు ఇక ఇవి మీవి కావు వీటిని గురించిన ఆలోచనను మనసులో నుండి తీసేయండి" అన్నాను. ఒకవ్యక్తితో "నాకు ఇప్పుడు మీరిచ్చిన ఈ రూపాయలిక మీవికావు. వాటిని గురించి మరిచిపొండి" అన్నాను. ఓ వ్యక్తి తన గురువుగారి కాళ్ళు, శరీరాన్ని వత్తుతుంటాడు అంటే తన తనువుతో గురువును సేవిస్తాడు. కనుక శరీరం అతనితోనే ఉంది. ఇక గురువుకు శరీరం సమర్పించినట్లు ఎలా అవుతుంది! ఇలాగే మనసు విషయం. తన మనసును గురువుకు అర్పించానంటాడొక శిష్యుడు. కానీ మనసు ఆ వ్యక్తి వెంటే ఉంటుంది. ఆ మనసులో అనేక రకాల ఆలోచనా విచారాలు చెలరేగుతుంటాయి. మరి గురువుకు మనసు సమర్పించినట్లు

ఎలా అవుతుంది? ఏ వ్యక్తీ తన తనువును, మనసును బాహ్య గురువుకు ఇవ్వజాలడు. తనువు మనసు గురువుకు ఎప్పుడు అర్పణమవుతుంది? నీ ఏకాగ్రత, తవజ్జ శరీరాన్ని మరిచిపోయి మనసు సంకల్ప వికల్పాలను లేవదీయటం నిలిపివేసినప్పుడు నీ మనసును గురువుకు సమర్పించినట్లవుతుంది. నీ సురత్ శబ్ద ప్రకాశాలలోకి వెళ్ళినప్పుడే అనగా జ్ఞాన రూపంలోకి వెళ్ళినప్పుడు ఇది సాధ్యపడుతుంది. హుజూర్ ముఅల్లా ముకద్దస్ రాయ్‌సాలిగ్‌రామ్ జీ తన వాణిలో స్పష్టంగా చెప్పారు. సద్గురువు శబ్ద స్వరూపి రాధాస్వామి దయాలుడు! ఆయన చరణాలే ప్రకాశం అని! రాజా జనకుడు అలా తనువు, మనసులను గురువుకు అర్పించాడు. అష్టావక్రుడు కానుక ఇమ్మని అడిగినప్పుడు తన సమస్త రాజ్యాన్ని సమర్పించాడు జనకుడు. ఆ తరువాత గురువుకు తన తనువును మనసునూ ఇచ్చి సంకల్ప రహితుడయ్యాడు. ఇక ఏ స్థితి మిగిలిపోయి ఉందో దానిపేరే గురువు. ఋషి అష్టావక్రుడు జనకమహారాజుకు రాజ్యం అప్పగించి జ్ఞానబోధ చేశాడు.

మనిషికి ప్రపంచంలో జీవించడానికి, ప్రపంచం నుండి దాటిపోవడానికి రహస్యం చెప్పటం బాహ్యగురువు బాధ్యత. శరీరంలో నీవున్నంతవరకు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోమని నేను చెబుతున్నాను. ముందు ఈ దేహాన్ని సంభాళించు. జిహ్వా చాపల్యంలోకి రాకు. విషయవికారాలను తగ్గించు. "శివ సంకల్పమస్తు" ననుసరించి మనసుకు మంచి ఆలోచనా విచారాల నివ్వు. ఎక్కువగా భక్తిచేసే వారిలో ముప్పాతికశాతం వీర్యంలోపం గలవారూ, అధికంగా విషయభోగాలను అనుభవించేవారుంటారు. ఇది నా దృష్టిలోకి వచ్చింది. అందుకే పాతిక సంవత్సరాల వయసు వరకు బ్రహ్మచారిగా ఉండాలని ఋషులు నియమం పెట్టారు. మంచిసాంగత్యం చేయి! ఇదే గురువు దయ. గురువు అంటే వివేకం, జ్ఞానం. ఫకీరు చంద్ పేరు గురువు కాదు.

జగ్ మే గురు సమాన్ నహిఁ దాతా ।
వస్తు అగోచర్ దియా సత్ గురునే భలీ బతాయీ బాతా ॥

నేను తప్పుగా వ్యాఖ్యానించటం లేదు. కానీ గురువు మాటలను, హితవును ఎవరూ వినరు. గురువు గురువు అని అరుస్తుంటారు. లేదా

గురువును గొప్ప చేసి డప్పు కొట్టటం ప్రారంభిస్తారు. ఫలానా రోజు ఆయన జన్మించారు. జీవితంలో ఫలానా ఫలానా పనులు చేశారు. ఫలానా తిథి రోజున శరీరాన్ని త్యజించారు అని ప్రచారం చేస్తారు. గురువంటే విశ్వాసం వాస్తవికత, యథార్థతకే మరో పేరు. లోకంలో ఉన్నతి, ఇళ్ళల్లో ఉంచేందుకు ఋషులు తల్లి, తండ్రి, అన్న, చెల్లి, స్త్రీ, పురుషులు, కొడుకుల బాధ్యతలు, ధర్మాలను నిశ్చయించారు. ఈ ప్రపంచం కోసమే వారు నిర్ణయించారు. దీని వలన మీ జీవితం సుఖంగా గడుస్తుందని వారి ఆలోచన. నేను కూడా ఇదే చెబుతున్నాను. కేవలం వ్యాఖ్యానిస్తున్న పద్ధతిలో తేడా ఉంది. అంతే! ఋషులు సంస్కృతంలో కఠిన పదాలలో వర్ణించారు. నేను దానిని సరళ పదాలలో వివరించాను.

కామ్ క్రోధ్ కైద్ కర్ రాఖే - లోభ్ కో లీన్ హో నాథా

గురువు నీ నుండి కామ క్రోధాలను ఎలా విడిపించాడని, తొలగించాడని నీ మనసులో ప్రశ్న పుడుతుంది. నేను నా కోసమే పని చేస్తున్నాను. ఇతరులు సంగతి నాకు తెలియదు. వాళ్ళెందుకు చేస్తున్నారో! నేను బస్రా బాగ్దాద్‌లో ఉన్నప్పుడు అభ్యాసంలో నాలోపల వీణా ధ్వని వినేవాడిని. కానీ మళ్ళీ స్వదేశానికి, స్వగృహానికి వచ్చాక కాముకుడను కాలేదా? అయ్యాను.

పర్ ఉపదేశ్ నర్ బహూతేరే, నిజ ఉపదేశ్ హై నర్ థోరే ।

సూర్యుడు, చంద్రుడు, తారకలు మొదలైన ప్రకాశాలను నాలో చూడటం వలన వీణా ధ్వనులు వినటం వలన నా పని సమాప్తమైందా? కాలేదు. పన్నెండు సంవత్సరాల తరువాత బస్రా బాగ్దాద్ నుండి ఇంటికి వచ్చాక కామంలో చిక్కుకున్నాను. దీనితో ఏం రుజువవుతోంది? ప్రకాశాన్ని చూసేవారు, శబ్దాన్ని వినేవారు సైతం కాముకులవుతారు. కానీ తరువాత చింతిస్తారు. (అక్కడే కూర్చున ఓ వ్యక్తి వైపు సైగ చేసి చూపిస్తూ) "నేను అభ్యాసం చేస్తాను! ఇలా ఉన్నాను అలా ఉన్నాను అని చెబుతుంటాడు. కానీ పిల్లవాడి పని ఏదో జరగకపోయేసరికి పరుగెత్తుకుంటూ ఇక్కడికి వచ్చాడు." నీ అభ్యాసం నిన్ను చింతల నుండి కాపాడిందా? గురువు కావాలని కోరుతుంటావు. ఏ గురువూ లోకానికి చెప్పని రహస్యం ఇది. నా మోహం తొలగి పోయిందని నేను చెబితే

తప్పవుతుంది. అయితే మొదట్లో ఉండే ఆవేశం ఆకర్షణ ఇప్పుడు లేవు. నేను కూడా నా పిల్లల్ని ఎత్తుకుని తిరిగేవాణ్ణి. వారితో సంతోషపడేవాణ్ణి. మరి ఇక అభ్యాసంతో నా మోహం తొలగిపోయిందని ఎలా చెప్పగలను? ఇప్పుడిక లోభం గురించి విను! నేను నా ఉద్యోగ కాలంలో లంచాలు తీసుకోలేదు. కానీ నా ఉన్నతి జరగాలనీ ఎక్కువ రూపాయలు దొరకాలనీ కోరుకునేవాడిని. నాలో అహంకారం కూడా ఉండేది. అహంకారానివి చాలా రూపాలుంటాయి. ఉదాహరణకు నేను రాధాస్వామి మతం వాడిని. మహర్షి జీ మహారాజ్ గారి గురుముఖిని. శిష్యుణ్ణి. మరి గురువు ఏం చెప్పాడు? నా కామ, క్రోధ, లోభ, మోహం, అహంకారాలు ఎలా సమాప్తమయ్యాయి? కేవలం నేనెవరినీ? అనే జ్ఞానం వలన, తెలివివలన సమాప్తమయ్యాయి. నాకీ బుద్ధి, తెలివి మీ వల్ల లభించింది. అందుకే మీరే నా సత్యసద్గురువులు. నా రూపం మీలో సాక్షాత్కరించిందని మీరు చెప్పినప్పుడు, ఎన్నో రకాలుగా మీకు సహాయపడిందని వివరించినప్పుడు ఆశ్చర్యపోతుంటాను. ఎందుకంటే ఆ సహాయాలు నేను మీకు చేయలేదు. మీలోపల సాక్షాత్కరించనూ లేదు. మరి మీలోపల ప్రకటమైన ఆ ఫకీర్ చంద్ ఎవరు? మీ శ్రద్ధావిశ్వాసాలే! కనుక నాలోపల ప్రకటమైన రంగులు, రూపాలు, భావాలు, విచారాలు నా సంస్కారాలే తప్ప వాస్తవానికి ఇవి లేవు. ఈ జ్ఞానం వలన నేను కామ, క్రోధ, లోభ, మోహ, అహంకారాల ఆకర్షణలో చిక్కుకోలేదు. కబీర్ సాహబ్ లేదా ఇతర సంతులు తమ శిష్యుల కామ, క్రోధ, లోభ, మోహ, అహంకారాలను ఉఫ్‌మని మంత్రం వేసి దూరం చేశారేమో నాకు తెలియదు. నేనెవరినీ ఖండించను. విమర్శించను. కానీ ఈ శబ్దంలో ఆయన అలా అనలేదు. ఆయన ధర్మదాసుతో తన పరదాను తీయవద్దనే చెప్పాడు. కబీర్ సాహబ్ పరదాను తొలగించగలిగితే ధర్మదాసుకు అలా ఎందుకు చెప్పాడు? అందుకే గురువు వచనాలను అర్థం చేసుకుని నీవే స్వయంగా తెరలు తొలగించవలసి ఉంది. ఈ ప్రపంచం సంకల్పమయమని నాకు అర్థమైంది. ఏ సమయంలో ఏదైనా ఆలోచనా విచారం వస్తే మీరు దానిని తొలగిస్తారు. నా సాంగత్యం బాగుండేది. నేను బయట ఏ చెడూ చేయలేదు. ఎవరి నుండీ లంచం తీసుకోలేదు. ఉచితంగా డబ్బులు కావాలని ఆశించలేదు. కానీ అభివృద్ధి చెందాలని, నాకు ఉన్నతి కలగాలనే ఆలోచన

నాలో ఉండేది. గురువు సత్యమైన రహస్యం, సత్యమైన జ్ఞానం, సత్యమైన వివేకం ఇస్తాడు. అందుకే రాధాస్వామి మతంలో గురువుదే గొప్పదనం, మహిమ ఉన్నాయి.

గురు నే దీనా భేద్ అగమ్ కా, సురత్ చలీ తజ్ దేశ్ భరమ్ కా।
బల్ పాయా అబ్ విరహ మరమ్ కా, భట్‌కన్ ఛూటా ధైరో హరమ్ కా ॥
బర్‌సన్ లాగా మేహ కరమ్ కా, సంశయ భాగా జనమ్ మరణ కా ।

నీవు గురువు పశువువై గురువును పూజిస్తావు. గురువును సముచితమైన రీతిలో అర్థంచేసుకోలేదు. చాలామంది నుండి ప్రతిరోజూ ఉత్తరాలొస్తాయి. ఎన్నో రకాల ప్రశ్నలకు జవాబులు అడుగుతుంటారు. కానీ జవాబు రాయడానికి ఓ కార్డు కూడా జత చేయరు. ఇలాంటి వ్యక్తులకు ఏం లభిస్తుంది? ఒకసారి బాగా డబ్బున్న శ్రీమంతుడు మా ఇంటికి వచ్చాడు. "ఖాళీ చేతులతో వచ్చావా?" అని అడిగాను. "అవును" అన్నాడు. ప్రతివస్తువూ త్యాగాన్ని ఆత్మ సమర్పణను కోరుతుంది. ఏ వస్తువూ ఎవరికీ ఉచితంగా లభించదు. ఒకవేళ ఎవరికైనా ఉచితంగా లభించినా అతడు దానిని ఖాతరు చేయడు. విలువ కట్టడు. నేను జీవితాంతం ఖాతరు చేశాక ఇది ప్రాప్తించింది. రాజుగారు, శాసకుడు, గురువు, చిన్నపిల్లలు మొదలైనవారిదగ్గరకి ఎప్పుడూ ఖాళీ చేతులతో వెళ్ళకు. కనీసం పువ్వులైనా తీసుకువెళ్ళు. శ్రీ ఆనందరావు నాతో చెప్పారిలా. తాను దాతా దయాల్ జీ సన్నిధికి చేరిన కొత్తలో అడిగారట, "హుజూర్! ఏం కానుక తేవాలి"? అని. 'రెండు బతాశా అనగా పంచదార బిళ్ళలు, రెండు పువ్వులు తీసుకురా' అని జవాబిచ్చారట దాతా దయాల్. మీకు ఈ మూల సూత్రం, ఉపాయం చెబుతున్నాను. ఇంటికి వెళ్తూ భర్త భార్యకోసం ఏదైనా వస్తువు తీసుకువెళ్తాడు. మీ తండ్రి, అక్క, చెల్లి వంటి ఇతర సంబంధీకులు మీ నుండి ఏదైనా ఆశిస్తారు. తీసుకోవాలని సిద్ధంగా ఉంటారు. కానీ ఇలాంటి అలవాట్లు తల్లికి చాలా తక్కువగా ఉంటాయి. మిమ్మల్ని ఇళ్ళల్లో శాంతిగా ఉంచడానికి, ప్రశాంతంగా మీరు జీవన యాత్ర కొనసాగించడానికి గురువు ఉపాయం చెబుతాడు.

కాల్ కరే సో హాల్ హీ కర్ లే, ఫిర్ న మిలే యహ సాతా ।
చౌరాసీ మే జాయ పడోగే, భుగ్ తో దిన్ అవుర్ రాతా ॥

నీవు చేయవలసిన దానిని ఈ జీవనంలోనే చేయి. దీనివలన నీ రాక పోకలు తొలిగిపోవాలి. నేను నా ఆత్మను ప్రశ్నిస్తుంటాను. "నిన్ను నీవు సద్గురువు అంటావు! నీ రాక పోకలు సమాప్తమయ్యాయా?" అని. ఒక వేళ అవి సమాప్తమైతే అనడానికి చెప్పడానికి మీకు హక్కుంటుంది. లేకుంటే ఉండదు. నేనెవరికీ నామం ఇవ్వ లేదు. కేవలం సత్సంగం చేయిస్తున్నాను. నా రూపం సత్సంగీయులలో సాక్షాత్కరిస్తుందని విన్నాక, వారి పనులు నెరవేరుస్తున్నానని తెలిశాక నా మనసులోని ఆలోచనావిచారాలు, రంగు రూపులు, నాలో ప్రకటమయ్యేవాటిని వదలడానికి వివశుడనయ్యాను. ఇప్పుడు ఇక మనసుకు అతీతంగా శబ్ద ప్రకాశాలలోకి వెళ్ళిపోతాను. శబ్దాన్ని విని, ప్రకాశాన్ని చూసే వస్తువు కోసం అన్వేషిస్తాను. కానీ అది అంతుపట్టదు. చిరునామా దొరకదు. ఇంత అభ్యాసం చేశాక కూడా నేనేమీ కాలేకపోయాను. ఒకవేళ ఏమైనా అయితే నాలో ఏదో శక్తి వచ్చేది. నేను కనీసం నా రోగాన్నైనా దూరం చేసుకునే వాడిని. సంతులందరూ తమ అంతిమ దశలో దుఃఖితులయ్యారు. కొందరి సంతానం అయోగ్యులయ్యారు. కొందరి సంతానం చెప్పిన మాట వినరు. మరికొందరికి వారి భార్యలతో పోట్లాటలు జరిగాయి. ఎవరైనా సంత్ ఉన్నత స్థితిలోకి చేరుకుంటే అతని చేతికి ఏమీ అందలేదని రుజువవుతోంది. ఈ సంతుల శిష్యులు ముప్పై, నలభై సంవత్సరాల క్రితమే నామం తీసుకున్నా నేటికీ వారంతా శబ్ద, ప్రకాశాల సాక్షాత్కారం చేసుకోకపోవటం చూస్తున్నాం.

జీవితం ఏమిటనే పరిణామానికి వచ్చాను. జీవనం ఒక తత్వం. ఇందులో అలలు వస్తుంటాయి. నీటి బుడగలు ఏర్పడుతుంటాయి. ఒకచోట అవి శరీర రూపం మరోచోట మనసు రూపం ఇంకొక చోట ఆత్మరూపం. వేరొక చోట సురత్ రూపం ధరిస్తాయి. ఒక రోజు ఆ నీటి బుడగ చిట్లి పోతుందనే జ్ఞానం వ్యక్తికి కలగనంతవరకు వారి అహంకారం పోజాలదు. ఈ జ్ఞానం కలిగితే ఇక మరణించడానికి భయమేమిటి? శరీరం ఒకసారి ఏర్పడవలసి ఉండి ఏర్పడింది. జన్మమరణాల సంశయం సమాప్తమై పోయింది. దీనివలన నాకేం లభించింది? శాంతి. నాకు గురువు వలన ఇది లభించింది. బహుశా

ఇతర గురువులు తమ శిష్యులకు మరేదైనా ఇస్తారేమో నాకు తెలియదు. హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్ శిక్షణను మార్చమని ఆజ్ఞాపించాడు. నేను నాకు అర్థమైన దానినే చెప్పాను. ఇది పొరపాటు కూడా కావచ్చు. నేను చెప్పిందే సరైనదని నేనేం వాదించను. ఇప్పుడు చివరి రోజులలో అంతిమ దశకు వచ్చిన ఈ సమయంలో మోసాలు, బూటకాలు ఎందుకు చేయటం?

శబ్ద పుకార్ పుకార్ కహత్ హైం కర్ లే సంతన్ సాథా ।
సిమర్ బందగీ కర్ సాహబ్ కీ కాల్ నచావే మాథా ॥

సత్సంగం చేయండని సంతు పిలుపునిస్తాడు. సత్సంగం ఎవరిది అవసరం? యోగ్యులైన వారి సత్సంగం కావాలి. పుస్తకాల ఉదాహరణ లిచ్చేవారు, తమ పూజ చేయించుకునేవారిని సంతులని నేను భావించను. ఈ శబ్దంలో కబీర్ సాహబ్ "సిమిర్ బందగీ కర్ సాహబ్ కీ" - "స్మరణ, ఆరాధన భగవంతునికి చేయి" అన్నాడే తప్ప తనకు పూజచేయమని చెప్పలేదు.

కహత్ కబీర్ సునో హో ధర్ మన్, మానో వచన్ హమారా ।
పర్దా ఖోల్ మిలో సత్‌గురు సే, ఆవో లోక్ దయారా ॥

తెర లేక పరదా తొలగించటం అంటే ఏమిటి? నీలో నీవు సత్యంగా ఉండి ఎవరైనా మహాపురుషుని సత్సంగంలోకి వెళ్ళు. ఇప్పుడు సమయం మారిపోయింది. అందుకే విషయాన్ని గురించి ఆలోచించు. ప్రపంచం ఇప్పుడు గుడ్డిగా దేనినీ నమ్మదు. సత్సంగంలో వచనాలను సరిగ్గా అర్థం చేసుకుంటే దానిని ఆచరించు. కానీ ఇవాళ రేపు ఏం జరుగుతోంది? బాబాజీ ఏ విషయం చెబుతున్నారో దానిని వేదవాణితో పోల్చి రుజువు చేయాలి. అలా అయితే భవిష్యత్తులో ఏ వ్యక్తీ బాబాజీ మాటను గురించి తర్కించరు. వాద వివాదాలు చేయకుండా ఉంటారు అని మన జనరల్ సాహబ్ అంటూ ఉంటాడు. కానీ ఎక్కడి నేను? ఎక్కడి వేదం? యోగ్యులైన వారే వేదవ్యాఖ్యానం చేస్తారు. అయోగ్యులు వేదాన్ని ఎలా విశ్లేషించగలరు? ఎలా అర్థం చేయించగలరు? ఇవాళ రేపు ఎందరో సత్సంగం చేయిస్తుంటారు. వారికి వాణిల్లోని అర్థమే తెలియదు. అర్థం చేసుకోలేదు. తామే అర్థం చేసుకోని వారు మీకేం చెబుతారు?

మొన్నటి సత్సంగంలో స్వామీ జీ మహారాజ్ వాణిలో వచ్చింది. నీకు మూడు లోకాల రాజ్యం లభిస్తుంది అని. అభ్యాసం చేసీ మనం రాజులమవుతామని ప్రపంచం అనుకుంటుంది.

నిజానికి మూడు లోకాలంటే ఏమిటి? శరీరం, మనసు, ఆత్మ-ఇవి మూడు లోకాలు. మహాసున్న్ ను దాటి సాధన చేసే వ్యక్తికి గురుజ్ఞానం లభించింది. అతడు మూడింటిపై నియంత్రణ, సంయమం సాధించగలడు. వాటిలో చిక్కుకొనడు. ఇదీ దీని వాస్తవిక అర్థం. నేను రోచకమైన, భయానక వాణిలను కూడా ఖండించను. విమర్శించను. ఇది కూడా అవసరమే! బుద్ధి చురుగ్గా లేనివారికి దీని ఆవశ్యకత ఉంది. ఇవాళ రేపు తెలివి పెరిగింది. కనుక బోధనను మార్చవలసిన అవసరం ఉంది.

నా కర్మవశాన నాకు నేనే సత్సంగం ఇచ్చాను. నేను గురుమతంలో ఉన్నాను. గురువు స్థాయిలో నేను ఇతరులకు ఉపదేశమిస్తూ ముందుగా నన్ను నేను ప్రశ్నించుకుంటాను. "ఫకీర్! గురు మతం వలన నీకేం లభించింది? అని" నాకు ఏది బోధపడిందో అదే చెప్పాను. అది పొరపాటు కావచ్చు. ఈ అనుభవాల వలన నాకు శాంతి లభించింది. సంశయాలు, భ్రమలు తొలగిపోయాయి. నేను మొదట్లో చేసే హాహాకారం సమాప్తమై పోయింది. ఇప్పుడు "శరణాగతం" నా మార్గం. పరుగెత్తి పరుగెత్తి అలసిపోయాను. ఇప్పుడు శరణాగతుని పరువు ఆ ఒక సర్వాధారునిదే! ఆయన అకహ, అపార, అగాధ్ అనాది అయి ఉన్నాడు. నన్ను నేను ఆయనకు సమర్పితం చేస్తుంటాను. మనసు ఇప్పటికీ చంచలంగానే ఉంది. కానీ ధ్యానంతో మంచి విచారాలతో దానిని అదుపు చేస్తుంటాను.

అభ్యాసం వలన నీ ఇచ్ఛాశక్తి పెరుగుతుంది. దీనివలన తనువును, మనసును నియంత్రించగలవు. ఇది గురుజ్ఞానంతో, బుద్ధి వివేకాలలో అదుపు లోకివస్తుంది. అందుకే తెలివి, వివేక, జ్ఞానముల పేరే గురువు.

*అందరికీ రాధాస్వామి*

# సత్సంగం

## 14–10–1973

# గురుమతం మహిమ

రాధాస్వామి!

మీకు, లోకానికి ఏమైనా చెప్పడానికి ముందు నన్ను నేను నీవు జీవితంలో ఏం చేశావు? ఏం చేస్తావు? అని ప్రశ్నించుకుంటూ ఉంటాను. చిన్నప్పుడు నాలో ఒకానొక వస్తువును ప్రాప్తించుకోవాలనే కోరిక ఉండేది. ఈ కోరిక నాకే కాదు అందరికీ ఉంటుంది. ఒకరు ధనం కోరుకుంటారు. మరొకరు గౌరవ, మర్యాదలు వాంఛిస్తారు. ఇంకొకరు కొడుకు కావాలను కుంటారు. వేరొకరు ముక్తి లభించాలనుకుంటారు. నాకు కోరిక లేదని నేనననుు. అందరిలో ఏదో ఒక కోరిక ఉంటుంది. నాలో కూడా కోరిక ఉండేది. నేనెవరిని? ఎక్కడ నుండి వచ్చాను? ఎక్కడికి వెళ్తాను? నా పరమాత్మ ఎక్కడున్నాడు? వంటివి తెలుసుకోవాలనే కోరిక ఉండేది. ఈ అన్వేషణలోనే రోజులు గడిచాయి. నా అదృష్టం 1905లో నన్ను దాతా దయాల్ జీ చరణకమలాలలోనికి చేర్చింది. ఆయన నాకీ పనిచ్చాడు. గురువు ఆజ్ఞకు బద్ధుడనై నా అనుభవం ఆధారంగా సత్సంగం ఇస్తుంటాను. పుస్తకాలు రాస్తాను. టేప్‌రికార్డు చేయిస్తుంటాను. చాలాసార్లు నన్ను నేను సంత్ సద్గురు వక్త్ అని కూడా అంటాను. నీవు సంత్ సద్గురు వక్త్‌వైతే ప్రపంచానికి ఏమిస్తావు? అని ప్రశ్నించుకుంటాను. దాతా దయాల్ జీ మహారాజ్ శబ్దం ఉంది :-

గురు హుయే సంసార్ మే పరగట్, గురు సే జ్ఞాన్ లో ।
ఛోడ్ దో పాఖండ్ కో, గురు మత్ కీ మహిమా జాన్ లో ॥

ఇప్పుడొక ప్రశ్న! దాతా దయాల్ జీ ఏ జ్ఞానం ఇచ్చేవాడు? ఆయన ఏం జ్ఞానం ఇచ్చేవారో ఆయనకే తెలిసి ఉండొచ్చు. గురుమతాన్ని గురించి ఆయనేం అర్థం చేసుకున్నారో ఆయనకే తెలుసు. ప్రతి మనిషి అవసరాలు, ఆశలు

వేర్వేరుగా ఉంటాయి. ప్రతివారి కోరికలు, ఆశలు పూర్తి చేసేటందుకు జ్ఞానం, విధానం, ఆచరణ, తెలివి వేరు వేరుగా ఉంటాయి. గురు జ్ఞానం ఏమిటి? అది ఒక తెలివి, బుద్ధి. దీనిద్వారా మన మనసుకు శాంతి చింతారాహిత్యం, ఆనందం లభిస్తాయి. శాంతి లేదా ఇచ్ఛను పూర్తి చేసే భావన వ్యక్తి, సమాజం, దేశాలలోకూడా ఉంది. కుటుంబాలలో కూడా ఉంది. ఏదో ఒక ఆశ, ఎవరిదో కొంచెం ఆశ. అందరికీ ఒకే పద్ధతి అన్వయించదు. ఒకటి రెండు జనరల్ సత్సంగాలవుతుంటాయి. అవి అందరికీ ఉపయోగకరంగా ఉంటాయి. జనరల్ సత్సంగం ఆరోగ్య విభాగంలాంటిది. ఆరోగ్యవిభాగం రోగాలు వ్యాపించకుండా, పరిశుభ్రత ఉండేలా ప్రతి ఒక్కరికి ఏర్పాటు చేస్తుంది. రోగి ఎలాంటి వాడైతే రోగాన్ననుసరించి ఇంజక్షన్ ఇచ్చి, ఔషధం ఇచ్చి, ఆపరేషన్ చేసి వ్యాధిని నయం చేస్తుంటారు. ఇలాంటిపని ప్రత్యేకమైన, ముఖ్యమైన సత్సంగం చేస్తుంది. అందుకే గురువు మహిమ అపారం. ఎదుటివారి స్థితిని బట్టి, ఆవశ్యకతననుసరించి గురువు సలహాలు, సూచనలు ఇస్తాడు. పద్ధతి చెబుతాడు. తనను కలిసినవారి మనోకామన పూర్తికావాలి లేదా వారికి శాంతి లభించాలని ప్రయత్నిస్తాడు. దాతాదయాల్‌జీ మహారాజ్ ఇదే చేసేవాడు. ఇతర గురువుల గురించి నాకు తెలియదు కానీ దాతా దయాల్‌జీ గురించి నాకు తెలుసు. నాకు దాతాతోనే పరిచయం, ఆయనతోనే వ్యవహారము కనుక ఆయన రీతి రివాజులు నాకు తెలుసు. దాతాదయాల్ నాకు ఒకరకమైన అజ్ఞ ఇచ్చాడు. నా తమ్మునికి మరో విధమైన అజ్ఞ ఇచ్చాడు. అతనికి నామదానం ఇచ్చి "నువ్వు నామం జపించకు. నీకు జీవితమంటే పని, పని అంటే జీవితం" అని చెప్పారు. ఇదే జరిగింది. నా తమ్ముడు ఎంతో అభివృద్ధి చెందాడు. రైల్వేలో ట్రాఫిక్ మేనేజర్ అయ్యాడు. 2500 రూపాయల జీతంతో రిటైర్ అయ్యాడు. రాయ్ సాహబ్ అనే బిరుదు అతనికి దొరికింది. ఇప్పుడతడు విరక్తుడైనాడు. సమయం వచ్చాక నీకు శరణం లభిస్తుందన్నాడు అతనితో దాతా దయాల్. నా భార్య దుఃఖంతో ఉండేది. "నిన్నెవరైనా ఒక్కమాటంటే నీవు లెక్కపెట్టి మరీ పదహారు మాటలను" అని ఆమెకు ఉపదేశించారు దాతాదయాల్‌జీ. దాతాదయాల్‌జీ కాశ్మీరుకు వెళ్ళినప్పుడు అక్కడ పండిత్ భాస్కర్‌నాథ్ దగ్గర బసచేశారు. 1932లో అక్కడ సత్సంగం జరిగింది. ఆ సత్సంగానికి చాలా

మంది కాశ్మీరీ పండితులు కూడా వచ్చారు. సత్సంగంలో దాతాదయాల్ "హింసా పరమో ధర్మః" అన్నారు. అది విని పండితులంతా ఏకకంఠంతో "హింసా పరమోధర్మః" కాదు, "అహింసా పరమో ధర్మః" అన్నారు. మీకు మీ వరకు "హింసా పరమో ధర్మః" అన్నారు. "మీకు కష్టాలు రానున్నాయి. హిందూ ముసల్మానుల జగడాలవుతాయి. మీరంతా సంఘటితం కండి. చావండి! చంపండి! మిమ్మేల్ని మీరు రక్షించుకొనండి" అన్నారు. వారి భార్యల వైపు చూసి, "మీరు బురఖాలు ధరించటం వదలండి. నడుములకు బాకులు కట్టుకొనండి" అని ఆదేశించారు. అలాగే జరిగింది. వాళ్ళంతా తమ రక్షణ చేసుకున్నారు. స్వామీ గోవింద్ కౌల్ తనను శిష్యుడిగా చేసుకోమని దాతాదయాల్ దగ్గరికి వచ్చారు. "ఒక షరతుపై నిన్ను నా శిష్యుడిగా చేసుకుంటాను. నీవు నన్ను పరమార్థం తప్ప మరే ప్రశ్నా అడగకూడదు. కూర్చుని ఉండు. నా సత్సంగం వింటూ ఉండు అంతే!" అన్నారు. భూప్ సింగ్! నావైపు ఏం చూస్తావు? నిన్ను దశమద్వారం కంటే ముందుకు తీసుకువెళ్తా! షరతేమిటంటే నీవు నా ఆజ్ఞపాటించు. కుబేర్ పేరుగల వకీలున్నాడు. "ఏ పనిని చేయటంలో నీకు కష్టాలు, విఘ్నాలు, ఇబ్బందులు వస్తే నీ పని పూర్తవుతుందని అనుకో ' అని అతనికి ఉపదేశించారు. సమయాన్ని బట్టి గురువు ప్రపంచంలో ప్రకటమవుతాడు. ఎక్కడ ఎలాంటి అవసరం ఉంటే అక్కడ అలాంటి వస్తువు ఉద్భవించటం ప్రకృతి నియమం. ఎక్కువ ఉష్ణం ఉన్నప్పుడు అక్కడ చల్లగాలి వస్తుంది. వర్షం కూడా కురుస్తుంది. ప్రకృతి నియమంలోకి గురువులు కూడా వస్తారు. ప్రకృతి వద్ద నియమం, ఉంది.

గురు హుయే సంసార్ మే పర్‌గట్, గురు సే జ్ఞాన్ లో ।
ఛోడ్ దో పాఖండ్ కో, గురు మత్ కీ మహిమా జాన్ లో ॥

గురుమతం అంటే ఏమిటి? అనుభవం, తెలివి, వివేకముల పేరే గురునామం. జ్ఞానంపేరే గురువు. జ్ఞానాన్ని ప్రాప్తించుకో. ప్రస్తుతకాలంలో గురుమతముదే శక్తి అధికారం ఉన్నాయి. నిరంకారుల గురువు, కబీర్ మతంలోని గురువు, రాధాస్వామి మతగురువు, రామకృష్ణ మఠ గురువు, శివానందుని శిష్యులు, శంకరాచార్యుని శిష్యులు ఇలా నాలుగువైపులా గురువులున్నారు. మీలోపల లేదా ఇతరుల లోపల - అమెరికా, ఆఫ్రికా వంటి

ప్రదేశాల్లోనూ నా రూపం ప్రకటమవుతుంది. కానీ అది నేను కాదు. మరి ఎవరు వెళ్తారు? ఇది వారి వారి శ్రద్ధ, విశ్వాసం, కర్మ, ప్రేమల ఫలితం. కానీ మేం మహాత్ములం దానినుండి అనుచితమైన లాభాన్ని పొంది గృహస్థులను తప్పుడు రీతిలో దోచుకుంటాం. మనిషిని వేరు వేరు మార్గాలలో, మతాలలో, ఆశ్రమాలలో విభజించాం. గట్టి పట్టుదలను వ్యాపింప చేశాం. మనుషుల మధ్య ఉండవలసిన పరస్పర ప్రేమను నష్టపరిచాం. దసరా సందర్భంగా మూడు సత్సంగాలిచ్చాను. విన్నవారికి తెలుసు నేనేంచెప్పానో! నేనేం చెబుతానో దానికి రుజువు కూడా చూపుతాను.

దసరా సత్సంగం తరువాత త్రివేంద్రమ్ నుండి మిలిటరీ క్యాంప్ సుబేదార్ హజారీ సింహ ఉత్తరం వచ్చింది. ఉత్తరం చాలా సుదీర్ఘంగా ఉంది. అతడు రాసిన సారాన్ని వినిపిస్తాను.

పరమ పురుష పూరణ్ ధని పూజ్య సత్‌గురుజీ మహారాజ్‌కు దాసుని రాధాస్వామి.

ఈ ఉత్తరాన్ని నెలపైన మూడు వారాల తరువాత మీ సేవలో రాస్తున్నాను. గత తొమ్మిది నెలల నుంచి నేను త్రివేంద్రమ్‌లో ఉన్నాను. ధనుష్కోటిని చూడడానికి వెళ్దామని నా మిత్రులు అన్నారు. నేను మా ఆఫీసర్‌తో ఈ విషయం చెబితే ఆయన రెండు స్టేషన్ వ్యాగన్‌లను మేం అక్కడికి వెళ్ళడానికి ఇచ్చాడు. 12-8-1973న ఉదయం ఒక వాహనంలో నా మిత్రులు, మరొక వాహనంలో స్త్రీలు, పిల్లలు, మరికొందరు పురుషులు కూర్చుని ఉదయం ఐదు గంటలకు బయల్దేరాం. ఇవాళ మేం ధనుష్కోటికి చేరుకోబోవటం లేదని బయల్దేరడానికి ముందుగానే నా అంతరంలోనుండి ధ్వని వినిపించింది.

మా వెనుక వాహనం నడుపుతున్న డ్రైవర్ తన వెనక కూర్చున్న స్త్రీ ప్రయాణీకులను చూడసాగాడు. అతడెక్కడ యాక్సిడెంట్ చేస్తాడోనని నాకు మరింత అనుమానం కలిగింది. బయల్దేరక ముందే నేను వాహనాలను మెల్లమెల్లగా నడిపించాలని ఇద్దరు డ్రైవర్లకూ చెప్పాను. వెనక వాహనం నడిపే డ్రైవర్ వెనుదిరిగి తరచుగా చూడడాన్ని నేను రెండు మూడు సార్లు చూశాను. ఈ సంకట స్థితి గురించి నేను మిమ్మల్ని ప్రార్థించాను. మీరు నాలోపల

ప్రకటమై "ముందువైపు చూడు! నేనందరినీ కాపాడుతాను" అన్నారు. ఇంతలో నా మోటారు బ్యాలెన్స్ అదుపు తప్పి వాహనం బోర్లాపడింది. వాహనం పడటం నేను చూశాను. అది నాలుగు గిరికీలు కొట్టి పల్టీలు కొట్టి కిందికి ఓ పొలంలోకి వెళ్ళిపడింది. మా అబ్బాయి నా ఒళ్ళో ఉన్నాడు. కిందపడ్డాం. నాకింద అబ్బాయి. నాపైన మోటారుబండి. మా వాహనం పడిపోవటం వెనక వాహనంలోని వారంతా చూశారు. ముందు వాహనంలో ఉన్నవాళ్ళలో ఒక్కరు కూడా ప్రాణాలతో మిగలరని వారు అనుకున్నారట. వెనక వాహనంలోని వాళ్ళు దిగి కిందికి వచ్చారు. పొలంలో బురద ఎక్కువగా ఉంది. వాళ్ళు వాహనం కింద ఉన్న నన్ను, నా కొడుకునూ బయటికి తీశారు. కిందపడిన మరో ఇద్దర్నీ తీశారు. మిగతా ప్రయాణికులను కూడా లేపారు. అందరూ మిలిటరీ హెడ్ క్వార్టర్ నుండి అంబులెన్స్ సహాయం అడగాలని అనుకుంటూ ఉండగా రెండు టాక్సీలొచ్చాయి. వాటిలో అందర్నీ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. నాకు స్పృహ వచ్చాక నా నాలుగు పక్కటెముకలు విరిగాయనీ, నడుముకు గట్టి దెబ్బ తగిలిందనీ తెలిసింది. ఈ యాక్సిడెంట్‌లో ఎవరూ చనిపోలేదు.

నాకు విపరీతమైన బాధ కలగసాగింది. మూలుగుతూ పడుకున్నాను. రాత్రికి మీరొచ్చారు. నొప్పుల వలన నాకు నిద్ర రాలేదు. మీరు నా పక్కటెముకలను, నడుమును వత్తసాగారు. నాకు సగం నొప్పితగ్గింది. "ఇంకా వత్తండి" అన్నాను. మీరు "ఇతర రోగులు నిద్రలో ఉన్నారు. లేస్తారు. ఇప్పుడిక నువ్వు కూడా పడుకో. నీకు నయమవుతుంది" అన్నారు. అదే సమయంలో నా భార్య మా ఇంట్లో మూడవ అంతస్తులో క్యాంటీన్ నుండి ఒక రూపాయి ప్రసాదం తెప్పించి మీ ఫోటో వద్ద ఉంచి నా ఆరోగ్యం కోసం మిమ్మల్ని ప్రార్థించసాగిందిట! తలుపులు మూసి ఉన్నాయి. గదిలోకి వెళ్ళడానికి మరో మార్గమేదీ లేదు. ఆమె మర్నాడు ఆస్పత్రికి వచ్చినప్పుడు చెప్పింది. మీరు మూడవ అంతస్థు కిటికీ మార్గం నుండి ఆమె వద్దకు వెళ్ళి, 'నీ భర్త దగ్గర నుండే వస్తున్నాను. అతణ్ణి పడుకో బెట్టాను. త్వరలోనే కోలుకుంటాడు. గాభరాపడకు" అని చెప్పారట. "మహారాజ్ ఇంత వార్ధక్యంలో కిటికీలో నుండి ఎలా వచ్చారో" అందామె!

నా కిప్పుడు 95 శాతం తగ్గింది. నా పట్ల జరగబోయే సంఘటనలను

మీరు నాకు చెబుతుంటారు. నా కొడుకు మధురకు సమీపంలోని ఓ ఊళ్ళో నా తండ్రి గారి దగ్గర ఉన్నాడు. అక్కడ మా అబ్బాయికి మశూచి సోకింది. వాడు వరుసగా మూడు రోజుల పాటు నా భార్య కలలోకి వచ్చి "అమ్మా! నీవో, నాన్న గారో వచ్చి నన్ను మీ దగ్గరికి తీసుకు వెళ్ళండి" అని అడగసాగాడు. నా కొడుకును నా దగ్గరకి పంపించమని మా నాన్నగారికి ఉత్తరం రాశాను. అయినా ఆయన పంపించలేదు. ఇక నేనే ఓ టాక్సీ తీసుకుని బయల్దేరాను. దారిలో నాకు కునుకుపట్టింది. కలలో పిల్లవాడు "మీరు ముందే వస్తే నా శవం దగ్గరైనా కూర్చుని గురూజీని తలచుకుంటే నేను మళ్ళీ బతికే వాడినే! ఇక ఇప్పుడు నేను మీకు దొరకను" అన్నాడు. నాకు మెలకువరాగానే మళ్ళీ ప్రయాణం కొనసాగించి మానాన్న గారింటికి వెళ్ళేసరికే పిల్లవాడిని పాతిపెట్టేశారు.

ఆ పిల్లవాడు నాకు దొరకగలడా? మీరు సదా వెంటనే ఉంటారు. మరి నా సాధన, అభ్యాసం సరిగ్గా ఎందుకు జరగటం లేదు? ఆ దుర్ఘటన జరుగుతుందని మీరు చెప్పారు. కానీ నేనొక్కడినే గాయపడ్డాను ఎందుకు"... ఇలా సాగిందతని ఉత్తరం. మీరు ఉత్తరం విన్నారు. ఈ సంఘటన గూర్చి నా కసలు ఏమీ తెలియదు. వాణిలో ఏం ఉంది?

గురు హుయే సంసార్ మే పర్‌గట్, గురు సే జ్ఞాన్ లో ।

ప్రపంచంలో గురువు ప్రకటమయ్యారు! ఆయననుండి జ్ఞానాన్ని తీసుకో!!

నిన్ను నీవు సంత్ సద్గురు వక్తనని చెబుతావు! ఏ జ్ఞానం ఇస్తున్నావు? అని నన్ను ప్రశ్నించుకుంటాను. "నేను ఎవరి అంతరంలోకీ వెళ్ళలేదు. ఏ గురువూ వెళ్ళడు" అనే జ్ఞానాన్నిస్తున్నాను. ప్రపంచంలో ఉన్న గురుయిజం అంతా కపటపు వల. అంతా మోసమే! మన గృహస్థులను మూర్ఖులను చేసి దోచుకుంటున్నారు. మన ఆస్తులు లాక్కోబడుతున్నాయి. నీకు సహాయంచేసేది నీ విశ్వాసం, శ్రద్ధ, నమ్మకాలే! మనం సాంసారికులం. మోసం, కపటాలలో చిక్కుబడి ఉన్నామనే సత్య జ్ఞానాన్నిస్తున్నాను. ఒకరు రాముడు, మరొకరు కృష్ణుడు, ఇంకొకరు హజరత్ మహమ్మద్, మరొకరు బాబా ఫకీర్ ఎవరూ పైన ఉత్తరంలో రాసినట్లు సహాయం చేయరు. ఈ విధంగా సహాయం చేసేది నీ ఆత్మయే! జీవులు నిబల, అబల, అజ్ఞానులు కనుక సహాయం కోరతారు. ఈ

అజ్ఞానులకు, మూర్ఖులకు ఏదైనా సహాయం చేస్తామని చెప్పుకునే మహాత్ములకు శుభాకాంక్షలు. వీళ్ళు ఆ సహాయం చేయకపోయినా చేశారని, ఆదుకున్నారన్న మంచి పేరు వీరికి దొరుకుతున్నది. ఈ గురువులు తమ ఆస్తులు, ఆశ్రమాలు సంపాదించుకుంటారు. మోటర్ కార్లు కొనుక్కుంటారు.

మీరు నా దగ్గరికి వస్తారు. నాపై బాధ్యత ఉంది. దసరాకు నేను చెప్పింది సత్యజ్ఞానం. ఇది పుస్తక రూపంలో అచ్చుకావాలని కోరుకుంటున్నాను. ఈ జ్ఞానాన్ని మీకే కాదు ప్రపంచానికిస్తున్నాను. ఈ పుస్తకం పేరు 'సంత్ సతగురుకీ సదా' అని పెట్టాలి. జీవుడు ఆశావాది. ఆశలలో చిక్కుకున్నందున దుఃఖితుడవుతాడు. దుఃఖితుల బుద్ధి సంతులితమై ఉండదు.

**ఆర్త్ కే బస్ రహే న చేతూ ।**
**ముడ్ ముడ్ కహే అపనా హీ హేతూ ॥**

నేను శిక్షణను ఎందుకు మార్చాను? స్పష్టంచేశాను? బుద్ధిమంతులకు ఒక విషయం తెలపాలని ఏది లభించినా అది మన కర్మ, శ్రద్ధ, ప్రేమ, కోరిక ఫలమేననే వాస్తవం తెలుసుకోవాలి. ఓ మనిషీ! నడవడిని పవిత్రంగా ఉంచుకో! విశ్వసించు. అప్పుడు శుభం కలుగుతుంది. కేవలం బాబా ఫకీర్ పేరును డప్పుకొట్టినంత మాత్రాన ఏమీ జరగదు. ఈ ప్రపంచం మనోమయమైనది లేదా ఇది సంకల్పం యొక్క సృష్టి. ఇది తెలుసుకుని నేను పిలుపునిచ్చాను. ఓ మనిషీ! నీ ఆలోచనా విచారంలో, భావంలో చాలా బలముంది. నీ విశ్వాసం, ఆశ, నీ ప్రవర్తనను బట్టి ఫలితం లభిస్తుంది. కర్మల ఫలం లభిస్తుంది, మనం సుఖం కోరుకుంటే చెడుకర్మలు చేయకుండా మనను మనం రక్షించుకోవాలి. మీరు మీ ఇళ్ళలో చూడండి! భార్య భర్తకు వ్యతిరేకం. భర్త భార్యకు విరుద్ధం. తండ్రీ కొడుకులకు పడదు. మిత్రులలో ఒకరిపై ఒకరికి నమ్మకం ఉండదు. నీ ఆలోచన విచారములే కర్మలు అవుతాయి. నీ ఉద్దేశం అంచనా, ఊహలే కర్మగా మారి సుఖదుఃఖములకు కారణమవుతాయి. ఒక ఇంట్లోకి కోడలు వచ్చింది. కోడలికి అత్తపట్ల ద్వేషం అయిష్టం వుంటే, అత్త కోడలికి మంచిచేసినా కోడలు ఆమెను ప్రేమతో చూడదు. ఆ కోడలికి అత్త వలన సుఖం లభించదు. ఎందుకంటే ఆమె తన ఊహను, ఆలోచననే చెడుగా చేసుకుంది. ఈ రోజు దేశంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు, సోషలిస్టు,

జనసంఘ్ వగైరా రాజనైతిక దళాలు పనిచేస్తున్నాయి. వీటి కార్యకర్తలకు ఒకరిపై మరొకరికి ద్వేషం, అసహ్యం. ఇక దేశంలో శాంతి రావాలంటే ఏ మాత్రం రాదు రాదు రాదు. "కర్మ ప్రధాన్ విశ్వ రచి రాఖా। జో జసు కీన్హ సు ఫల్ చాఖా'' కర్మగతి గొప్పది.

నా మాటలను విని ఆచరిస్తే మీ నావ తీరం చేరుతుందని చెప్పదలచుకుంటున్నాను. కర్మఫలితాలను ఎవరు మార్చగలరు? మనం ఏం చేశామో అదే లభిస్తుంది. నా ఆత్మపై ఏ భారం లేదు. ఏ పాపం లేదు. నేను ఇటీవల అలీగఢ్‌కు వెళ్ళాను. అక్కడ లాలా మక్ఖీలాల్ గారి కొడుకు రిటైర్డ్ మేజర్ ఉన్నాడు. యుద్ధం తరువాత జీపులో ఎక్కడికో వెళ్తుంటే అతని కాలు విరిగింది. ఇప్పుడతడు కృత్రిమమైన కాలు పెట్టుకున్నాడు. తనకు యాక్సిడెంటైన విషయాన్ని అతడు చెప్పాడు. నాలోపల ప్రకాశం కనిపించింది. మీరు సాక్షాత్కరించారు. నీవు ఇప్పుడే మరణించవు అని అభయమిచ్చారని చెప్పాడు. అతడు ఒక సంవత్సరంపై తొమ్మిదినెలలపాటు ఆసుపత్రిలో ఉన్నాడు. అప్పుడు అతని అంతరంలో నాశబ్దం వినిపించేదట. "నీవు బాగవుతావు! నీవు బాగవుతావు' ' అని. ఇప్పుడతడు పూర్తిగా కోలుకున్నాడు. అతనికి పెన్షను కూడా వస్తుంది. గ్యాస్ కంట్రాక్టు కూడా దొరికింది. యుద్ధానికంటే ముందు తను నా దగ్గరికి హోషియార్‌పూర్‌కి వచ్చానని చెప్పాడు. ఇక్కడి నుండి వెనుదిరిగి వెళ్ళేటప్పుడు కెప్టెన్‌తోపాటు వెళ్ళి భృగుసంహితవారికి తన జాతక చక్రం చూపించాడు. 36 సంవత్సరాల తర్వాత చాలా కష్టం వస్తుందని భృగుసంహితలో వచ్చింది. ఈ కష్టానికి కారణం ఏమిటంటే నీవు పూర్వజన్మలో జడ్జీగా ఉండేవాడివి. లంచం తిని నిరపరాధికి శిక్ష విధించావు. నేరస్థుడిని విడిచి పెట్టావు. దీనికి శిక్షగా నీకా కష్టం వస్తుంది అని భృగుసంహితలో అతని గురించి వివరణ ఉంది.

నేను హిందువును. జనన మరణాలను నమ్ముతాను. నేను భయపడిపోయాను. నిజం చెప్పకుండా కుహనా గౌవరం, కుహనా మర్యాదను పొందితే ఆ మేజర్‌కు పూర్వ జన్మలోని కర్మకు శిక్షపడినట్లే నాకు పడదా? నేను తప్పించుకోగలనా? గీతలో కృష్ణుడు చెప్పాడు. ప్రకాశాన్ని అంధకారం మూసివేసి ఉంచింది. జ్ఞానం అజ్ఞానంతో కప్పబడి ఉంది. అడుగు సిద్ధిస్తుంది. సిద్ధాంతం ప్రకారం ప్రపంచంలో ఏదో పెద్ద శక్తి వస్తుంది.

యాభైవేలు దానం ఇచ్చి నీకు జనన మరణాల నుండి లేదా కర్మఫలం నుండి తప్పించుకోవాలని ఆశిస్తే అది నెరవేరదు. తాజా ఉదాహరణతో బోధిస్తాను. ఇటీవలే అలీగఢ్ వెళ్ళాను. ఓ మేజర్ గారి బంధువు ఒకరు ఎంతో ధనవంతుడు. పైగా అతడు దాన గుణం కలవాడు. అతడొక ధర్మశాల నిర్మించాడు. దీనికి గాను లక్షలాది రూపాయలు వెచ్చించాడు. ఇంకా చాలా దానాలు చేశాడు. అతడు ఓ యాక్సిడెంట్‌లో గాయపడ్డాడు. అతని తలకు బలమైన గాయాలు కావటంతో వారం రోజులపాటు స్పృహ కోల్పోయాడు. నాసికలోకి రబ్బరు ట్యూబులు బిగించి దాని ద్వారా గ్లూకోజ్ ఇచ్చేవారు. అన్నంతినే స్థితిలో లేడు. అతడు లక్షలాది రూపాయలు దానం చేశాడు. అతడు చేసిన దానం అతనికేమాత్రం సహాయపడలేకపోయింది. ఈ ప్రశ్న నా మనసులో నిలిచింది. ఇదే ప్రశ్నను నేను నిన్ను కూడా అడుగుతున్నాను. నీవు చేసే దానం నిష్కామమైనది కాకుంటే, ఆ దానం ఫలితం పొందాలన్న కోరిక వాసన కారణంగా నీవు మరొక జన్మ ఎత్తవలసి ఉంటుంది. నీవు యోనిలోకి రావలసి ఉంటుంది. నీవు ధనం ఇస్తే ధనం లభిస్తుందనేమాట నిజం. దానం ఇవ్వటం వలన చెడు కర్మల ఫలితం నుండి తప్పించుకోగలగాలనుకుంటే అది జరగదు. నీవు చేసే కర్మను చివరికి అనుభవించవలసి ఉంటుంది. చెడు కర్మ ఏమిటి? మన స్వంత ప్రయోజనంకోసం ఎవరిదైనా ధనం తీసుకోవటం, ఎవరినైనా చెడుగా ప్రచారం చేయటం ఇవి నేరాలు. పరహితం కోసం, ఇతరుల మేలుకోసం నీవు చేస్తే దాని ప్రభావం ఉండదు. నా దగ్గరకి చాలామంది న్యాయార్జితం చేయని వారు కూడా వస్తుంటారు. నేను వారికి చెబుతుంటాను. ఈ ఆదాయాన్ని పరహితం కోసం, మంచి సేవల కోసం, తల్లిదండ్రుల సేవల కోసం, దీనదుఃఖితుల సేవ కోసం వినియోగించమని హెచ్చరిస్తాను. పరిశుద్ధమైన, పవిత్రమైన ఆదాయంతో నీ పొట్టపోసుకో. పెళ్ళిలో ఇరవై వేలు ఖర్చుపెట్టటం అవసరమా? ఇది సామాజిక నేరం. ప్రస్తుత కాలంలో ఏ రంగానికి వెళ్ళిచూసినా నిజాయితీగా పనిచేయటం కష్టమైపోయింది. సత్యమార్గాననడిస్తే ఉద్యోగం చేయజాలవు. నీ స్వార్థంకోసం, వ్యక్తిగత లాభం కోసం కుకర్మల నుండి తప్పించుకో! చెడు కర్మలు చేయకు.

ఇది కలియుగం. ఇవాళ రేపు ఇక్కడ సత్యం ఎక్కడుంది? సత్య

సంధతతో ఉంటే గడవటం కష్టం. అయినా స్వప్రయోజనం కోసం, స్వార్థంకోసం మోసం చేయకండి. నేను స్టేషన్ మాస్టరుగా పనిచేశాను. వ్యక్తి గత స్వార్థం కోసం ఎన్నడూ లంచం తీసుకోలేదు. ప్రభుత్వం వారి కలాలు, కాగితాలు సైతం నా స్వంత పనులకు వాడలేదు. సిబ్బందిని రక్షించడానికి రికార్డును మార్చాను. క్యాష్‌బుక్ మార్చాను. వాళ్ళను రక్షించాను. ఈ పని చేసినందున నన్ను నేను నేరస్థుడనని అనుకోను. పొరపాటు చేసిన మనిషి పశ్చాత్తాప పడి, ఇకముందు పొరపాటు చేయదలచుకోకుంటే, అలాంటివాడిని క్షమిస్తే అతడు చక్కబడతాడు. మంచివాడుగా మారతాడు. అతణ్ణి మెరుగుపడనివ్వటంలో ఏ ఆక్షేపణా లేదు. ఎందుకంటే అతడు ఇకపైన అలాంటి పొరపాటు చేయడు. మనం హవనం చేయాలి అని ఆర్యసమాజం వారనుకుంటారు. నెయ్యి దొరకదు. ధరలు బాగా పెరిగాయి. ఎక్కడి నుండి హవనం చేస్తారు? ఒకప్పుడు చేయగలిగారు. ప్రతి కాలానికీ ధర్మాలు వేర్వేరుగా ఉంటాయి.

కలి కేవల్ నామ ఆధారా । వేద శాస్త్ర శ్రుతి మత్ సారా ॥

ముందుగా యోగ్యుడైన గురు వచనాలను విను. కర్మఫలం నుండి అవతారపురుషులైన రామకృష్ణులుసైతం తప్పించుకోలేకపోయారు. రాముడు సరయూ నదిలో మునిగి చనిపోయాడు. ఆయన ఎందుకు నదిలో మునిగి ప్రాణాలు వదిలాడు? సమాధి స్థితిలోకి వెళ్ళి ప్రాణాలను విడవవచ్చు గదా? ఎందుకు మునిగాడు సరయూలో? ఆయన ఉదాసీనుడయ్యాడు. ఎందుకంటే ఆయన రావణుని వద్దనుండి సీతాదేవిని అగ్నిపరీక్ష చేసే తీసుకువచ్చాడు. ఆమె పవిత్రురాలని రుజువైపోయింది. అదే సీతను ఒక చాకలి వాడేదో అన్నాడని ఆమెను వదిలేశాడు. ఆమెను ఎందుకు వనవాసానికి పంపించాడు? లోకులు రాముడు మర్యాదా పురుషోత్తముడని, శ్రేష్ఠుడని అనాలన్న గౌరవాభిలాష వలన సీతను త్యజించాడు. నిరపరాధి అయిన స్త్రీపట్ల రాముడు ఇలా అపరాధం చేశాడు. అందుకు శిక్ష రాముడు అనుభవించవలసి వచ్చింది. శ్రీకృష్ణుని వంశమంతా మహాభారత యుద్ధానంతరం పరస్పరం కలహించుకుని చనిపోయింది. కర్మఫలం నుండి తప్పించుకునే ఉపాయం ఏమిటి? అపాయం కష్టం ఎదురైనా నీ స్వప్రయోజనం కోసం, స్వార్థం కోసం తిమ్మిని బమ్మిని చేయకు.

నేను గురుపదవిలోకి వచ్చాక ఎన్ని అద్భుతాలు, వింతలు, మహాత్మ్యాలు జరిగాయో ప్రచురిస్తే పెద్ద గ్రంథం అవుతుంది. కానీ నేను అందుకు అనుమతించను. నేను వాటిని ప్రచురింపచేసి, ప్రచారం చేసుకుంటే బాబా ఫకీర్ ఇది చేశాడు అది చేశాడని అందరికీ తెలుస్తుంది. అలా చేస్తే ఏమవుతుంది? హజారీసింహ సుబేదార్ స్థితి విన్నారు. ఇలాంటి వ్యాఖ్యానాలు విని లోకులు నాకు గౌరవమిస్తారు. ధనమిస్తారు. మర్యాద ఇస్తారు. అలా ఇస్తే నేను నేరస్థుణ్ణి కానా? కర్మ ఫలం నుండి తప్పించుకోగలనా?

గురు హుయే సంసార్ మే పర్‌గట్, గురు సే జ్ఞాన్ లో ॥

నేనే జ్ఞానాన్నిస్తున్నానో అదే సత్యమని దావా లేదు. నా అనుభవంలోకి వచ్చిన, అర్థంచేసుకున్న అంశం ఇది. అంతే! కర్మ అనుభవించే కారణంగా చెప్పాను. నేను నీనుండి దొంగతనం చేస్తే, నిన్ను మోసం చేస్తే, నీ ధనం కైవసం చేసుకుంటే నేను పాపినవుతాను. ప్రస్తుతం దేశంలో ఘెరావులూ, సమ్మెలూ చేస్తున్నారు. రైళ్ళు, బస్సులు, మోటార్లు, జీపులు కాలుస్తున్నారు. ఈ నేరం చేస్తున్న వారికి ఈ సొమ్ము ఎవరిదో తెలుసు. ఈ సొమ్ము అరవైరెండు కోట్ల ప్రజలది. ప్రభుత్వ వస్తువులను నష్టపరిచేవారు, దొంగిలించేవారు అరవైరెండు కోట్ల రెట్లు అధికంగా అపరాధం చేస్తున్నారు. ప్రభుత్వంతో మోసం, కపటం, బ్లాకులో వస్తువులమ్మటం కూడా అలాంటి పాపమే! ఈ కర్మ చేసినందుకు వీరికి శిక్ష పడుతుంది. అది అనుభవించక తప్పదు. ఇలా చేసేవాడు ప్రజల మనిషైనా మంత్రి అయినా ఎవరికైనా శిక్ష తప్పదు.

అపవాదం, నింద అన్ని చోట్లా ఉన్నాయి. కానీ నేడు ఎన్నికలలో పోటీ చేసి మంత్రి అయ్యాక ధనం సమకూర్చుకోవటం, ప్రజలనుండి పైసలు దోపిడీ చేసే కోరిక నాయకులలో ఎక్కువగా కనిపిస్తుంటుంది. అందరినీ అనటం లేదు. నిజాయితీ పరులు కూడా ఉండవచ్చు. ఎవరైనా కానీ కర్మ ఫలం అందరికీ వర్తిస్తుంది. ఇలాంటి సత్యం తెలిసింది. మీనుండి తీసుకున్న డబ్బు నా స్వప్రయోజనాలకు వాడను. మందిరంలో అది ఖర్చవుతుంది. అబద్ధాలు చెప్పి మోసం చేసి మీ నుండి డబ్బు తీసుకుంటే మందిరం నాశనమవుతుంది. మందిరం నాశనం కాకున్నా ఆ డబ్బును తిన్నవారు నష్టపోతారు. దానిని తిన్నవారి మనసు పవిత్రంగా పరిశుద్ధంగా ఉండదు. చూడు! మందిరాలు,

ఆశ్రమాలు, గురుద్వారాలలో ఎంత మోసం ఉందో? దీనికి కారణం అక్కడికి వచ్చిన ధనం లోకుల్ని మోసంలో ఉంచి తీసుకున్నది కావటమే! మనకు దుఃఖాలన్నీ, కష్టాలన్నీ మన నడవడి, ప్రవర్తన, స్వార్థాల కారణంగానే వస్తుంటాయి. తీసుకున్న సొమ్ము ఇవ్వకుంటే ఏదో ఒక రూపంలో ఇవ్వవలసి ఉంటుంది. జరిగిన సంఘటన ఒకటి చెబుతాను.

ఆర్య సమాజానికి చెందిన ఆజ్ఞారాం అనే ఒక డాక్టర్ నా దగ్గరకు వచ్చేవాడు. అతడు జ్యోతిష్యాన్ని నమ్మేవాడు. "ఆర్యసమాజం వారు జ్యోతిష శాస్త్రాన్ని నమ్మరు. నీవెందుకు నమ్ముతావు" అని ఓ రోజు అతణ్ణి అడిగాను. అతడు తనకు జరిగిన ఒక సంఘటనను వివరించాడు. "నేను లాహోర్‌లో వైద్యవిద్యనభ్యసించే రోజులలో ఒక రోజు అనార్‌కలీ మీది నుండి వెళ్తుండగా ఓ వ్యక్తి నన్ను ఆపి నీవు వైద్యశాస్త్రం చదువుతున్నావా? నీ పేరు 'అ' అనే అక్షరంతో మొదలవుతుందా?" అని అడిగాడు. "అవును" అన్నాను. బ్రాహ్మణ పండితుడిలా కనిపిస్తున్న ఆ వ్యక్తి "నాకు జ్యోతిషం తెలుసు. గతజన్మలో నేను నీ దగ్గర నుండి వందరూపాయలు అప్పుతీసుకున్నాను. అది తిరిగి ఇవ్వలేదు. దానిని తిరిగి ఇవ్వని కారణంగా నా వీపుపై పన్నెండు సంవత్సరాల నుండి పుండు బాధిస్తు ఉంది. నీ రూపాయలివిగో తీసుకో" అంటూ అతడు నాకు వంద రూపాయలిచ్చాడు. నేను మనసులో సంతోషించి ఆ రూపాయలు తీసుకున్నాను. "నీవు చికిత్సచేస్తే నా పుండు తగ్గుతుందని జ్యోతిషం చెబుతోంది" అన్నాడు పండితుడు. రెండు రోజులు కార్బాలిక్ యాసిడ్‌తో పుండును శుభ్రం చేసి కట్టుకట్టాను. అది తగ్గిపోయింది. ఆ బ్రాహ్మణుడు నాతో, "నీవు నాకు చికిత్స చేశావు కానీ ఫీజుగా నీకివ్వడానికి నా దగ్గర ఏమీ లేదు. నీవు నీ జన్మస్థలం, సమయం చెప్పు. నేను నీ జన్మపత్రం వేసిస్తాను" అని అతడు నా జన్మపత్రం తయారు చేసిచ్చాడు. ఆ జన్మకుండలిలో ఆ బ్రాహ్మణుడు ఏమేం రాశాడో నూటికి నూరు పాళ్ళు అవన్నీ నిజాలేనని రుజువయ్యాయి. కనుక అప్పటి నుండి నాకు జ్యోతిషంపై నమ్మకం ఏర్పడింది" అని ఆజ్ఞారాం చెప్పాడు.

అప్పు తీసుకుని, తీర్చకపోతే ఎక్కడికి పోతావ్? మన శాస్త్రం కూడా ఇదే చెబుతున్నది. ఇళ్ళలో అన్నదమ్ములుంటారు. పరస్పరం వారు ఇతరుల్ని

మోసం చేసి తిమ్మిని బమ్మిని చేసి దొంగిలిస్తే నేరస్థులవుతారు. ఎందుకు? కృష్ణ, సుదాముల చరిత్ర మీకు తెలుసు. కృష్ణుడు, సుదాముడు ఇద్దరూ గురువుగారింట్లో విద్యార్థులుగా ఉండేవారు. ఒకరోజు వాళ్ళిద్దరూ అడవికి కట్టెలు తీసుకురావడానికి వెళ్ళారు. వెళ్ళేటప్పుడు సుదామునికి గురువు గారి ధర్మపత్ని శనగలు ఇచ్చి "దారిలో ఆకలివేస్తే ఇద్దరూ తినండి" అని చెప్పింది. అడవిలోనే చీకటి పడటంతో ఒక చెట్టుపై సుదాముడు, మరొక చెట్టుపై కృష్ణుడు ఎక్కారు. సుదాముడు శనగలు తినసాగాడు. "సుదామా! ఏం తింటున్నావు?" అని కృష్ణుడు అడిగినప్పుడు "ఏమీ లేదు. చలి కారణంగా పళ్లు కొరుకుతున్నాను! నీకు అదే శబ్దం వినిపిస్తున్నది" అన్నాడు. సుదాముని జీవిత కాలమంతా అతని పళ్ళు శబ్దం చేస్తూనే ఉన్నాయని మీరు వినే వుంటారు. మీ వ్యాపారంలో భాగస్వామ్యం ఉంటే అందులో మీ భాగస్థునికి తెలియకుండా రాసే దొకటి, తీసుకునేదొకటి అయితే నమ్మక ద్రోహానికి ఫలితం అనుభవించవలసి ఉంటుంది. తప్పదు.

ఓ మహాత్ములారా! గురువునయ్యాక నా అనుభవంలోకి వచ్చినవే మీకూ వచ్చాయి. మీ శిష్యులను మీరు సత్‌లోకానికి చేర్చుతామని చెబితే వారు ఎక్కడికి పోతారో నేను చెప్పను గానీ మీకు మాత్రం ఎదురుగా నరకం తయారుగా ఉంది. మీరు గౌరవం, ప్రతిష్ఠ, మర్యాదల కోసం గురువులవుతారు. గురునామం అంటే జ్ఞానం, తెలివి, వివేకాలపేరు. మీరు నాకు సేవచేస్తారు. నేను సత్ జ్ఞానం ఇస్తాను. అందుకే నా ఆత్మపై ఏ భారం లేదు. మీకు ఇష్టమైతేనే సత్సంగానికి రండి. లేకుంటే లేదు. మీకిష్టమైతే నా సాహిత్యాన్ని చదవండి లేకుంటే లేదు. మీకిష్టమైతే మందిరానికి పైసలివ్వండి లేకుంటే లేదు. సంతోషంగా ఇస్తే దానిని అంగీకరిస్తాను. దాతా అన్నాడు :-

గురు హుయే సంసార్ మే పరగట్, గురు సే జ్ఞాన్ లో ।
ఛోడో దో పాఖండ్ కో, గురు మత్ కీ మహిమా జాన్ లో ॥

మందిరంలో బిహారీలాల్ అనే ఒక వ్యక్తి ఉన్నాడు. అతణ్ణి నేను గురువు రూపంగా భావిస్తాను. అతడు 1942లో నా దగ్గరకి మా ఇంటికి వచ్చాడు. అప్పుడే నేను కొత్త ఇంట్లో గృహ ప్రవేశం చేశాను. అక్కడ పీరేముగాం,

ఇంకా మరికొందరు సత్సంగీలున్నారు. అతడు నా దగ్గరికి ఒక జంపఖాన, మిఠాయి, పళ్ళు, 300 రూపాయలు కానుక చేయడానికి వచ్చాడు. అతని భార్య నాకు ఉత్తరం రాసింది. అతని భార్యపేరు సావిత్రి. ఆమె అభ్యాసం చేసేది. ఆమె రాసిందేమిటంటే తనకు అభ్యాసంలో స్వామీజీ, దాతా దయాల్ జీ, బాబా సావన్ సింగ్ జీ మహారాజ్ లు ప్రకటమయ్యారు. బాబాజీ! మీరు కూడా ప్రకటమయ్యారు. "ఈ సమయంలో సంత్ సద్గురు ఫకీర్ చంద్. నీవతని దగ్గరికి వెళ్ళు" అని దాతా దయాల్ అన్నారట. కానుక చేయడానికి మా దగ్గర ఇంకా ఏమీ లేవు. ఈ మూడు వందల రూపాయలు మీకు అర్పిస్తున్నాను అని రాసింది. ఇది 1942 నాటి మాట. మీరు కూడా వచ్చారు అని ఆమె నాకు రాయకుంటే ఇతర మహాత్ములు ఆమె అంతరంలోకి వెళ్ళి దర్శన మిచ్చారు కాబోలని నమ్మేవాడిని. నేనైతే వెళ్ళలేదు. ఆ బిహారీ లాల్ ద్వారా ఈ జ్ఞానం కలిగింది. దాతాదయాల్‌జీ, స్వామీజీ మహారాజ్ లేదా హుజూర్ బాబా సావన్ సింగ్‌జీ మహారాజ్ వీళ్ళెవరూ వెళ్ళలేదు. అది ఆయన భార్య ఊహ భావన. ఇదే బిహారీ లాల్ చేసిన ఉపకారం; నాకు జ్ఞా దాత అయిన కారణంగా అతనిపై కష్టం వచ్చినప్పుడు అతడిని మందిరంలోకి పిలిపించుకున్నాను. అతడికి నెలకు 25 రూపాయలు, తిండి, బట్టలు ఏర్పాటు చేశాను. రోగగ్రస్తుడైతే చికిత్స చేయిస్తాను. ఇదీ జీవితానుభవం.

నేనిలా స్పష్టం చేసినందున లోకులు నా వెంట తిరగరు. కానీ లోకుల కళ్ళ ఎదుట పరదా పెట్టి నా వెనక తిప్పుకుంటే ఎక్కడికి వెళ్తాను? నా స్థానం ఎక్కడుంది? ఓ మనిషీ! నీ కర్మను సరిచేసుకో! నీకు దొరికేదంతా పూర్వజన్మ కర్మ, ఈ జన్మలోని కర్మల ఫలితమే! కర్మలను మంచివిగా చేసుకో! ఇదీ గురు జ్ఞానం. ఈ జ్ఞానాన్ని గురువు ఆజ్ఞ ప్రకారం, హుజూర్ బాబాసావన్ సింగ్‌జీ ఆజ్ఞకు వశుడనై ఇచ్చిపోతాను. నేనిలా స్పష్టంగా చెబుతున్నందున నా దగ్గరికి ఎవరొస్తారు? చాలా తక్కువ మంది డబ్బులిస్తారు. కానీ నేనేం చేయగలను? నాపైన బాధ్యత ఉంది. దాతా అన్నాడు.

తూ తో ఆయా నర దేహీ మే, ధర్ ఫకీర్ కా వేశా ।
దుఃఖీ జీవ కో అంగ్ లగాకర్, లేజా గురు కే దేశా ॥

తీన్ తాప్‌సే జీవ దుఃఖీ హై, నిబల అబల అజ్ఞానీ
తేరా కామ్ దయా కా భాయీ, నామ దాన్ దే దానీ ॥

నేనేది చెబుతానో అదే నా నామదానం. గురువులు మనలను మూర్ఖులను చేశారు. నేను నిజమే చెబుతున్నాను. మనం మూర్ఖులు కావటంలో, దోపిడీకి గురికావటంలోనే సంతోషిస్తాం. ఆనందిస్తాం. నా నుండి 175 మంది స్త్రీలు ప్రసాదం తీసుకు వెళ్ళారు. ఇరవై సంవత్సరాలనుండి సంతానం లేనివారికి సైతం సంతానం కలిగింది. నా కూతురి పెళ్ళై పద్దెనిమిది సంవత్సరాలైనా ఆమెకు పిల్లలు పుట్టలేదు. ఆలోచించండి! పిల్లల్ని నేనిస్తానా? కళ్ళుతెరవండి! దాతా అన్నాడు.

గురు హుయే సంసార్ మే పరగట్, గురు సే జ్ఞాన్ లో ।
ఛోడ్ దో పాఖండ్ కో, గురుమత్ కీ మహిమా జాన్ లో ॥

గురు హై బ్రహ్మా గురుహై విష్ణు, గురు హీ శివ కా రూప్ హై ।
బ్రహ్మ గురుహై పరబ్రహ్మ హై గురు కో సబ్ కుఛ్ మాన్ లో ॥

దొరికేదంతా కర్మఫలం లేదా ప్రవర్తనా, నడవడి ఫలం. మీరిక ఏడుస్తారెందుకు? హాహా కారాలు ఎందుకు చేస్తారు? చేసిన దానిని అనుభవించు. జ్ఞానం, తెలివి కలిగితే దుఃఖాలు వచ్చినా అవి తక్కువగా బాధించినట్లనిపిస్తుంది.

"హోయీ హై వో హీజో రామ రచి రాఖా"

మనిషి చాలాసార్లు బడాయికోసం పనిచేస్తాడు. దశరథ మహారాజు శబ్ద బేధీ బాణం సంధించగలిగేవాడు. ఒకసారి శ్రవణుడు నీళ్ళు నింపుతూ దశరథుని బాణానికి గురయ్యాడు. దశరథుడు పరీక్షించలేదు, ఆలోచించలేదు. బాణం విడిచాడు. శ్రవణుడు చనిపోయాడు. ఆలోచించకుండా అర్థంచేసుకోకుండా పని చేయటం వలన ఏ ఫలితం ఎదురైంది? రాముని వియోగంలో హా రామా! హా రామా!! అంటూ ప్రాణాలను విడిచాడు.

నర పశు తిరియా పశు వేద పశు సంసార్ ।
మానుష్ తాహీ జానియే, జామేఁ వివేక్ విచార్ ॥

కోపంతో కొందరు "నీ రక్తం తాగుతా" అంటారు. నిజానికి అలా

చేయడానికి వారికి సామర్థ్యం లేదు, శక్తి లేదు. మనం ఏ కోపం, సంతోషం ప్రదర్శిస్తామో దాని ప్రభావం మన మేథస్సుపై ఉంటుంది. దీని అనుభవం కూడా నాకుంది. రెండు నెలల క్రితం నాకొక కల వచ్చింది. రైళ్ళు, తంతి వంటివి కలలో వస్తూనే ఉంటాయి. ఎందుకంటే ఆ పనులను నేను నా స్వప్రయోజనం కోసం, పొట్టకోసం చేశాను. కానీ ఈ బిబ్బో, గుప్తా, మానవతా మందిరం నా స్వప్నంలోకి ఏనాడూ రాలేదు. మీతో, వీరితో, మందిరంతో నాకున్నది నిష్కామ కర్మ సంబంధం. అందుకే వీరు కలల్లో రారు. నేను కలలో ఏం చూశాను? ఒక మనిషి భోజనం తెచ్చాడు. అందులో మాంసం ఉందని నాకు అనుమానం వచ్చింది. "ఏమిటి" అని అడిగాను. "మాంసం" అన్నాడతడు. "నేను మాంసం తినను" అని కంచం వదిలేశాను. అప్పుడే నాకు మెలకువ వచ్చింది. అంతదాకా స్వప్నం చూస్తున్నానని అర్థమైంది. తెల్లవారుజాము 4 1/2 గంటల నుండి 6 గంటల వరకు ఆలోచించాను. ఎన్నడూ జీవితంలో మాంసం కలలోకి రాలేదు. కానీ ఇప్పుడీ కలఎందుకు వచ్చింది? దీని చింతలోనే ఉన్నాను. ఆలోచిస్తుంటే నాకు జ్ఞాపకం వచ్చింది! 1918లో ఓడపై యుద్ధానికి బయల్దేరాను. సెకండ్ క్లాసు కంపార్ట్‌మెంట్‌లో కూర్చున్నాను. "ఏం తింటారు" అని క్యాంటిన్ వాళ్ళడిగినప్పుడు శాకాహారం అని చెప్పాను. భోజనం నా ఎదుటికి వచ్చింది. అందులో బంగాళదుంప కూర ఉంది. దానిని చూసి "ఇదేమిటి?" అని అడిగాను. చేపల పులుసు అందులో కలిపామనీ, చేపల్ని శాకాహారంగానే భావిస్తామనీ భోజనం తెచ్చిన మనిషి అనటంతో కోపంగా నేనా భోజనాన్ని పారేశాను. అదే విచారం! 1918 నాటి క్రోధం, సన్నివేశం 1973లో కలలో కనిపించింది. చూడు! భీష్మపితామహుడు బ్రహ్మచారి. సమస్త జీవనం ఆయనే పాపమూ చేయలేదు. అతడు ఆరునెలల పాటు బాణాల శయ్యపై పడి ఉండవలసి వచ్చింది. కృష్ణుడు ఆయన్ని పరామర్శించడానికి వెళ్ళాడు. "మహారాజా! గత వంద జన్మలలోనూ నేనే పాపం చేయలేదు. మరి నాకీ శిక్ష ఎందుకు లభిస్తున్నది" అని కృష్ణుణ్ణి ప్రశ్నించాడు భీష్ముడు. "మరో రెండు జన్మలు వెనక్కు వెళ్ళి గమనించు" అన్నాడు కృష్ణుడు. 101 జన్మలకు పూర్వం ఒక ముళ్ళ కొమ్మతో ఓ పామును భీష్ముడు కొట్టాడు. దాని ఫలితం ఇప్పుడు అనుభవించవలసి వస్తున్నది. ఇది నిజమో కాదో నాకు తెలియదు.

నీవు రాధాస్వామి మతం వాణిని రోజంతా చదువుతావు. గంటల తరబడి గీతాపఠనం చేస్తావు. వాణి-వచనాలను చదవటం వలన, గీత చదవటం వలన తరించి పోతారా? తరిస్తానని అనుకోవటం భ్రమ. అబద్ధం. అర్జునుడు గీతలోని పద్దెనిమిది అధ్యాయాలు కృష్ణుని ముఖారవిందం నుండి నేరుగా విన్నాడు. అయినా అతనికి నరక ప్రాప్తి కలిగింది. యుధిష్ఠిరుడు 'అశ్వత్థామా హతో నరో వా కుంజరోవా" అని ఒకే ఒకసారి అసత్యం చెప్పినందుకు రెండున్నర ఘడియలపాటు నరకానికి వెళ్ళవలసి వచ్చింది. ఎవరి అంతరంలోనికీ వెళ్ళని ఈ గురువులు తమ శిష్యులను సత్ ధామానికి చేరుస్తామని ప్రచారం చేసుకుంటారు. వాళ్ళంతా ఎక్కడికి వెళ్ళి ఉంటారో ఆలోచించు. అందుకే నేను సత్యాన్ని వ్యక్తం చేశాను. నేను సంత్ సత్ గురువునైతే కర్మల ఫలం నుండి తప్పించుకోగలనని అనను. నా కర్మల ఫలం నేను కూడా అనుభవించవలసే ఉంటుంది. ఒక డాక్టరు చికిత్స చేస్తాడు. నీవు ఏరోగానికి చికిత్స చేయించుకోవడానికి అతని దగ్గరికి వెళ్ళావో ఆ డాక్టరుకు కూడా అదే రోగం ఉండవచ్చు. అతనికి ఆ రోగానికి అవసరమైన ఔషధం తెలుసు. అతని వైద్యం వలన నీవు బాగవుతావు. నీ వ్యాధి తగ్గుతుంది. ఎందుకంటే ఇదే వ్యాధితో ఆ డాక్టరు కూడా బాధపడ్డాడు గనుక దానికి సరైన మందు ఏదో ఆ డాక్టరుకు బాగా తెలుసు. మీరు నా వద్దకు వచ్చారు. నిర్భయుడినై పనిచేయవలసిన బాధ్యత నాపైన ఉంది.

కర్మ ఫిలాసఫీ ఇంత దృఢంగా ఉంది. దీనినుండి తప్పించుకోగల ఉపాయం ఏదైనా ఉందా? సంతులంటారు. వారి మాటలపై విశ్వాసం కూడా ఉంది. కానీ చనిపోయి చూడలేదు. ఇలాంటి నమ్మకం కలిగించే జ్ఞానం నాకు మీ నుండి లభించింది. మీ లోపల నా రూపం పనిచేస్తుంది. రోగాలకు తగిన ఔషధాలను సూచిస్తుంది. పరీక్షలు రాస్తుంది. హజారీ సింహ సుబేదార్ రాసిన ఉత్తరం చదివి వినిపించాను. "మూడవ అంతస్థులో ఉన్న కిటికీద్వారా బాబా నీవొచ్చావు" అని అతని భార్య అంది. ఇదంతా మాయేనని దీనివలన అర్థం చేసుకున్నాను. లేదు కానీ ఉన్నట్లనిపిస్తుంది. నేను వెళ్ళలేదు. ఇది వారి విశ్వాసమే! ఇదంతా ఊహ, ఆశ, విచారం ఇదే మీకుంటే మరణ సమయంలో వచ్చే రంగులు, రూపులు అసత్యాలని మీకు నమ్మకం కలుగుతుంది. ఆ

రూపంలో, ఆ స్థితిలో ప్రకాశం శబ్దాలలోకి వెళ్ళిపోతారు. జ్ఞానం వలన మోక్షం కలుగుతుందని రుజువైంది. జ్ఞానం ఏమిటి?' దాతా అంటారు :-

ప్యార్ ఛాయాసే కియా తుమ్‌నే, అపనా రూప్ జానా నహీఁ ।
తుమ్‌నే అప్‌నా అవుర్ మాయా కా, రూప్ పహచానా నహీఁ ॥

ఆయన ఇలాంటి వాణిని వచనాలను నాకు ఉత్తరాలలో రాసేవారు. కానీ నాకు అర్థమయ్యేది కాదు. రహస్యం తెలుసుకోగోరే వాడిని! "ఫకీర్! నీకు సత్యమైన రాధాస్వామి దయాలుని దర్శనం సత్సంగీయుల రూపంలో అవుతుంది' అన్నారాయన. నేను అబద్ధంచెప్పను. మిమ్మల్ని సత్యమైన సద్గురువులని భావిస్తాను. ఏ మహాత్ముడూ ఇలా అనడు. అందరూ సైగ చేస్తారు.

శిష్య నవై గురు కో, యే జానే సబ్ కోయ్ ।
గురు నవై శిష్య కో, కోయీ విర్‌లా హీ హోయ్ ॥

ఒకసారి స్వామీజీతో కొందరు శిష్యులు, "మహారాజ్! సాలిగ్‌రామ్ మిమ్మల్ని చాలా ప్రేమిస్తాడు" అని చెప్పారట. దానికి ఆయన "ఏం తెలుసు? నేను అతనికి గురువునో? లేక అతడే నా గురువో?" అని స్వామీజీ సమాధాన మిచ్చారట. నేను కూడా దాతాదయాల్ జీ దగ్గరికి వెళ్ళేవాడిని. అక్కడ దాతా దగ్గర పెద్ద పెద్ద వారుండేవారు. నేను ఇరవై రూపాయల జీతం పొందే ఉద్యోగిని. వాళ్ళందరితో దాతా, "ఈ ఫకీర్ నన్ను తరింపచేయడానికి వచ్చాడు. నాకు ముక్తినివ్వడానికి వచ్చాడు. ఇతడు ఫకీర్!" అనేవాడు. రహస్యం నాకు మీనుండి లభించిందని నేనన్నట్లే ఆయన నా గురించి అనేవాడు. మనం ముక్తులం కావటం అనేది ఎలా జరగ గలుగుతుంది? మరణించాక మనం వెనుదిరిగి రాకూడదు. చూడు! నీవు సినిమా చూస్తావు. అక్కడ తెరపైన విమానాలు ఎగురుతాయి. గుర్రాలు పరుగెత్తుతాయి. కామోత్తేజం కలిగించే దృశ్యాలు వస్తాయి. దుఃఖం కలిగించే అంశాలు కనిపిస్తాయి. నవ్వించే ఏడ్పించే ఘటనలు ఎదుటకు వస్తుంటాయి. ఇవన్నీ చిత్రాలే! ఇవన్నీ నిజానికి నకిలీవే! అయినా ప్రభావం చూపుతాయి. ఇదే విధంగా ఆలోచనా విచారాలు, ఊహలు, భావనలు, కల్పనలే మేధస్సుపై ప్రభావం వేస్తాయి. వాటి ప్రభావం వలన మనం సుఖదుఃఖాలను పొందుతుంటాం. నిజానికి అవేవీ లేవు.

లోపలా, బయటా ఆలోచనా విచారాలు, భావనలు, రూపురంగులలో చిక్కుపడకుండా ఉండటం వలన ప్రకాశం, శబ్దాలలోకి వెళ్ళటం వలన రాకపోకలు తప్పిపోతాయి. తొలగిపోతాయి. నీకు లభిస్తున్నది ఈ జన్మలోవీ, గతజన్మలోవీ కర్మల ఫలితాలు. ఓర్పుతో పనితీసుకొనండి. ఆశావాదిగా ఉండడానికి, మంచి విచారాలు, పెట్టుకోవడానికి, ఒక్క ఇష్టుడినే అంగీకరించమని నీకు సలహా ఇస్తున్నాను. నన్ను గురువుగా, ఇష్టునిగా ఏర్పర్చుకోమని నేననటం లేదు. గురువును పరమ తత్వ అధారమని, పూర్ణుడని అంగీకరించు, విశ్వసించు. గురువును హోషియార్‌పూర్‌లో ఉండే ఫకీర్ చంద్ అని అనుకోకు. రాధాస్వామి ధామానికి చెందిన దాతా దయాలుడని అనుకోకు. కబీర్ అన్నాడు :-

గురు కో మానుష్ జాన్‌తే, తే నర్ కహియే అంధ్ ।
దుఃఖీ హోయే సంసార్ మే ఆగే యమ కా ఫంద్ ॥

గురు కియా హై దేహ కో, సత్ గురు చీన్హా నాహిఁ ।
కహే కబీర్ తా దాస్ కా తీన్ పాప్ భర్ మాహిఁ ॥

ఎందుకంటే కల్పితమైన, ఊహామాత్రమైన, భ్రమతో కూడుకొనిన ప్రపంచం ఇది. ఆలోచనా విచారాల, భావనల ప్రపంచం ఇది. అందుకే నీ ఊహను, భావనను, ఆలోచనా విచారాలను సరైనవిగా పరిశుద్ధమైనవిగా ఉంచుకో. దైవప్రసాదం అమృతమని మీరాబాయికి నమ్మకం ఉంది. కనుక విషం సైతం ఆమెనేమీ చేయలేక పోయింది. ప్రభావం చూపలేకపోయింది. మీరాకున్నంతటి విశ్వాసం, నమ్మకం, భావం పెంచుకో. భగవంతుడు ఏది చేసినా మంచే చేస్తాడు. చెడు ఆలోచించకు. సంపూర్ణమైన నమ్మకం పెంచుకో. ఏది జరిగినా మంచే అవుతున్నదని అనుకో. ఇందులోనే మనకు శ్రేయస్సుంది. ఇవాళ జరుగుతున్నదాని ప్రభావం రేపు ఎలా ఉంటుందనేది మనకు తెలియదు. అందులోనే మేలుందనే వాస్తవం తరువాత తెలుస్తుంది. జరిగింది మంచిదే అయింది. అలా జరగకుంటే చెరుపు కలిగేదే అనుకుంటాం. ఆ భగవంతునికి ఏ రూపమూ లేదు. అన్ని రూపాలూ ఆయనవే! ఒక్క రూపాన్ని విశ్వసించండి. మన హిందువులలోని లోపం ఇదే. ఇవాళ రాముడిని రేపు హనుమంతుడిని కొలుస్తారు. ఇది సరైనది కాదు. చాకలివాడి కుక్క ఇంటికి చెందదు. రేవుకు

చెందదు అన్నట్లవుతుంది ఇలాంటి వారి పరిస్థితి. అందుకే బ్రహ్మ సావిత్రి అథవా గాయత్రి సాధన లక్ష్యంగా చేసుకో. కానీ అక్కడికి ప్రతివ్యక్తీ వెళ్ళజాలడు. అందరి బుద్ధికి ఇది అర్థం కాదు. అయినా నీవు ఆశావాదివై ముందుకు సాగిపో. వాణిలో ఏమన్నారు?

గురు హుయే పర్‌గట్ సంసార్ మే, ఉన్ సే జ్ఞాన్ లో

ఓ దాతా! నా కర్మ, అదృష్టం రాముని అన్వేషణలో ఉన్న నన్ను మీ చరణాలలోకి చేర్చింది. మీరు అపారమైన దయ చూపారు. నాకు లాహోర్, 1905వ సంవత్సరం జ్ఞాపకానికి వస్తోంది. నేను మీ పనిని చేస్తూ వెళ్ళాను. పని సరిగా చేశానా తప్పుగా చేశానా అనే విషయం నాకు తెలియదు. నా ఆలోచన, ప్రవర్తన సరైనదై ఉంది. శరీరాన్ని వదిలేముందు శిక్షణ పద్ధతి మార్చుమని మీరు చెప్పారు. నేను తప్పు చేసినా దీని గురించి నాకు బాధలేదు. సత్సంగీయులారా! మీరొస్తారు. మీ దయకు కృతజ్ఞుడిని. మీరు సేవచేస్తారు. గౌరవిస్తారు. ఈ జైన్ గారొచ్చారు. ఈయన 751 రూపాయలిచ్చాడు. ఎందుకిచ్చాడు? ఎప్పుడో ఒకసారి ఇతనికి ఏదో ఆపద వచ్చింది. ఇతని భార్య హోషియార్‌పూర్‌కు వచ్చింది. అప్పుడు అతడెవరో నాకు తెలియదు. నా రూపం ఇతనిలో ప్రకటమయ్యేదేమో నాకాసంగతి కూడా తెలియదు. ఇతని భార్య వచ్చినప్పుడు, "ఏం కోరుకుంటున్నావ్?" అని అడిగాను. "వ్యాపారం దెబ్బతిన్నది. కొంచెం డబ్బుకావాలి" అందామె. "నా దగ్గరైతే లేదు" అన్నాను. 500 రూపాయల డ్రాఫ్టు ఢిల్లీకి చెందిన అగ్రవాల్ పేరుతో రాసి ఆమెకిచ్చాను. "నీవు వీరికి భాగస్థునివిగా! చూడు. సహాయపడు! అర్థంచేసుకో" అని అగ్రవాల్‌కు ఒక ఉత్తరం రాశాను. అగ్రవాల్ కూడా ఇతనికి 500 రూపాయిలిచ్చాడు. "మహారాజ్! ఇతనికి భాగస్థుణ్ణి కావటం సరైనదనిపించటం లేదు. ఇతని పని చాలా చిన్నది." అని నాకు ఉత్తరం రాశాడు. ఈ జైన్ తన వ్యాపారం ప్రారంభించాడు. ఇతని పని నెరవేరింది. అగ్రవాల్ ఇచ్చిన రూపాయలు కూడా మళ్ళీ తిరిగి ఇచ్చేశాడు. తన ఆదాయం నుండి నూటికి రూపాయి పావలా మందిరానికి ఇస్తాడు. ఆ లెక్కన ఇతడు ఇప్పటికి మందిరానికి 2,500 రూపాయలిచ్చాడు. నేను 500 రూపాయలే ఇచ్చాను. నీవు ధనం, ఆదాయం, గౌరవం కోరితే దుఃఖితులకు సహాయం చేయి. ఈ ధనం వెంట వచ్చేది కాదు.

ఒకనాటికి చనిపోతావు. అన్నీ ఇక్కడే మిగిలిపోతాయి. బంధువులు వెంటరారు. మిత్రులు వెంటరారు. దీనులకు, బాధితులకు చేసిన సహాయం నీ వెంట వస్తుంది. ఇతరుల్ని ఏవగించుకుంటే అదే నీకు ఎదురవుతుంది. ఏది ఇస్తే అదే లభిస్తుంది. నిరుపేదల దీవెనలో చాలా శక్తి ఉంది.

ఊహలో, భావనలో, ఆలోచనా విచారంలో చాలా గొప్ప శక్తి ఉంది. ఒక వ్యక్తి నన్ను ఏర్పర్చుకుని శనగపంట కోయించగలుగుతున్నాడు. నేను అతడి శనగ పంటను రోజంతా కోశానని తారాచంద్ దసరా సత్సంగంలో చెప్పాడు. అతని విశ్వాసం శనగ పంటను కోసింది. నేనైతే వెళ్ళలేదు. లోకులు తమ విశ్వాసంతో రూపాన్ని ఏర్పర్చి తమ పని చేసుకోగలిగినప్పుడు మనిషి ఎవరికైనా మేలు కోరితే ఎందుకు మేలు జరగదు? మీరు నా రూపం ఏర్పర్చుకుని పని తీసుకుంటారు. కానీ నేను వెళ్ళను. అమెరికాకు వెళ్ళను. ఆఫ్రికాకు వెళ్ళను. ఇక్కడ అక్కడ ఎక్కడికీ వెళ్ళను. నేను తమ పనులు విజయవంతం చేస్తానని లోకులనుకుంటారు. మనిషి ఆలోచనలో, ఊహలో, భావంలో చాలా బలముందని దీని వలన రుజువవుతున్నది. ఎవరికైనా మేలుకోరితే మేలే జరుగుతుంది. మా అబ్బాయి నాకు రెండువందల రూపాయలిస్తాడు. కట్నీ వాళ్ళు రెండువందల రూపాయలు నాకు, మందిరానికి యాభై రూపాయలిస్తారు. మరో వ్యక్తి యాభై రూపాయలిస్తాడు. మందిరానికి పదిహేను రూపాయలు, 5 రూపాయలు ఇస్తారు. మా ఇంటి నెలవారీఖర్చు దాదాపు 475 రూపాయలు. నేను నా పెన్షను అంతా మందిరానికి ఇస్తాను. ఈ రూపాయలు రాకుంటే నాకు ఎలా గడుస్తుంది? నేను కోరుకోకపోయినా నాకు రూపాయలిచ్చిన వారికి మేలు జరుగుతుందా? జరగదా? మందిరంలో దుఃఖితులకు, అనాథలకు సేవ అందుతుంది. ఆసుపత్రి ఉంది. రోగుల అదృష్టం వలన దీనికి డబ్బు అందుతుంది. మందిరానికి వస్తున్న ఆదాయం వారి అదృష్టానిదే తప్ప నా అదృష్టం కాదని అనుకుంటాను. కట్నీవారు పది సంవత్సరాల నుండి మందిరానికి, నాకు 250 రూపాయలిస్తున్నారు. ఇది గాక వారి ఆదాయం నుండి నూటికి ఒక రూపాయి చొప్పున నా వాటా తీస్తారు. ప్రతి సంవత్సరం దాదాపు వెయ్యి రూపాయలు ఈ వాటా కింద పంపుతారు. ఆ రూపాయల్ని నేను ధామ్ కు పంపిస్తాను. ఆ కట్నీ వారికి ఎవరిచ్చారు?

ఆశీర్వాదం! కాషాయం దుస్తులు వేసుకునే వారికి ఇవ్వకండి. సాధువులకు ఇవ్వకండి. మీరు గృహస్థులు. గృహస్థులకే మీరు సహాయం చేయాలి. ఒక వైద్యుడు జలంధర్ నుండి నా దగ్గరికి వచ్చాడు. అతనికి సంతానం లేదు. నేను చెప్పాను. "డ్యూటి టైం తరువాత రాత్రిపూట పేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించు. ఫీజు తీసుకోకు. సాధ్యమైనంత వరకు వారికి చికిత్స చేయి" అన్నాను. ఒకటిన్నర సంవత్సరం తరువాత మాస్టర్ మోహన్‌లాల్ గారింటికి అతడు వచ్చాడు. నేను అతడి విషయం మరిచే పోయాను. అతని వెంట భార్య, పిల్లవాడు వచ్చారు. నా పాదాలకు మొక్కారు. "నీ పేరివి? నీకేం కావాలి? అని అడిగాను. "మీరు చెప్పినట్లే చేశాను. ఈ కుర్రవాడిని మాకు మీరే ప్రసాదించారు". అన్నాడు. ఇపుడిక ఆలోచించండి! వారికీ పిల్లవాడిని నేనిచ్చానా? పేదవారి ఆశీర్వాదమా?

నా శిక్షణ, బోధన ఇదే! ఇళ్ళలో పరస్పరం ప్రేమగా ఉండండి. ఎవరికీ మేలు చేయలేకపోతే కనీసం కీడైనా చేయకుండా ఉండండి. చాలు. ఏది చేస్తావో అదే అనుభవిస్తావు. స్త్రీలు ఇళ్ళల్లో ఏం చేస్తుంటారు? ఇళ్ళలో శీతయుద్ధం మంచిది కాదు. ఇంట్లో ప్రేమ లేకుంటే శాంతి ఎక్కడి నుండి వస్తుంది? నా అనుభవం నేను చెబుతుంటాను. నా కొడుకు చనిపోయాడు. రెండు సంవత్సరాల ముందే ఇల్లు కట్టడానికి ప్లాను వేశాను. ఇంటికి అల్లుడొచ్చాడు. అతనికి చూపించగా, "మీకిద్దరు కొడుకులు కదా! ఇద్దరికీ సమానంగా వాటా వచ్చేలా ఇల్లు కట్టండి" అన్నాడతడు. "ఒక్కడే బ్రతకాలని చెప్పు" అన్నాను. అల్లుడికి కోపం వచ్చింది. నా చేతిలోనుండి ప్లాన్ లాక్కుని చింపెయ్యడానికి తయారై "అత్తగారికి చెబుతాను" అన్నాడు. నా స్నేహితుడు పురుషోత్తమ దాసు అతడికి నచ్చచెప్పాడు. శాంతింపచేశాడు. ప్లాన్ వాపసు తీసుకున్నాడు. కొన్నాళ్ళ తరువాత పిల్లవాడు జబ్బుపడ్డాడు. కపూర్తలా నుండి డాక్టర్ ను పిలిపించాం. "మామూలు మలేరియా" అన్నాడాయన. "నీవు చికిత్స చేసి బాగుచెయ్యి. అడిగినంత డబ్బు ఇస్తా" అన్నాను. ఆ కుర్రవాడు బతకలేదు. ఒక కుర్రవాడు చనిపోవాలని ఎందుకన్నాను? నేను జ్యోతిష్యుడినా? నా దగ్గర నా తమ్ముని పిల్లలు ముగ్గురు, నా పిల్లలు, నా భార్య, ఒక నౌకరు ఉండేవారు. నా జీతం తక్కువ. ప్రభుత్వ నౌకర్లతో నేను పనిచేయించుకునే

వాడిని కాను. కనుక నేను వేరే నౌకరును పెట్టుకున్నాను. ఇంటి ఖర్చు బొటా బొటీగా సరిపోయేది. నా భార్య మండిపడుతుండేది. ఆమెకు ఆ కర్మ ఫలితం లభించింది.

కర్మలను అనుకూలంగా ఏర్పర్చుకొనండి. ఇంట్లో అత్తామామలుంటే వారికి సేవ చేయండి. వారి ఆశీస్సులు తీసుకొనండి. అత్తామామల, తల్లిదండ్రుల సేవలు చేయరు. భగవంతుడు కావాలని కోరుకుంటారు. ఈ ముసలివాళ్ళకు కూడా సేవ చేయించుకోవటం చేతకాదు. మీలో కూడా లోపం ఉంది. హర్‌స్వరూప్ తండ్రి నా సత్సంగానికి వచ్చాడు. అతడు దాతా దయాల్ దగ్గర నామదానం తీసుకున్నాడు. "దాతా అయితే ఇప్పుడు లేడు. ధామ్‌కో, డేరాకో, ఇతర గురువుల ఆశ్రమాలకో వెళ్తే నీవు ఖాళీగా, తెల్లకాగితం లాగే ఉన్నావు. కొత్త పద్ధతిలో నామం తీసుకో అంటారు. ఏం చేయాలి" అన్నాడు. నేనతన్ని నాతో ధామ్‌కు తీసుకువెళ్ళాను. "ఇంటికి వెళ్ళాక ఎవరి దోషాలనూ చూడకు. అందరినీ పొగడు. ఎండిపోయిన రొట్టెలిచ్చినా బయట మాత్రం నీకు నేతిరొట్టెలిస్తున్నారని చెప్పు. అందరికీ ఆశీస్సులిస్తుండు. దీవిస్తుండు. ఇలా చేశాక కూడా నీకు కష్టం వస్తే బాధ్యత నాది" అన్నాను. కొన్ని సంవత్సరాల తరువాత నేను మళ్ళీ వెళ్ళాను. అతడు తన మనుమడైన ధర్మేంద్రతో కలిసి నా దగ్గరకు వచ్చాడు. "బాబా! నీ ఉపాయం నా జీవితాన్ని ఎంతో మెరుగుపరచింది. నాకు చాలా సేవ జరుగుతుంది." అన్నాడు. బిబ్బో వాళ్ళ ఇంట్లోని పెద్దలకు చాలాసేవ చేసింది. వాళ్ళ మలమూత్రాలను సైతం ఎత్తి పారవేసింది. నా భార్య తన అత్తమామలకు చాలా సేవచేసింది. ఆమె వ్యాధిగ్రస్తురాలైనప్పుడు ప్రకృతి నా దగ్గరికి గోపాలదాసును పంపించింది. గోపాలదాసు ఏడు సంవత్సరాలపాటు ఆమెకు చాలా సేవ చేశాడు. నా దగ్గర పైసలుండేవి కాదు. నేను పేదవాడిని. ఆ రోజుల్లో దాతా నుండి ఒక ఉత్తరం వచ్చింది. ఆయన డబ్బు కావాలని అడగ లేదు. కానీ సైగ చేశాడు. మరో రీతిలో ఆ అవసరాన్ని గురించి ప్రస్తావించాడు. నేను నా భార్యతో ఈ విషయం చెప్పాను. ఆమె తన నగలను ఇచ్చింది. ఆ నగలను అమ్మి నేను దాతాకు డబ్బు పంపాను. కూతురు పెద్దదైంది. మీరు మంచి వారే, నా నగలను నా దగ్గర మిగల్చలేదు అనేదామె! ఇప్పుడు ఇక నేనేం చేయాలి అనుకున్నానంతే!

అమ్మాయి పెళ్ళి ఎంతో ఘనంగా జరిగిపోయింది. నా భార్య ఇచ్చింది కనుకనే ఆమెకు మరో రూపంలో దొరికింది. వాణి ఇలా ఉంది.

గురు హుయే సంసార్ మే, పరగట్ గురుసే జ్ఞాన్ లో

ఆధ్యాత్మ జీవితం, గృహస్థ జీవనం రెండింటి జ్ఞానం ఇస్తాను. సిగ్గువిడిచి మరీ చెబుతున్నాను. విషయభోగాలను తగ్గించండి. ఒక సత్సంగి నా దగ్గర కొచ్చాడు. "చాలా అశాంతిగా ఉన్నాను" అన్నాడు "నీవు బ్రహ్మచర్యం కోల్పోయావు, విషయం భోగాలను అధికంగా అనుభవించావు" అన్నాను. "నాకు బ్రహ్మచర్యం గురించి ఎవరూ బోధించలేదు" అన్నాడు. "ఎవరు చెబుతారు?" అన్నాను. ప్రస్తుతం గురువులకు అత్యధిక సంఖ్యలో శిష్యులను తయారు చేసుకోవాలనే కోరిక అధికమైంది. ఏదేమైనా విషయభోగాలు అధికంగా అనుభవించే వారిలో అశాంతి రావటం తప్పనిసరి! అశాంతిని ఎవరాపగలరు? ఇదే నేనివ్వగోరిన గురుజ్ఞానం! భార్యలను వదిలెయ్యమని నేను చెప్పటం లేదు. కానీ అత్యధిక విషయ వికారాలను అనుభవించకండి. నేను బోధించటంలో ఏ విషయం వదలలేదు. ఆచరించటం మీ పని. ఐదారుగురు పిల్లలయ్యారు. ఇక చాలు! ఈ వ్యవహారాన్ని నిలిపేయండి. అంగీకరించకుంటే శరీరం అస్వస్థమై, అశాంతిగా ఉంటుంది. నిజం చెప్పాలంటే నా అనుభవాన్ని బట్టి అన్నీ సర్వేశ్వరుని చేతుల్లో ఉంటాయి. **ఎవరిపైన ఆయన దయ ఉంటే వారే ఈ మార్గంలోకి వస్తారు.** లక్షసార్లు నచ్చచెప్పు, ఏమైనా చేయి - కర్మను అనుభవించవలసే ఉంటుంది. ఒక స్త్రీ వచ్చింది. ఆమె భర్త వెంటే ఉన్నాడు. "బాబా మేమిద్దరం బర్త్ కంట్రోలు ఆపరేషన్ చేయించుకున్నాం! అపరేషన్ కంటే ముందు ఆరుగురు ఆడపిల్లలున్నారు. ఆపరేషను చేయించుకున్నాక కూడా ఈ ఏడవది పుట్టింది" అంది. నేను ఆశ్చర్యపోయాను. ఏం లీల ఇది? ఆలోచించాను. నీవు ఏం చేస్తావు? ఏం చేయగలవు? ఎందుకు ప్రేలాపన చేస్తావు. కర్మ అందరూ అనుభవించవలసే ఉంటుంది. దాతా అన్నారు.

గురు హుయే పర్‌గట్ సంసార్ మే, గురు సే జ్ఞాన్ లో ।
ఛోడ్ దో పాఖండ్ కో, గురు మత్ కీ మహిమా జాన్ లో ॥

"నీకేం లభించింది?" అని నా ఆత్మను ప్రశ్నిస్తాను. నీ లీల నీకే

తెలుసు! నీవు అపరంపారుడవనే జ్ఞానం లభించింది. ఏక్ దృష్టి సే తేరా దాతా, దుఃఖియో కా బేడా పార్ హై" ఇక్కడికి చేరాక నాకు శాంతి లభించింది. ఎనభై ఏడు సంవత్సరాల వాడినయ్యాను. పరుగెత్తాను. పరుగులు పెట్టాను. శాంతి ఎక్కడ లభించింది. ఇక్కడికి వచ్చాక! ప్రభూ! నీ ఇచ్ఛ, నీ ఇష్టం అన్నాక!! ప్రభూ! నీవేం కోరుతావో, ఏం కావాలనుకుంటావో అదే అవుతుంది. దైవేచ్ఛ వలన శిష్యుడనయ్యాను. తండ్రి నయ్యాను. పతినయ్యాను. ఆఫీసర్‌నయ్యాను. గురువును కూడా అయ్యాను. అంతా మాయ! మాయా చక్ర పరిభ్రమణం! మాయా వలయం! కొంత నా కోరిక! కొంత కర్మమని దీనిని చెప్పవలసే ఉంది. మీరు నా దగ్గరికి వస్తారు. మీకు నేనేం ఇవ్వగలను? నా వద్ద శుభ భావనలున్నాయి. వాటినే ఇస్తాను. నేను కోరేదేమంటే నన్ను కలవడానికి వచ్చిన వారికి తినడానికి తిండి, తొడుక్కోడానికి గుడ్డ, ఉండడానికి ఇల్లు దొరకాలి. మనసుకు శాంతి లభించాలి. నేనెవరికీ ముక్తి ఇవ్వగోరటం లేదు. నేను దాతా దగ్గరికి వెళ్ళేవాడిని. పిండిని పాలతో తడిపి రొట్టెలు చేసి వెంట తీసుకువెళ్ళి. అక్కడ ఆ రొట్టెల్ని ప్రసాదం చేయించుకుని తెచ్చేవాడిని. "వచ్చేటప్పుడు రొట్టెల ప్రసాదం తెస్తావు" అనేవారు కొందరు. అన్నిటికంటే పెద్ద ప్రశ్న రొట్టెలదే! నేను పేదవాడిని. ఆకలిగొన్నాను. రొట్టె కోరుకుంటాను.

"నహిఁ దారిద్ర సమ దారుణ దుఃఖ భాయీ"

పెద్ద పెద్ద సంతులు, గురువులు బంగారు కర కంకణాలు, ఉంగరాలు, హారాలు ధరిస్తారు. పేదల స్థితి ఏమిటో వారికేం తెలుసు? హుజూర్ మహారాజ్ పోస్ట్ మాస్టర్ జనరల్‌గా ఉండేవారు. ఆయనకు దుఃఖితుల బాధలేం తెలుసు? పేదరికం గురించేం తెలుసు? ఓ మనిషీ! ఎప్పటివరకు బలం ఉందో పనిచేయి. వృద్ధాప్యంలో దాతా దయాల్ గీదడ్ బాహ వచ్చారు. ఆయనకు కడుపులో నొప్పి బాధించేది. మేం వెచ్చగా కాపడం పెడుతున్నాం. తెల్లవారు ఝాము ఐదు గంటల వేళ దీపం వెలిగించమన్నారు. "రాత్రంతా కడుపు నొప్పితో బాధపడ్డారు. ఇప్పుడు విశ్రాంతి తీసుకొనండి" అన్నాను. "ఫకీర్! నిన్నెవరు ఫకీర్‌ను చేశారయ్యా! ఐదు నిమిషాల తరువాత మరణించబోతున్నానని నాకు ముందుగా తెలిస్తే చివరి మూడు నిమిషాల వరకు పనిచేస్తూనే ఉంటాను" అన్నారాయన. వృద్ధులు, వృద్ధురాళ్ళు ఎందరో వచ్చారు. మీరంతా

వృధాగా ఉండకండి. పనిచేయండి. దాతా దయాల్ జీ సునామ్‌కు వచ్చారు. నేనాయనతో, "నా తండ్రి వృద్ధుడు. ఇంట్లో అస్వస్థుడై ఉంటాడు. ఆయనకోసం ఏమైనా చెప్పండి" అన్నాను. ఐదు నిమిషాలు కళ్ళు మూసుకుని "మీ నాన్నగారికి ఉత్తరం రాయి. బతికి ఉన్నంతవరకు ఏదో ఒక పని చేస్తూ ఉండమని" అన్నారు. జీవితం తపస్సు చేసుకోవడానికి కాదు. పనిచేయడానికి! తన వాళ్ళని సేవించని వారు మూర్ఖులు, నాకు సేవలవసరం లేదు. నా భావాలు, ఆలోచనా విచారాలు, ప్రవచనాలు ప్రచారం అవుతుండాలి. పిల్లాపాపలను పెంచండి. సామాన్యమైన జీవితం గడపండి. ప్రస్తుత కాలంలో స్టాండర్డ్ పెంచమనే మాటలు వినిపిస్తున్నాయి. స్టాండర్డ్ ఎంత కావాలంటే అంత పెంచుకో. ఏదో ఒక లోపం కనిపిస్తూ ఉంటుంది. సంతోషం ఉండదు. స్టాండర్డ్ ముగిసిపోదు. చూడు. ఎలాంటెలాంటి ఇళ్ళు కడుతున్నారు. ఎటువంటి బట్టలు తయారవుతున్నాయో? నీవు మూడువందల రూపాయల చీర కట్టకు. యాభై రూపాయల చీర కట్టుకో. ఆ పైసలు మిగిల్చి ఒళ్ళు దాచుకునేందుకు బట్టలు లేనివారికి కొనివ్వు. నాకు సేవ చేయమని నేనను. నీ సంతానాన్ని మంచివారిగా తీర్చిదిద్దు. చెడు స్నేహాల నుండి వారిని తప్పించు. ఎలా కాపాడతావు? నువ్వే మాత్రం మెరుగయ్యావని? క్షమించు - మరిచిపో అనే సూత్రాన్ని పాటించు. చాలు!

*అందరికీ రాధాస్వామి*

# సత్సంగం

## 21–10–1973

# సంత్‌మతం అసలైన శిక్షణ

రాధాస్వామి!

ఓ సర్వాధార సర్వేశ్వరా! నన్ను రూపొందించిన వాడా! సమస్తప్రపంచాన్ని తయారు చేసినవాడా! సృష్టికి ఆధారమైనవాడా! చిన్ననాటి నుండీ నిన్ను విశ్వసించాను. ఒకసారి ఒకరూపంలో, మరోసారి మరోరూపంలో నిన్ను నమ్మాను. దైవేచ్ఛ లేక నా కర్మ ఈ అన్వేషణ నన్ను ఇటు దాతా దయాల్ మహర్షి శివవ్రత్‌లాల్ జీ మహారాజ్ చరణాలలోనికి తీసుకువెళ్ళింది. ఇది 1905 నాటి సంఘటన. ఆయన నాకు రాధాస్వామి మతం లేదా సంత్‌మతం లేదా కబీర్ మత సంబంధిత విచారాల నిచ్చి నన్ను గురుమతంలోకి మళ్ళించాడు. సమస్త ఆయువు ఈ గురుమతంలో గడిచిపోయింది. హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ గురుమతం రహస్యం చెప్పడం కోసం నాకు ఈ పని ఇచ్చాడు. "ఫకీర్! శరీరాన్ని త్యజించే ముందు బోధనా పద్ధతిని మార్చు"మని ఆయన నన్నాజ్ఞాపించాడు. నేనేం చేశానో నాకు తెలీదు కానీ నా అనుభవాలను వివరించాను. దసరాకు ఈ సారి ఢిల్లీకి వెళ్ళాను. అక్కడ నా సత్సంగానికి సంత్ కృపాల్ సింగ్ జీ, జైనముని సుశీల్ కుమార్, ఇంకా ఇతర మహాపురుషులు ఇద్దరు ముగ్గురు వచ్చారు. అక్కడ సత్సంగంలో నేను చాలా చెప్పాను. తరువాత గుప్తాగారి ఇంట్లో వసంతవిహార్‌లో ఒక సత్సంగం ఇచ్చాను. అక్కడ హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్ రాసిన ఈ కింది శబ్ద్ పై సత్సంగం జరిగింది.

గురుహుయే సంసార్ మే పర్‌గట్, గురు సే జ్ఞాన్ లే ॥

"ఫకీర్! నీ పుస్తకాల్లో, సత్సంగాల్లో నిన్ను నీవు సంత్ సద్గురువక్త్ అంటావు. నీవు సత్‌గురువు కర్తవ్యం పూర్తిచేస్తున్నావా?" అని నన్ను నేను

ప్రశ్నించాను. నా ఆత్మ అవునని చెబుతుంది. తప్పో ఒప్పో నాకు తెలీదు కానీ నా ఆలోచనా, నా నడవడి పవిత్రంగా ఉన్నాయి. సరైనదిగా ఉన్నాయి. మీరొచ్చారు. మీకు చెప్పాలనుకుంటున్నాను. నేను చెప్పేదానిని లోకులు శ్రద్ధగా వినరు, పట్టించుకోరు.

ధ్యాన్ తక్ కర్‌తా నహీం హై, కోయీ మేరీ బాత్ కా ।
క్యా కహూం హై భేద్ ఉన్ మే, ముర్ఖు మే దిన్ కా రాత్ కా ॥

ఇది హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ శబ్ద్ వినడానికి లోకం తయారుగా లేకున్నా ప్రపంచానికి ఏం చెప్పాలనుకున్నాడో అది ఆయనకే తెలుసు. నేను నా కర్మ యోగవశాన చెప్పదలచుకుంటున్నది ఏమిటి? "ఓ మనిషీ! నీకు లభిస్తున్నదంతా నీ కర్మ, నీ విశ్వాసం, నీ శ్రద్ధ, నీ నడవడి, ప్రవర్తనకు ఫలితమేనని చెబుతున్నాను. రాముడు, కృష్ణుడు, దేవీ దేవతల దయతో ఇవన్నీ లభిస్తాయనుకుంటుంది ప్రపంచం. రామచంద్రుడు దయచూపాడని ఒకరు, కృష్ణుడు కరుణించాడని మరొకరు, దేవి కృప చూపిందని వేరొకరు ఇలా అంటుంటారు. కానీ నా అనుభవంలోకి వచ్చిన అంశం ఏమిటంటే అది మన విశ్వాసం, శ్రద్ధ, కర్మ, నడవడి ననుసరించి లభిస్తాయి. దీనికి ఋజువు చూపుతాను. సుబేదార్ హజారీ సింహకు సైన్యంలో ఉద్యోగం ఉంది. అతని ఉత్తరం వచ్చింది. మీకు వినిపిస్తాను.

పరమ పురుష పూర్ణ ధని పూజ్య సతగురుజీ మహారాజ్‌కు దాసుని రాధాస్వామి.

నెలపైన మూడు వారాల తర్వాత తమకు నేనీ ఉత్తరం రాస్తున్నాను. నేను ఏడు నెలల నుండి త్రివేంద్రమ్‌లో ఉన్నాను. నేను, నా మిత్రులు ధనుష్కోటిలో విహరించాలనుకున్నాం. మా ఆఫీసర్‌తో నేనీ విషయం చెబితే ఆయన మా అందరికోసం రెండు వ్యాగన్‌లు మంజూరు చేశారు. 1973 ఆగష్టు 12వ తేదీ ఉదయం ఐదు గంటలకు మేం మా కుటుంబాలతో సహా బయల్దేరాం. వెళ్ళేటప్పుడు నా అంతరంలో ధ్వని వినిపించింది. నేడు మేం ధనుష్కోటికి వెళ్ళమని - చేరుకోలేమని!

దారిలో డ్రైవర్ బండి నడిపిస్తూ వెనుకవైపు కూర్చుని ఉన్న స్త్రీల వైపు

చూడసాగాడు. ఇది చూశాక ఇతడెక్కడ దుర్ఘటన చేస్తాడోనని నాకు మరింత భయం కలిగింది. బయల్దేరకముందు నేను ఇద్దరు డ్రైవర్లకూ చెప్పాను వాహనాలు మెల్లగా నడిపించమని. నేను రెండు, మూడు సార్లు వెనుక వాహనం డ్రైవరు వెనుకవైపు చూస్తుంటే చూసి మిమ్మల్ని ప్రార్థించాను. మీరు నా అంతరంలో ప్రకటమై "ముందుకు చూడు! నేనందరినీ రక్షిస్తాను" అన్నారు. ఇంతలో నా వాహనం డ్రైవర్ సంతులనం - ఏకాగ్రత - దెబ్బ తిని వాహనం పడిపోయింది. అది బోర్లాపడటం నేను చూశాను. నాలుగు పల్టీలు కొట్టి కిందపొలంలో పడిపోయింది. మా పిల్లవాడిపైన నేను, నాపైన వాహనం ఉంది. పొలమంతా బురదగాఉంది. వెనకున్న వాహనంలోని వాళ్ళంతా ఈ స్థితి చూసి ఒక్కరు కూడా ప్రాణాలతో మిగలరని అనుకున్నారట. వాళ్ళు కిందికి చేన్లోకి వచ్చారు. వాహనం కిందినుండి నన్ను, నా కొడుకును వెలికితీశారు. వాహనం కింద ఇంకా ఇద్దరూ ప్రయాణికులున్నారు. వారినీ తీశారు. మిగిలిన ఇతర ప్రయాణీకులంతా వాహనంలోనే ఉన్నారు. వారినీ తీశారు. అందరూ మిలిట్రీ హెడ్ క్వార్టర్ నుండి అంబులెన్స్ తెప్పించాలని ఆలోచిస్తున్నారు. అంతలో కార్లు వచ్చాయి. వాటిలో అందర్నీ దగ్గరిలోని ఆసుపత్రికి తీసుకువెళ్ళటం జరిగింది. నాకు స్పృహ వచ్చాక తెలిసింది నా నాలుగు పక్కటెముకలు దెబ్బతిన్నాయని, నా నడుముకు తీవ్రంగా గాయమైందనీ! కానీ ఈ దుర్ఘటనలో ఎవరూ మృతి చెందలేదు.

నాకు బాగా నొప్పిగా ఉంది. రోజంతా అశాంతిగా ఉన్నాను. రాత్రికి మీరొచ్చారు. నా నడుమును, పక్కటెముకల భాగంలో వత్తసాగారు. ఆ క్షణంలోనే నాకు 50 శాతం నెమ్మదించింది. నొప్పి తగ్గింది. ఇంకా నొక్కండి అన్నాను నేను. "ఇతర రోగులు మేల్కొంటారు. నువ్వు కూడా ఇకపడుకో. నీకు తగ్గిపోతుంది." అని మీరన్నారు. ఆ సమయంలో నా భార్య మా ఇంట్లో మూడో అంతస్థులో ఒక రూపాయి ప్రసాదం వుంచి మీ ఫోటో ఎదుట నా ఆరోగ్యం బాగుపడాలని ప్రార్థిస్తోంది. నా అశాంతి కారణంగా ఆమె కూడా అశాంతితో బాధపడుతోంది. ఇంటి తలుపులన్నీ మూసి ఉన్నాయి. గదిలోకి రావడానికి దారే లేదు. మీరు మూడో అంతస్థులోని ఒక కిటికీ ద్వారా వచ్చారని ఆమె మర్నాడు నాతో చెప్పింది. ఆ కిటికీ తెరిచి ఉంది. వస్తూనే

మీరామెతో, "నేను నీ భర్త దగ్గరి నుండే వస్తున్నాను. త్వరలో కోలుకుంటావని, గాభరపడకుమని అతడికి చెప్పాను" అని. చెప్పారట. మహారాజ్ ఇంత వార్థక్యంలో కిటికీ ద్వారా వచ్చారని ఆమె అంది. ఇప్పుడు నాకు 75 శాతం తగ్గింది" అని రాశాడతడు.

ఇదీ సంఘటన. నాతో జరిగినట్లున్న ఇలాంటి సంఘటనలు నాకు చాలామందే చెబుతుంటారు. అతడు ఇంకా ఉత్తరం రాస్తూ "మా అబ్బాయి మధురకు దగ్గర్లో ఒక ఊళ్ళో మా నాన్నగారిదగ్గర ఉండేవాడు. అక్కడ అతడికి అమ్మవారయింది. ఆ విషయం వరుసగా మూడు రోజుల పాటు నా భార్య స్వప్నంలో వచ్చింది. నువ్వు కానీ, నాన్నగారు కానీ వచ్చి నన్ను తీసుకువెళ్ళండి అని మా అబ్బాయి చెప్పసాగాడు. నేను మా నాన్నగారికీ విషయం గురించి ఉత్తరం రాశాను. కానీ ఆయన కుర్రవాణ్ణి నా దగ్గరికి పంపించలేదు. అప్పుడొక రోజు నేను టాక్సీ తీసుకుని అబ్బాయిని తీసుకు రావడానికి వెళ్ళాను. దారిలో నాకు కొంచెం నిద్ర రాసాగింది. "మీరు ఆలస్యం చేశారని" పిల్లవాడు నాకు అంతరంలో కనిపించి చెప్పాడు. "అంతే కాదు. మీరు త్వరగా వస్తే కనీసం నా శవం దగ్గర కూర్చుని గురువుగారిని జ్ఞాపకం చేసుకుంటే బహుశా నేను పునర్జీవితుడనయ్యేవాడినే. ఇక ఇప్పుడు నేను మిమ్మల్ని కలవజాలను" అన్నాడు. ఇలాగే జరిగింది. నేను ఇల్లు చేరే సరికి వాడిని పాతిపెట్టేశారు.

ఇప్పుడు నేను మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను - ఆ నా పిల్లవాడు నాకు మళ్ళీ తిరిగి లభిస్తాడా? రెండవ విషయం ఏమిటంటే మీరు సదా నాతో ఉంటే మరి నా సాధన, అభ్యాసం ఎందుకు బాగా జరగటంలేదు? మూడవ విషయం - దుర్ఘటనలో మీరు అందరినీ కాపాడతానన్నారు. మరి నేను ఒకడినే గాయపడ్డాను ఎందుకు?

పదిపేజీల ఉత్తరం అది. అతడు ఇంకా చాలా రాశాడు. మీరీ ఉత్తరం విన్నారు. ఓ భారత వాసులారా! నేను ప్రమాణ పూర్తిగా చెబుతున్నాను. నేను అతని అంతరంలోకి వెళ్ళలేదు. ఆ సంఘటన గురించి నాకు ఏ మాత్రం తెలియదు. నన్ను నేను సంత్ సద్గురు వక్తనని చెబుతాను. నేను సంత్ సద్గురు వక్తనే. సత్‌గురువు అంటే సత్యమైన జ్ఞానం, సత్యమైన తెలివి, సత్యమైన

రహస్యం పేరే సత్‌గురువు. అది నేనిస్తాను. రాధాస్వామి మతం వాణిలో రాసి ఉంది.

గురునే దీనా భేద్ అగమ్ కా - సురత్ చలీ తజ్ దేశ్ భరమ్ కా।
బల్ పాయా అబ్ విరహ మరమ్ కా - భటకన్ ఛూటా దైరో హరమ్ కా॥

బోధనా సరళిన్ని మార్చవలసిన బాధ్యత నాపై ఉంది గనుక నా అనుభవాలు చెబుతుంటాను. మరొక సంఘటన వినండి. అలీగఢ్‌లో నా సత్సంగానికి రణజీత్ సింహ అనే స్కూలు మాస్టరు వచ్చాడు. ఆయన కృషక్ జీ తో నామం తీసుకున్నాడు. నన్ను ధ్యానిస్తాడు. బి.ఏ. పరీక్ష ఇవ్వడానికి ఫారం నింపి ఇవ్వాల్సి ఉంది, కానీ అతడు మరిచిపోయాడు. నింపిన ఫారం ఇవ్వాల్సిన చివరి తేది రోజు జ్ఞాపకం వచ్చింది. కాని ఆ సమయంలో అతడు ఇరవై కిలోమీటర్ల దూరంలోని తన పొలాలకు నీళ్ళు పెడుతున్నాడు. సమయానికి చేరుకోవటం అసంభవం. అందుకే అతనికి చాలా దుఃఖం కలిగింది. అతడన్నాడు. "బాబాజీ! అప్పుడు నేను చాలా సేపు ఏడ్చాను. మిమ్మల్ని జ్ఞాపకం చేసుకున్నాను. మర్నాడు ఆ యూనివర్సిటీకి బహుశా ఫారం ఈ రోజు తీసుకుంటారేమోననే ఆశతో వెళ్ళాను. కానీ అక్కడ నేను అంతకు ముందే ఫారం దాఖలు చేసినట్లు రసీదు నాకిచ్చారు. "నిన్న నీవు నీ ఫారం ఇచ్చి, ఫీజుకట్టేశావు కదా" అన్నారు. మహారాజ్! మీరు నా రూపం ధరించి ఇదంతా చేశారు. నేను మీకు ధన్యవాదాలు చెబుతున్నాను. మీకు కృతజ్ఞుణ్ణి" అన్నాడు.

"చూడు! నీవు అబద్ధం చెబితే కుష్ఠురోగివై మరణిస్తావు" అన్నాను

"ఈ ఘటన సత్యం మహారాజ్" అన్నాడతడు.

ఇప్పుడు నేను నా ఆత్మను ప్రశ్నిస్తాను, "ఏం ఫకీర్! నీవు సుబేదారు హజారీ సింహ, రణజీత్ సింహలకు సహాయం చేయడానికి వెళ్ళావా?" అని. నేను వెళ్ళలేదని నేనంటున్నాను. నాకా విషయాలేవీ తెలియవు. మరి అలా నా రూపంలో వెళ్ళిందెవరు? అందుకే నేను చెబుతుంటాను ఎవరికి ఏది లభించినా అది వారి కర్మ, శ్రద్ధ, విశ్వాసం, నడవడి, ప్రవర్తనల ఫలితమే లభిస్తుంది. మనం విశ్వసిస్తాం. కానీ ఎప్పుడు? కష్టం వచ్చినప్పుడు. ఏ వ్యక్తి సర్వేశ్వరుని లేదా సత్‌గురువును నిష్కామభావంతో జ్ఞాపకం చేస్తాడో, ధ్యానం చేస్తాడో

వారికి సహాయం సదా లభిస్తుంటుంది. రణజీత్ సింహ ఐదేళ్ళనుండి అభ్యాసం చేస్తున్నాడు. 'అన్నయ్య అభ్యాసం చేసినప్పుడు అచ్చం మీలాగే మాట్లాడతాడు' అని అతని తమ్ముడు నాతో చెప్పాడు. కానీ నేనెక్కడికీ వెళ్ళను.

"ఏం నీవు సంత్ సద్గురువువా?" అని. నన్ను నేను ప్రశ్నించుకుంటాను. ఔను! ఎందుకంటే నేను ప్రపంచానికి, మహాత్ములకు, గురువులకు సత్ జ్ఞానం ఇస్తాను. అందుకే నేను సంత్ సద్గురువును. మీరొస్తారు. నా బాధ్యత నాకు తెలుస్తుంది. మీకు చెప్పదల్చుకుంటున్నాను. ఏ వ్యక్తి సత్యమైన హృదయంతో తన ఇష్టుణ్ణి తలచుకుంటాడో ఆ ఇష్టుని పైన సంపూర్ణ విశ్వాసం ఉండాలి. అతని గురువు రాముడైనా, కృష్ణుడైనా, దేవీ అయినా, దేవత అయినా లేదా ఇతర మూర్తి అయినా ఎవరైనా సరే వారిపై విశ్వాసం దృఢంగా ఉండటం అవసరం. అతనికి ఏదైనా కష్టం కలిగినప్పుడు అతని విశ్వాస శక్తి ఏదో ఒక రీతిలో అతనికి అవశ్యం సహాయం చేస్తుంది. కానీ అనుభవించక తప్పని కర్మలు కొన్ని ఉంటాయి. వీటికి సాక్ష్యం చూపుతాను.

హుజూర్ బాబాసావన్‌సింహ జీ మహారాజ్ కాలు విరిగింది. ఆయన గురువు హుజూర్ బాబా జైమల్‌సింహ జీ మహారాజ్ మహాపురుషుడు. మరి ఆయన హుజూర్ బాబాసావన్‌సింహజీ మహారాజ్ గారిని కాపాడాడా? ఆయన కొడుకును మృత్యువు నుండి తప్పించగలిగేడా? నా సద్గురు మహారాజ్ నా కొడుకు మృత్యువును ఆపగలిగాడా? నేను కూడా ఆయన్ని హద్దుల్లేనంతగా విశ్వసించాను. పల్టూ సాహబ్‌ను జీవించి ఉండగానే మరిగే నూనెలో పడవేశారు. ఆయనకు ఇష్టుడు లేడా! అందుకే హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ శలవిస్తున్నాడు.

ధ్యాన్ తక్ కర్తా నహీఁ హైఁ, కోయీ మేరీ బాత్ కా,
క్యా కహూఁ హై భేద్ ఉన్ మే, ముఝ్ మే, దిన్ కా రాత్ కా ॥

హుజూర్ దాతాదయాల్‌మహారాజ్ ఏం చెప్పదలచుకున్నాడో అది ఆయనకే తెలిసి ఉంటుంది. నేను ఆయన రచనల ద్వారా నా బుద్ధిని అనుసరించి ఏం అర్థం చేసుకున్నానో అది చెప్తాను. ఇవాళ్టి వరకు సంతులు గుప్తంగా ఉంచిన రహస్యాన్ని, లేదా వారు లోకానికి సైగల్లో చెప్పినదానిని విడమరిచి విశదముగా

చెప్పాను. సుఖశాంతులు కోరేవ్యక్తి ఈ మాటను అర్థం చేసుకుని లాభం పొందాలి. మనిషి కర్మలు అనేకం అనుభవించి తీరవలసినవి ఉంటాయి. అతడు సంతైనా కానీ, పరమ సంతైనా కానీ, అవతారమైనా కానీ! ఎవరైనా అనుభవించవలసిందే! శ్రద్ధా, విశ్వాసాలు బలంగా ఉంటే బాధల భారం కొద్దిగా తగ్గుతుంది.

మరొక దుఃఖధాయకమైన, శిక్షణా ప్రదమైన సంఘటనను వినండి. గతవారం ఒక యువకుని నుండి ఉత్తరం వచ్చింది. అతడంటాడు. "బాబాజీ! మీ పుస్తకాలు చదువుతుంటాను. మీ ఫోటోను దర్శనం చేసుకుంటాను. మీ ఫోటో ఉన్న లాకెట్ నా మెడలో ఉంది. బాబాజీ! నేను ఘోర పాపం చేశాను. దీని నుండి రక్షింపబడే ఉపాయం ఏదైనా చెప్పండి." అతనికి తన తల్లి ప్రవర్తనపై సందేహం ఉండేది. అందుకే బాధపడేవాడు. తల్లిపై ఎల్లవేళలా క్రోధాన్నే వెళ్ళగక్కేవాడు. అతని తల్లి నేర్పరి. ఆమె తన కొడుకును అదుపు చేసేటందుకు తాడు విసిరి సఫలం చెందింది.

ఇప్పుడు నేను ఆలోచిస్తుంటాను. గురువుల ఫోటోను దగ్గర ఉంచుకునేవారు, మెడలో లాకెట్ ధరించేవారు, ఆయన పుస్తకాల్ని చదివేవారు ప్రారబ్ధకర్మలనుండి తప్పించుకోగలుగుతారా? ఆలోచించండి! నేనేం చెబుతున్నానో! నేను అనామీ ధామం నుండి ఫకీర్ దేహంలో ప్రపంచానికి సత్య జ్ఞానమివ్వడానికి వచ్చాను.

వందనమ్ సత్ జ్ఞాన దాతా వందనమ్ సత్ జ్ఞాన మయ్ ।
వందనమ్ నిర్వాణ దాతా, వందనమ్ నిర్వాణ మయ్ ॥

నా వద్దనుండి లేదా ఇతర గురువుల నుండి లాభాన్ని ఎవరు పొందగలుగుతారు? సత్యమైన సేవకులు, గురువు ఆజ్ఞను పాటించేవారు, బలిదానమిచ్చే వారే లాభపడతారు కానీ మీరేం అనుకుంటారు? గురువుకు పూలదండవేసి, రూపాయలిస్తే సేవకులమవుతామనుకుంటారు. గురువు ఆజ్ఞను పాటించే వారే సేవకులు. మూడు, నాలుగు సంవత్సరాల నుండి రూప్‌లాల్ వ్యాధిగ్రస్థుడై మందిరంలో ఉంటున్నాడు. అతడు నడిచి తిరగజాలడు. చికిత్సకై నేనతణ్ణి ఢిల్లీ హాస్పిటల్‌కు పంపాను. అక్కడ ఐదు నెలలు గడిచాయి.

ఖర్చంతా మందిరం భరిస్తుంది. అతని వెంట అతణ్ణి చూసుకోవడానికి భూప్ సింహను పంపించాను. ఈ భూప్ సింహ పది, పన్నెండేళ్ళ క్రితం ఏదో కారణంతో దుఃఖితుడై ఆత్మహత్య చేసుకోబోగా అతని లోపల నా రూపం ప్రకటమై "మేలుకో! మేలుకో! మేలుకో! నువ్వు మేల్కొనే సమయం ఇప్పుడొచ్చింది" అందట. అతడు ఆత్మహత్య చేసుకోవటం ఆపేశాడు. ఇప్పుడు సర్వీస్ ముగిసి పెన్షన్ లభిస్తోంది. నా దగ్గర ఉంటున్నాడు. ఇటీవల నేను ఢిల్లీకి దసరా సత్సంగానికి వెళ్ళినప్పుడు "ఈ నాలుగైదు నెలలు ఒక రకమైన జైల్లో గడిపాను" అని భూప్ సింహ నాతో అన్నాడు.

"నీ మనసులో ఈ విచారం రాకుంటే నీవు ఎక్కడికి చేరేవాడివో తెలీదు. నీవు రూప్‌లాల్‌ను సేవించావు. కానీ మనసులో బాధపడ్డావు. ఇక నీకు ఏం లభిస్తుంది? హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్ నా పేరిట శబ్దం రాశారు.

**తూతో ఆయా నర్ దేహీ మే, ధర్ ఫకీర్ కా భేసా ।**
**దుఃఖీ జీవ్ కో అంగ లగాకర్ లేజా గురు కే దేశా ॥**

**తీన్ తాపసే జీన దుఃఖీ హై, నిబల్ అబల్ అజ్ఞానీ ।**
**తేరా కామ్ దయా కా భాయీ నామ దాన్ దే దానీ ॥**

నేను పలికే వాక్కే నేనిచ్చే నామదానం.

**తేరా రూప హై అద్భుత్, అచరజ్ తేరీ ఉత్తమ దేహీ ।**
**జగ కల్యాణ జగత్ మే ఆయా, పరమ దయాల్ సనేహీ ॥**

నేను నా విధిని, నా కర్తవ్యాన్ని పూర్తిచేసి పోవాలనుకుంటున్నాను. దుర్గాదాసుకు మేలు జరగనీ. అతడు 22,000 రూపాయలిచ్చి ఈ మానవతా మందిరానికి పునాది వేశాడు. జ్ఞాన సూర్యుని ఉదయింప చేసేటందుకు నేనీ మందిరం కట్టించాను. ఎవరి అదృష్టంలో ఉంటే వారు లాభపడతారు. ఇవాళ రేపటి గురువుల, శిష్యుల స్థితి ఎలా ఉంది? నా స్థితి ఎలా ఉంది? ఇదంతా మీరు చూస్తూనే ఉన్నారు.

ఇపుడాలోచించండి. నేను చెప్పినదంతా తెలుసా? నేను మీకు బోధించిన

విషయం రహస్యం ఎవరికైనా తెలుసా? ధన్యగురు ధన్యగురు అనటమే మీకు తెలుసు. దీనితో మీ నావ నది నుండి దాటి పోదు. ఎవరైనా యోగ్యుని సత్సంగంలోకి వెళ్ళి ఆయన ప్రవచనాలను విని, ఆలోచించు, అర్థంచేసుకో. తరువాత వాటి ద్వారా నీ జీవనాన్ని క్రియాత్మక రూపంలోకి తీసుకురా!

ఏక్ జన్మ గురు భక్తి కర్, జన్మ దూసరే నామ్ ।
జన్మ తీసరే ముక్తి పద్, చౌథే మే నిజ ధామ్ ॥

కొన్నాళ్ళు సత్సంగం చేసి రహస్యాన్ని అర్థం చేసుకో. బాహ్య గురువు కర్తవ్యమేమిటంటే అతడు నీకు తన మాటలపై పూర్ణవిశ్వాసం కలిగించాలి. ఇదే సత్‌గురువు దయ. మిగతాదంతా నీవు దేనినైతే సద్గురువు దయ అనుకుంటున్నావో - ఇది నీకు లభించింది. గురువు అదిచ్చాడు, ఇదిచ్చాడు అని చెబుతావు. ఇదంతా నీ ప్రారబ్ధ కర్మ లేదా నీ ప్రవర్తనా ఫలమే! నేనిలా స్పష్టంగా చెబుతున్నందుకు నాకెవరూ పైసలివ్వరని నాకు తెలుసు. నాకు శిష్యులు కారు. నా ఆశ్రమం నిర్మాణం కాదు.

సాంచే కా కోయీ గాహక్ నాహీం, ఝూటే జగ్ పతి యాయ్ ।
గలీ గలీ గోరస్ ఫిరే, మదిరా బైఠ్ బికాయ్ ॥

సత్యమైన వ్యక్తిని ఎవరూ ఆదరించరు. అబద్ధాల వ్యక్తిని అందరూ ఇష్టపడతారు అని చెబుతున్నాడు కబీర్ సాహబ్. ప్రపంచంలో పెద్ద పెద్ద ఆడంబరాలు కన్పిస్తుంటాయి. నిన్న దుర్గాదాసు ట్రిబ్యూనల్ పేపర్ లోనిదో కట్టింగ్ తెచ్చాడు. అందులో శ్రీ గుల్జారీలాల్‌జీ నందా రాశారు. తను భ్రష్టాచారానికి, లంచగొండితనానికి వ్యతిరేకంగా "మానవధర్మ"మనే సంస్థను నడిపించాలనుకుంటున్నానన్నారు. నేను కూడా మానవ ధర్మం నడిపించాను. "మనిషివి కమ్ము" అనే నినాదమిచ్చాను. ప్రపంచం సరైన దారిలోకి వచ్చిందా? నేనాయనకో ఉత్తరం రాశాను. ధర్మహీనుడైన వ్యక్తి ధర్మమూర్తిగా మారగలుగుతాడా అని ఉత్తరం రాశాను. ఇలా ఎందుకు రాశాను? ఎవరికి ఏం లభించినా అది వారివారి కర్మలు, ఆచరణలవల్లనే లభిస్తాయని మీకు ఉదాహరణలిచ్చి మరీ చెప్పాను. ఒక వ్యక్తి బాబా ఫకీర్ చెప్పిన విషయాలను ఆచరణలో పెట్టడు. అతడు మనిషి కాగలుగుతాడా? మరేమవుతాడు? రాముడు,

మహమ్మద్‌ల పేరిట హిందూ, ముస్లిములు పరస్పరం కలహిస్తుంటారు. ఒకరి నొకరు చంపుకుంటున్నారు. హిందుస్తాన్, పాకిస్తాన్ లమధ్య యుద్ధం ఎందుకు జరిగింది? అరబ్, ఇజ్రయిల్‌ల మధ్య యుద్ధం ఎందుకు జరుగుతున్నది? హిందువులు, సిక్కులు పరస్పరం ఎందుకు పోట్లాడుతుంటారు? ఆలోచించండి.

శ్రీ గుల్జారీలాల్ నందాగారు భ్రష్టాచారానికి విరుద్ధంగా 'మానవధర్మ' మిషన్ నడిపించాలని సంకల్పించటం పూర్తిగా సరైనదే! కురుక్షేత్రంలో హోలీటాంక్ - పవిత్ర సరోవరాన్ని నిర్మించనున్నారని విన్నాను. దానికి అనేక రూపాయలు ఖర్చై ఉంటాయి. ఆ సరోవరంలో స్నానం చేయటం వలన ఎవరి పాపాలైనా తొలగిపోయి శుద్ధి అయితే, ఎవరైనా పూర్తిగా మనుషులు కాగలిగితే ఆ సరోవర నిర్మాణానికి ఖర్చుపెట్టిన డబ్బు మంచిపనికి వినియోగింపబడిందను కోవచ్చు. కానీ అక్కడ స్నానం చేసినా లాభమేమీ లేకుంటే నిర్మాణానికి ఖర్చుపెట్టిన ప్రజల డబ్బు వృథాయే అయిందని నా భావన.

నా ఈ ఆలోచనా విచారాలను అంతటా ప్రచారం చేయాలని కోరుకుంటున్నాను. బుద్ధిమంతులు ఆలోచించాలి. ఈ మతాలవారు, ధర్మాలవారు మనలను ఎటువైపు తీసుకువెళ్తున్నారు? కలహాలకు మూలమేమిటి? విరుద్ధ విచారధార, వాస్తవికత తెలుసుకోకుండా ఉండటమే దీనికి కారణం. ఇవన్నీ ఆలోచించాలి. ఒక ముసల్మాను మందిరానికి హాని కలిగిస్తాడు. కూలదోస్తాడు. ఒక హిందువు మసీదును పడగొడతాడు. లేదా అనాదరిస్తాడు. మరి దీని పరిణామం ఏమిటి? పరస్పర జగడాలు, రక్తపాతాలు! రామాయణం, పురాణం లేదా మరో పవిత్రగ్రంథాన్ని అవమానిస్తే ఎలాంటి పరిణామం ఎదురవుతుంది? రక్తపాతం! స్నేహభావన, ప్రేమగుణం కలిగినవారే మానవులు. అందుకే ద్వేషాలతో రక్తపాతాలకు సిద్ధపడేవారెవరూ మనుషులు కారు. వారికి నియమం లేదు. తమ ఇష్టమైన రీతిలో ప్రవర్తిస్తారు. ఇక వారు మనుషులెలా అవుతారు? నేను మీకు సత్సంగం చేయిస్తున్నాను. మీరు బుద్ధి జీవులైతే నా మాటలను అర్థం చేసుకొనండి. హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ నిజం చెప్పారు.

ధ్యాన్ తక్ కర్తా నహీఁ హై, కోయీ మేరే బాత్ కా ।

హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ ప్రపంచానికి ఏం చెప్పదలచు కుంటున్నారు? ఇది ఆయనకే తెలిసి ఉండొచ్చు. దీని గురించి ఎవరూ ఆలోచించరు. భగవంతుడు మందిరాలలో, మసీదులలో, గురుద్వారాలలో లేడు. మీలోనే ఉన్నాడని ఈనాటివరకు సంతులంతా చెప్పారు. నేను వర్తమాన సంత్ సద్గురువును. భగవంతునిలో మనం ఉంటామని నా పరిశోధన చెబుతోంది. దీనిని బలపరుస్తోంది స్వామీజీ మహారాజ్ వాణి.

**జల్ విచ్ మీన్ ప్యాసీ, మోహే సున్ సున్ ఆవే హాఁసీ ॥**

చేప నీళ్ళలో ఉంటూ నీటికై తపించి వెదికినట్లే మనం కూడా భగవంతునిలో ఉంటూ ఆయన్ని వెదుకుతుంటాం. మీ పరిశోధన గత సంతులకంటే ముందుకు ఉందా అని మీరడగవచ్చు! వినండి.

నేనొక సారి హోషియార్‌పూర్ జిల్లా పరిధిలోని సింహపూర్‌కు వెళ్ళాను. అక్కడ నా సత్సంగానికి ఒక డాక్టర్ వచ్చాడు. ఆయన బాబా జగత్ సింహ మహారాజ్ శిష్యుడట. నా సత్సంగం విన్న తర్వాత ఆ డాక్టర్ నా దగ్గరికి వచ్చి, "మహారాజ్! ఇక పైన రానున్న సంతులు దీనికంటే ముందరి మార్గం చెబుతారు అని అన్నాడు మా గురువుగారు. అది నిజమని మీ మాటలు రుజువు చేశాయి" అన్నాడు. సంత్ సద్గురువు శిక్షణ, బోధన సదా సమయానుసారం, అవసరాన్ని బట్టి ఉంటుంది.

నా కోడలు ప్రసూతికై ఆసుపత్రికి వెళ్ళింది. తల్లివెంట 3 1/2 సంవత్సరాల కూతురు కూడా వెళ్ళిచూసింది. రాత్రికి పిల్లవాడు పుట్టాడు. మర్నాడు మా అబ్బాయి ఆ పాపను తీసుకుని ఆసుపత్రికి వెళ్ళాడు. ఆ పాప నవజాత శిశువును చూసి చాలా సంతోషించి, "మమ్మీ! వీడెక్కడి నుండి వచ్చాడు" అని తల్లిని అడిగిందట. చిన్న పిల్ల కనుక వాస్తవం అర్థం చేసుకోజాలదు. తల్లి హోషియార్‌పూర్ నుంచి బాబాజీ పార్సిల్ చేసి పంపించాడని చెప్పిందట.

ఇప్పుడు బుద్ధి పెరిగింది. కనుక సమయానుసారం బోధనలో పరివర్తన రాక తప్పదు. కాలం మారుతున్నది. సత్యుగం తరువాత మిగతా యుగాలు వస్తాయి. ఇది ప్రకృతి నియమం. అందుకే నా ఈ శిక్షణ ప్రస్తుత కాలానికే గాక భవిష్యత్తులో రాబోయే మతాలకు కూడా అవసరం. హుజూర్ దాతా దయాల్

నాతో, "ఫకీర్! కాలం మారుతుంది. ధార్మిక భేదభావాలు సమాప్తమవుతాయి. నా బోధన సైతం లోకానికి నచ్చదు. శరీరాన్ని విడిచేముందు బోధన పద్ధతిని మార్చుమని" ఆజ్ఞాపించారు. కనుక మారుస్తున్నాను. సేఠ్ దుర్గాదాసును ఉద్దేశించి, "దుర్గియా! నీకు మేలు జరగనీ! నీవు నా కర్మ తగ్గించుకోవడానికి సహాయం చేశావు."

భగవంతుడు అందరిలో ఉంటాడని లోకం అంటుంది. కానీ భగవంతునిలో అందరం ఉన్నాం అంటాన్నేను. ఎందుకంటే ఎవరిని నీవు భగవంతుడని అనుకుంటున్నావో అది నీ మనసు ఏర్పర్చిన భగవంతుడే! లోకులు నా రూపాన్ని తమ అంతరంలో జాగ్రత, స్వప్నాలలో ఏర్పర్చుకుంటారు. సమాధి స్థితిలో ఆ రూపంతో మాట్లాడతారు. కానీ అది నేను కాను. నాకు ఆ సంగతులే తెలియవు. ఎవరిని నీవు పరమాత్మ అని భావిస్తావో అది నీ మనసు రూపొందించుకున్న రూపమేనని రుజువైంది! అసలైన పరమాత్మ లేక గురువు అఖండ మండలాకారమై ఉన్నాడు. ఆయన ఇక్కడ ఉండడు. ఆయన కిరణాల వలన ఆయన ప్రకాశం కన్పిస్తున్నది. కానీ మనం భ్రమలలో ఉన్నాం. మనకీ వాస్తవ జ్ఞానం ఎప్పుడు కలుగుతుంది? మనం దానితో మమేకం చెందుతాం. మనం మిగలం. ఆ మూలం ఉండిపోతుంది. ఆ అకాలపురుషుడు ఉండిపోతాడు. ఆ సత్యమైన పరమాత్మ ఏమిటో? ఎవరో? ఎవరికీ తెలియదు. అందరూ ఆయన్ని అంతంలేని మూలం అన్నారు. మరికొందరు ఆయన్ని అకహ, అపార్, అగాధ్, అనామ్ అన్నారు. నేను ప్రపంచంలోని ధార్మికులకు, మతాలవారికి చెప్పాలనుకుంటున్నాను. దేవుని పేరిట విభజింపబడి మీరంతా వేర్వేరుగా ఉంటున్నారు, ఒకరు ఒక ధర్మానికి గురువు. మరొకరు మరో ధర్మానికి గురువు. మీరంతా పొరపాటులో ఉన్నారు. ప్రాపంచిక సుఖాన్ని మీరు కోరుకుంటే మీ మనసే మీకు దానిని ఇస్తుంది. ఎందుకు? జైసాఖ్యాల్, వైసా హాల్! జైసీ మతి వైసీ గతి; జైసీ కర్నీ వైసీ భర్నీ! మీ నడవడి, ప్రవర్తనకు తగిన ఫలితం లభిస్తుంది. ఈ విషయం సామాన్య జనులకు అర్థంకాదు. నా ఆలోచనా విచారాలు, అభిప్రాయాలు అర్థమైతే తమ ప్రవర్తనను, నడవడిని, మనసును పవిత్రంగా ఉండాలని తెలుసుకుంటారు. మీ మనసు ఏకాగ్రం కావడానికి రాముడు, కృష్ణుడు, మహమ్మద్ సాహబ్‌ల రూపాల్ని ఏర్పర్చుకొనండి.

ఇందులో తేడా లేదు. మీ మనసు ఏకాగ్రం కావటం ముఖ్యం. మనసు ఏకాగ్రం చెందటం వలన మీ ఇచ్ఛాశక్తి పెరుగుతుంది. దీనికే సిద్ధి శక్తి అని మరోపేరుంది. దీని వలన మీ ప్రాపంచిక ఇచ్ఛలు నెరవేరుతాయి. సాంసారిక సుఖాలు లభిస్తాయి.

కాల్ నే చోటీ పేకడ్ రఖీ హై, సబ్ కీ హాథ్ మే।
ఫిర్ భీ యహ కర్ తే హై ఝుగడా, జాత్ కా అవుర్ పాత్ కా॥

కాలం ప్రపంచాన్ని సృష్టిస్తుంది. అనగా కాలుడు లోకాన్ని రచిస్తాడు. మనస్సు కాలం అంశం. నీ అంతరంలో నేనును పుట్టింపచేసే వస్తువు ఈ మనసే! ఈ మనసే మనలను పట్టి ఉంచింది. నీవు మనసులోనుండి బయట పడనంతవరకు నీ పాపం, పుణ్యం, మంచి, చెడు, ఈర్ష్య ద్వేషం సమాప్తం కాజాలవు.

ప్రపంచం ఈశ్వరుడు ఈశ్వరుడుఅని అరుస్తుంది. బనారస్ నుండి నా వద్దకు ఒక వ్యక్తి వచ్చి, "నాకు ఈశ్వరుని రూపం బోధించండి" అన్నాడు. "ఈశ్వరునిలో పుట్టింప చేసే శక్తి ఉంది" అన్నాను. ఆయన అన్నిచోట్లా ఉన్నాడు. నాలోపలా ఉన్నాడు. నీలోపల ఉన్న ఈశ్వరుడు నీ వీర్యమే. ఏ వ్యక్తి తన స్వార్థం కోసం వీర్యాన్ని నష్టం చేసుకుంటాడో అతడు ఈశ్వర ద్రోహి. వీర్యాన్ని అవసరానికి మించి నష్టపరుచుకోవటం వలన మీలోపల అశాంతి అధికంగా వస్తుంది." అని చెప్పాను. ఢిల్లీలో నా దగ్గరకు ఒక నవయువకు డొచ్చాడు. "మహారాజ్! నేను చాలా అశాంతిగా ఉన్నాను. చాలా మంది మహాత్ముల వద్దకు వెళ్ళాను. కానీ నాకే లాభమూ కలగలేదు. మీరు నాపై దయ చూపండి" అన్నాడు. "నిజం చెప్పు! నీవు నీ వీర్యాన్ని నష్టపరుస్తున్నావా? లేదా" అన్నాను. అతడంగీకరించాడు. ఇక "నీకు అశాంతి తప్ప ఇంకేం వస్తుంది" అన్నాను.

నేను సంత్ సత్‌గురు వక్తనని నిజమే చెబుతాను. నా మాటలను శ్రద్ధగా వినండి. మీ బ్రహ్మచర్యాన్ని రక్షించండి. దీనిని వ్యర్థంగా నష్టపరచకండి. లేకుంటే ఈశ్వరునికి కోపం రావటం తప్పదు. మీరు తప్పించుకోలేరు. మీ వీర్య రక్షణే మీరు ఈశ్వరునికి చేసే అన్నిటికన్నా పెద్ద పూజ. మీకు ఈశ్వరుని

స్థూల రూపం చెబుతున్నాను. నా దగ్గరకి అశాంతితో బాధపడేవారొస్తారు. వీరిలో 75 శాతం తమ బ్రహ్మచర్యాన్ని నష్టపరుచుకున్నవారే వస్తారు. ఈశ్వరుడు తన సంకల్పంతో రచన చేస్తాడు. మీరు కూడా మీ సంకల్పంలో నన్ను ఏర్పర్చుకుంటారు. కానీ నాకు అది తెలియదు. ఎందుకంటే మీ విచారాలు భక్తి, భావం మంచితనంలో ఉంటాయి. మీరు మీ మనసును ఏకాగ్రం చేసి మీరు మీ ఈశ్వరుని లేదా గురువు రూపమును మీ లోపల ప్రకటం చేసుకుని దానితో పని తీసుకుంటారు. మీ లోపల సంతోషము కలుగుతుంది. ఒకవేళ మీ మనసులో చెడు విచారాలుంటే లేదా ఎవరిగురించైనా చెడుగా ఆలోచిస్తే లేదా ఎవరిపట్లనైనా మీ మనసులో ఏవగింపు, ద్వేషం, ఈర్ష్య పెట్టుకుంటే దాని ప్రతిచర్య కూడా మీపై ఉంటుంది. మీకు హాని కలుగుతుంది. దాని కారణంగా అశాంతి రావటం తప్పదు. ఇది ఈశ్వరుని సూక్ష్మ రూపం.

ఈశ్వరుని మూడవ రూపం ఏమిటి? జ్యోతి స్వరూపం-ప్రకాశం. ఎప్పటి వరకైతే ఎవరిదైనా శారీరిక, మానసిక బ్రహ్మచర్యం లేదో వారు రక్షింపబడి తలకొట్టుకుని మరణించినా లక్షసార్లు ఈశ్వరా ఈశ్వరా అంటున్నా, లక్షసార్లు బాబా ఫకీర్ లేదా మరో గురువు కాళ్ళు మొక్కి తిరిగినా వారి అంతరంలో ప్రకాశం ప్రకటం కాదు కాజాలదు. వారు జ్యోతిస్వరూప దర్శనం చేసుకోజాలరు.

ఒకవ్యక్తి తన ఆలోచనలో నన్ను ఏర్పర్చుకుని పని సాధించుకోవటం వలన మనసులో చాలా శక్తి ఉందని రుజువైంది. అందుకే ప్రతిదినం ఒకరి పట్ల మరొకరికి అసహ్యం, ద్వేషాల విచారాలే మీ హానికి కారణాలవు తున్నాయి. గాయత్రి సాధన చేయమని శాస్త్రం చెబుతున్నది. సావిత్రిని అంటే ప్రకాశాన్ని మీ అంతరంలో సాక్షాత్కరింపచేసుకో. ఇదే గురుమత శిక్షణ. గురువే ఎక్కువవాడా? ఈశ్వరుడా? మీలో ఈశ్వరభక్తిని అనగా భగవద్భక్తిని పెంచి, జ్ఞానం ఇచ్చిన ఆ గురువు స్థాయి పెద్దది. కానీ చేసేవాడు, చేయించేవాడు భగవంతుడే! నేనీ మార్గంలో పరిశోధన చేశాను. ఏడు సంవత్సరాల వయసులో బయల్దేరాను. ఇప్పుడు 87 సంవత్సరాలు. నా అనుభవంలోకి వచ్చిన విషయాలే చెప్పాను. కానీ నేను చెప్పిందే నిజమని, చివరిదని వాదించను. నాపై గురు ఋణం ఉంది. దానిని తీర్చుకోవాలని ప్రయత్నిస్తున్నాను. ఎవరు విన్నా వినకపోయినా ఫర్వాలేదు. ఈ లోకంలో ఎక్కడ చూసినా మానవతా మానవతా

అని నినాదాలిచ్చేవారు కనిపిస్తుంటారు. కానీ నిజానికి వీరికి మానవత అంటే ఏమిటో తెలియదు. వినండి! మీ లోపల నా రూపం సాక్షాత్కరించి మీ పనులు చేసింది. కానీ అది నేను కాను. ఈ విషయం మీకు చెప్పకుండా దాచిపెట్టి మీరందించే సేవలందుకుంటే, మీరిచ్చే డబ్బు తీసుకుంటే అది భ్రష్టాచారం, లంచగొండితనం అవుతుంది. దీనికి ఏ మహాత్ముడు అతీతుడు కాడు. ఎవరూ నిజం చెప్పలేదు. ఎవరైనా చెప్పబోతే నోటికి తాళం వేస్తారు. "జాగ్రత్త! ఎవరికీ చెప్పవద్దు" అని హెచ్చరిస్తారు. కబీర్ సాహెబ్ సైతం

ధర్మదాస్ తొహె లాఖ్ దోహాయీ - సార్ భేద్ బాహర్ నహిఀ జాయీ ॥

అన్నారు. వాస్తవం తెలుసుకోవడానికి, ఉన్నత శిక్షణ పొందడానికి ప్రపంచం తయారుగా లేదు. నా దగ్గరికి వచ్చేవాళ్ళంతా ప్రాపంచిక కోరికలు తీర్చుమని వస్తారు. పరమార్థం కావాలని కోరే వారెందరు? మీరంతా ఇప్పుడు నా దగ్గరకు పరమార్థం కోసం వచ్చారా? అభ్యాసం చేసినా లౌకిక వాంఛలు నెరవేరడానికే చేస్తారు. ఢిల్లీ నివాసి మదన్‌లాల్ తరచుగా నా దగ్గరకు వస్తాడు. అతని కొడుకు రాత్రి కార్లో ఢిల్లీకి వస్తున్నాడట. దగ్గర చాలా రూపాయలున్నాయట. దారిలో దొంగలు ఓ తాడును రోడ్డుకు అడ్డంగా కట్టారు. కారు ఎక్కువ వేగంతో వస్తోంది. దార్లో తాడు కట్టి ఉండటం చూసి, ఇక తప్పించుకునే దారిలేదని ఆ కుర్రవాడు భయపడ్డాడట. "బాబాజీ! బాబాజీ నన్ను కాపాడు' ' అతడు గట్టిగా అరిచాడట. అతడు పిలవటం ఆలస్యం బాబా ఫకీర్ వచ్చి క్షణంలో తాడును పైకి లేపాడుట. ఆ అబ్బాయి కారుతాడు కిందినుండి వేగంగా దూసుకుపోయింది. అంతే! దొంగలు మ్రాన్పడి చూస్తూ ఉండి పోయారట. ముఖ్యంగా ఆ అబ్బాయి ప్రాణాలు మిగిలాయిట! ఈ సంగతులన్నీ మదన్‌లాల్ చెప్పి "మహారాజ్! అంతటి ఆపత్సమయంలో మీరే వచ్చి కాపాడకుంటే నా డబ్బు పోయేది. కొడుకు పోయేవాడు" అన్నాడు కృతజ్ఞతగా. "ఏం ఫకీర్ చంద్! నువ్వు వెళ్ళి ఆ తాడును రోడ్డుపై పైకి లేపావా? కుర్రవాడిని నీవే రక్షించావా? కనీసం ఈ సంఘటన గురించైనా ఇంతకు క్రితం నీకు తెలుసా' అని నా ఆత్మను నిలదీశాను. ఇది నేనెందుకు చెబుతున్నాను. ఎందుకంటే మదన్‌లాల్ నా సేవ చేస్తున్నాడు. అతడు మోసపోకూడదు. బాబాజీ ఆదుకున్నాడన్న భ్రమలో అతడు ఉండకూడదని స్పష్టం చేస్తున్నాను.

తాము చనిపోయేటప్పుడు బాబాజీ పల్లకీ తెచ్చాడని ఒకరు, విమానం తెచ్చాడని మరొకరు చెబుతుంటారు. హుజూర్ సావన్‌సింగ్‌జీ మహారాజ్ కారు తెచ్చాడని కొందరన్నారు. మరొకరు మరోటంటారు. వాళ్ళిలా ఎందుకు చెబుతుంటారు? అంత్యసమయంలో గురువు వచ్చి నిన్ను తీసుకు వెళ్తాడని వారికొక నమ్మకం కలిగించబడింది. ఎలాంటి సంస్కారాలు మనిషికి కలిగిస్తే అవే రూపం ధరించి ఎదుటికి వస్తాయి. నేను అబద్ధాలు చెప్పడానికి తయారుగా లేను. నేను సత్యాన్ని స్పష్టీకరించటం వలన మందిరానికి డబ్బులు రావు. ఆ విషయం గురించి నాకేం బాధలేదు. మందిరం నడిస్తే నడవనీ లేకుంటే లేదు. మందిరంతో నాకేం సంబంధం? నాపై గురు రుణం ఉంది. దానిని తీర్చుకునేటందుకు పని చేస్తున్నాను.

ఒక రోజు మిట్టమధ్యాహ్నపుటెండలో తనతో పాటు వెళ్ళి నేను తన శనగ పంటను కోశానని చెప్పి, "మహారాజ్! నేను తమను చాలా కష్టపెట్టాను" అని బాధపడ్డాడు సంత్ తారాచంద్. "అలా వచ్చింది నేను కాదు. నీ విశ్వాసమే" అని చెప్పాను అతనికి. మొదటి సారి వచ్చినప్పుడు 1100/- రూపాయలు మందిరంలో ఇచ్చి వెళ్ళాడు. తరువాత అతడొక సంఘటన చెప్పాడు. "బాబాజీ! నా దగ్గరికి ఓ స్త్రీ వచ్చింది. ఆమె యాభైయ్యొక్క రూపాయలిచ్చింది. "అమ్మా! ఈ యాభైయ్యొక్క రూపాయలు ఎందుకిస్తున్నావు' అని అడిగాను. ఆమె, "మహారాజ్! మా పక్కింటికి నిప్పంటుకుంది. జనమంతా అరిచిగగ్గోలు చేయసాగారు. అది చూసి మా ఇంటికి కూడా మంటలు ఎక్కడ వ్యాపిస్తాయోనని భయపడి మిమ్మల్ని ప్రార్థించాను "సంత్ తారాచంద్ మహారాజ్! నా ఇల్లు మంటల పాలుగాకుండా కాపాడు! నీకు యాభైయ్యొక్క రూపాయలు ముడుపు కట్టి ఇస్తా" అని మొక్కాను. మా ఇంటికి మంటలు వ్యాపించలేదు. మా ఇటువైపు ఇల్లు సైతం మంటకు ఆహుతైంది గానీ మా ఇల్లు సురక్షితంగా ఉంది. మీరు నాపై ఎంతో దయ చూపారు. కనుక ఈ యాభైయ్యొక్క రూపాయలిస్తున్నాను. మహారాజ్! ఇంత మేలుచేశావు. మరోసారి దయచూపు. నా పక్కవైపు చాలా సంవత్సరాలనుండి నొప్పి ఉంది. దానిని తగ్గించు." అని వేడుకుందట. "మంచిది! మంటలనుండి నీ ఇంటిని కాపాడిన వారే నీ ఈ నొప్పిని సైతం తగ్గిస్తారని ఆమెకు చెప్పి పంపాను" అన్నాడు సంత్ తారాచంద్.

"నిజం చెప్పు! నీవా మహిళ ఇంటికి వెళ్ళి మంటలు అంటుకోకుండా కాపాడావా?" అని తారాచంద్‌ను అడిగాను. "లేదు మహారాజ్! వెళ్ళ లేదు" అన్నాడు తారాచంద్. "ఇలాగే నేను కూడా నీ శనగపంటను కోయడానికి రాలేదు" అని చెప్పాను. ఇప్పుడు అతడికి వాస్తవికత బోధపడినందుకు సంతోషంగా ఉంది.

సంత్ తారాచంద్‌కు వాస్తవం అర్థంకానప్పుడు భ్రమలో ఉండి 1100 రూపాయలు మందిరానికి ఇచ్చి వెళ్ళాడు. ఇప్పుడాయనకు అసలు విషయం అర్థమై భ్రమలలో నుండి బయటపడ్డాడు. కనుక 108 రూపాయలిచ్చాడు. ఇవాళ ఢిల్లీ దసరా సత్సంగంలో 200 రూపాయలిచ్చాడు. అతనికి చాలా పెద్ద ఆశ్రమం ఉంది. గొప్ప గొప్పవాళ్ళెందరో అతని శిష్యులు. ఇది అతని ప్రారబ్ధకర్మం. వారిది కూడా ప్రారబ్ధకర్మమే! గోస్వామి తులసీదాస్ రామాయణంలో రాశాడిలా -

సునహుఁ భరత్ భావీ ప్రబల్, విలఖి కహేవు మునినాథ్ ।
హాని లాభ్ జీవన్ మరణ్ యశ్ అపయశ్ విధి హాథ్ ॥

ఎవరికైనా ప్రారబ్ధ కర్మల ఫలమే లభిస్తుంది.

ధ్యాన్ తక్ కర్తా నహీఁ హై, కోయీ మేరీ బాత్ కా ।
క్యా కహుఁ హై భేద్ ఉన్ మే, మూర్ఖ మే దిన్ కా రాత్ కా ॥

మీతో నేను చెప్పిన మాటలు రహస్యాల్ని తెలిపేవే గదా! మీరు నన్ను ప్రశంసిస్తారు. బాబాజీ ప్రసాదంతో పిల్లవాడు పుట్టాడు. ఈ పని నెరవేరింది. ఆ పని నెరవేరింది అంటూ ఉంటారు. ఈ మదన్‌లాల్ నా దగ్గరకు వచ్చాడు. అతడికి పిల్లలు లేరు. ప్రసాదం తీసుకువెళ్ళిన కొంతకాలానికి కొడుకు పుట్టాడు. బాబాఫకీర్ తనకు సంతానం ప్రసాదించాడని అతడనుకుంటాడు. నా మెదడు పనిచెయ్యదు. ఇదేం లీల? నేను మిమ్మల్ని మోసగించజాలను. నా శిక్షణ సరైనదైతే ఇది వ్యాపించనీ! లేకుంటే ఇక్కడితో ముగిసి పోనీ!

ఢిల్లీ సత్సంగానికి సంత్ కృపాల్‌సింగ్‌జీ వచ్చాడు. "మీరు కూడా ఏమైనా చెప్పండి." అన్నాను. "మీ మాటలు వినడానికి వచ్చాను" అన్నాడు.

హోషియార్‌పూర్ రైల్వేస్టేషన్‌కు ఓ కొత్త అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ వచ్చాడు. అతని భార్య వ్యాస్ డేరా సత్సంగిని. ఆమె మానవతా మందిరానికి వచ్చింది కాబోలు! బాబా ఫకీర్ ఆశ్రమాల గురించి, గద్దెల గురించి విమర్శిస్తుంటాడు, వ్యాఖ్యానిస్తుంటాడు అంటూ మొదలు పెట్టి తన ఇష్టం వచ్చినట్లు బాబా చరణ్ సింగ్ జీ కి ఉత్తరం రాసిందట. అది చదివి దానికి జవాబుగా చరణ్ సింగ్ జీ, "అలాంటిదేం లేదు. నీవు ఫకీరుల మాటలను అర్థంచేసుకోలేవు" అని రాశాడట. ఆ తరువాత కొంత కాలానికి తెల్లవారు జామున నాలుగు గంటలకు నారూపం ఆమె లోపల సాక్షాత్కరించిందట. "లే! లేచి భజన చేయి" అని తనను మేల్కొలుపుతున్న "నీవెవరివి?" అని ఆ రూపాన్ని ఆమె అడిగింది. బాబా చరణ్ సింగ్ దగ్గర నువ్వెవరిని విమర్శించావో, ఎవరిపై చాడీలు చెప్పావో ఆ నేనే" అందట నా రూపం. ఈ విషయాలేవీ నాకు తెలియవు. ఇదేం రహస్యం అని ఆలోచిస్తుంటాను. మోసం ఎలా దూరం కాగలుగుతుంది? మహాత్ములు సత్యమైన అంశం చెప్పకుండా అనుచితమైన రీతిలో లాభం పొందుతుంటారు. లోకుల నుండి డబ్బు తీసుకుంటారు.

లంచగొండితనం వంటి భ్రష్టాచారాల్ని ఎవరు దూరం చేయగలరు? నేను నా సమస్త జీవితం సత్యసంధతతో గడిపాను. కానీ నేను కూడా పడిపోతుంటాను. ఎలా? ఇంటిని నాదనుకుంటాను. అది ఇటుక, రాళ్ళు, సిమెంట్‌తో కట్టబడింది. ప్రకృతి ఇచ్చిన పిల్లవాడిని నావాడనుకుంటున్నాను. ఏం? ఇది నిజాయితీ లేకపోవటం కాదా? ఇది భ్రష్టాచారం కాదా? ఎవరైనా సత్య జ్ఞానమిచ్చే యోగ్యపురుషుని సత్సంగం చేయమని సంతులు చెబుతారు. మీరు అర్హులు కాకున్నా మీ ఎదుట రత్నాలు, ముత్యాలు విరజల్లుతున్నాను. ఎందుకు? గురువాజ్ఞ పాటిస్తున్నాను. ఆయన ఆజ్ఞ నెరవేరుస్తున్నాను. బోధనా పద్ధతిని మారుస్తున్నాను. భగవంతుడు మనలో ఉంటాడని అందరూ అన్నారు. కానీ మనమే ఆయనలో ఉంటామని నేనంటున్నాను. అందులో గతి - చలనం అవుతుంది. మన స్థితి చేప స్థితి వంటిదే! చేపనీళ్ళలో ఉంటున్నా దప్పికతో ఉంటుంది. చేపకు దాహం వేసినప్పుడు తలకిందులవుతుంది. అప్పుడు దాని గొంతులోకి నీళ్ళు పోతాయి. మనది కూడా తలకిందుల ఉల్టా మార్గమే!

ఆత్మ జ్ఞాన్ బినా సబ ఝూటా, క్యా మథురా క్యా కాశీ ।

మనం దేవుడవటమే ఆత్మజ్ఞానం అని లోకం భావించింది. నీవు అజర, అమర, అవినాశివి కావని నేనంటాను. నీ మనసు సదా మారుతూ ఉంటుంది. అది కూడా అజర, అమరం కాదు. శబ్ద ప్రకాశాలు కూడా మారుతుంటాయి. దేని నుండి మనం ఉద్భవించామో ఆ శక్తే అమర, అవినాశి శక్తి. ఇది లోకులకు బోధపడితే మనుషుల పరస్పర అసహ్యం, ద్వేషం, ఈర్ష్యలు సమాప్తమవుతాయి. పరమాత్ముడు మందిరంలో ఉన్నాడని కొందరనుకుంటారు. మసీదులో ఉన్నాడని మరికొందరనుకుంటారు. గురుద్వారాలో ఉన్నాడని కొందరనుకుంటారు. వ్యాస్‌లో ఉన్నాడనీ, ఆగ్రాలో ఉన్నాడని, హోషియార్‌పూర్‌లో ఉన్నాడని మరికొందరనుకుంటారు. వీరంతా భ్రమలతో ఉన్నారు. అసలు సంగతిని మరిచిపోయి ఉన్నారు. కానీ ఇందులో వారి తప్పు కూడా ఏదీ లేదు. వారికి నిజాన్ని వివరించే వారు లేరు. హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్ నన్ను పిచ్చివాడనే వారు. ఆయన నిజమే అనేవారు. ఉన్నమాటే అనేవారు. అప్పట్లో నాకు అది బోధపడేది కాదు. నేను అజ్ఞానిని. కానీ ఇప్పుడర్థమైంది. ఏ రాముణ్ణి నా జీవిత పర్యంతం వెదికానో ఆతని నుండే పుట్టాను. ఆయనలోనే విలీనమవుతాను. నీటితో బుడగ ఏర్పడింది. అది పగిలి మళ్ళీ నీటిలోనే కలిసిపోతుంది. ఆ సర్వేశ్వరుడు మూలం, పరమ తత్వాధారుడు. అజ్ఞాన, స్వార్థాల కారణంగా మనిషి భగవంతునికి అనేక నామ రూపాలిచ్చుకున్నాడు. వాటి పరిణామాలను మనం కళ్ళతో చూస్తున్నాం. మనవ జాతిలోని ధార్మిక పక్షపాతం అనగా మత పక్షపాతం దూరం చేయడానికి లోకంలో సంతులు అవతరించారు. ఎందుకంటే మనసు చంచలమైనది. ఇది సహాయాన్ని కోరుకుంటుంది. కనుక దీనికి తగిన సహాయమందించు. యోగ్య పురుషుని సహాయం దొరికితే నీ ఇహ, పరలోకాలు రెండూ విజయవంతమవుతాయి. రామకృష్ణులు, దేవీ దేవతల సహాయం ఉంటే నీ ప్రాపంచిక జీవనం జయప్రదమవుతుంది. కానీ పరలోకం సిద్ధించదు. పరమార్థం లభించదు. యోగ్యుడైన గురువు సహకారంతో ఇహమూ, పరమూ రెండూ నెరవేరుతాయి. నాకు హుజూర్ దాతా దయాల్ జీ పై విశ్వాసం ఉండేది. నా ఇహ పరాలు రెండూ సిద్ధించాయి.

హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ బోధన సరళిని మార్చమన్నాడే గానీ అది ఎలా మార్చాలో చెప్పలేదు. నా అనుభవాలనే చెబుతుంటాను. ఎవరైనా వింటున్నారా లేదా? ఆచరిస్తున్నారా లేదా అని పట్టింపు నాకు లేదు.

దీనిని ఆదరించే, విలువ నెరిగే ప్రియపుత్రులు వస్తారు. చేపకు దాహమైనప్పుడు అది తలకిందులుగా ఉల్టా అవుతుంది. దాని దప్పిక తీరుతుంది. ఇలాగే తమ ఇంటికి చేరుకోవాలనే తపన కలిగినవారికి తిరోగమన మార్గం - ఉల్టా మార్గం ఉంది.

తుమ్ ఉలట్ చలో హాఁ ఉలట్ చలో ఆసమాన్, నీచే క్యాఁ రహనా ।
నీచ్ నీచ్ నీచ్ కీ సంగత్, నీచ్ భావ్ మే నీచ్ కీ రంగత్ ॥

త్యాగ్ కుసుంగత్ కర్ సత్ సంగత్, భవకే దుఃఖ్ సుఖ్ క్యాఁ సహనా!

కానీ దీనికంటే ముందుగా ఎవరైనా యోగ్యుల సాంగత్యం చేయండి. ప్రస్తుత కాలంలో ఏం జరుగుతోంది? రెండు పుస్తకాలు చేతిలో పట్టుకుని గురువవడానికి సిద్ధపడతారు. సత్సంగం చేయిస్తారు. ఎంతో దగాకోరు గుండాగా పేరు తెచ్చుకున్న రౌడీని ఓ గద్దెపై కూర్చోబెట్టి గురువుగా ప్రచారం చేసి చూడు! అసలు రంగు తెలియని వారంతా అతనికి శిష్యులవుతారు. లోకుల అంతరంలో అతని రూపం ప్రకటమవుతుంటుంది. మధ్యప్రదేశ్‌లో ఓ గురువుండేవాడు. అతడు నామ దానమీయటం మొదలు పెట్టాడు. చాలా మంది అతనికి శిష్యులయ్యారు. దామోదర్ దాస్, అతని మిత్రులు కూడా ఇతని పరిధిలోకి వచ్చారు. ఎంతో సేవ చేశారు. ఒక మనిషి లోపల అతని రూపం ప్రకటమైంది. ఆ మనిషి భార్యను ఈ గురువు చెడు దృష్టితో చూడసాగాడు. ఈ సంగతి గమనించిన భార్య గురువు గారి అంతరంగం గురించి భర్తకు చెప్పింది. "నా గురువును గురించి చెడుగా ప్రచారం చేస్తావా?' అంటూ ఆ వ్యక్తి భార్యను కొట్టాడు, "రుజువు చేసి చూపు"! అన్నాడు ఆ భర్త. "రుజువు కావాలా? అయితే రాత్రికి మీ గురువు గారి గది దగ్గరున్న చింత చెట్టుపైకి రహస్యంగా ఎక్కి దాక్కుని చూడు. అంతా తెలుస్తుంది" అంది భార్య. అతడలాగే చేశాడు. అతనికి నిజం తెలిసిపోయింది. శిష్యుడు నిలదీసే సరికి గురువు గారూ తన తప్పిదాన్ని ఒప్పుకున్నారు. ఆ ప్రియ శిష్యుని వల్లనే

గురువు గారి అసలు స్వరూపం లోకానికి తెలిసిపోయింది. చుట్టూ చేరిన శిష్య వర్గం చెట్టుకొకరూ పుట్టకొకరూ చెల్లాచెదరయ్యారు. విశ్వాసం తొలగిపోయినందున గురువు గారి రూపం ఇక శిష్యునిలో ప్రత్యక్షమవటం ఆగిపోయింది. రిద్ధిసిద్ధులు తొలగిపోయాయి.

అతనికి రిద్ధి సిద్ధులు ఎవరిచ్చారు? ఇక్కడ గురువు దుష్టుడు. మీ కళ్ళు తెరిపించడానికే ఇలాంటి వాస్తవ సంఘటనలను మీకు చెబుతున్నాను. దొంగ గురువుల బారిన పడకండి. నా తరువాత మీరు మరోగురువు దగ్గరికి వెళ్ళకూడదనే నా ప్రయత్నం. నా మాటలని అర్థంచేసుకొనండి. మీరు మోసపోకూడదనేదే నా అభిప్రాయం. నీవు నా దగ్గరికి రా! రాకపో!

**కామీ తరే క్రోధీ తరే పాపీ తరే అనంత్ ।**
**ఆన్ ఉపాసక్ కృతఘ్న తరే న నామ రటంత్ ॥**

కృతఘ్నుడు తరించజాలడు. అతడు గురువుకే పరిమితం కాజాలడు. నీవు నీ తల్లిదండ్రులకు సేవ చేయకుంటే నీవు కృతఘ్నుడవు. ఎవరైనా చేసిన మేలును, బదులు తీర్చకుంటే నీవు కృతఘ్నుడవు. ఒక స్త్రీ తన భర్తను సేవించకుంటే, ఒక భర్త తన భార్య కష్టాన్ని తన కష్టంగా భావించకుంటే నామం జపించినా శుభం కలుగదు. నేను స్పష్టంగా ఎందుకుచెబుతున్నాను? ఒకటి గురు రుణం! రెండవది - నా శిక్షణ - బోధన లోకంలో ప్రచారమైతే జనం దోపిడీ నుంచి తప్పించుకోగలుగుతారు. వాళ్ళకు వాస్తవం బోధపడుతుంది. ధార్మిక మత పక్షపాతాలు దూరం కావాలి. మీరొస్తారు. మీరు మందిరంలో ఇచ్చేది నాకు భ్రష్టాచారం కారాదు. కనుక నేను స్పష్టంగా చెబుతున్నాను.

**నాచే కూదే తోడే తాన్, దునియా రఖే ఉస్‌కా మాన్ ।**

పరమార్థం గురించి వినండి.

**తుమ్ ఉలట్ చలో హాఁ ఉలట్ చలో అసమాన్, నీచే క్యోఁ రహనా**
**నీచే నీచ్ నీచ్ కా సంగత్, నీచ్ భావ్ మే నీచ్ కా సంగత్**
**త్యాగ్ కుసంగత్ కర్ సత్ సంగత్, భవ కే దుఃఖ సుఖ క్యోఁ సహనా ?**

భవం అంటే నీ మనసు. నీ లోపల అనేక రకాల ఆలోచనా విచారాలు

చెలరేగటం భవసాగరం. ఇందుకు సత్సంగంలో విషయాన్ని అర్థం చేసుకో! నేను సత్సంగం యిస్తున్నాను. ఇది కూడా భవసాగరమే! కానీ సత్సంగం వలన మంచి ఆలోచనలు, విచారాలు లభిస్తాయి. ఇతరుల దోషాలను క్షమించు. నీవు ఒకరి తప్పుల్ని క్షమించకుంటే నీ తప్పులను ఎవరు క్షమిస్తారు? తప్పులు అందరూ చేస్తారు. నా దగ్గరికి ఒక నవయువకుడొచ్చాడు. "బాబాజీ! నేను నా భార్యను వెళ్ళగొట్టాను. పెళ్ళికంటే మందు ఆమె ఎవరినో ప్రేమించిందట" అన్నాడు. నేనతని వైపు చూసి, "శభాష్! మంచి పని చేశావు! కానీ ఒక్క విషయం నిజం చెప్పు. పెళ్ళి కంటే ముందు నీవు పరాయి స్త్రీలతో అక్రమ సంబంధం కలిగి ఉన్నావా లేదా?" అని అడిగాను. "అవును. ముగ్గురు అమ్మాయిలతో నాకు సంబంధం ఉంది" అన్నాడు. "మూర్ఖుడా! ఇక్కడ అధిక దోషి ఎవరు? నువ్వా? నీ భార్యనా? ఆమె తలచుకుంటే నీకు సరైన జవాబిచ్చేదే! వెళ్ళు! వెళ్ళి నా భార్యను వెనక్కి పిలుచుకో! ఆమెను తీసుకొచ్చి సంసార జీవితం కొనసాగించు" అన్నాను. "తప్పు అందరూ చేస్తారు! మరోసారి ఆమె తప్పుచేస్తే నిస్సందేహంగా ఈ సారి వెళ్ళగొట్టు" అన్నాను. మనిషి మనసులో అనేకరకాల ఆలోచనలు, విచారాలు చెలరేగుతుంటాయి. కానీ ఎవరూ తమ మనసులోని మాటలను చెప్పరు. మా మహాత్ముల భుజాలకో, హృదయాలకో ఒక యంత్రం బిగించాలి. మేం ఏం ఆలోచిస్తున్నామో ఆ యంత్రం టేప్ చేయగలిగితే వీరిలో ఎవరూ ఈ లోకానికి ముఖం చూపజాలరు! దీనికి చికిత్స ఉల్టా మార్గం.

సీధా మారగ్ జగత్ కా, ఉల్టా సంత్ కా పంథ్ ।
జో కోయీ ఉలట్ మగ్ చలే, సో పావే నిజ కంథ్ ॥

అంతర్ముఖుడై తన లోపల నడక కొనసాగించిన వ్యక్తే పరమాత్మను కలుసుకుంటాడు. పరమాత్మ మందిరాలలో, మసీదులలో లేడు. సంసారిక కోరికలు ఉంటే అవి ఆ మనిషిని పైకి వెళ్ళనీయవు. అందుకే సంతులు స్మరణ, ధ్యానాలనిచ్చారు. దీనివలన నీవు శరీరం, మనసులను మరిచిపో, నీకు లోపలి నుండి తెలివి, వివేకం ప్రాప్తిస్తాయి.

నీచే మాయా నీచే కాయా, నీచే ఝాయీ నీచే ఛాయా ।
ఇస్‌కే భరమ్ మే జో కోయీ ఆయా, సో తో రహా యమ బంధ బంధాయా॥

కింది ఏముంది? మాయ! బుద్ధి విచారం, శరీరం, ఛాయ. ఛాయ ఏమిటి? సంత్ తారాచంద్ శనగ పైరును కోసిన బాబా ఫకీర్ ఛాయ! చెడు కలల వలన మనం బాధపడతాం. మంచి స్వప్నాలొస్తే సంతోషిస్తాం. ఈ రెండూ మాయ ఛాయలు! మాయ భ్రమలో చిక్కుబడి ఉన్నది ద్వంద్వం. రాధాస్వామి మత శిక్షణ నా అనుభవాన్ని బలపరచకుంటే ఈ మతానికి వ్యతిరేకంగా పిలుపునిచ్చేవాడిని! హుజూర్ రాయ్‌సాలిగ్‌రామ్‌మహారాజ్ తనవాణిలో రాశారు. అంత్య సమయంలో మనిషి ఎదుట ఫిలిం నడుస్తుంది. ఛాయా రూప గురువు కూడా వస్తాడు. సత్సంగం కూడా వినిపిస్తాడు. ఇక ఆ జీవుడు కొంత కాలం వరకు పైలోకాల్లో ఉంటాడు. సంత్ సద్గురు వక్త్ ఎవరైనా ప్రపంచంలోకి వస్తే ఆ జీవి దేహాన్ని ధరిస్తాడు. జన్మిస్తాడు. ఆ గురువు సన్నిధిలోకి వచ్చి మిగిలిన సంపాదనను పూర్తి చేసుకుని తన ఇంటికి వెళ్ళిపోతాడు. అందుకే ఎవరైనా రాకపోకల నుండి విముక్తి పొందాలని నా వద్దకు వస్తే వారికి తప్పక మేలు జరుగుతుంది. నా మాటల్ని వారు అర్థం చేసుకుంటే అంత్యసమయంలో మాయకు లోను కారు. చిక్కుపడరు.

హుజూర్ దాతా దయాల్ మహారాజ్ దయతో నా అనుభవాలను మీకు చెప్పాను. మీ అంతరంలోకి నేను వెళ్ళననే మాట నాకు బోధపడింది. అన్నిటి కంటే ముందు మీ నడవడిని, మనసును పవిత్రంగా ఉంచుకొనండి! ఎవరితోనూ ద్వేషం పెంచుకోకండి. ఇక మనకు కలిగే సుఖదుఃఖాలు ఈ జన్మవీ, ప్రారబ్ధ కర్మల ఫలాల పరిణామాలు. కర్మఫలితాన్ని అందరూ అనుభవించవలసిందే! సత్సంగీయుల కర్మలు చాలావరకు స్వప్నంలో తొలిగిపోతాయి. మీరు స్వప్నంలో చూసేది ఏమిటి? మీ ప్రారబ్ధ కర్మలే! మీరు చేసిన కర్మలు వాటి సంస్కారాలు బీజరూపంలో మీ మేధస్సుపై ఉన్నాయి. సమయం వచ్చినప్పుడు అవి పొటమరిస్తాయి. నేను ఏ మాట చెప్పినా అర్థంతో చెబుతాను. స్వప్నంలో నేనేం చేస్తాను? నా కోసం ఒక వ్యక్తి భోజనం తెచ్చాడు. అందులో మాంసం ఉంది. నాకు స్పృహ మెలకువ వచ్చింది. ఇవాల్టి వరకు ఇలాంటి కల ఎన్నడూ రాలేదు. ఇవాళేమైంది? ఒక గంట ఆలోచించాక ఒక సంఘటన గుర్తొచ్చింది. 1918లో నేను బహరీ నావలో బసరే బగ్దాద్‌కు వెళ్తున్నాను. నాకు శాకాహారం తెమ్మని పడవలో భోజనం తెచ్చే మనిషికి చెప్పాను. అతడు ఆలుగడ్డల

కూరతెచ్చాడు. కానీ అందులో మాంసం ఉన్నదని నాకు అన్పించింది. అతడిని అడిగాను. "ఇందులో చేపల పులుసు కలిసింది" అన్నాడు. ఇదివిని నాకు కోపం రాగా పళ్ళెం ఎత్తి పారేశాను. ఆ నాటి కోపం 50-55 సంవత్సరాల తరువాత తలపుకొచ్చింది. జన్మ జన్మాంతరాల తరువాత పొటమరించే ఇలాంటి కర్మలు కూడా చాలా ఉంటాయి. నిజమో అబద్ధమో నాకు తెలియదుగానీ నేను విన్న విషయం చెబుతాను. మహాభారత యుద్ధంలో భీష్మపితామహుడు అంపశయ్యపై పడిఉన్నాడు. శరీరం అంతటా బాణాలు గుచ్చుకుంటున్నాయి. ఎంతో బాధగా ఉంది. "ఈ స్థితి నాకెందుకు వచ్చింది? నేనేం పాపం చేశానని నాకీ శిక్ష పడింది? నేను నా గత వంద జన్మలనుండీ ఏ పాపమూ చేయలేదు' అన్నాడు కృష్ణునితో. కృష్ణుడు నవ్వాడు, "భీష్మాచార్యా! మరో రెండు జన్మలు వెనక్కి వెళ్ళిచూడు. ముళ్ళకొమ్మతో ఒక పామును కొట్టావు. దాని దేహమంతటా ముళ్ళు గుచ్చుకున్నాయి. అవే ఈ బాణాల ములుకుల రూపంలో నీ దేహంలో గుచ్చుకున్నాయి" అన్నాడు.

నేనో, మరొక సంత్, మహాత్ముడో ఈ కర్మ ఫలాల నుండి తప్పించుకో గలరని నీవు భావిస్తున్నావా? లేదు. యోగ్యుడైన గురువు నీకు లభిస్తే - నీ లోపల ప్రకటమయ్యేదంతా మాయ అని ఆయన నీకు విశ్వాసం కలిగిస్తే అంత్య సమయంలో మాయలో చిక్కుబడవు. రాకపోకల నుండి తప్పించు కోగలవు.

*అందరికీ రాధాస్వామి*

# సత్సంగం

## 28–10–1973

## కర్మ - విచారం

హంసా ఛోడో కర్మ కీ ఆసా ।

కర్మ కాల్ సబ్ జగత్ నచావే, ఫిర్ ఫిర్ కరే గ్రాసా ।
ఉపజన్ వినసన్ కర్మ హీ కియే, కర్మ హీ జగత్ బినాసా ॥

కర్మ హీ కాల్ బ్యాల్ పుని కర్మ హీ, కర్మ హీ కీ సబ త్రాసా ।
జప తప కర్మ బాంధ్ జగ్ రాఖే, పాప - పుణ్య విశ్వాసా ॥

కర్మ హీ దేవల్, తీర్థ్ కీనే, కర్మ హీ అల్లా ఉదాసా ।
కర్మ హీ యోగ్ ధ్యాన్ తప్ పూజా, కర్మ చఢావే దాసా ॥

కర్మ హీ దుఃఖ - సుఖ జడ్ - చేతన్ హై, తీన్ లోక్ ప్రకాసా ।
కర్మ హీ దే లే పుణ్య కర్మ హీ, యజ్ఞ దాన్ దేహ వాసా ॥

జీతనా భూత్ కర్మ్ కే వశ్ హై, చార్ విచార్ నివాసా
కర్మ దుఃఖీ దారిద్రీ కహియే, కర్మ హీ భోగ్ విలాలా ॥

కర్మ వికార్ రాహ తజ్ బైఠో, కహే కబీర్ సుఖ్ బాసా ।

మిత్రులారా! రాధాస్వామి! నేనెవరికీ సత్సంగం ఇవ్వను. నాకు నేనే సత్సంగం ఇచ్చుకుంటున్నాను. చిన్న వయసులో రాముడిని కలుసుకోవాలని బయలు దేరాను. రాముడు అవతరించి వస్తాడని రామాయణం వలన తెలుస్తున్నది.

నానా భాంతి రామ్ అవతారా, రామాయణ శత కోటి అపారా ।

రాముణ్ణి కలుసుకోవడానికి నా లోపల ఒక ప్రబలమైన కోరిక, తపన ఉండేది. ఈ తపనలో ఒకసారి ఇరవైనాలుగు గంటలపాటు ఏడ్చాను. అప్పుడు హుజూర్ దాతా దయాల్ మహర్షి శివవ్రత్‌లాల్ జీ మహారాజ్ దృశ్యం నాకు

కనిపించింది. ఆయన్ని నేను రాముడని భావించాను. దైవేచ్ఛ నన్నాయన చరణాలలోకి తీసుకు వెళ్ళింది. నేనాయన్ని అత్యధికంగా ప్రేమించాను. పూజించాను. ఆయన నాకు సంత్ మతం శిక్షణ నిచ్చాడు. రాధాస్వామి మత శిక్షణ, బోధన చదవమని ఇచ్చాడు. ఇందులో అన్ని మతాల విమర్శ ఖండన ఉంది. అది చదివి నా మనసు బాధకు లోనైంది.

తన పూర్వీకుల, పూజ్యుల ఖండన, విమర్శ ఎవరు చదవగలుగుతారు? సంత్ మతం అన్నిటికంటే ఉన్నతమైనదని చెప్పబడింది. ఈ మత నియమాలపై సత్య సంధతతో నడుస్తాను. నా అనుభవాలను ప్రపంచానికి చెప్పి పోతానని ఆ సమయంలో ప్రతిజ్ఞ చేశాను. నేను అర్థం చేసుకున్నదంతా పొరపాటు కావచ్చు. కానీ నా హృదయం, నడవడి, ఆలోచనలు పూర్తిగా పవిత్రంగా, పరిశుద్ధంగా ఉన్నాయి. మంగళ శబ్దంలో ఈ పంక్తి వచ్చింది.

కాల్ కర్మ్ కాట్ ధుర్ లయ్ పహుంచాయా

ఫకీర్! నువ్వు ధుర్ లయ్‌కు చేరుకున్నావా అని నా ఆత్మను ప్రశ్నిస్తాను. కుబేర్‌నాథ్ జీ, ఇంజినీయర్ గారూ! మీరొచ్చారు. గురువును కావాలనే కోరిక నాకు లేదు. జీవనంలో ఒక అన్వేషణ ఉండేది. ఇప్పటికీ ఉంది. నేను అర్థంచేసుకున్న విషయాన్నే పైవాణి ధృవీకరిస్తున్నది. కనుక నేను సరిగానే అర్థం చేసుకున్నానని నాకు ధైర్యం, ఉత్సాహం వచ్చాయి. ఈ మార్గంలో నేను పరిశోధన జరిపాను. నక్షత్రాల కిరణాలు, బాహ్య సంస్కారాలతో నా మనసు రూపొందింది. ఈ నా శబ్ద ప్రకాశాలు కూడా బయటి ప్రకాశ శబ్దాలతోనే వచ్చాయి. మీ కారణంగా ఈ అంతస్థుకు చేరుకున్నాను. ఇక్కడ కూర్చున్న ఈ ఇంజనీయర్ గారిలో నా రూపం ప్రకటమైంది. నేను ప్రకటమయ్యానని నాకు ప్రతి రోజూ ఉత్తరాలు వస్తుంటాయి. అలా నేను వెళ్ళను. వాటి గురించి నాకు తెలియనే తెలియదు. ఎవరిలోపల ఏది ప్రకటమైనా అది వారి వాంఛలననుసరించి ఉంటుంది. చదవటం వలన, వినటం వలన, ప్రారబ్ధ కర్మానుసారం వ్యక్తి మేధస్సులో ఎటువంటి సంస్కారాలు నిక్షిప్తమై ఉంటాయో అవి అత్యధికమైనప్పుడు జాగ్రత, స్వప్న స్థితులలో లేక సమాధిలో వారి ఎదుటికి వస్తాయి. అందుకే నేను ఇప్పుడు రంగు రూపులను వదిలి ముందుకు

వెళ్ళే ప్రయత్నం చేస్తుంటాను. ముందర ప్రకాశం, శబ్దం ఉన్నాయి. ప్రకాశాన్ని చూస్తుంటాను. శబ్దాన్ని వింటాను. ప్రకాశాన్ని చూసే, శబ్దాన్ని వినే వస్తువును అన్వేషిస్తుంటాను. దాని అంతు దొరకదు.

మీరొస్తారు. మీరంతా పెద్ద మనుషులు. నేను మిమ్మల్నో, పేదవారినో మోసగించి నా వెంట తిప్పుకోవాలనుకోను. నాలుగు రోజుల జీవితం. ఒక రోజు వెళ్ళిపోవాల్సి ఉంది. "ధుర్ పదం" అంటే ఏమిటి? నా సురతే అంతా, అన్నీ అని నేనంటే మరి నాలో ఏమైనా చేయగల శక్తి ఉండి తీరాలి. ఒకవేళ నేను అలఖ, అనామీ నైతే నా వ్యాధిని దూరం చేసుకోవచ్చు. ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు కానీ నేను చేయలేను. బాబాజీ! మీరు మా పని చేశారు. ఫలానా సమయంలో మాకు సాయంచేశారు అని చెబుతుంటారు. నేను ఎవరికీ సాయం చేయడానికి వెళ్ళను. నేను సత్యం చెబుతున్నాను. ఇదంతా నీ ఆశ, నడవడి, ప్రవర్తన, సత్యహృదయం, విశ్వాసం. ఇదే నీకు సహాయం చేస్తుంది. నేను కేవలం ఉత్సాహం విచారాలే ఇస్తుంటాను. నాలో బహుశా ఈ శక్తి లేదని ఆలోచిస్తుంటాను. హుజూర్ దాతా దయాల్ జీ లేక ఇతర సంతులు అనామీ ధామంలో ఉండే వారిలో ఈ శక్తి ఉండి ఉంటుంది. కానీ ఎలా అంగీకరించగలను? హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్ ధామం పాడుపడింది. సంతుల యుక్త వయస్కులైన కొడుకులు చనిపోయారు. పల్టూ సాహబ్ స్థితి ఏమైంది? ఆ సర్వాధారుడు అంతంలేని వాడనే పరిణామంపైకి వచ్చాను. అందులో చలనం ఉంటుంది. దయాల్ దేశం, కాలదేశం, శబ్ద ప్రకాశాలు, జీవజంతువులు ఏర్పడతాయి. వాటిలో సురత్ వస్తుంది. తరువాత ఆత్మ ఉంది. దీనికంటే కింద మనసు ఏర్పడుతుంది. తరువాత శరీరం, జ్ఞానం, తెలివి పుడతాయి. నేను ఆ పరమాత్మ అనే సింధువులో నేనొక గాలిబుడగను, ఆ సర్వేశ్వరుని దయతో రూపొందాను, ఆయన దయతోనే ఆయన ఇచ్ఛతోనే చిట్లి పోతాను అనే జ్ఞానం కలగాలి. ఇది అర్థం చేసుకొని ప్రపంచంలో నిశ్చింతగా, దుఃఖరహితంగా ఉండే స్థితిపేరు "ధుర్ పదం" అని నాకు అనిపిస్తుంది. ఎందుకంటే కబీర్ సాహబ్ కూడా ఇదే చెప్పారు. కనుక నేను సరైన రీతిలో ఉన్నానని నాకు నమ్మకం కలిగింది. ఆయన రాస్తారు.

హంసా! ఛోడో కర్మ కీ ఆసా

కర్మ యొక్క ఆశను విడిచి పెట్టుమని ఆయనంటారు. నా అనుభవం ఏమిటంటే నీవు స్వయంగా కర్మచేయవు. ఈ కర్మలు స్వాభావికంగానే ప్రకృతి వైపునుండి ఏర్పడ్డాయి. ఎవరి గ్రహాలు ఎలా ఉంటే వాటి చలనాన్ని అనుసరించడానికి వివశులై కర్మ చేస్తుంటారు. దీనికి రుజువు చూపుతాను. ఉత్తర ప్రదేశ్‌కు గవర్నర్‌గా, గొప్పనాయకునిగా ఉన్న కే.ఎం. మున్షీ ఒక పుస్తకం రాశారు. అందులో పదమూడు అధ్యాయాలున్నాయి. వ్యక్తి లోపల చాలా శక్తి ఉందనీ, మనిషి కోరితే ఏదైనా చేయగలడనీ! మొదటి పన్నెండు అధ్యాయాలలో ఆయన రాశారు. కానీ పదమూడవ అధ్యాయంలో తాను ఈ పన్నెండు అధ్యాయాలలో రాసినదంతా తప్పని రాశాడు. ఆయన ఇంకా ఇలా రాశాడు. "నా చిన్నతనంలో మా నాన్న చనిపోయాడు. మా అమ్మ నిరుపేద. నేను జబ్బు పడ్డాను. మా అమ్మ నా జన్మకుండలి తీసుకుని జ్యోతిష్యుని దగ్గరికి వెళ్ళింది. అతడు దానిని పరిశీలించి నీ కొడుకు ఒకనాటికి గవర్నర్ అవుతాడు. అతని గ్రహాలు అలా ఉన్నాయి. నువ్వు చింతించకు ఇతడికేం కాదు అన్నాడు. నేను కోలుకున్నాను. చదువులో బాగా తెలివైనవాడిని. ప్రారంభం నుండి చివరి వరకు స్కాలర్ షిప్ లభించింది. బాగా చదువుకున్నాను. ఉత్తరప్రదేశ్‌కు గవర్నర్ నయ్యాను" అని రాశాడు. కనుక ఏది జరగవలసి ఉందో అది మొదటే రాసిపెట్టబడి ఉంటుంది. అందుకే నేనంటున్నాను, ఎందుకు చింతిస్తావు? ఎందుకు దిగులు పడతావు?

హంసా ఛోడో కర్మ కీ ఆసా
కర్మ కాల్ సబ్ జగత్ నచావే, ఫిర్ ఫిర్ కరే గ్రాసా

ఇది ప్రకృతి నియమం. ఇది మన కర్మ చేస్తుంది. కానీ మనం మనం చేశాం, మనం ఇది చేస్తాం, అది చేస్తాం అనుకుంటాం. మనలో ఒక 'నేను' అనే భావన వచ్చేస్తుంది. "దానిని వదిలెయ్! శరణా గతిలోకి రమ్మ"ని ఆయన చెబుతున్నాడు. His will is supreme.

కర్మ హీ కాల్, కాల్ పుని కర్మ హీ, కర్మ హీ కీ సబ్ త్రాసా ।

చలనంలో ఉన్నవన్నీ - చంద్రుడు, సూర్యుడు, తారకలు, పృథ్వీ ఇవన్నీ కర్మ చక్రంలో ఉన్నాయి. మనమందరం కూడా కర్మ చక్రంలోనే

ఉన్నాం. చాలా సార్లు ఆలోచిస్తుంటాను! "ఫకీర్! నిన్ను నీవు సంత్ సద్గురు వక్తనని చెబుతావు ప్రజలు కూడా నిన్ను గురువనుకుని నీ వద్దకు వస్తారు. నీకేం దొరికిందో చెప్పు" అని. నేను చైతన్య సింధువులోని ఒక గాలిబుడగను అనే విషయం నాకు తెలిసింది. ఆ సర్వేశ్వరుడు అకహ-చెప్పజాలనివాడు, అపార్-పారం-తీరంలేనివాడు. అంతులేనివాడు. అగాధం అంతులేని లోతైనవాడు. అనామ్-నామంలేనివాడు, (అన్ని నామాలూ కలవాడు) ఎవరికీ ఆయన లభించలేదు. ఒకరు ఆయన్ని 'హైరత్‌రూపం' అన్నారు మరొకరు బే అంత్ - అంతంలేని వాడన్నారు. మనను మనం ఆ ప్రకృతికి అర్పణ చేసుకొని "రాజీ బ రజా" అనగా దైవేచ్ఛపై ఆధారపడి ఉండాలి. ఎవరితో ఏ పని తీసుకోవాలో దాని ప్రకారం వారి మేధస్సులను ప్రకృతి ప్రేరేపిస్తూ ఉంటుంది. మనిషి వశంలో ఏదీ లేదు. మనం ఇతరులపై దోషారోపణ చేస్తాం. ఫలానా వారు ఇలా అన్నారు. అలా చేశారు అంటూ నిందిస్తాం. కానీ వారి వశంలో కూడా ఏదీ లేదు. అనటం, వినటం, అర్థం చేసుకోవటానికి గొప్ప గొప్ప మహాపురుషులు పతనమయ్యారు. ఇది వారి వశంలోని విషయంకాదు. వారి కర్మ అంతే! ఇంజినీయర్ గారూ! మీకు ఎంతో ఉన్నతి లభించింది. అది మీ కర్మలో ఉంది. నేనుగానీ, మీరుగానీ ఏమీ చేయలేదు. తన వశంలో ఏదీ లేదనే జ్ఞానం మనిషికి కలిగితే అతని జీవితం సుఖంగా గడుస్తుంది. మనకు జ్ఞానం లేదు కనుకనే ప్రతి ఒక పనికి "నేను"ను చేరుస్తుంటాం. ఫలితంగా దుఃఖపడుతుంటాం. సుఖాన్నీ అనుభవిస్తాం.

జప్ తప్ కర్మ బాంధ్ జగ్ రాఖే, పాప్ పుణ్య విశ్వాసా

నీవు జపతపాలను ఏదో ఒక ఉద్దేశ్యం కోసం చేస్తావు. కర్మ ఉద్దేశ్యం అయితే ఇక కర్మఫలం సుఖ, దుఃఖాల నుండి ఎలా తప్పించుకోగలవు? ఇది అవశ్యం అనుభవించవలసిందే.

కర్మ హీ దేవల్ తీర్థ్ కీనే, కర్మ హీ అల్లా ఉదాసా,
కర్మ హీ యోగ్ ధ్యాన్ తప్ పూజా, కరే చఢావే దాసా
కర్మ హీ దుఃఖ్ సుఖ్ జడ్ చేతన్ హై, తీన్ లోక్ ప్రకాశా ॥

అన్ని లోక-లోకాంతరాలలో కర్మ చక్రం ఉంది. కర్మ అనగా అర్థం గతి, చలనం. ఈ గతి ప్రతి ఒక్క స్థానంపై ఉంది. మన శరీరంలో కూడా గతి

చలనం ఉంది. ఇది మనకు తెలియదు. కనుక మనకు జ్ఞానం, శాంతి రావాలంటే ఏం చేయాలి? సంత్ మతంలో ఏం లభిస్తుంది? సంతులు వ్యాధుల్ని తొలగిస్తారని కొందరు భావిస్తారు. తమ రోగాల్ని దూరం చేసుకోలేని వారు నీ రోగాన్ని ఎలా దూరం చేయగలరు? వాళ్ళు వారి పిల్లల్ని కాపాడుకోలేక పోయారు. నీ పిల్లల్ని ఎలా రక్షిస్తారు? పల్టూసాబ్ అనేవాడు

సాధో! హమ్ వహా( కే వాసీ జహా( పహు(చే న అవినాశీ

ఇదే కాదు. ఆయన మరోమాట కూడా అనేవాడు. ఏ పనిని ఈశ్వరుడు, పరమేశ్వరుడు చేయజాలరో దానిని సంత్ చేయగలుగుతాడు అనేవాడు. కానీ ఆయన స్థితి చివరికి ఎలా అయింది? ఇతర సాధువులు ఆయన్ని ఎత్తి నూనెమరుగుతున్న బాణలిలో వేశారు. ఆయన జీవితం అలా ముగిసింది. తమ ఆశ్రమాల కోసం, పేరు ప్రతిష్ఠలకోసం సంతులు రోచకమైన, భయానకమైన మాటలు రాశారు. బ్రాహ్మణుల రాజ్యంలో బ్రాహ్మణుల మాటలు చెల్లాయి. బౌద్ధుల రాజ్యంలో భిక్షువుల ఆటలు సాగాయి. ముసల్మానుల రాజ్యంలో కాజీల ఆటలు సాగాయి. ఇప్పుడు సంతుల రాజ్యంలో సంతుల మాటలు చెల్లుతాయి.

హుజూర్ దాతా దయాల్ జీ నా గురించి చాలా రాశాడు. ఆయన ఆజ్ఞను పాటించడానికి నేను చాలా పనులు చేస్తాను. నీవొక వేళ తప్పుడు రీతిలో సాధువుల సేవ చేస్తే నీవు పొరపడుతున్నావు. కబీర్ సాహబ్ ఒకచోట సాధువు మహిమను గురించి రాశాడు.

బేటా బేటీ స్త్రీ సాధు కహే( సో దే,
సర్ సాధు కో సోంప్ కర్ జన్మ సఫల్ కర్ లే ।

అయితే మనం సాధువులకు బిడ్డల నివ్వాలా? నేను సంత్ సతగురు వక్తను. ఇతర మహాత్ములు తమ శిష్యులతో తమ గొప్పదనం ప్రచారం చేయించుకుంటారు. కానీ నా గొప్ప నేనే చెప్పుకుంటాను. నేనీ ప్రపంచంలోకి సత్యాన్నే చెప్పడానికి వచ్చాను. మీరాలోచించండి. ఈ వాణిని చదివిన వ్యక్తి సాధువులకు సేవ చేస్తాడా? ధనం ఇస్తాడా? స్త్రీలు కూడా అతన్ని సేవిస్తారా? ఇతడు సాధువేనా కాదా అని కూడా ఎవరూ ఆలోచించరు. ప్రపంచం

వ్యర్థంగా అజ్ఞానవశాన దోపిడీకి గురవుతోంది. ఈసారి దసరాకు నేను సత్సంగమివ్వడానికి ఢిల్లీ వెళ్ళాను. అక్కడికి సంత్ కృపాల్‌సింగ్‌జీ మహారాజ్, ముని సుశీల్ కుమార్ జీ మహారాజ్‌లు కూడా వచ్చారు. నేను సంత్ సద్గురు వక్త్ ననీ, ఈ సమయంలో అవసరమైన శిక్షణ నిస్తాననీ వారి ఎదుట అన్నాను. ఆ సర్వేశ్వరుడు ఒక తత్వం. అతని అంతు ఎవరూ కనిపెట్టలేకపోయారు. ఎవరూ ఆయన్ని తెలుసుకోలేకపోయారు. తమను తాము బ్రహ్మ అని చెప్పుకునే వేదాంతులను కోపగించుకుంటాను. వారి వైఖరి నాకు నచ్చదు. ఆ సర్వేశ్వరునికి ఎన్ని సృష్టులు లేదా ఎన్ని ప్రకృతులు ఉన్నాయో ఆలోచించాల్సిన విషయం. కోట్లాది సూర్యులు, కోట్లాది చంద్రులు, కోట్లాది జీవజంతువులున్నాయి. ఇన్ని సృష్టులలో మనిషి ఉనికి ఏమిటి? ఎంత? కానీ మనిషి దేవుడవుతాడు.

**సాధ్ మిలే యే సబ ఛూటే, కాల్ మాల్ యమ చోట్ ।**
**సీస్ నివావత్ ఢై పడే, రఖ్ పాపన్ కే పోట్ ॥**

సాధువు ఎదుట తలవంచి మొక్కటంవలన నీ పాపాలు దూరమవుతాయా? సాధువు మహిమ నాకు తెలుసు. సాధువు చెప్పిన వాక్కులను ఆచరించటం వలన నీ పాపాలు దూరమవుతాయి. నా మందిరం కట్టించినా, నా మెడలో బంగారం వేసినా, నాకు రూపాయ లిచ్చినా నీ పాపాలు తొలగిపోవు. సత్సంగంలో నా వచనాలను విను, అర్థంచేసుకో, తరువాత వాటిని ఆచరిస్తే నీ పాపాలు తొలగిపోతాయి. వేలాది, లక్షలాది మంది కుంభమేలాకు వెళ్తారు. చింతాపూర్ణికి వెళ్తారు, కొందరు ఆనందపూర్‌కు వెళ్తారు. మరికొందరు మరో చోటికి పోతారు. అక్కడికి వెళ్ళటం వలన వారి పాపాలన్నీ సమాప్తమై పోతాయా? ఆచరించటం వలన పాపాలు దూరమవుతాయి.

అన్ని మతాల వారు, ధర్మాలవారు మతాంతరాలవారు భయానక వచనాలను రాసిరాసి ప్రపంచాన్ని తమ వెంట తిప్పుకున్నారు. వారిని తమ బరువులు మోసే జంతువుగా చేసుకున్నారు. ప్రజల ధనం తిని ప్రపంచంలో ఏవగింపు, ద్వేషం, ఈర్ష్యలను వ్యాపింపచేశారు. ఈ మత విద్వేషమే పాకిస్థాన్‌ను అలా చేసింది. అరబ్బు ఇజ్రయిలీలను పోట్లాడుకునేలా చేసింది. ప్రతిచోటా మతాల, ధార్మిక జగడాలను పుట్టించింది. ఈ అజ్ఞానంతో ప్రపంచం ఏం

లాభం పొందగలిగింది? సాధువు గొప్పదనం ఏమిటంటే ఆయన బుద్ధి, వివేకాలనిస్తాడు. అందుకే తులసీదాస్ అన్నాడు -

ఏక్ ఘడీ ఆధీ ఘడీ, ఆధీ సే పుని ఆధ్ ।
తులసీ సంగత్ సాధ్ కీ, కటే కోటి అపరాధ్ ॥

ఈ మాటను నేను అంగీకరిస్తాను. ఎలా? అపరాధమంటే తప్పు, పొరపాటు సాధువు సాంగత్యంతో అసలు విషయాన్ని అర్థం చేసుకుంటే నువ్వు ఇక తప్పు చేయవు. అపరాధం చేయవు. నా దగ్గరికి కొందరు వస్తుంటారు. బాబాజీ! నా పేదరికం తొలగిపోవాలని ఒకరంటారు. మరొకరు కొడుకు కావాలంటారు. మరొకరిది ఏదో దావాకేసు ఉంది. అది నెగ్గాలంటారు. మరొకరు తమను వేధిస్తున్న వ్యాధి దూరం కావాలనుకుంటారు. తమ కూతురికి పెళ్ళి కుదరటంలేదని వేరొకరు మొర పెట్టుకుంటారు. ఇలా వారి వారి వ్యక్తిగత కోరికలు తీరాలనే తప్ప వివేకం ప్రాప్తించుకోవాలని ఎవరొస్తారు? తమ్ముడూ! ఇవన్నీ మీ కర్మల ఫలితాలే! మీకు దొరికినదంతా మీకర్మ వల్లనే, దొరుకుతున్నదంతా మీ కర్మవల్లనే, దొరకబోయేదీ మీ కర్మల వల్లనే లభిస్తుంది. కనుక ఇంజినీయర్ సాబ్! మీరొచ్చారు. మీకు ఇష్టమైతే నిస్సందేహంగా రండి. మీకు ఇష్టమైతే నా పుస్తకాలు చదవండి. లేకుంటే చదవకండి. మీకు ఇష్టమైతే మందిరానికి డబ్బులివ్వండి. లేకుంటే ఇవ్వకండి. కానీ అబద్ధపు మాటలుచెప్పి మిమ్మల్ని నా వెంటపెట్టుకోవాలని నేననుకోవటం లేదు. నాలుగు రోజుల జీవితం. నేనూ ఒక రోజు చనిపోవలసే ఉంది. నాకు నా పేరు ప్రసిద్ధి చెందాలనే అవసరం, కోరికలేదు. దాతా దయాల్ జీ మహారాజ్ నన్ను ఆజ్ఞాపించాడు.

తూ తో ఆయా నర దేహీ మే, ధర్ ఫకీర్ కా భేసా ।
దుఃఖీ జీవకో అంగ్ లగా కర్, లే జా గురు కే దేశా ॥

తీన్ తాప్ సే జీవ దుఃఖీ హై, నిబల అబల అజ్ఞానీ ।
తేరా కామ్ దయా కా భాయీ, నామ దాన్ దే దానీ ॥

నా వాణిని, నా వచనాలను మీరు ఆచరిస్తే మీ నావ నదిని దాటుతుంది. ఎవరికి ఏది లభించినా వారి వారి విశ్వాసాల ఫలం లభిస్తుంది.

సుబేదార్ హజారీ సింహ ఉత్తరం మొన్న సత్సంగంలో వినిపించాను. ఆయన రాశాడు, "బాబాజీ! మేం కొందరం పిల్లలతో కలిసి రెండు వాహనాలలో కూర్చుని ధనుష్కోటి చూడడానికి తయారయ్యాం. ఇవాళ ధనుష్కోటికి మేం చేరలేక పోవచ్చని నాకు అకస్మాత్తుగా ఆలోచన వచ్చింది. మీ రూపం నాలో ప్రకటమైంది. "చింతించక్కు, నేనెవరినీ చావనీయను" అని మీరు చెప్పారు. మేం బయల్దేరాం. దైవేచ్ఛ! దారిలో ఒక వాహనం నేలపై దొర్లిపోయింది. అందులో నేనే ఉన్నాను. అది నాలుగు పల్టీలు కొట్టింది. కింది మా పుత్రుడు, వాడిపై నేను, నా పైన వాహనం మరో వాహనం ఆగింది. మమ్మల్ని లేవనెత్తారు. మరికొందరికి గాయాలయ్యాయి. అందరికంటే ఎక్కువ దెబ్బలు నాకే తగిలాయి. నా పక్కటెముకలు విరిగాయి. మమ్మల్ని అసుపత్రికి తరలించారు. నాకు చాలా కష్టమైంది. రాత్రికి మీరొచ్చారు. నా ఎముకల్ని వత్తసాగారు. నాకు సగానికి పైగా నొప్పులు తగ్గాయి. నా ఆరోగ్యం కోసం మీ ఫోటో ఎదుట నిల్చుని ప్రార్థిస్తున్న నా భార్యకు కనిపించి, "నీ భర్త దగ్గరనుండే వస్తున్నాను. అతడికి త్వరలోనే నయమవుతుంది." అని చెప్పారు. ఉదయం నేను నా స్థితిని నా భార్యకు చెబితే ఆమె ఈ విషయం చెప్పింది. తను మూడవ అంతస్థులో ఉంది. ఇంట్లోని అన్ని తలుపులూ మూసి ఉన్నాయి. మీరు కిటికీ మార్గంనుండి మూడవ అంతస్థులోని మా ఇంట్లోకి ప్రవేశించారట. అదే దారినుండి వెళ్ళి పోయారట! అని రాశాడతడు.

ఇలాంటి మాటలు విన్నప్పుడు ఆశ్చర్యపడుతుంటాను. నేనైతే పోలేదు. అలా వెళ్ళిందెవరు? ఇదొక పరదా! దీని కారణంగా మిమ్మల్ని మూర్ఖుల్ని చేసి దోచుకోవటం జరిగింది. ఇదంతా మీ విశ్వాసమే! దానిని సగుణంపైనైనా ఉంచండి. లేదా నిర్గుణంపైనైనా ఉంచండి. ఆ ప్రకటమైన రూపంతో నీ ప్రాపంచిక పనులు నెరవేరుతాయి. కానీ నీకు జ్ఞానం, యోగ్యత జీవించి ఉన్న సంత్ సత్‌గురువుతోనే లభిస్తాయి. ఇంజినీర్ సాబ్! నిన్న మీరు ఒక దుప్పటి ఇచ్చారు. ఆ దుప్పటిని తీసుకునే అర్హత, అధికారం నీకెక్కడివని నన్ను నేను ప్రశ్నించుకుంటాను. నా నుండి జ్ఞానం తీసుకు వెళ్ళండి. జ్ఞానదాత అనే యోగ్యతతో నాకు ఎవరైనా ఏమైనా ఇస్తే నేను తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. నేను నిజానికి ఎక్కడికీ వెళ్ళను. ఏ సాయమూ చేయను. "బాబాజీ

ఇది చేశాడు అది చేశాడు" అంటారు. అజ్ఞానంతో ఎవరైనా నాకు ఏమైనా ఇవ్వగోరితే, వారినుండి ఏ వస్తువైనా తీసుకునే అర్హత నాకు ఉండదు. సంతుల భయంకర వాక్కులు ప్రపంచాన్ని సంతుల వలలో బంధించాయి. కబీర్ సాహబ్ రాశాడు.

బేటా, బేటీ స్త్రీ, సాధ్ కహే సో దే
సర్ సాధు కో సోంప్ కర్, జన్మ సఫల్ కర్ లే

ఈ వాక్కును చదివిన వారు ఏం చేస్తారు? వినండి. అమృతసర్ నుండి నా దగ్గరకు ఒక వ్యక్తి వచ్చాడు. తన గురువుకు తన భార్యకు మధ్య అక్రమసంబంధం ఉందని చెప్పాడు. గురువును ఏమైనా అంటే పాపం చుట్టుకుంటుంది. ఆయన శపిస్తాడని అన్నాడు. ఇలాంటి భ్రమలు గృహస్థుల హృదయాల్లో నింపారు. ఆలోచించండి. ఇది నా జీవన అనుభవం కనుక నేను సత్యంతో పని చేస్తాను.

చాలా సంవత్సరాల కిందటి విషయం. వ్యాస్‌దేరాకి చెందిన 'రసాలా సారీ దునియా' పత్రిక ఎడిటర్ ఓ జంటను నా వద్దకు పంపించాడు. భార్యను భూతం ఆవహించేదట. ఆమెకు పిల్లలు లేరు. 'పెళ్ళై ఎన్నేళ్ళయింది' అడిగాను. ఏడేళ్ళైందని చెప్పారు. ఆ యువకుడితో, "నీవు నపుంసకుడివా" అని అడిగాను. అతడు ఔనన్నాడు. "నీవు సత్సంగివా" అన్నాను. "అవును" అన్నాడు. "మీ దగ్గరికి ఎవరైనా సాధువు సత్సంగం ఇవ్వడానికి వచ్చేవాడా" అని యువతిని అడిగాను. ఆమె అవునంది. "నీవు మగవాడివి కాదు. ఈమె కామంలోని రుచి చూసింది. ఇప్పుడా రుచే, ఆలోచనే ఆమెను భూతమై వేధిస్తోంది. నాకు బోధపడిన చికిత్సను వారికి చెప్పాను. వాళ్లు వెళ్ళి పోయారు. కనుకనే సాధువు గొప్పదనం, మహిమ ఉంది.

భూమి పవిత్ర హోయ్ సంత్ జహాం పగ్ ధరే

కానీ నియమం మేమిటంటే ఆ సంత్ సంపూర్ణంగా సంత్ అయి ఉండాలి. నేను ఇప్పటికీ పతనమవుతుంటాను. వంద సంవత్సరాల పూజ, ఆరాధనల కంటే రెండున్నర ఘడియల సత్సంగం గొప్పది అనే స్థాయి సత్సంగం ఇస్తున్నాను. పూజ, ఆరాధనల వలన నీకు అర్థమైనా దాని వలన

నీకు జీవనపు అనుభవాలు కలుగుతాయి. కానీ ఇట్లా కాదు, ఇట్లా చేయమని యోగ్యుడైన సత్పురుషుడు నీకు వెంటనే బోధిస్తాడు. నేను నా సమస్త జీవితంలో ఎంతో అభ్యాసంచేశాను. ఇప్పటికీ చేస్తాను. కానీ నా అనుభవమే సరైనదని చెప్పను. ఈ ప్రపంచం మన కర్మలేనని, ఇదంతా ఆ పరమాత్మ ఇచ్ఛ, దయే నని మనిషికి జ్ఞానం కలిగినప్పుడు ఇక అతడు తన కష్టాల గురించి చింతించడు. బాధపడడు. ఇక అతడి జీవనం సుఖమయమవుతుంది.

సంత్ జన్ మారగ్ విహంగ్ బతావే

విహంగం అంటే పక్షి. పక్షి ఏం చేస్తుంది? ఒక శాఖపై నుండి మరో శాఖ పైకి ఎగిరిపోతుంది. రెండో దానిపై నుండి మూడవ కొమ్మపై వాలుతుంది. అంటే అది చంచలమైనదని అర్థమవుతోంది. ఒక చోట విశ్రాంతిగా కూర్చోదు. ఇలాగే మనిషి కూడా తన విచారాన్ని ఒక అనుభవంతో పరిశీలించాలి. దానిలోని హాని లాభాలను పరిశీలించాక ఇక దానిని వదిలిపెట్టాలి. రెండవదాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి. కానీ మనం దానిని విడిచిపెట్టి హానిని పొందుతాం. నిన్న చండీగఢ్ నుండి ఒక నవయువకుడొచ్చాడు. మొదట్లో కూడా వచ్చేవాడు. ఒక యువతిని ప్రేమించాడు. ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానన్నాడు. అతడి తల్లిదండ్రులు నాతో ఈ విషయం చెప్పారు. "అంతా సరిగానే అవుతుంది" అన్నాను. ఆ అమ్మాయి మరో యువకుణ్ణి ప్రేమించసాగింది. ఆ విషయం తెలిసిన ఈ యువకుడు వెళ్ళి ఆ అమ్మాయిని కొట్టాడట. ఆ అమ్మాయి రెండోసారి ఇతణ్ణి ప్రేమించటం మొదలు పెట్టింది. నేనా కుర్రవాడితో "ఆమె మోసగత్తె అయితే పోనీ" అని చెప్పాను. అనుభవం అయ్యాక దానిని వదిలిపెట్టు. రెండవ అనుభవం చేసుకో. ఇది ప్రపంచపు విహంగం. మన విహంగం ఏమిటి? మనం సహస్రదళ కమలం లేక త్రికుటిలో అభ్యాసం చేస్తాం. మన మనసులో రకరకాల విచారాలు ఉత్పన్నమవుతాయి. మనం మన ఇష్టుని ద్వారా వాటిని ఆపుతాం. అవి సమాప్తమవుతాయి. మనం మన ఇష్టుణ్ణి ప్రేమిస్తాం. ఆనందం పొందుతాం. సాధనలో ఎవరికైనా ఆనందం లభించకుంటే ఆ సాధన చేస్తున్న పద్ధతి తప్పు. కనుక నీ సాధనను సరైన రీతిలో చేయి. ఒక స్థానపు ఆనందం పొందాక దానిని వదలి ముందుకు వెళ్ళు. కానీ మీరు అక్కడే ఆ ఆనందంలోనే చిక్కుబడి ఉంటారు. ఒక వేళ

ఏకతావాదంలో నీకు సుఖం లభిస్తే, నీవు దానిని వదలి అనేకవాదంలో చిక్కుపడతావు. ఈ నడక నీ విహంగం నడక కాదు. నీవు ప్రతిరోజూ చూస్తుంటావు. జనం మరణిస్తారు. ఏదో ఒకనాటికి మనం కూడా మృతి చెందుతామని నీకు తెలుసు. ఎవరైనా మరణిస్తే మనం ఏడుస్తాం. ఒకనాడు మనం కూడా మరణిస్తామని తెలిసినప్పుడు ఇక ఏడవటం వలన లాభమేమిటి?

ముందు అనేకవాదంలోకి వెళ్ళు. తరువాత త్రికుటిలోకి వెళ్ళు. చాలా ప్రేమచేయి. ఆనందం పొందు. తరువాత సున్న్‌లోకి వెళ్ళు. మహాసున్న్‌లోకి వెళ్ళు. ఆనందం ప్రాప్తించుకో. మళ్ళీ కిందికి రాకు. పైకి వెళ్ళు. అనుభవం తరువాత వీటన్నిటినీ వదిలి నేను వెళ్ళిపోయాను. ఇప్పుడు కేవలం పైకి వెళ్ళాను. ఎందుకంటే కిందిస్థాయిలో నాకు అనుభవాలు అయ్యాయి. ఇదంతా నా మనసు కల్పనలే తప్ప మరేదీ కాదని తెలిసిపోయింది. కనుక పైకే వెళ్ళాను.

సంత్ జన్ మారగ్ విహంగ్ బతావే
కౌన్ ఘర్ సే జీవ కీ ఉత్పత్తి, కౌన్ ఘర్ కో జావే।

మహా సున్న్‌లో సమాధి స్థితి ఏర్పడితే ఇక ఈ సమాధి స్థితి కూడా వస్తుంది. ఏమిటి? నా మనసు ఇక్కడి నుండి దాటింది, ఈ మానసరోవరం నుండి దాటింది. సంతులు ఈ స్థానానికి మానసరోవరమని పెట్టారు. అక్కడ నీరు లేదు. అక్కడికి వెళ్ళి మనసు లహరులు ఏకత్రితమవుతాయి. ఓం యొక్క బిందువు పేరు మహాసున్న్. మీరు నన్ను రంగు రూపులనుండి బయటికి తీశారు. మీ అనుభవాల వల్లనే నాకీ జ్ఞానం కలిగింది.

ఇక్కడ భూప్‌సింహ్ కూర్చుని ఉన్నాడు. ఏదో కారణం వలన ఇతడు అశాంతిగా ఉండేవాడు. ఢిల్లీ కుతుబ్ మినార్ పై నుండి దూకి ఆత్మహత్య చేసుకోబోయాడు. నా రూపం ఇతని లోపల ప్రకటమై "భూప్ సింహ్! మేలుకో! మేలుకో. నీవు మేల్కొనే సమయం వచ్చింది" అందట.

ఏక్ హీ సాధే సబ సధే, సబ్ సాధే సబ్ జాయ్

అని అన్నానని చెప్పాడు భూప్‌సింగ్. నేను వెళ్ళలేదు. అలా చెప్పలేదు. మరి ఎవరు వెళ్ళారు? నా రూపంలో ఉండి ఎవరు చెప్పారు? అతని మనసే అతని విశ్వాసమే అలా వెళ్ళింది. ఎందుకంటే ఇతనికి తన దుఃఖాల నుండి

తప్పించుకోవాలనే కోరిక ఉండేది. సత్యమైన తపన ఉండేది. కనుక ప్రకృతి ఇతనికి ఇలా ఏర్పాటు చేసింది. ఇంజినీయర్ గారూ! సత్యమైన గురువు నీ లోపల ఉంటాడు. బయట ఉండడు. బాహ్యగురువు కర్తవ్యం కేవలం నీకు అసలు గృహపు చిరునామా అందించటం.

ఘర్ మే ఘర్ దిఖ్‌లాయ్ దే, సో సతగురు పురుష సుజాన్

హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్ ఒక శబ్దం రాశారు.

యహ మన్ సమఝు న జోగ్ సాధో, యహ మన్ సమఝు న జోగ్ ।
మన్ హీ జ్ఞాన్ అవుర్ మన్ హీ ధ్యాన్ హై, మన్ హీ మోక్ష అవుర్ భోగ్ ॥

నాకు ఈ మనసు అర్థమయ్యేది కాదు. మనసు రూపం బోధించడానికి హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్ నాకు గురుపదవిని ఇచ్చాడు. ఈ పని చేయమని చెప్పాడు. ఆయన ఆజ్ఞాపించారు, "ఫకీర్! నీకు సత్యమైన సత్‌గురువు దర్శనం సత్సంగీయుల రూపంలో లభిస్తుంది" అన్నారు. నా రూపం లోకుల అంతరంలో ప్రకటమవుతుంది. వారికి సహాయపడుతుంది. కానీ అది నేను కాను. మరి వారి లోపలికి ఎవరు వెళ్తారు? వారి విశ్వాసమే. ఈ మహాత్ములు ప్రపంచానికి సత్యాన్ని చెప్పలేదు. అందరూ పరదాపెట్టారు. తెరలు కప్పారు., నిజం చెబితే వారికి రూపాయలు అందవు. సత్కారాలు లభించవు. కెప్టెన్ లాల్‌చంద్ ఓ సారి చెప్పారిలా - ఇతని సిపాయి ఎక్కడికో వెళ్తుంటే దారిలో కొందరు సాధువులు కూర్చుని భంగు నూరుతున్నారు. వారి చర్య సిపాయికి కోపం తెప్పించింది. అతడు వారిని విమర్శించి, భంగ్ నూరుతున్న జాడీని విరగొట్టాడు. 'నువ్వు మమ్మల్ని బాధించావు. నీవు అంధుడివవుతావు' అన్నాడట ఒక సాధువు. సిపాయికి మనసులో ఆలోచన, భయం కలిగాయి. 'నిజంగానే అంధుడినైతే' - అనే సందేహం కలిగింది. అతని బలహీన విచారం కారణంగా అతని దృష్టి బలహీనమైంది, మిలిట్రీ ఆసుపత్రికి వెళ్తే డాక్టర్ నీవు ఊరికే చెబుతున్నావ్' అన్నాడట. కెప్టెన్ లాల్ చంద్ నా సత్సంగం విన్నాడు గనుక ఆయన దీని వెనక ఉన్న కారణం తెలుసుకోగలిగాడు. అర్థంచేసుకోగలిగాడు. అతడు సిపాయికి నా ఫోటో ఇచ్చి "చూడు! ఈయన గురువులకే గురువు. ఈయన ఎదుట ప్రార్థన చెయ్. నీ దృష్టి మెరుగుపడుతుంది.' అని చెప్పాడు.

అతడు ఆచరించాడు. దృష్టి బాగుపడింది. "అతడి దృష్టిని నేను బాగుపరిచానా?" అని ఆలోచిస్తాను. నాకు అతడెవరో కూడా తెలియదు. ఆ సిపాయి హిందువు. సాధువులకు శపించే శక్తి ఉంటుందని హిందువులకు ఒక నమ్మకం. ఆ విచారమే ప్రభావం చూపి అతని దృష్టిపై పడింది. కెప్టెన్ లాల్ చంద్ సాహబ్ అతనికి మరొక విచారం ఇస్తే ఇక అతని దృష్టి బాగుపడింది. కనుక ఇదంతా విచారాల ప్రపంచం. అందుకే నీ విచారాలను సరిగ్గా ఉంచుకునే ప్రయత్నం చెయ్.

ఒకసారి నేను హన్మకొండకు వెళ్ళాను. నాతో పరస్‌రామ్ కూడా ఉన్నాడు. ఒక ఆదివారం రోజు పరస్‌రామ్ భార్య స్టేషన్‌కు బయల్దేరింది. ప్రాతఃసమయం. చీకటిగా ఉంది. వంటరిగా ఉన్నందున దారిలో ఆమెకు భయమైంది. "బాబాజీ! మిమ్మల్ని తలచుకున్నాను. మీరొచ్చారు. నన్ను స్టేషన్‌లో వదిలేసి మాయమయ్యారు" అని ఆమె చెప్పింది. నేను వెళ్ళానా? లేదు. మిమ్మల్ని స్వేచ్ఛాజీవులను చేసి వెళ్ళాలనుకుంటున్నాను. నా తరువాత మీరు ఏమైనా అడగడానికి ఇతర మహాత్ముల వద్దకు వెళ్ళే అవసరం రాకూడదు. మనసు రూపాన్ని అర్థంచేసుకున్న తరువాత వ్యక్తి రెండవ ద్వారం నుండి ముందుకు వెళ్ళగలడు. కాని వెళ్ళడు. ముందర శబ్ద ప్రకాశాలున్నాయి. నేనక్కడికి చేరుకుంటాను. కానీ ప్రతి ఒక్క వ్యక్తి అక్కడికి చేరుకోజాలడు. ఎందుకు? మేధస్సుపై పడి ఉన్న సాంసారిక ఇచ్ఛలు అక్కడిదాకా చేరుకోనివ్వవు. కనుక ఒక పద్ధతి ఉంది. ముందుకు వెళ్ళాలని ఒక ప్రబలమైన కోరిక పెట్టుకో. దుఃఖ సమయంలో అందరూ తమ ఇష్టుణ్ణి, పరమాత్మను జ్ఞాపకం చేస్తుంటారు. కానీ సుఖంలో కూడా నిష్కామ భావంతో పరమాత్ముడిని ధ్యానించే వారికి సహాయం లభిస్తుంది. ప్రకృతి స్వయంగా వారికి సహాయపడుతుంది. నీ విచారంలో, విశ్వాసంలో చాలా శక్తి ఉంది. నియమం ఏమిటంటే నీవు స్మరణ, ధ్యానాలను సరైన రీతిలో చేయి. విహంగము నడక అంటే ఏమిటి? నీ అనుభవంతో లాభాన్ని పొందు. పైకి పయనిస్తూ వెళ్ళు.

మన్ మే వేద్ కో పఢ్ కర్, బ్రహ్మ శంకర్ కర్‌తే యోగ్ ।
మన్ హీ అంతర్ సృష్టి వ్యాపీ, మన్ హీ మే హై రోగ్ ॥

మన్ గోవింద్ మన్ గోరఖ రూపా, మన్ హీ యోగ వియోగ ।
మన్ హీ పానీ మన్ హీ అగ్ని, మన్ హీ ఆనంద సోగ్ ॥

మన్ హీ గురు హై మన్ హీ చేలా, మన్ హీ బ్రహ్మ సంయోగ్ ।
మన్ హీ కా వ్యవహార్ జగత్ మే, నాహిఁ జానేఁ లోగ్ ॥

మన అనుభవంతో లాభం పొందుతూ అనేక వాదం, త్రిపుటీ వాదం, ద్వైతవాదం, అద్వైతవాదాలలో నుండి నీ సురత్‌ను నడిపిస్తూ ప్రకాశ, శబ్దాలలోకి తీసుకువెళ్ళు. అది నీ రూపం.

సంత్ జన్ మారగ్ విహంగ్ బతావే ।
కౌన్ ఘర్ సే జీవ కీ ఉత్పత్తి, కౌన్ ఘర్ కో జావే ॥

జీవుడు ఎక్కడి నుండి వచ్చాడు? నేనేం అర్థం చేసుకున్నాను? మన శరీరంలో నాలుగు వస్తువులున్నాయి. శారీరిక, మానసిక, ఆత్మిక జ్ఞానం ఇక నాలుగవ వస్తువు ఈ అన్నిటిలో ఉంటూ వీటన్నిటికీ సాక్షిగా ఉంది. అదేమిటి? అది నేను. సురత్. పై లోకాల కంటే పైన ఒక తత్వం ఉంది. అందులో గతి, చలనం అవుతుంది. కదలిక పుడుతుంది. ప్రకాశం, శబ్దం, చేతనత్వం ఉత్పన్నమవుతుంది. ఆ చేతనత్వం నేను. అదే సురత్ శబ్దంలోకి వస్తుంది. ఇక మళ్ళీ అదే ప్రకాశంలోకి వస్తుంది. కిందికి వచ్చి మనసులోకి వస్తుంది. అదే శరీరంలోకి వస్తుంది. ఇదే విధంగా కింది నుండి పైపైపుకు నడుస్తూ మన నిజగృహంలోకి చేరటమే విహంగమం అవుతుంది.

కహాఁ జాయే జీవ ప్రలయ్ హోయె సో సురత్ బినా చఢాయే

శరీరం విడిచే సమయంలో నాకు స్పృహ ఉంటే ఎక్కడికి వెళ్తాను? అనేది మీకు చెప్పాలని ఉంది. మూలంలో కలిసిపోతాను. వ్యక్తికి ఒక జ్ఞానం కలగాలి. సముద్రపు ఆటుపోటులు వచ్చాయి. లహరులు ఏర్పడ్డాయి. తుంపరలు ఏర్పడ్డాయి. నీటిబుడగలు వచ్చాయి. అవి పగిలి మళ్ళీ సముద్రంలో కలిస్తే ఆ వ్యక్తికి శాంతి లభిస్తుంది. జ్ఞానమనే అగ్ని వలన భ్రమలు దూరమవుతాయి. తరువాత ఎక్కడినుండి మనం వచ్చామో అక్కడికే చేరుకుంటాం. ప్రపంచానికి మోక్షం లభిస్తూనే ఉంది. మరి ఇలా జనసంఖ్య

ఎందుకు పెరుగుతోందని చాలా మంది ప్రశ్నిస్తుంటారు. ఈ రచన అనాది ఎప్పుడైనా సముద్రపు ఆటుపోటులు అధికంగా వస్తే సృష్టి రచన కూడా అధికమవుతుంది.

నాకు జ్ఞానం కలిగింది. కనుక ఇప్పుడు నేను చాలా సుఖంగా ఉన్నాను. కానీ ఈ జ్ఞానం ఎప్పుడు కలుగుతుంది? నీవు నీ అనుభవంతో లాభం పొంది విహంగమ మార్గంపై నడిచినప్పుడు కలుగుతుంది.

గఢ్ సుమేర్ వాహీ కో కహియే, సూయీ నఖా సే జావే।
భూ మండల్ సే పరిచయ్ కర్ లే, పర్వత్ ధూల్ లఖావే॥

సూయీ కా నాకా అంటే ఏమిటి?

సూది వంటి కాలువ. సూది వంటిసన్నని ప్రవేశద్వారం. నీవు మేల్కొంటావు. తరువాత నిద్రించడానికి వెళ్ళినప్పుడు జాగ్రత స్థితిని మరిచి, ఒక సన్నని, పలుచని స్థితి నుండి బయటపడి స్వప్నంలోకి వెళ్ళిపోతావు. ఆ స్థితి పేరే సూది కాలువ. ఇది బాహ్యావస్థ. అంతరంలో మనస్సు యొక్క సంపూర్ణ ఆలోచనలను, ఆటలను విడిచి పెట్టాక వచ్చే ఏకతావాద స్థితిని సూది వంటి కాలువ అంటారు.ఈ స్థితి నుండి బయటపడి పైకి వెళ్ళి పోతే మనసు యొక్క సంబంధం సమాప్తమైపోతుంది. భూమండంలో పరిచయం అంటే అర్థం ఏమిటి? మనసు రూపం నీకు అర్థంకానంతవరకు నీవు ముందుకు పోజాలవు.

ద్వాదశ కోస్ సాహబ్ కా డేరా, తహఁ సురత్ ఠహరాయ్

పన్నెండు కోసులు అంటే ఏమిటి? శరీరంలోని చక్రాలు ఆరు, మనసులోని చక్రాలు ఆరు ఈ పన్నెండిటినీ వదిలి వెళ్ళాక మన రూపం బోధపడుతుంది. లోకులు సంతుల రాసిన వాణిలను, ప్రవచనాలను విని, చదివి వారి వెనక తిరిగారు. ఆ రోజులు గతించాయి. ప్రస్తుత సమయం మరొకలా ఉంది.

తాకే రంగ్ రూప్ నహిఁ రేఖా, కౌన్ పురుష్ గుణ్ గావే

అంతర్ముఖమై సూది వంటి కాలువ నుండి ప్రకాశ మార్గం నుండి

దాటిపోయాక నీ ఆదిస్థితి, అకహ, అపార, అగాధ, అనామ స్థితి వచ్చేస్తుంది. అదే మన ఆదిగృహం. మనం అక్కడి నుండే వచ్చాం. అక్కడికే తిరిగి వెళ్ళి పోవలసి ఉంది.

> కహే కబీర్ సునో భాయీ సాధో, యహ పద లఖ పావే!
> అమర్ లోక్ మే ఝూలే హిండోలా, సత్తగురు శబ్ద సునావే ॥

కబీర్ సాహబ్ వర్ణించిన అమరలోకం ఏమిటో నాకు తెలీదు. నా మూలమే అమరలోకమని నాకు అర్థమైంది. అది మరణించదు. జన్మించదు. పైగా అన్నిటికీ ఆధారమైనది. ఇంజినీర్‌గారూ! మీరు నన్ను గురువుగా భావిస్తారు. నా భాధ్యతను గుర్తుంచుకుంటాను. ఏ అభిప్రాయంతో నేటివరకు మీరు నడుస్తున్నారో అది పరమార్థపరమైనది కాదు. స్వార్థ సంబంధమైనది. అందులో ప్రాపంచికమైన కోరిక ఉంది. ఇప్పుడు మరి చీఫ్ ఇంజినీయర్ అవుతారు. సాధన తప్పక చేయాలి. మనస్సు సహాయాన్ని కోరుకుంటుంది. దీనికి గురు స్వరూప సహాయం ఇవ్వండి. పైకి వెళ్ళాక ఇక ప్రకాశం, శబ్ద సహాయమీయండి. మీ లోపల ప్రకటమైన గురు మూర్తిని బాబా ఫకీర్ అనుకోక దానిని పూర్ణమని, పరమ తత్వమని విశ్వసించండి. లేకుంటే గమ్యం పైకి వెళ్ళలేరు.

ఇప్పుడిక ప్రాపంచిక మాటలను వినండి. మీ విచారంలో చాలాశక్తి ఉంది. కనుక ఆలోచనా విచారాన్ని ఉన్నతంగా, ఆశావాదంతో ఉంచండి. ద్వేషం, ఏవగింపులను వదిలెయ్యండి, మీ స్వార్థంకోసం ఎవరినీ బాధించకూడదు. మీరో అధికారి. ఎవరైనా తమ అహంకారంతో ఏమైనా అంటే అందుకు ప్రతీకారం తీర్చుకోవాలనే కోరికను మనసులో పెట్టుకోకండి. ఎవరైనా పొరపాటు చేస్తే వారికి శిక్ష తప్పక ఇవ్వ వలసి ఉంటుంది. లేకుంటే మీ విధిని సక్రమంగా నిర్వర్తించలేదనే దోషం మీకంటుతుంది.

హజరత్ అలీ తన శత్రువుతో యుద్ధం చేస్తున్నప్పుడు అతడిని కింద పడదోసి అతని గుండెలపై కాలుమోపాడు శత్రువు. ఆ సమయంలో అతడి ముఖంపై ఉమ్మి వేశాడు. హజరత్ అలీ అతడిని వదిలేశాడు. శత్రువు లేచినిల్చుని, "చేతికి అందిన శత్రువును వదిలేయటం తెలివైన పనా" అని హేళన చేశాడు. దానికి హజరత్ అలీ స్పందించి, "మొదట నీకూ నాకూ

మధ్య యుద్ధం ఉంది. కానీ ఇప్పుడు నీవు నా ముఖంపై ఉమ్మేసి వ్యక్తిగతంగా నన్ను అవమానించావు. వ్యక్తిగత అవమానంపై మా మత ధర్మంలో ప్రతీకారం తీర్చుకోవటం నిషిద్ధం. కనుక నిన్ను వదిలేశాను అన్నాడాయన. ఒక మసీదులోకి ఇద్దరు చెడు దృష్టితో వెళ్ళారు. లోకులు వారి చెడు చేష్టలను చూసి హజరత్ మహమ్మద్ సాహబ్‌కు చెప్పారు. ఆయన వారిని పట్టి తెమ్మని హజరత్ అలీని ఆజ్ఞాపించాడు. అతడు వెళ్ళాడు. తన కళ్ళపై గుడ్డ కట్టుకున్నాడు. చేతిలో ఓ కర్ర తీసుకుని మసీదులోకి ప్రవేశించాడు. అటూ ఇటూ తిరిగి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోయాడు. వాళ్ళు కలవలేదని హజరత్ మహమ్మద్‌కు చెప్పాడు. ఇతడు కళ్ళకు గుడ్డ కట్టుకుని వెళ్ళాడని ప్రజలన్నారు. నేరస్థులు ఇతన్ని చూసి మౌనంగా వెళ్ళిపోయారు. ఈయనకా సంగతే తెలియదు అన్నారు. హజరత్ మహమ్మద్ ఈయన్ని దీనికి కారణం ఏమిటని అడిగారు. దానికి హజరత్ ఆలీ జవాబిస్తూ "ఎవరి దోషమూ చూడకూడదని మీరు చెప్పారు. కనుక నేను నా కళ్ళపై గుడ్డకట్టుకున్నాను" అన్నారు.

కనుక ఏదో ఒక నియమంపై నడువు. ఆశావాదిపై ఉండు. నాకిది కావాలి, అది కావాలి అని భగవంతుడిని అడగకు. ఆయన్ని కేవలం ప్రేమ కావాలని అడుగు. నీవు నీవైపు చూసుకో. నీ నౌకరు ప్రేమతో నీకు సేవ చేస్తాడు. అప్పుడు నీకు నీవుగా అతని అవసరాలను పూర్తి చేస్తావు.

మహమ్మద్ గజనీ ఢిల్లీలో దోపిడీలు, అల్లర్లు చేసినప్పుడు అతని సంబంధికులు దోపిడీలో చాలా ధనం పోగుచేసుకున్నారు. కానీ అతని ఒక నౌకరు వెళ్ళలేదు. "నీవెందుకు వెళ్ళలేదు" అని పాదుషా అడగ్గా "భగవంతుని సంతోషంలోనే నా సంతోషం ఉంది. ధనాన్ని నేనేం చేసుకుంటాను?" అన్నాడు పాదుషా చాలా సంతోషించి అతడిని మంత్రిగా నియమించాడు.

భార్యాభర్తలు ఒకరికొకరు నిష్కామసేవ చేయండి. యుక్తవయస్సులో ఉన్నప్పుడు ఎలాగైనా చేస్తారు. కానీ అసలైన సేవ వృద్ధాప్యంలోనే చేయబడుతుంది. ఒక వ్యక్తికి లక్షలాది రూపాయల ఆస్తి ఉంది. అతని ఆస్తి తనకు లభిస్తుందని కొడుకు సేవిస్తాడు. ఒక నిర్ధనుడైన పేదతండ్రికి సేవచేస్తే అదీ నిజమైన సేవ అనిపించుకుంటుంది. తమ స్వార్థంకోసం అందరూ సేవచేస్తారు. కనుక నీవేం చేయాలి? Be true to your ownself. ఒక వేళ

నీ నడవడి, ప్రవర్తన, మనసు పరిశుద్ధంగా, స్వచ్ఛంగా ఉంటే నీకు నీ పొరపాటు వలన కలిగే పాపం అంటదు. ప్రశ్న కేవలం నీ మనసు స్వచ్ఛతదే, నీ నడవడిదే, ప్రవర్తనదే! నేను నా సమస్త జీవనం నా గృహస్థ జీవనంలో, శిష్యరికంలో, గురుత్వంలో గడిచింది. నా నడవడిని, ప్రవర్తనను మనసును పవిత్రంగా ఉంచుకున్నాను. నల్లమందు హానికారం కానీ పిల్లల్ని బాగా పడుకోబెట్టడానికి తల్లి పిల్లలకు నల్లమందు ఇస్తుంటుంది.

ఇంజనీరుగారూ! నేను సత్యమైన హృదయంతో కోరుతున్నాను. మీ అందరికీ తినడానికి తిండి, తొడుక్కోడానికి బట్టలు, ఉండడానికి ఇల్లు మనసుకు శాంతి లభించాలని కోరుకుంటున్నాను. ఇక మిగిలింది నిర్వాణం. దీనికి అర్హతగల వారు చాలా తక్కువమంది ఉంటారు. అంత్య సమయం వరకు శబ్దం రాకుంటే జనన మరణాలు సమాప్తం కావు. గురువులు లోకులకు నామం ఇచ్చి ఏం చేశారని ఆశ్చర్యపోతుంటాను. వాళ్ళు వాళ్ళ ఆశ్రమాలు నిర్మించుకున్నారు. కానీ మనకేం ఇచ్చారు. ఎవరూ ఎవరి లోపలా ప్రకటం కారని సత్యం చెప్పలేదెవ్వరూ! నేను సత్యం ఎందుకు చెప్పాను? వినండి! ప్రేమతో రామాయణం చదువుతారు. ఆనందం పొందుతారు. గ్రంథాలను చదవటం వలన మన దుఃఖాలు దూరమవుతాయని భావిస్తారు. రామాయణం రాసిన గోస్వామి తులసీ దాసుకు రామాయణం పైన ఎంత ప్రేమ ఉండి ఉంటుంది? అంతిమ స్థితిలో ఆయన పరిస్థితి ఎలా మారింది? ఎంత కష్టం కలిగి ఉంటుంది. తన సేవకులతో, తనను కలుసుకోవడానికి వచ్చేవారితో ఆయన "ఇప్పుడు హనుమంతుడు రావటంలేదు. రాముడు రావటం లేదు" అనే వారట. ఏ రాముడు, ఏ హనుమంతుని రూపం అతని లోపల దర్శనమిచ్చేదో అది ఆయన మనస్సే. తులసీదాస్ మనసులోనే చిక్కుబడి ఉన్నాడు. అందుకే మనసు రూపం అర్థం కానంతవరకు, గురు జ్ఞానం లభించనంతవరకు రాకపోకలనుండి అనగా జననమరణాల నుండి విముక్తి లభించటం కష్టం.

*అందరికీ రాధాస్వామి*

# సత్సంగం

## 16–11–1973

# భజన ఎందుకు అవసరం ?

(1)

మేరీ బీతీ ఉమరియా భజన్ బినా,
పంథ్ మే ఆయె బనే పంథాయీ, సూఝీ న డగరియా భజన్ బినా ।

భక్తీ కా సౌదా నహిఁ కీనా, బంద్ బజరియా భజన్ బినా ।
మన్ హువా టూక్ కరేజా ఫాటే, మాయా కీ నజరియా భజన్ బినా ।

అబహుఁ సోచ్ సమఝ్ అజ్ఞానీ, జా గురు కీ సేజరియా భజన్ బినా ।
రాధాస్వామీ చరన్ కీ ఓట్ పకడ్ లే, నామ బిసరియా భజన బినా ।

(2)

నిష్ఫల్ సబ్ ధంధా భజన్ బినా,
జప్ తప్ కిరియా కరమ్ ధరమ్ సే, కటే న ఫందా భజన్ బినా ।
జ్ఞాన్ ధ్యాన్ సే కామ్ న నికలే, డోలే నర అంధా భజన్ బినా ।
జో కోయీ పోథీ పత్రా సోధే, బంధే కా బంధా భజన్ బినా ।
రాధాస్వామీ ప్రీతి న మన్ మే ఉపజీ, సుమతి కా మందా భజన్ బినా ।

రాధాస్వామి!

భజనకు సంబంధించిన రెండు శబ్దాలు విన్నారు. "భజనను ఎందుకు చేశావు? దాని వలన నీకేం లభించింది?" అని నన్ను నేను ప్రశ్నించుకుంటూ ఉంటాను. మీరు నా దగ్గరికి వచ్చినప్పుడు నాకు నా జీవితం జ్ఞాపకానికి వస్తుంది. నేను అశాంతిపాలై బాధపడినట్లే వీళ్ళు కూడా ఏదో ఒక కారణంగా దుఃఖపడుతున్నారని అనుకుంటూ ఉంటాను. మనసులోని అశాంతిని దూరం చేయడానికి భజన చేస్తాం. నేను లోగడ చేశాను. ఇప్పటికీ చేస్తుంటాను. స్మరణ, ధ్యానం, భజన మూడూ వేరు వేరు అంశాలు. స్మరణ అంటే నామాన్ని

జపించటం! కొందరు రామ రామ అంటారు. మరికొందరు రాధాస్వామి అని జపిస్తారు. మరికొందరు వాహెగురు అని స్మరిస్తారు. "ధ్యానం" అంటే నీ ఇష్టదైవం రూపాన్ని తలచుకోవటం, 'భజన' అంటే నీ లోపల - నీ అంతరంలో నిరంతరం తనకు తానుగా ధ్వనిస్తున్న అనహద నాదాన్ని వినటం భజన. నా అనుభవాలు చెప్పిపోతానని ప్రతిజ్ఞ చేశాను గనుక చెబుతున్నాను. నేను భజన చేశాను. అలా చేసినందుకు నాకు ఆనందం, సంతోషం లభించాయి. కానీ అశాంతి దూరం కాలేదు. కొన్ని పరిస్థితులలో శాంతి లభించినా తరువాత అశాంతి పాలయ్యాను. ఎవరేమైనా అంటే కోపం వచ్చేది. అందుకే అంతరంలో భజనను ప్రాప్తించుకున్నవారు సద్గురువును అన్వేషించాలి. హుజూర్ దాతాదయాల్ మహర్షి శివవ్రత్‌లాల్‌జీ మహారాజ్ నాతో, నాలో భజన చేయించారు. నాకు మీరు గురువులై దొరికారు. ఎలా? నిన్న రాత్రి ఒక రైల్వే ప్లేటియర్ మా ఇంటికొచ్చారు. ఆయన తల్లిగారు - కృషక్ జీ దగ్గర నామదానం తీసుకుందట. కానీ నన్ను గురువుగా విశ్వసించేదట. ఆమె మరణించిందని ప్లేటియర్ చెప్పారు. ఆమె మృతి చెందడానికి నెలరోజులు ముందు నుండే ఆహారపదార్థాలు తినటం, నీళ్ళూ పాలూ తాగటం మానేసిందట. చివరిక్షణాలలో నాదొక ఫోటో దగ్గరికి తెప్పించుకుందట. ఆ ఫోటోనుద్దేశించి, "బాబాజీ! ఇక నన్ను తీసుకు వెళ్ళు" అనేసి ప్రాణాలు విడిచిందట.

ఆమె నిన్ను గురువుగా భావించి ధ్యానించిన విషయం నీకు తెలుసా? 'బాబాజీ ఇక తీసుకువెళ్ళు' అన్న సంగతైనా తెలుసా?" అనుకున్నాను. లేదు. నాకా విషయాలేవీ తెలియవు. ఇదంతా మనిషి విశ్వసించిన విధానం, ఫలితం, లీల అని రుజువవుతోంది.

చూడు బల్ బీర్! సత్సంగం కోసం నీవు నా దగ్గరికొచ్చావు. నీకింకా సమయం రాలేదు. నా మాటలను నీవిప్పుడు అర్థం చేసుకోజాలవు. మనసు - చిత్తవృత్తులు ఏకాగ్రం కానంతవరకు విషయం అర్థం కావటం కష్టం. నీ చిత్తవృత్తులు ఏకాగ్రమయ్యాక నీకు నా మాటలు లాభకరమవుతాయి. భజనతో పాటే గురువుంటాడు. అందుకే ప్రతిశబ్ద్ కింద రాధాస్వామీ అనో, నానక్ అనో, మరొక గురువుపేరో ఇవ్వబడుతుంది. ఇంతకు ముందు మనం చదువుకున్నది దాతాదయాల్‌జీ మహారాజ్ రాసిన శబ్దలు. "ఓ దాతా! నేను మీ మాటల్ని అర్థం

చేసుకోలేక పోయానని బాధగా ఉంది. ఐనా సత్సంగీయుల రూపంలో మీరు నాపై దయ చూపారు.

మేరీ బీతీ ఉమరియా భజన బినా ।
పంథ్ మే ఆయే బనే పంథాయీ, సూఝీ న డగరియా భజన బినా ।

నామం తీసుకున్నాను. కానీ దారి దొరకనందువల్ల గమ్యానికి చేరుకోలేదు.

భక్తీ కా సౌదా నహిఁ కీనా, బంద్ నజరియా భజన బినా ।
మన్ హువా టూక్ కరే జా ఫాటే, మాయా కీ వజరియా భజన్ బినా ॥

మనం పంథాయిలం - మతానుయాయులమయ్యాం. నామం తీసుకుని అంతరంలో భజన చేశాం. కానీ నిజం ఏమిటంటే మనం చూశామనుకుంటున్న దానిని చూసింది మనం కాదు. మాయ. కనుకనే మనం ముందుకు వెళ్ళలేకపోయాం. ప్లేటియర్ (ఎ.పి.డబ్ల్యు.ఐ) గారి తల్లి భజన చేసి ఉండొచ్చు. నన్ను అంతరాన సాక్షాత్కరింపచేసికొని ఉండొచ్చు. ఆమె చూసిన బాబా ఫకీర్ ఎవరు? మాయ. ఆమె సంకల్పం విశ్వాసం. అందుకే అంతరాన భజన స్థితిని ప్రాప్తించుకొనకుంటే, యోగ్యులైన వారి సత్సంగం చేయకుంటే మాయావల నుండి బయట పడటం అసంభవం. నన్ను నేను 'సంత్ సద్గురు' అన్నాను. నేను నా బాధ్యతను పూర్తి చేస్తున్నాను. సత్ జ్ఞానమిస్తాను. ఎవరైనా మృతి చెందేటప్పుడు రాముడో, కృష్ణుడో, బాబాఫకీరో మరో గురు రూపమో ఎదుటికి వస్తే అది మాయ! మనసు ఆడే ఆట. కనుక మనిషి మాయలో ఉన్నంతవరకు ముందుకు వెళ్ళే ప్రశ్నే ఉదయించదు. బాబా ఫకీర్ ఆమె అంతరంలో కనిపించనేలేదు. ఆమెను తీసుకు పోనూ లేదు.

అబహుఁ సోచ్ సమఝ్ అజ్ఞానీ, జా గురు కీ సేజరియా భజన బినా

ఓ మనిషీ! కనీసం ఇప్పుడైనా ఆలోచించు. ఎవరైనా యోగ్యుడైన మహాత్ముని శరణంలోకి వెళ్ళు. ఎవరి వెనుక వేలాది మంది భక్తుల గుంపు తిరుగుతుందో వారిని లోకులు గురువు అనుకుంటారు. గురువులు సైతం ఆధ్యాత్మిక బోధనలకంటే ఎక్కువ ప్రాధాన్యాన్ని ఆశ్రమాలకు, మందిరాలకు, మఠాలకిచ్చి వాటిని నిర్మించుకున్నారు. వీళ్ళంతా మోసాల వలను ఏర్పర్చారు. అడిగిన వారికి లేదనకుండా నామదానాలిస్తారు. కానీ వాస్తవిక దృష్టి కోణం

నుండి చెబుతున్నాను. మాయా దేశానికి సంబంధించినంతవరకు నేను దానిని విమర్శించను. ఎందుకంటే మనసు సహాయం కోరుతుంది. మాయ, భజన రెండూ వేరు వేరు వస్తువులు. మాయా దేశంలో మనసుకు సహాయం లభిస్తుంది. రాముడు, కృష్ణుడు, గురువుల వంటి రూపాలతో సహాయం తీసుకుంటున్న వారికి అభినందనలు మనసుకు ఆధారంకావాలి. సహాయం కావాలి. ఎవరి ద్వారానైనా తన మనసుకు సహాయం, ఆశ్రయం లభిస్తే ఆ వ్యక్తి మాయ నుండి బయటపడజాలడు. మాయరూపం నీకు బోధపడిన తరువాతే నీవు మాయ నుండి బయట పడగలవు. సంతుల మతంలో మూడు దేశాలున్నాయి. మాయా దేశం, కాలుని దేశం, దయాలుని దేశం. మాయాదేశంలో మనసుకు సహాయం కావాలి. ఈ దేశంనుండి బయటపడటానికి జ్ఞానం అవసరం. మనసుకు సహాయమందించి సంపాదించు. చాలా తిను, ఇతరులకు తినిపించు! కాని నీ మనసుకు ఏ దుఃఖం, కష్టం కలగకూడదనుకుంటే, ఇందుకోసం ఎవరైనా సంత్ సద్గురువు శరణంలోకి వెళ్ళు. నీ రూపం యొక్క జ్ఞానాన్ని ప్రాప్తించుకో. తనను తాను అర్థం చేసుకున్నవారికి, తనేమిటో బోధపడినవారికి దుఃఖం, సుఖం రెండూ అనుభవానికి రావు. అంటే వాటిని పట్టించుకోరు. హాని కలిగినా కష్టం వచ్చినా అలాంటి వారు విలపించరు.

బల్‌బీర్! నీవొచ్చావు. నీకు మూడు, నాలుగు సత్సంగాలిచ్చాను. నేను నా విధిని నిర్వర్తించాను. చాలా సంపాదించు. తిను. మనసుకు ఆధారం, సహాయం అందించు. కానీ ఇలా ఉంటూ కూడా నీవు నీ మనసుకు కల్పన ఉండకూడదనుకుంటే అది అసంభవం. జీవనం సదా ఒక్కలా ఉండదు. ఒకప్పుడు ధనవంతుడివి కావొచ్చు. మరొకసారి నిరుపేదవూ కావచ్చు. ఒకసారి ఆరోగ్యం బాగుంటుంది. మరోసారి శరీరం రోగగ్రస్తమవుతుంది. ఒకసారి గౌరవం లభిస్తుంది. మరోసారి అవమానం ఎదురవుతుంది.

రాధాస్వామీ చరన్ కీ ఓట్ పకడ్ లే, నామ్ బిసరియా భజన్ బినా ।

రాధాస్వామి చరణాల శరణు వేడుకో! రాధాస్వామి చరణాలంటే ప్రకాశం. హుజూర్ మహారాజ్ ప్రేమవాణిలో రాశాడు. నీవొకవేళ జీవనంలో ఉన్నత స్థితిలోకి పైకి వెళ్ళలేకపోతే కనీసం ప్రకాశం నీ లోపల అవశ్యం వచ్చి తీరాలి.

కనిపించి తీరాలి. హిందువులలో మృతి చెందినవారి వద్ద దీపం వెలిగించి పెడతారు. ఆకాంతిని చూశాకైనా ఆ విగతాత్మకు తను చేరవలసినది ప్రకాశ స్థానమని గుర్తుకు రావాలని, వారికి సూక్ష్మ శరీరం జ్ఞాపకానికి రావాలని దీపం పెడతారు. తను ప్రకాశంలోకి వెళ్ళాలని లేదా పారబ్రహ్మదేశంలోకి వెళ్ళాలని మృతిచెందిన వారికి తలపుకు రావాలి. హిందువులలో సావిత్రిని గురించి చెప్పటం జరిగింది.

నిష్ఫల్ సబ్ ధంధా భజన్ బినా

నిష్ఫలం ఎందుకు? నీకు భజన లభించకుంటే అనగా శబ్దం వినిపించకుంటే అంత్యసమయంలో ఏదో ఒక రూపం వస్తుంది. అది రామునిదైనాకానీ, కృష్ణునిదైనాకానీ ఇంకొకరిదైనాకానీ అలా వస్తే నీవు మాయ పరిధినుండి, మాయ వలలో నుండి బయటపడలేదని అర్థం. ఇప్పుడే నేను మీకు ప్లేటియర్‌గారి తల్లి ఉదాహరణ చెప్పాను. నన్ను గురువుగా విశ్వసించిన ఆమె అంత్యసమయంలో నా ఫోటో తెప్పించి, "బాబాజీ, ఇక తీసుకుపో" అంటూ ప్రాణం వదిలింది. నాకు ఆమె తెలియనైనా తెలియదు. ఈ విషయం నాకు తెలియదు. అందుకే ఫకీర్ శరీరంలో అనామీ ధామం నుండి సత్యాన్ని చెప్పడానికే వచ్చానని అంటూ ఉంటాను. ఈ గురువులు, ధర్మానుయాయులు ఈ మాటలను, ఈ వాస్తవాలను పరదాలో తెరచాటున పెట్టి ప్రపంచాన్ని దోచుకున్నారు. ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడా సత్యంలేదు. గృహస్థులు, రాజకీయానికి చెందినవారు ఎప్పుడూ మోసాలు చేస్తూ ఉంటారు. కేవలం సాధు సమాజం నుండి సత్యాన్ని ఆశించేవారు. కానీ నేడు సాధువులే అందరికంటే ఎక్కువ మోసాలు చేస్తారు.

జప్ తప్ కిరియా కరమ్ ధరమ్ సే, కటే న ఫందా భజన్ బినా ।

జపం, తపం, ధర్మం, కర్మ అన్నీ మనసుతో చేయబడతాయి. ఇదంతా మాయా దేశపు ఆట! కానీ ఇది పూర్తి ఫలం ఇవ్వదు. రాకపోకలు - జననమరణాలు సమాప్తం కావటమే పూర్తి ఫలం. దీనిని ఖండించను. విమర్శించను. ఎందుకంటే మాయాదేశంలో ఇవన్నీ చేయవలసి ఉంటుంది. మాయాదేశంలో ఉంటూ నీవు మాయా దేశపు నియమాలను పాటించకుంటే

నీవు అపరాధివవుతావు. సంతుల జపతపాల రూపం వేరుగా ఉన్నా అవి కూడా జపతపాలేగదా! ఆ విషయంవేరు! స్మరణ చేయటం కూడా జపమే! ఒకరు ఒకలా చేస్తే మరొకరు మరొక విధంగా స్మరణ చేస్తారు. సనాతన ధర్మమునను సరించే వారు హరిద్వార్‌కు అస్థికలు చేరిస్తే రాధాస్వామి మతంవారు చాలామంది బ్యాస్‌కు చేరుస్తారు. ఇందులో తేడా ఏముంది? కేవలం జపం, తపం, క్రియా, కర్మల ఆకృతులు, రూపాలు మారాయి. నియమపాలన చేయకుంటే, సహాయం తీసుకోకుంటే, విశ్వసించకుంటే బాధపడవలసివస్తుంది. జనన మరణాలు సమాప్తం కావాలి కనుక భజన చేయమని సంతులు అభిప్రాయపడతారు. భజనతోపాటు సత్‌గురువు ఆవశ్యకత కూడా ఉంది. నీలోపల వీణ, మురళి మోగటం ప్రారంభిస్తే ఎవరైనా సత్యసతగురువును అన్వేషించమని హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ రాశారు. ఇప్పుడు నాకు మీరే సత్యమైన సద్గురువులై దొరికారు. బోధపడడానికి నీకు ఈ పనిని ఆయనిచ్చారు. నాకు మీ వలన వాస్తవం బోధపడింది. మాయాదేశంలో మాయే మనలను చిక్కుబడేస్తుంది. మాయే స్వేచ్ఛను ప్రసాదిస్తుంది. మాయ రూపాన్ని అర్థంచేసుకో. ప్రపంచంలో ఉండు, అందరితోనూ ప్రేమగా వ్యవహరించు. ముసల్మానువైతే మసల్మానువై ఉండు. హిందువువైతే హిందువుగా ఉండు. కానీ ఒకరు మరొకరితో ద్వేషం పెంచుకోకండి. మాయాదేశంలో జపం, తపం, జాతి, నియమం, క్రియా, కర్మల వినా జరుగుబాటు లేదు. ఒకవేళ తీరానికి దాటి పోవాలనుకుంటే భజన చేయి.

జ్ఞాన్, ధ్యాన్ సే కామ్ న నికలే, డోలే నర్ అంధా భజన్ బినా ।

ఒకవేళ ధ్యానం ఏర్పడకుంటే ఏదో పరిణామంపైకి చేరుకోకుంటే సందిగ్ధంలో ఉంటావు. ఇవాళ ఒక ఆలోచనపైకి చేరితే రేపు మరొక భావనపైకి చేరతావు.

జో కోయీ పోథీ పత్రా సోధే, బంధే కా బంధా భజన బినా ।

కొందరు గ్రంథసాహబ్‌ను పఠిస్తారు. మరికొందరు గీతను పఠిస్తారు. ఇంకొందరు రాధాస్వామి మతం వాణిలను చదువుతారు. ఒకరు రాముణ్ణి విశ్వసిస్తారు. మరొకరు కృష్ణుణ్ణి నమ్ముతారు. తమ తమ విశ్వాసానుసారం

మృత్యుసమయంలో గీతా, రామాయణం వంటివి వినిపించటం జరుగుతుంది. వాళ్ళు దీనిని దాటి వెళ్ళి పోతారా? లేదు. దీనివలన వారి మనసుకు సహాయం, ఆధారం లభిస్తుంది. ఈ విచారాలన్నీ, ఆలోచనలన్నీ మాయ అని మనిషికి విశ్వాసం కలిగినప్పుడు అతడు తీరం దాటిపోతాడు. ప్రకాశంలోకి వెళ్ళిపోతాడు. అందుకే నేను బోధనను, శిక్షణను మార్చాను. దీనివలన తన ఆదిగృహానికి వెళ్ళగోరేవారికి వాస్తవాన్ని చెప్పిపోవాలని శిక్షణను మార్చాను. కానీ ఇక్కడికి వచ్చాక నేను కూడా విఫలమయ్యాను. అంత్యసమయంలో ఆ మృతి చెందనున్న వ్యక్తికి జ్ఞాపకం ఉంటుందో లేదో మరి! అంతిమ సమయంలో రాముడో, కృష్ణుడో, గురువో వస్తే వారికి మంచి దేహం లభిస్తుంది. ఎవరో ఒక సంత్ సద్గురువు సంపర్కంలో ఉండి మిగిలిన సంపాదన పూర్తిచేసుకుంటారు. మిగిలిన సంపాదన అంటే ఏమిటి? నేను దేనిని అర్థం చేసుకున్నానో చెబుతాను. కొందరు అభ్యాసం చేస్తారు. కానీ రూపంలోనే చిక్కుకుని ఉంటారు. ఈ రూపు రంగులన్నీ మనసు యొక్క లీలలని మాయ అని విశ్వాసం కలుగనంతవరకు వారు మళ్ళీ జన్మనెత్తవలసి ఉంటుంది. అందుకే జ్ఞానం కలిగినా మోక్షం లేదు. సంత్ సద్గురువునైన అర్హతతో నేను జనన మరణాల వలయం నుండి బయట పడదలచుకున్న వారికి సత్య జ్ఞానమిచ్చి పోతున్నాను. మిగతా వారికి మాయాదేశంలో జప, తపములు, కర్మధర్మములు అవసరం. రాధాస్వామి మతంవారు జపతపాలు, తీర్థ వ్రతాలు చేయవద్దని చెబుతారు. నేను వారిని నిలదీసి అడుగుతున్నాను! ఆగ్రా, బ్యాస్, హోశియార్‌పూర్‌లకు వెళ్ళటం తీర్థ యాత్రలు కావా? ఏదో పొందడానికే వెళ్తున్నారు గదా! గంగాజలం బాగాలేవని మీరు మీ గురువులతో నీళ్ళను ప్రసాదం చేయించుకుని వెళ్తారు అవి మంచివా? కేవలం ఆకారం, రూపం మారిందంతే! నీ విశ్వాసమే పనిచేయాలి. చేస్తుంది. ఇది మాయాదేశపు భ్రమ. విశ్వాసాన్ని గురించిన ఓ ఉదాహరణ ఇస్తాను. ఒకసారి గంగానదికి కుంభమేలా జరిగినప్పుడు. లక్షలాది మంది వచ్చారు. శివుడు, పార్వతి కూడా అక్కడికి వెళ్ళారు.

"మహారాజ్! వీళ్ళంతా తరించిపోతారా?" అని పార్వతి శివుణ్ణి ప్రశ్నించింది.

"వీరిలో ఎవరూ తరించరు" అని జవాబిచ్చాడు శివుడు.

"ఎలా" అంది పార్వతి.

"నేను ఓ ముసలివాడి వేషంలో మృతి చెందినట్లుపడుకుంటాను. నీవు నా దగ్గర విలపిస్తూ కూర్చో. ఎవరు తరిస్తారో చూడు" అని శివుడు వృద్ధుని రూపంలో పడుకున్నాడు. పార్వతి ఏడవసాగింది. "నా భర్త శవాన్ని దహనం చేయాలి. నేను ఒంటరిగా ఈ పని చేయజాలను..." అంటూ రోదించసాగింది. నవయువకులొస్తున్నారు. వ్యంగ్యంగా మాట్లాడి వెళ్ళిపోతున్నారు. ఒక నవయువకుడొచ్చాడు.

"అమ్మగారూ! ఏమిటి సంగతి" అన్నాడు

"జీవనంలో ఏనాడూ ఏ పాపమూ చేయని వారే నాభర్త శవాన్ని దహనం చేయడానికి అర్హులు" లోగడ ఇతరులకు చెప్పినట్లే చెప్పింది పార్వతీదేవి. ఆ నవయువకుడు వెళ్ళి గంగానదిలో స్నానంచేసి వచ్చి పార్వతితో, "అమ్మా! ఇప్పుడు నాలో పాపాలేమీ లేవు. ఎందుకంటే గంగలో స్నానం చేసి వచ్చాను. నా పాపాలు నశించి పోయాయి. కనుక నేను ఈ శవాన్ని దహనం చేయడానికి అర్హుడను" అన్నాడు. ఇంతమంది స్నానం చేయవచ్చినా ఎవరికీ విశ్వాసం లేదనడానికి ఈ సంఘటన ఉదాహరణ!

అందుకే ఈ సమస్త ఆట - లీల మనసు యొక్క విశ్వాసానిదే! మనం మన ఆలోచన విచారాలతోనే పాపులం, మన ఆలోచనావిచారాలతోనే ధర్మాత్ములము అవుతున్నాము. విశ్వాసం, పాపపుణ్యాల సంబంధం మాయా దేశంతో ముడిపడి ఉంది. దయాల్ దేశంలో పాప పుణ్యాలేవి? అక్కడ సురత్‌తో శబ్దాన్ని వినడమొకటే ఉంది.

రాధాస్వామీ ప్రీత్ న మన్ మే ఉపజీ, సుమతి కా మందా భజన్ బినా ।

ఏ రాధాస్వామి ప్రీతి? ఒకటి బాహ్యగురువు. ఆయన నుండి నీకు సుమతి లభిస్తుంది. అసలైన రాధాస్వామి నీ లోపల ఉన్నాడు.

రాధా ఆది సురత్ కా నామ్ స్వామీ ఆది శబ్ద్ పహిచాన్

అందుకే గురువు శబ్ద యోగం యొక్క శిక్షణ నిస్తాడు. కానీ ముందుగా

ఆచార వ్యవహారాలు, ఆలోచనలు సరిచేసుకునే సాధన చెబుతాడు. చిత్తవృత్తి సరైనదిగా మారినప్పుడు నామ దానమిస్తాడు. బల్‌బీర్! నేను అన్ని రకాలుగా నీకు అర్థం చేయించే ప్రయత్నం చేశాను. ఇక ఆచరించటం నీ విధి!

> కుఛ్ కర్‌నీ కుఛ్ కర్మగత్, కుఛ్ పూర్వలే లేఖ్ ।
> దేఖో భాగ్ కబీర్ కే, లేఖ్ సే భయా అలేఖ్ ॥

ఆచరణ కూడా ప్రతి ఒక్క వ్యక్తీ చేయజాలడు. కొంత కర్మ గతి, మరి కొంత ప్రారబ్ధ కర్మలు కూడా ఉంటాయి. ఈ ప్రపంచంలో నీవు చేస్తున్నది కూడా సహాయపడుతుంది. ఒకవేళ నువ్వు ప్రతిరోజూ పోట్లాటలు, మోసాలు చేస్తుంటే నీవు తరించిపోయే మాట కల్ల. అందుకే అనుభవాల తరువాత నేను "మనుష్యబనో" "మనిషివి కమ్ము" అనే నినాదమిచ్చాను. ముందుగా మనిషివికా! వివేకం కలిగినవారే మానవులు.

> గురు పశు, నర పశు, త్రియా పశు, వేద పశు సంసార్ ।
> మానుష్ తాహే జానియే, జా మే వివేక్ విచార్ ॥

ఎవరిలో ఆలోచనా విచారాల తెలివి, యోగ్యత లేదో వారు సుఖంగా ఉండలేరు. భవసాగరం దాటి పోలేరు.

*అందరికీ రాధాస్వామి*

*పరమసంత్ పరమ దయాల్ పండిత్ ఫకీర్ చంద్ మహారాజ్*

# సత్సంగం

## 25–11–1973

# అజ్ఞాన ఆవేశం

> దయా గురు క్యా కరూఀ వర్ణన్, ఆ హా హా, ఓ హో హో ।
> లగాయా మోహే నిజ చరణణ్, ... ।
> దిఖాయా ఘట్ మే ఇక్ గుల్‌శన్, ... ... ।

సుఖీ జహా౹ శబ్ద ధున్ ధన్ ధన్, ... ... ।
వహా౹ సే ఆగే పగ్ ధారణ ... ।
కరత్ రహీ సురత్ గురు దర్శన్ ... ।
చరణ పర్ వార్ రహీ తన్ మన్, ... ।
ఖేలతీ సున్న్ మే సంగ్ హంసన్, ... ... ।
భఁవర్ హుయే సతపుర్ ధావన్, ... ... ।
పరస్ రాధాస్వామీ హుయీ పావన్, ... ... ।

రాధాస్వామి! ఇవాళ ఈ ఆ హా హా, ఓ హో హో అనే హుజూర్ మహారాజ్ శబ్దం విన్నారు. ఇలాంటి శబ్దాలు ఎందుకు ఆలపిస్తుంటారని ఆలోచిస్తాను. నిన్న కూడా శ్రీ కె.జె. సహాయ్ నుండి ఉత్తరం వచ్చింది. ఈ శబ్దంలో ఉండే ఆవేశమే, అభిప్రాయమే అతనిలో కూడా ఉండేది. నేను సైతం ఒకప్పుడు ఈ అభిప్రాయం, అవేశంలోనే ఉన్నాను. అందులో ఉండి ఇలాగే ఇలాంటి అంతరాంతరాల్లో నుండి స్వాభావికంగా వెలువడే శబ్దాల్ని పాడేవాడిని. ఈ ఆవేశం, అభిప్రాయం ఎప్పుడు ఉద్భవిస్తుంది? వ్యక్తి తన ప్రేమలోకి వచ్చి తనలోపల ఏదైనా వస్తువును చూసినప్పుడు, సూర్యుడు, చంద్రుడు లేదా గురుమూర్తిని చూసినప్పుడు అతనికి చాలా సంతోషం కలుగుతుంది. ఆ సంతోషంలో నుండి అతనిలో ఒక రకమైన ఆవేశం, అభిప్రాయం పుడతాయి. దీనినే వారు పద్య లేదా గద్య రూపంలో చెబుతుంటారు. హుజూర్ మహారాజ్ ఈ శబ్దం రాశారు. కె.జె. సహాయ్ గద్యంలో రాశారు. ఆ ఆవేశం, అభిప్రాయం అజ్ఞానం నుండి వెలువడుతుంది. సత్యం యొక్క జ్ఞానం కలుగనంతవరకు ఇలాంటి ఆవేశం ఉద్భవిస్తూ ఉంటుంది. కె.జె. సహాయ్ నిన్న తన ఉత్తరంలో రాశారు! "బాబాజీ! నేను అభ్యాసం చేశాను. నాలోపల ప్రకాశం కనిపించింది. చాలా పెద్ద సూర్యుడిని చూశాను. అందులో మీరు విరాజమానులై ఉన్నారు. మిమ్మల్ని చూసి నాకెంతో సంతోషం కలిగింది. ఇంతటి ఆనందాన్ని నా జీవితంలో ఏనాడూ నేననుభవించలేదు" అని ప్రశంసిస్తు రాశాడు. నేనతని లోపలికి వెళ్ళానా? లేదు. ఇదంతా అతని విశ్వాసపు లీల! ఈ భక్తులంతా - కొందరు రాముని భక్తులు, మరికొందరు కృష్ణుని భక్తులు, ఇంకొందరు దేవీ - దేవతల భక్తులు లేదా గురుభక్తులు వీరిని ప్రశంసించే వాళ్ళు అంతా

సత్యానికి దూరంగా అజ్ఞానంలో ఉన్నారు. అజ్ఞానంలోకి రాకుంటే జ్ఞానం, సత్యాల వైపు రావటం కూడా కష్టతరమే కనుక నేను దానిని ఖండించను. ఇదీ ఒక స్థాయి. అజ్ఞానంలో ఆనందం, సంతోషం ఉన్నాయి. కె.జె. సహాయ్ గారు బుద్ధిమంతుడైన మనిషి బ్యాంక్ మేనేజర్. జీతం కూడా ఎక్కువగానే వస్తుందేమో! కానీ ఇది బాహ్య ప్రపంచం. అంతరంలో సత్యాన్ని అర్థం చేసుకోవటం మరో అంశం. నేనతనికి ఇచ్చిన జవాబును కూడా మీరు విన్నారు. ఆహాహాహా అన్నవారూ వెళ్ళిపోయారు. ఓహోహోహో అన్నవారూ వెళ్ళిపోయారు. రామకృష్ణుల భక్తులు కూడా వెళ్ళిపోయారు. అందరూ వెళ్ళిపోవలసే ఉంది. రాధాస్వామి మతవాణిలో వచ్చింది.

ఆప్ ఆప్‌కో ఆప్ పహచానో, కహా ఔర్ కా నేక్ న మానో

నన్ను నేను గుర్తించాను. కానీ ఈ గుర్తింపు నాకెవరిచ్చారు? కృషక్ జీ, దయాల్ దాస్, కమాల్‌పూర్‌కు చెందిన ఓ మాత, ఇంకా కె.జె. సహాయ్ ఇతర సత్సంగీయులిచ్చారు. వీరిలో ప్రకటమై సాయపడింది నేను కాదు గనుక నాలో ప్రకటమైన భావ, విచారాలు, రూపురేఖలు, రంగులు వంటివి అసలు లేవు. ఉన్నవి కేవలం సంస్కారాలే! కనుక నేను వాటిని వదిలి వీటికంటే ముందరికి వెళ్ళడానికి వివశుడనయ్యాను. నాకు సత్యం బోధపడింది. ఈ వయసులో మిమ్మల్ని సద్గురువులని భావించక ఇంకెవరిని భావించగలను? హుజూర్ దాతాదయాల్ జీ మహారాజ్ నా పేరిట ఒక శబ్దం రాశారు.

తూ ఫకీర్ హై కైసా భాయీ, భూల్ భరమ్ చిత్త్ లాయా క్యోఁ ।
తజ్ అజ్ఞాన్ కీ బాతేఁ జల్దీ, జ్ఞాన్ ధ్యాన్ అలసాయా క్యోఁ ॥

అంఖియా ఉలట్ తమాషా దేఖేఁ, అంతర్ కీ లీలా న్యారీ ।
సబ కుఛ్ అంతర్ తేరే భరా హై, ఇస్ సే ఆంఖ్ హటాయా క్యోఁ? ।

గురు తో తేరే ఘట్ కే వాసీ, తూ గురు ఘట్ మే రహతా హై ।
మై తూ భూల్ భరమ్ హై ప్యారే, యహ సిద్ధాంత్ భులాయా క్యోఁ ॥

బాహర్ భీతర్ గురు హై వ్యాపక్, కహీఁ రాజా కహీఁ పరజా హై ।
చేలే మే గురు, గురు మే చేలా, నహీఁ తో ఉసే చితాయా క్యోఁ ॥

ఆప్ ఆప్ కో ఆప్ పఘానే, రాధాస్వామి కీ హై వాణీ ।
కహా అవుర్ కా నేక్ న మానో, యహ వాణీ బిసరాయా క్యోఁ ॥

శ్రీ కె.జె. సహాయ్ పొరపాటు భ్రమలో ఉన్నాడు. నేను అతని అంతరంలో కనిపించినట్లు ఎర్రని సూర్యునిలో, అత్యధిక ప్రకాశంలో కూర్చుని వేలాది మంది సాధువులకు, మహాత్ములకు సత్సంగం చేయిస్తున్నానని ఆయన భావిస్తున్నాడు. కానీ అలా అతనిలో సాక్షాత్కరించింది నేను కాను. నాకీ సంగతే తెలియదు.

మహాత్మా దయాల్ దాస్ గారూ! ఈ గమ్యం చాలా కఠినతరమైనది. ఈ గమ్యం, స్థాయిపై నీవిప్పుడే నిల్చొనజాలవు. ఎందుకు? నేనొక అంతర్యామిని కాను. నీ భవిష్యత్తును గురించి నాకేమీ తెలియదు. కానీ నేనింతవరకు నిలబడలేను గనుక నీకు చెబుతున్నాను. నీవీ గమ్యంపై, స్థానంపై నిలబడజాలవు. సురత్ సహాయాన్ని కోరుతుంది. కనుక సహాయాన్ని తీసుకో! కానీ ఎవరి సహాయం తీసుకుంటే వారిని పరిపూర్ణులని నమ్ముకో! శ్రీ కె.జె. సహాయ్ నన్ను తన గురువుగా భావించాడు. తన స్థితిగతులను నాకు రాస్తుంటాడు. అతనికి నాపైన విశ్వాసం ఉంది. గత ఉత్తరంలో నేనాయనకు స్పష్టంగా రాశాను. ఏమని? నీకు అంతరంలో పరిచయం లభిస్తుందన్నాను. అతనికి నాపై విశ్వాసం ఉంది గనుక అతని విశ్వాసం అతనికి అంతా చూపించింది. ఇలాగే స్వామీజీ పై హుజూర్ మహారాజ్‌కు ఇలాంటి విశ్వాసమే ఉండేది. అతని విశ్వాసమే అతనికి ఉత్సాహం, ఆనందం, సంతోషాలనిచ్చింది. కనుక ఈ శబ్దం ఆయన రాసినప్పుడు ఆయనకు పూర్ణ జ్ఞానస్థితి లేదు. ఇది అంతరిక విషయం. ఇప్పుడు ఇక ప్రపంచం సంగతి విను! సర్వాత్మక సర్వేశ్వరుడు ఏం చేశాడో సరిగ్గానే జరుగుతున్నది అని నీవు విశ్వాసం కలిగి ఉంటే నీ ఈ విశ్వాసం, ఆశల పరిణామంగా నీ పని అవశ్యం నెరవేరుతుంది. కానీ "అయ్యో! ఇలా కాకూడదు, ఇలా అయింది" అని మనం సందేహంలో పడిపోతాం. ఎందుకంటే ఇది మనోమయజగత్తు. కనుక అలా ఆలోచించినందుకు అలా ఆ విధంగా జరుగుతుంది. ఇది విశ్వాసానికి సంబంధించిన విషయం. వ్యక్తి ఆశావాది అయి ఉండి 'శివసంకల్పమస్తు' నియమంపై అచంచలంగా ఉంటే అతని ప్రపంచం, పరమార్థం రెండూ విజయవంతమవుతాయి. ఎప్పుడూ

నిరాశ పడకూడదు. మీకొక మాట చెబుతాను. ఈ సమస్త లీల - ఆట మన సంకల్పానిదే! అప్పుడప్పుడు మీరంటూ ఉంటారు, "మేం మంచి ఆలోచనా విచారమే చేశాం; ఆశావాదిగానే ఉన్నాం కానీ అది జరగలేదు" అంటారు. ఇది కూడా నిజమే! కానీ మొదట తీసుకున్న నిరాశావాద ఆలోచనా విచారాలు, వాటి సంస్కారాల ప్రభావం వాటి ఫలాల్ని కూడా అనుభవించవలసి ఉంటుంది. ఒకసారి ఉద్భవించిన వస్తువు తన అస్తిత్వాన్ని, ప్రాకట్యాన్ని తప్పక చేస్తుంది. తరువాత సమాప్తమవుతుంది. ఇది ప్రాకృతిక నియమం. మనం చేసిన లేదా ఆలోచించిన కర్మకు ఫలితం అవశ్యం లభిస్తుంది. కనుక ప్రపంచం కోసం, పరమార్థం కోసం ఆశావాదివై ఉండాలి.

వ్యక్తికి పూర్ణ జ్ఞానం కలుగనంతవరకు వారు తమ లోపలి దృశ్యాలను చూసి ప్రసన్నులవుతారు. ఆ సంతోషాన్ని పద్య రూపంలోనో గద్య రూపంలోనో వ్యక్తం చేశారని మీకు రుజువు చేశాను. నిన్న కె.జె. సహాయ్ రాసిన ఉత్తరంలో తను చాలా ప్రసన్నంగా ఉన్నానని రాశాడు. అతనికి లభించిన ఈ సంతోషం ఎలా, ఎక్కడినుంచి లభించింది? తనలోపలి నుండే! మనం బిందువులం. అది సముద్రం. ఈ శరీరం సంపూర్ణ సృష్టికి నమూనా. మనిషికి గురువు లభించి, ఆయన సత్సంగంలోని మాటలు ఇతనికి బోధపడితే సముద్రాన్ని అతడు తన లోపలే ప్రవహింపచేసుకుంటున్నాడు. ఆ ఖజానా అతనికి లభిస్తుంది. ఇలాగే హుజూర్ మహారాజ్ తనకు లభించిన సంతోషాన్ని ఆయన తను రాసిన శబ్ద్‌లో ప్రకటం చేశాడు. ఇది స్వామీజీ మహారాజ్ ఇవ్వలేదు. ఇది హుజూర్ మహారాజ్ లోపలే ఉంది. ఆయనకు ఆయన విశ్వాసం, శ్రద్ధ, ప్రేమలే ప్రాకట్యం చేయించాయి. ఎందుకంటే ఇది ప్రకృతి నియమం. జైసాఖ్యాల్ వైసా హాల్', 'జైసీ ఆశా వైసీ బాసా,' 'జైసీ కర్‌నీ వైసీ భర్‌నీ'!

హుజూర్ మహారాజ్ ఈ శబ్దం రాసినప్పుడు ఆయన స్థితి పూర్ణజ్ఞానంతో లేదని చెప్పాను. కఠోరమైన వారికి, పక్షపాత పంథాల వారికి నా ఈ శబ్దాలు చెడుగా అనిపించవచ్చు. కానీ నేను చెప్పిన మాటలను రుజువు చేస్తాను. హుజూర్ మహారాజ్ గురుపదవి పైకి వచ్చాక తన వాణిలో, సత్‌గురువు కేవలం శబ్ద స్వరూపి రాధాస్వామి దయాలుడని, ఆయన చరణాలే ప్రకాశమనీ శలవిచ్చారు. బాహ్యగురువు కర్తవ్యమేమిటంటే జీవిని సత్యమైన సద్గురువు

అనగా ప్రకాశం, శబ్దాల్లో కలపాలి. నా స్థితే ఇదే అయింది. నేను కూడా హుజూర్ మహారాజ్ లాగే హుజూర్ దాతాదయాల్ జీ మహారాజ్‌ను ప్రశంసించేవాడిని. నేను సద్గురువు స్థానంలో పనిచేస్తున్నాను. సత్యజ్ఞానం ఇస్తున్నాను. గురుముఖులు, సాధుగురువులు జీవులకు విశ్వాసం, ప్రేమలను ఇప్పిస్తారు. అందుకే రాధాస్వామి మతంలో సాధు గురువులు సత్సంగం చేయించి జీవులను ప్రేరేపిస్తారు. ప్రోత్సహిస్తారు. వీరు లేకుంటే సద్గురువు ఏం చేస్తాడు? వీరు పునాది సిద్ధం చేస్తారు. వీరిలో నుండి కొందరు వ్యక్తులు ముందరి ఉన్నతిపై అగ్రసరులుగా ఉంటారు. పంథను నడిపించటం లేదా గద్దెను నడిపించడానికి ఒకరకం శిక్షణ, అసలైన ఉద్దేశ్యం మరొకటి ఉంది. నా మార్గం రాధాస్వామి ధామం లేదా దాతాను లేక అకాల్‌ను కలుసుకోవటం, దానిని తెలుసుకొని గుర్తించటం మటుకే! నేను బంధనాలు తెంచుకున్నాను. కానీ అందరూ బంధాలను తొలగించుకోవటానికి ఇష్టపడరు. వారు ప్రాపంచిక ఆనందం కోరుకుంటారు, నేను ప్రాపంచిక ఆనందాన్ని ఇవ్వజాలను. నేను జీవికి శాంతినిస్తాను. ఆనందం వేరు, శాంతివేరు! ఏది స్వార్థమో అదే పరమార్థం. కానీ ఒకటి ప్రాపంచికం రెండవది ఆధ్యాత్మికం; ప్రాపంచిక ఆనందాన్ని కోరివారికి నా శిక్షణ, బోధన అంత లాభదాయకంగా అనిపించదు. జీవులను ఉత్సాహపరిచి, ఆశావాద విచారాలనిచ్చి వారి జీవితాలను వృద్ధిపరిచే మహాత్ములకు గురుముఖులకు నా శుభాకాంక్షలు. అందుకే ప్రాపంచిక దృష్టి కోణం నుండి సాధు గురువులు, హంసలు, భక్తుల స్థాయి, ఆనందమిచ్చే విషయంలో నాకంటే పైదేననవచ్చు. నేను వారిని గౌరవిస్తాను. జీవులను ధృపదధామానికి చేర్చటమే నా పని.

నా అభిప్రాయంలో ఈ సమస్త లీల, ఆట సురత్ దే! నేనీ వయసులో ఇప్పుడు నా శరీరం మనసులను లెక్క చేయకుండా త్రిలోకీకి అతీతంగా ఉన్న రాధాస్వామి దయాలుడు లేదా అకాలపురుషుడిని ప్రేమిస్తాను. ఆయనే నా ఇష్టుడు. భక్తి, ప్రేమల శబ్దం వింటే నా తల వంగిపోవటం, చేతులు తమకు తాముగా ముకుళించుకుపోవటం మీరు చూసి ఉంటారు. ఇలా ఎందుకు జరుగుతుంది? నేను కావాలని చేతులు జోడించను. శిరస్సు వంచను. సురత్ తన లోపల శరణాగతమైనప్పుడు శరీరం, మనస్సు స్వయంగా తనకు తానుగా దీనత్వ స్థితికి వచ్చి ఇలా జరుగుతుంది. కనుక మనిషిలోని సురతే మూలవస్తువని

చెబుతున్నాను. ఇలాగే బయటి ప్రపంచంలో కూడా జరుగుతుంది. నీవు ఎవరైనా ఇష్టమైన వ్యక్తిని కలుసుకున్నప్పుడు నీవు సురత్ ప్రేమల ఆవేశ స్థితికి వచ్చి కౌగిలించుకుంటావు. చిన్నపిల్లవాడైతే ముద్దు పెట్టుకుంటావు. ఎత్తుకుంటావు. గుండెకు హత్తుకుంటావు. పెద్దవారైతే పాదాలకు మొక్కుతావు. అల్లుకుపోతావు. కనుక ఈ సమస్త లీల ఆట సురత్ దే!

మన సామాజిక సభ్యత, సామాజిక నియమాలకు సంబంధించినంత వరకు వాటిలో సురత్ పని చేయదు. మనసు, బుద్ధి పనిచేస్తాయి. ఎవరికైనా ధన్యవాదాలు చెప్పటం, రాంరాం చెప్పటం, జయరామ్ అని అనటం లేదా సలాం వాలేకుం లేదా సత్ శ్రీ అకాల్ అనటం లేదా ఎవరిపైనైనా చాడీలు చెప్పటం ఇవన్నీ మనసు ఆటలే! సురత్ ఆట ఉన్న చోట గౌరవాలు, అమర్యాదలు, గొప్పదనం, తక్కువదనం ఉండవు. ఓ రాజు గారి కొడుకు, బీదవారి కొడుకు పరస్పరం ప్రేమతో ఉంటే వారిలో గొప్ప - బీదతనాలు సమాప్తమవుతాయి. సర్వేశ్వరుని నిత్యప్రేమికుడు చాలాసార్లు ఆయన్ని నీవు అని సంబోధిస్తాడు. కానీ ప్రాపంచిక సంబంధాలలో నీవు అంటే కొందరికి నచ్చదు. హుజూర్ మహారాజ్ ప్రేమావేశానికిలోనై ఈ శబ్దంలో ఏం చెప్పాడో అదంతా సురత్ ఆట. సురత్ లీల. సురత్‌లో దీనత్వం ఉంటే మర్యాద, గౌరవం తమకు తాముగా వెంట ఉంటాయి. సురత్‌లో కేవలం ప్రేమ ఒక్కటే ఉండి దీనత్వం లేకుంటే వారి మాటతీరు మరోరకంగా వుంటుంది. హుజూర్ మహారాజ్ శబ్దంలో ప్రేమతో పాటు సురత్‌లో దీనత్వం కూడా ఉంది. చాలా మంది సర్వేశ్వరుడు లేదా గురువు లేదా తన ఇష్టుడిని ప్రేమ చేస్తారు. గానీ దీనత్వం ఉండదు. వారు ప్రేమ ఆవేశంలోకి వచ్చి నిందిస్తుంటారు కూడా!

నా బోధన శిక్షణ సాంగత్యాలవలన మీలో ఏవగింపు, ద్వేషం తొలగిపోతాయి. మీ భ్రమలు నశిస్తాయి. ఆధ్యాత్మికత లభిస్తుంది. అన్నిటికంటే ముందు ప్రాపంచికులకు స్మరణ, ధ్యానం ఉన్నాయి. నేనిప్పటికీ స్మరణ, ధ్యానం చేస్తుంటాను. శరీరం, మనసులను విడిచి సురత్‌తో ఆత్మ సమర్పణం చేస్తాను. కానీ దానితో పాటే శరీరం, మనసులు కూడా ఆత్మ సమర్పణ మవుతుంటాయి.

అందరికీ రాధాస్వామి

## సత్సంగం

## 09–12–1973

# సత్యమైన సాధన

కోయీ భాగే సురత్ తజ్ యహ సంసార్,

జా జగ్ మే పూర్ణ సుఖ నాహిఁ, ఖోజ్ కరో తుమ్ నిజ బార్ ।
నిజ ఘర్ హై బ్రహ్మాండ కే పారా, తీన్ లోక మే కాల్ పసార్ ॥

మాయా సంగ్ దుఃఖీ రహే సబ్, జీవ కోయీ న జావే భవ కే పార్ ।
సచ్చా సుఖ్ హై సంత్ కే దేసా, జాతే చలో సంత్ కీ లార్ ॥

సతగురు కర్ ఉన్ సేవా కర్‌నా, ప్రీత్ ప్రతీత్ చరణ్ మే ధార్ ।
వహ దయాల్ తో హై భేద్ బతావేఁ, సురత్ శబ్ద కా మారగ్ సార్ ॥

ప్రీతి సహిత్ జబ్ కరో కమాయీ, తబ జావో భవ సాగర్ పార్ ।
రాధాస్వామి చరణ శరణ దృఢ కర్‌లే, పావో ఉన్‌కీ మెహర్ అపార్ ॥

రాధాస్వామి!

మీరొచ్చారు. సంత్ మతం ఏం నేర్పిస్తుంది ? మీకు ఇవాళొక ఉత్తరం వినిపిస్తాను. దీనిని లుథియానా నుండి ఒకాయన రాశారు.

లుథియానా,
18-11-1973.

*పరమ సంత్ పరమదయాల్ ఫకీర్ చంద్ జీ మహారాజ్,*

రాధాస్వామి!

ఈ ఆత్మకుదుపులు తింటూ ముప్పై అయిదు సంవత్సరాలు గడిచాయి. గ్రంథాలు, పోథీలు చదివేశాను. దయాల్ బాగ్ ఆగ్రాకు వెళ్ళాను. ఢిల్లీలో సంత్ కృపాల్‌సింగ్ జీ మహారాజ్ దగ్గరకు వెళ్ళాను. వ్యాస్‌లో బాబా చరణ్ సింగ్ జీ

మహారాజ్ వద్దకు వెళ్ళాను. చాలా చోట్ల సత్సంగం విన్నాను. సంత్, మహాత్ముల, దీనుల, దుఃఖితులకు సేవ చేశాను. పెద్ద పెద్ద థియరీలు చదివాను. విన్నాను. కొందరు ఆశ్రమాలు విస్తరించుకోవటంలో నిమగ్నమై ఉన్నారు. కొందరు మానవ కేంద్రం ఏర్పాటు చేయటంలో లీనమై ఉన్నారు. కొందరు గౌరవ ప్రతిష్ఠల కోసం పనులు చేస్తున్నారు. కొందరు డబ్బు కూడ బెడుతున్నారు. అనేక చోట్ల గురుయిజం నడుస్తోంది. జీవుల సందోహం పొంగివస్తున్నది.

ఆత్మ అనామీ ధామం నుండి, సర్వాధారుని నుండి విడివడి వచ్చిందనీ, ఈ ఆత్మ పిండ, అండ, బ్రహ్మాండ, సత్యఖండ, అగమ అగోచర, అపార, అనామీ దేశంలోకి తిరిగి వెళ్ళి పోతుందని చాలా విన్నాను. సూర్య చంద్రులు, తారకలు అంతరంలో కనిపిస్తాయి ఇదవుతుంది అదవుతుంది! అంటారు. కానీ ఫకీర్! ప్రపంచమే అంతా! సంతులు, మహాత్ములు సంతు మహాత్ములు తాము చూశామనీ, అనుభవంలోకి తెచ్చుకున్నామనీ చెబుతారు. ఉన్నత శ్రేణికి చెందిన మహామహులు కబీర్, గురునానక్‌లు ఎంతో చెప్పారు. సోదరా ఫకీరా! సత్యమేమిటంటే చాలా విన్నాను కానీ నాకేదీ కనిపించలేదు. ఇదంతా నాకు బూటకమేననిపిస్తుంది. నా మిత్రుడొకరు నాకు 'శివ్', 'జనతా జనార్ధన్' రెండు పుస్తకాలనూ ఇచ్చాడు. వాటిలో మీ మానవతా జండాను చూశాను. అది చూశాక మిమ్మల్ని కూడా చూడాలనిపించింది. నీవు నన్ను కూడా అనామీ దేశం, రాధాస్వామి దేశం దాకా చేర్చగలవా? నీవు నాకు మార్గదర్శకునివి కాగలవా? చూడు ఫకీరా! ఆలోచించుకో! నీవు పరమసంతువూ, పరమ దయాలుడవూ అని విన్నాను. నీవొక వేళ దయాలుని శక్తివైతే సరేనను! అంగీకరించు. ఇక ఒక షరతు! లోపలా, బయటా రెండు వైపులా సంభాళించవలసి ఉంటుంది. నా తల్లి దండ్రులుకూడా గుడ్డివాళ్ళు. పద్దెనిమిది సంవత్సరాల నుండి రోగపీడితులై, మంచంపై పడిఉన్నారు. వారిని లేపి మలమూత్ర విసర్జనకు సాయపడుతుంటాను. అందుకే ఒకవేళ నేను ఇంట్లోనే ఉండగా నీవు నన్ను సంపూర్ణం చేయగలిగితే సరేనను. లేకుంటే ఈ రోజునుండి మానవతా జండాను పెకిలించి ఎక్కడైనా పారవేయ్. మరేం లాభం? సత్యమైన గురువు కాగలిగితే శీఘ్రమే చెప్పు. నాకు చూపించు. ఏ విధంగా ఆత్మ పిండ, అండ, బ్రహ్మాండ, సత్యఖండాల ద్వారా అనామీ దేశం లేదా రాధాస్వామి

దేశంలోకి వెళ్తుంది? ఇవాళ్టి వరకు అందరూ చెబుతుండటమే విన్నాను. గానీ ఎవరూ ఆత్మనులాగి పైకి తేలేదు.

చాలా సంవత్సరాలనుండి ఆత్మలోకి ఒక విచారం పదే పదే వస్తుంటుంది. ఈ మనిషి శరీరంలోకి వచ్చి ఒకవేళ మన ఇంటికి తిరిగి రాధాస్వామి దేశంలోకి వెళ్ళి ఆత్మ పరమాత్మల అనుభవం పొందకుంటే మనిషి ఏమీ చేయనట్లే!

మిమ్మల్ని మీరుపొంది సకల ప్రపంచమును ఒకే జండా కిందికి తీసుకు రావాలనే తపన మీలో ఉంది. కలియుగపు జీవులను చూసి దయ కలుగుతుంది. ఏమైనా ప్రాప్తించుకుంటే చెప్పు. నాకు కూడా చూపించు. నేను నీ ఉత్తరం కోసం ఎదురు చూస్తుంటాను. త్వరగా జవాబివ్వాలి. నీవొకవేళ అసలైన ఫకీరువే అయితే ఈ ఆత్మను కూడా కబీర్, ఫరీద్, గురునానక్‌ల వలె చేయి. అప్పుడు నమ్ముతాను.

తీసుకో ఫకీరా! ఎత్తుకో! మానవతా జండా! సకల ప్రపంచాన్ని ప్రకాశవంతం చేయకుంటే అడుగు.

నా దగ్గర పంచ శబ్దాలున్నాయి. నీ అనుగ్రహాన్నివ్వాలి. మార్గదర్శనం చేయించాలి. నా సూక్ష్మ ప్రకాశవంత స్వరూపం లోపలికి వచ్చి దర్శనం ఇవ్వాలి. మార్గదర్శనం చేయించి బోధించాలి.

ఒకవేళ ధైర్యముంటే రా. నా మనసనే మందిరం నీ కోసం ఖాళీగా ఉంది. పరమాత్మ ప్రకాశంతో దీనిని నింపెయ్యి.

చూసుకో. నేనెవరిని? నాలోపల ఎవరు ప్రకాశం ఇస్తున్నారు? ఆధ్యాత్మికతా సంపద పంచిపెట్టేవాడా! నేనుకూడా నీ ఎదుట జోలె పట్టుకుని నిల్చున్నాను. నీ దర్బారు నుండి ఖాళీగా వెళ్ళను.

ఈ పంక్తులతో నేను ఉత్తరాన్ని ముగిస్తున్నాను. మీ కోసం నిరీక్షిస్తున్నాను.

ప్రతి విషయమూ అత్యంత గోప్యంగా ఉంచాలి.

మీరీ ఉత్తరం విన్నారు. నన్ను నేను ఈలోకంలో సంత్ సద్గురు వఖ్తనని అన్నాను. ఎవరైనా సంత్, మహాత్మా ఏ వ్యక్తినైనా ఆ గమ్యం వరకు చేర్చగలడా అని నన్ను నేను ప్రశ్నించుకుంటాను. నేనీ ప్రశ్న ఎందుకు అడుగుతాను? ఈ

పని ఎందుకు చేస్తాను? ప్రాపంచిక ప్రాణులకు నా అనుభవంలోకి వచ్చిన సత్యమైన మాట, సత్యమైనబాట, సత్యమైన సాధన చెప్పిపోవాలనే ఈ పని నిర్వహిస్తుంటాను.

ఈ వ్యక్తిలోపల తపన ఉంది. భావావేశముంది. దీనికి కారణం ఏమిటి? పద్ధెనిమిది సంవత్సరాలనుండి అతని తల్లిదండ్రులు వ్యాధి గ్రస్థులైనారు. అతడు ఈ వ్యాధి నుండి బాధపడుతున్నాడు. ఆ దుఃఖం నుండి తప్పించుకుని రక్షింపబడాలనుకుంటున్నాడు. అతనికి తన మనసు యొక్క మనోవిజ్ఞాన జ్ఞానం లేదు. నన్ను నేను ప్రశ్నించుకుంటాను. "ఫకీర్! నీవు గానీ. మరే మహాత్ములైనా గానీ ఇతణ్ణి అక్కడికి చేర్చగలరా" అని ఇతరుల సంగతి నేను చెప్పలేనుగానీ, నా అనుభవం చెప్పగలను. నా గురుసోదరులు గురించి నాకు తెలుసు. నాకీ జ్ఞానం సత్సంగీయుల ద్వారా లభించింది. కృషక్ జీ, దయాల్ దాస్, కమాల్ పుర్‌కు చెందిన అమ్మ, సంత్ తారాచంద్, ఇంకా ఇతర సత్సంగీయులు అభ్యాసం చేశారు. వారి లోపల నా రూపం దర్శనమిచ్చింది. నీవు వీరిలో శబ్దం ధ్వనింపచేశావా? ప్రకాశాన్ని వెలువరించావా అని నన్ను నేను నిలదీస్తుంటాను. తనలో నన్ను ప్రకాశవంతమైన రూపంలో చూసినప్పుడు దీని జ్ఞానం కలుగుతుందా? లేదు. కనుక దీనివల్ల రుజువవుతోంది - అక్కడికి చేరేవారు తమ తమ ప్రేమ, తత్పరత, పరిశ్రమ, తమ సత్యసంధతతోనే చేరుకోగలరు. ఈ విషయాన్ని నేను ప్రచురింప చేయగోరుతున్నాను. దీనివలన లోకుల భ్రమలు, సంశయాలు దూరం కావాలి.

గురువు రూపాన్ని అర్థంచేసుకొనక సత్యాన్ని, యథార్థాన్ని అర్థంచేసుకొనక, విశ్వాసం లేనందువలన మనిషి లోపల భిన్న భిన్న ప్రకారాల భ్రమలు పుడుతుంటాయి. నన్ను నేను సంత్ సద్గురు వక్తనని చెప్పాను. సతగురు వంటే సత్యమైన జ్ఞానం. ఎవరికి ఏది లభించినా అది వారి విశ్వాసం, వారి ప్రేమ, తత్పరత, [illegible]. వారి సేవలకు ఫలం లభిస్తుంది. ఏ గురువూ, ఏ మహాత్ముడూ ఎవరికీ ఏమీ ఇవ్వడు. ఒకవేళ ఇస్తే అతనికి కేవలం ఒక విచారం ఇస్తాడు. దాని వలన జీవునికి సరళపద్ధతి లభిస్తుంది. నేను నా గురించి చెబుతాను. నేను 1905లో నామం తీసుకున్నాను. 1916 వరకు నా లోపల విపరీతమైన ప్రేమ విశ్వాసాలు పొంగేవి. నాకు శబ్దం వినిపించలేదు. ప్రకాశం కనిపించలేదు.

ఆ సమయంలో నేను చాలా ఏడ్చేవాణ్ణి. ఆ విషయం పండిత పురుషోత్తమదాసు, సేఠు దుర్గాదాసు, ఇంకా బ(సాబగ్దాద్‌లో అప్పట్లో ఉన్న ఇతరులకు తెలుసు. 1905 నుండి 1916 వరకు నాకు ఏమీ లభించని కారణం ఏమిటి? ఎందుకంటే నాకు పదమూడు సంవత్సరాల వయసులో పెళ్ళయింది. పదిహేను సంవత్సరాలకే గృహస్థ జీవనంలో ప్రవేశించాను. ఏవ్యక్తి అధికంగా విషయ వికారాల జీవనం గడుపుతాడో లేదా ఎవరి శారీరిక, మానసిక బ్రహ్మచర్యం పతనమవుతుందో వారికి ఈ గమ్యం లభించదు.

జహాఁ కామ్ తహాఁ నామ్ నహీఁ, జహాఁ నామ్ నహీఁ కామ్ ।
రవి రజనీ దోవూ నా మిలే, ఏక్ ఠౌర్ ఏక్ యామ్ ॥

మన అశాంతి, చింత, భ్రమలకు అన్నిటి కంటే ముఖ్య కారణం మన శారీరిక మానసిక బ్రహ్మచర్య పతనం. నాలుగు రోజుల క్రితం ఒక నవయువకుడు వచ్చాడు. నేనతణ్ణి చూసి ఎందుకు వచ్చావని అడిగాను. "బాబాజీ! నేను చాలా అశాంతిగా ఉంటాను. చదువులో మనసు నిలవదు" అన్నాడు. "నిజం చెప్పు! చేతితో వీర్యం నష్టపరుస్తావా లేదా?" అన్నాను. అతడు అంగీకరించాడు. సంత్ సత్‌గురువునన్నాను గనుక నాకు అర్థమైన సత్యజ్ఞానాన్ని ప్రపంచానికి చెప్పి గురు ఋణం నుండి విముక్తుణ్ణి కావాలనుకుంటున్నాను.

ఇంతకుముందు చదివిన ఉత్తరం రాసిన వ్యక్తిని నేను చూడలేదు. అతడెవరో నాకు తెలియదు. చూస్తే అతడి గురించి బహుశా ఏమైనా చెప్పగలనేమో! ప్రపంచం గురుమతాన్ని అర్థం చేసుకోలేదు. భవసాగరం నుండి దాటింప చేయటానికే గురుమతం ఉంది. బ్రహ్మచర్యాన్ని కోల్పోయే వారికి, కోల్పోయినవారికి ఈ వస్తువు లభించజాలదు. ఇది నా జీవన అనుభవం. దానికి ఋజువు చూపిస్తాను. ఓ ఊళ్ళో ఓ కెప్టెన్ ఉండేవాడు. అతనికి భగవంతుణ్ణిచేరే ఆసక్తి ఉండేది. అతడో మహాత్ముని వద్దకు వెళ్ళి 'నాకు భగవంతుని దర్శనం కలిగించు' అని అడిగాడు. ఆయన సరే కలిగిస్తానని అభయమిచ్చాడు. ఈ కెప్టెన్ ఆ మహాత్మునికి పదివేల రూపాయలిచ్చాడు. అతని కారుకు డ్రైవర్‌గా పనిచేయసాగాడు. పది సంవత్సరాలపాటు కారు నడిపించాడు. ఈ పదేళ్ళ కాలంలో అతనికి ప్రకాశ దర్శనం కాలేదు. శబ్దం

వినిపించలేదు. అతడు మహాత్మునిపై దావావేశాడు. ఏమని? ఈ మహాత్ముడు నాకు రాముణ్ణి, భగవంతుణ్ణి చూపిస్తానని వాగ్దానం చేశాడు. కానీ ఈ రోజు వరకు నాకేమీ లభించలేదు అని. ఆ మహాత్ముని శిష్యులందరూ కలిసి ఓ నిర్ణయం తీసుకున్నారు. ఈ వార్త న్యూస్ పేపర్‌లో వచ్చింది. అలాగే ఈ వ్యక్తి ఉత్తరంలో రాశాడు. "చూడు! నీలో సత్య అభిలాష ఉంది. కానీ నీవు మూర్ఖుడవు. తెలివి హీనుడవు, మర్యాద తెలియని అసభ్యుడవు" అని. ఎనిమిది సంవత్సరాలక్రితం ఆ కెప్టెన్ నా దగ్గరకు వచ్చాడు, ఎంతో గర్వంగా చెప్పాడు. నేను దావావేసి నలభై వేల రూపాయలు వసూలు చేశాను అన్నాడు. ఈ గురుమతం అంతా నటన. అతనితో "నీవు శబ్దం వినజాలవు. ప్రకాశం చూడజాలవు" అన్నాను. "ఎందుకు" అడిగాడతడు. "నీ పెళ్ళయిందా?" అని ప్రశ్నించాను. "లేదు" అన్నాడతడు. "అయినా వీర్యం నష్టపరుచుకుంటావు" అన్నాను. "మీరు చెబుతున్నది పూర్తిగా నిజం" అన్నాడు. "ఏ మనిషి వ్యర్థంగా, అవసరాన్ని మించి తన వీర్యాన్ని నష్టపరుచుకుంటాడో అతని అదృష్టంలో ప్రకాశం లేదు. శబ్దం లేదు" అన్నాను. "ఇవాల్టి వరకు నాకీ విషయం ఎవరూ చెప్పలేదు" అన్నాడతడు "దానికి నేను బాధ్యుడిని కాను. ఈ అంశం నీకూ, నీ గురువుకే తెలియాలి" అన్నాను.

అందుకే ఎవరికి నచ్చినా, నచ్చక పోయినా నేను సదా స్పష్టం చేస్తుంటాను. నీవు ఒకవేళ శారీరిక, మానసిక బ్రహ్మచర్యాన్ని నష్టం చేసుకుంటూ ఉంటే నీ సురత్ పైకి అధిరోహించజాలదు. ఈ ఉత్తరం రాసిన వారి మనసులో ఇలాంటి వ్యాకులత ఎందుకొచ్చింది? దీనికిగాను నేనతనికి జవాబిస్తున్నాను. రెండవది సుదీర్ఘకాలంగా అతని తల్లిదండ్రులు రోగపీడితులై ఉన్నారు. తన ఇహ పర లోకాల బాధ్యత తీసుకోమని ఉత్తరం రాశాడతడు. ఏ సంత్, ఏ మహాత్ముడు, మహాపురుషుడు ఎవరి బాధ్యతనూ తీసుకోజాలడు. సంతులే స్వయంగా తమ రోగాన్ని అనుభవించారు. ఏ సంతైనా ఎవరి బాధ్యతైనా తీసుకోగలడని నేనెలా ఒప్పుకోగలను? అందరూ తమ తమ కర్మలను అనుభవించారు. వారి ఇళ్ళలో అశాంతి వ్యాపించింది. వారి సంతానం కులచరిత్రను చెడగొట్టారు. వారి మాటల్ని లెక్క చేయలేదు. వారేమీ చేయలేకపోయారు. అందరూ తమ తమ కర్మలను అనుభవించక తప్పదు. ఎలా చేస్తే అలా అనుభవించాలి. కబీర్ సాహబ్ కూడా ఇదే చెప్పాడు.

అరే మన్ ధీరజ్ కాహే న ధరే ।
శుభ్ అవుర్ అశుభ కర్మ పూర్వలే రత్తీ ఘటే న బఢే ॥

ఒకవేళ సత్యమైన మనసుతో ప్రార్థన చేస్తే నీ విచారశక్తి వలన, నీ విశ్వాసం కారణంగా నీకు ఏమైనా ప్రాప్తించగలదు. కొందరు నాకు ఉత్తరాలు రాస్తుంటారు. "బాబాజీ మీరొచ్చారు. ప్రకటమయ్యారు. మీరీ పనిచేశారు. ఆ పని చేశారు" అని. కానీ అది నేను కాదు, నాకా విషయాలే తెలియవు మరి!

హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ గారి సత్సంగి ఒకాయన రోహతక్ జిల్లాలో నివసించేవాడు. దాతాను ఎంతో ప్రేమించేవాడు. ధామ్‌కు ప్రతి సంవత్సరం భోజనాల కోసం చాలా ధాన్యం తెచ్చేవాడు. హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ అతని ఊరికి వెళ్ళేవాడు. ఓ సారి అతని స్థలంలో కుటీరం వేసుకుని ఆరునెలలున్నాడు. అక్కడే ఆయన "కబీర్‌యోగ్' అనే పుస్తకం రాశాడు. ఆయన ప్రసాదం వలన చాలా మందికి ఒకానొక రోగం నయమైంది. ఆ వ్యక్తి సోదరునికి కూడా వ్యాధిసోకింది. అతడు సోదరుణ్ణి తీసుకుని హుజూర్ దాతాదయాల్ మహారాజ్ దగ్గరికి ధామ్‌కు వచ్చాడు. "అతడికి నయమవుతుంది విశ్వసించు" అన్నాడు దాతాదయాల్. కానీ అతనికి జబ్బు నయంకాలేదు. చనిపోయాడు. తరువాత ఆ వ్యక్తి దాతా దయాల్‌ను చాలా అపకీర్తి పాలు చేశాడు. నేను ప్రమాణమిస్తున్నాను. ఏ సంతూ ఎవరి కర్మనూ కత్తిరించజాలడు. తగ్గించజాలడు. ఈశ్వరుడు, పరమేశ్వరుడు సైతం ఎవరి కర్మనూ తొలగించలేరంటానునేను. ఈశ్వరుడు ఒక నియమం. ఎవరు చేసిన దానిని వారు అనుభవించక తప్పదు. ఇది నియమం. పరమార్థం సంగతి అటుండనీ, ఆధ్యాత్మికతకు అర్హుడు కావడానికి ముందుగా మనిషి మానవతను అలవరుచుకోవాలి. ఇది నా జీవితానుభవం. మీకు చెప్పాలనుకుంటున్నాను. మీ జీవితాలను సార్థకం చేసుకోవాలనుకుంటే ముందుగా మనిషివి కావటం అవసరం. సచ్చరిత్రుడవు కావాలి. పూర్వీకుల నియమానుసారం నడువు. పూర్వకాలంలో యువకునికి ఇరవై ఐదు సంవత్సరాల వరకు బ్రహ్మచర్యం పాటించాలనే నియమం ఉండేది. ఎందుకు? మనలోపలి వీర్యం ఈశ్వరుని స్థూలరూపం. దానిని అవసరాన్ని మించి నష్టపరిస్తే అశాంతి కలగక తప్పదు. నీవు సుఖంగా ఉండజాలవు. మనపట్ల ఏం జరుగుతున్నా అవి కొన్ని ఈ

జన్మలోని కర్మల ఫలితాలు. మరి కొన్ని ప్రారబ్ధ కర్మల ఫలాలు. అందుకే మనం మన కర్మలు మంచివై ఉండేలా నడుచుకోవాలి. మన స్వార్థం కోసం ఎవరినీ మోసగించరాదు. దగా చేయకూడదు. ఈ నియమాలపై నడిచే వ్యక్తి సంత్‌మతానుసారం తన ఆదిగృహానికి తిరిగి వెళ్ళడానికి అర్హుడవుతాడు.

నా దగ్గరికి చాలా మంది వస్తుంటారు. వీరంతా ఆది గృహానికి వెళ్ళడానికే వస్తున్నారా? వీరు తమ సాంసారిక అవశ్యకతలను పూర్తి చేసుకోవడానికి వస్తుంటారు. వీరి విశ్వాసం వల్లనే వీరి పనులు నెరవేరు తుంటాయి. నా పూర్వ జన్మల కర్మలననుసరించి యశస్సు లభించేది ఉంది కనుక లోకులు బాబాజీ మా పని చేస్తాడనుకుంటారు. ఎవరి పనులైనా చేయడానికి నేనవరిని?

చునార్‌కు చెందిన ఒక వ్యక్తికి పిల్లల్లేరు. నా దగ్గరికి వచ్చి ప్రసాదం తీసుకువెళ్ళాడు. అతడికి కొడుకు పుట్టాడు. అతడు ఎంతో సంతోషించి ఉత్సవం జరుపుకున్నాడు. నన్నెంతో ప్రశంసించాడు. టెలిగ్రాం ఇచ్చాడు. అందులో అరవైరెండు పదాలున్నాయి. "జరిగిందంతా నీ కర్మవల్లనే జరిగింది. జరగబోయేది నీ కర్మవల్లనే జరుగుతుంది" అని నేను జవాబిచ్చాను. తెల్లవారి మరో టెలిగ్రాం వచ్చింది. పిల్లవాడు మరణించాడని! ఇప్పుడు చెప్పు! నా ప్రసాదం వలన అతడికి కొడుకు పుట్టి ఉంటే ఎందుకు చనిపోతాడు? నేను స్పష్టంగా చెబుతాను. కానీ ఇతరులు సత్యం చెప్పక అజ్ఞానంలో ఉంచుతారు. కానీ వారి పనులు నెరవేరనప్పుడు ఈ లుథియానా మనిషి ఈ ఉత్తరంలో రాసినట్లే రాస్తారు. నాకు అతడు పరిచయమే లేదు. జ్ఞానం, అనుభవాల పేరే గురువు. కానీ ఇది కూడా నీకు ఏదో ఒకచోట పూర్తి విశ్వాసం కలిగినప్పుడే లభిస్తుంది. శ్రద్ధ విశ్వాసాలు లేకుంటే ఏమీ లభించదు. విశ్వాసం పనిచేస్తుంది. నామదేవ్, ధన్నా భక్తులది విశ్వాసమే! ఈ సమస్త లీల విశ్వాసానిదే! సంత్ తారాచంద్ జీ చెప్పాడు. అతడొక సారి కబీర్ పంథి మఠంలోకి వెళ్ళాడుట. అక్కడ ఒక స్త్రీని చూశాడట. ఆమె అభ్యాసం చాలా ఉన్నత స్థితిలో ఉంది. "అమ్మా! నీవు ఏ నామం జపిస్తావు" అని ఇతడు ఆమెను అడిగాడు "మేకకు మూడు కాళ్ళు" అని ఆమె జవాబిచ్చింది. అది విని తారాచంద్ చాలా ఆశ్చర్యపోయి, "మీరు ఈమెకు ఇలాంటి నామం ఉపదేశించారేమిటి?" అని

అక్కడి మఠాధిపతిని అడిగాడుట. అతడు చెప్పాడట ఆమె నామదానమిమ్మని నన్ను ప్రతిరోజూ వేధిస్తుండేది. ఒకరోజు నేను కోపంతో "మేకకు మూడు కాళ్ళు" అన్నాను. ఈమె దానినే నామం అనుకుని దానినే జపిస్తుంది. ఆమె ఏ స్థితిలో ఉందో ఇప్పుడు మీరే చూస్తున్నారు" అన్నాడట. దీనివలన ఏం రుజువైంది? ఈ సమస్త ఆట నీ విశ్వాసానిదే!

నేనీ తలనొప్పిని ఎందుకు స్వీకరించాను? నేను ఒక సాధారణ భక్తుడిగా ఉండేవాణ్ణి. రాముడు, కృష్ణుడు, అవతారాలు, దేవీ దేవతలను కొలిచేవాణ్ణి. దైవేచ్ఛ నన్ను హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ చరణ కమలాలలోకి తీసుకువెళ్ళింది. నేను ఆయన్ని రాముడిగా భావించి పూజించాను. ఆయన నాకు సంత్ మత బోధన నిచ్చాడు. ఇందులో అన్ని మతాల ఖండన ఉంది. నేను గాభరా పడ్డాను. హుజూర్ దాతాదయాల్ మహారాజ్‌ను నేను వదిలిపెట్టలేను. ఆ సమయంలోనే నేను ఒక శపథంచేశాను. ఆ మార్గంలో నేను స్థిరంగా, సత్యంగా నడుస్తాను. నా అనుభవాన్ని లోకానికి చెబుతాను. నాపై పనిచేసే బాధ్యత ఉంది. అందుకే ఈ పనిని సత్యసంధతతో నిర్వహించాను. దీని వలన తన నిజగృహానికి వెళ్ళగోరే మనిషిగానీ లేక తన ప్రాపంచిక జీవనం ఆనంద దాయకం చేసుకోగోరే మనిషికి అసలైన పద్ధతి తెలియాలి. ఇవాళ రేపు అనధికారులకు అనగా అనర్హులకు నామం ఇవ్వబడుతుంది. వారికి అసలైన రీతి తెలియదు. వారు కేవలం మాంసం, మద్యం నిషేధిస్తారు కానీ దీనివలన నావ కడలిదాటదు. తీరం చేరదు. ప్రతి ఒక్కరికీ వేరువేరు సూచనలు పనిచేస్తాయి. అందరికీ ఒకే చికిత్స పనికిరాదు.

హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ శరీరాన్ని విడిచాక ఒకసారి ధామ్‌కు వెళ్ళాను. అక్కడ గోరఖ్‌పూర్ నుండి కొందరు వచ్చారు. వారిలో ఒక నవయువకుడు ఎంతో నిమగ్నమై కనిపించాడు. అందరూ అతణ్ణి గౌరవించేవారు. భక్తుడనే వారు. అతణ్ణి దూరం నుండే చూశాను. తరువాత అతని భుజం పట్టుకుని "నేను కేవలం నీ కోసమే ఇక్కడికి వచ్చానని" చెప్పాను. ఇది విని చుట్టు ప్రక్కలవారు ఆశ్చర్యచకితులయ్యారు.

"నేను ప్రపంచానికి కొంత చెప్పాలనుకుంటాను. కొంత రహస్యం వివరించాలనుకుంటాను."

తరువాత సత్సంగం జరిగింది. "నువ్వు ఆగు" అన్నాను అతడితో. ఇతరులంతా వెళ్ళిపోయాక ఒంటరిగా ఉండగా "నిజంచెప్పు. నీవు నీ చేతితో బ్రహ్మచర్యం నష్టపరుచుకుంటావు కదా?" అన్నాను. అతడు అవునన్నాడు. "మూర్ఖుడా! చస్తావు. ఇంత ప్రేమ పూర్వకముగా పాడుతావు. లోకులు నిన్ను భక్తుడనుకుంటారు. నిజానికి నీ బ్రహ్మచర్యం లోపం వలన నీ మానసిక స్థితి చెడిపోయింది" అన్నాను. అతడు అంగీకరించాడు. అతనికి నేను అనేక సూచనలిచ్చాను. ఒక సంవత్సరం తరువాత మళ్ళీ కలిశాడతడు. "మహారాజ్! ఈ సంవత్సరం మొత్తంలో ఒకేసారి పతనమయ్యాను" అన్నాడు. "ఇక నువ్వు రక్షింపబడతావ్" అన్నాను. ఇది నా జ్ఞానం. మనం మన తలకొట్టే పిచ్చివారి వెంట తిరుగుతాం. నా మాటలను ఆలోచించండి. నన్ను నేను సంత్ సత్‌గురువక్త్ అన్నాను. నేను నా కర్తవ్యం నిర్వహించాలనుకుంటున్నాను. కనుక సత్యం వెల్లడిస్తాను.

ఒక మఠాధిపతి శరీరం త్యజించాడు. అతని శిష్యులలో ఒకరు తలకొట్టుకోవటం ప్రారంభించాడు. నాలో ధారవచ్చేసింది అనసాగాడు. ఒక డాక్టరును తనకు అనుకూలమైన వాడిగా చేశాడు. ఇతరులంతా ఇతణ్ణి గద్దెపై కూర్చోబెట్టారు. కొంత కాలం తరువాత ఆ గురువు శిష్యుడే! అయిన ఆ డాక్టరు నావద్దకు వచ్చాడు! చాలా మాటలు మాట్లాడాడు. మీ గురువుకు చక్కెర వ్యాధి ఉందని నా కనిపిస్తోంది" అన్నాను. "మీరు చెప్పేది పూర్తిగా నిజం. కానీ ఈ విషయం తమకెలా తెలుసు" అన్నాడాయన. "నాకు మనోవిజ్ఞానం తెలుసు" అన్నాను. నా విషయం నాకు తెలుసు. చిన్నతనంలో నా బ్రహ్మచర్యం పతనం కాగా నేను కూడా తన్మయంలో పడేవాడిని. చాలాసార్లు స్పృహ కోల్పోయేవాడిని. ఇది నేను అనుభవించినది. హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ "ఫకీర్! శరీరాన్ని త్యజించేముందు బోధనా విధానాన్ని మార్చివెళ్ళు" అని ఆదేశించాడు. నేను శిక్షణను మారుస్తున్నాను. ఎవరి అదృష్టంలో ఉంటే వారు తమ జీవనాన్ని సఫలం చేసుకుంటారు. ఎవరి భాగ్యంలో లేదో వారిని నేనేం చేయగలను? నేను చెప్పేదే సత్యమని దావా చేయను. ఇది నా అనుభవం. బస్రా బగ్దాద్‌కు వెళ్ళకుంటే నా స్థితి ఏమయ్యేదో మరి!

హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ తనువు విడిచాక శ్రీ కుబేరనాథ్ నాకు ఉత్తరాలు రాసేవాడు. నేను వాటికి జవాబిచ్చేవాడిని. శ్రీ మహేశ్వరనాథ్ - వకీలు గారి ఉత్తరం కూడా వచ్చింది. "సత్తలోకం, అలఖలోకం, అగమలోకం, అనామలోకం ఇవన్నీ ఏమిటి? నేను అక్కడికి ఎలా వెళ్ళాలి" అని రాశాడతడు. నేను అతని ఏ ఉత్తరానికీ జవాబు ఈయలేదు. శ్రీ మహేశ్వరనాథ్ నాకు తెలుసు. నేను రాధాస్వామీ ధామ్‌కు వెళ్ళినప్పుడు శ్రీ కుబేరనాథ్ నా దగ్గరికి వచ్చి, "మహారాజ్! మీరు నా ఉత్తరాలకు జవాబిచ్చారు గాను శ్రీ మహేశ్వరనాథ్‌కు జవాబులు రాయలేదు" అని అడిగాడు. "అతని ఉత్తరం చదివాక అతడు షుగర్ - వ్యాధి గ్రస్థుడని అనిపించింది." అన్నాను. నిజానికి కుబేరనాథుడు నా పరీక్షకోసం అతనితో రాయించాడు. "మహారాజ్! అతడు తన ఉత్తరాలలో తన రోగం గురించి రాయనే లేదు" అన్నాడు కుబేర్‌నాథ్. "ఇది నా జ్ఞానం. నాకు మనో విజ్ఞానం తెలుసు" అన్నాను. అప్పుడు శ్రీ కుబేర్‌నాథ్ నాకు తలవంచాడు. నన్ను సత్‌గురువుగా అంగీకరించాడు.

సహస్రదళ కమలం, త్రికుటి, సున్న్, మహాసున్న్, భఁవర్‌గుఫా వంటి స్థాయిలన్నీ మనిషియొక్క మానసిక భావాలు, ఆలోచనా విచారాల ఆటలు. వీటి తరువాత సత్, అలఖ, అగమ లేదా ఆత్మ, సురత్ చేతనల స్థితుల లీల. దీనిని దాటి దీనికి అతీతమైనది మూల స్వరూపం అకాల్, నామం అదే అధారం. శారీరిక, మానసిక తెలివి కలిగి, జ్ఞాపకాలను మరిచి పోలేని వ్యక్తి సత్, అలఖ, అగమాలలోకి వెళ్ళజాలడు. నాకిది చాలా కఠినంగా ఉండేది. నా రూపం మీ లోన ప్రకటమవుతుందనీ, అనేక రూపాలతో సాయపడుతుందనీ మీరు చెబుతారు. కానీ ఆ వచ్చింది నేను కాదు. అది మీమీ మనస్సే. అందుకే నేనీ మనసును విడిచిపోవడానికి వివశుడనవుతాను. ఇది మాయ, కాలం అని నాకు బోధపడింది. కనుక నేనిక ముందుకు వెళ్ళిపోతాను.

అందుకే ఎవరైనా తమ ఆదిగృహానికి తిరిగి వెళ్ళాలనుకుంటే వారు తమ శారీరిక, మానసిక బ్రహ్మచర్యాలను సంభాళించుకోవాలి. ప్రపంచంలో జరుగుతున్నదీ, జరిగేదీ, జరిగినదీ అంతా మన మన కర్మల ఫలాలే! ఇలా భావించగా ఉదాసీనత కలిగిన వారి కోసమే నామం!

విషయోన్‌సే జో హోయ్ ఉదాసా, పరమారథ్ కే జామన్ ఆసా ।

ధన్ సంతాన్ ప్రీతి నహిఁ జాకే, ఖోజత్ ఫిరే సాధు గురు జాగే ॥

ఈ స్థితి కలుగనంతవరకు ఎవరికీ శాంతి లభించదు. భఁవర్ గుఫా, సోహంగం వరకు నేననేది, మనసు యొక్క ఆటలే నని తెలియనంతవరకు ఆ ఆటను వదలనంతవరకు ఎవరూ శబ్దప్రకాశ మండలమైన సత్ పదానికి చేరుకోజాలరు. తమలోతాము లీనమవటం తెలిసిన వారు ప్రకాశాన్ని చూసే, శబ్దాన్ని వినే వస్తువులో లయం చెందుతారు. ఆ వస్తువే ప్రతి వ్యక్తి మూలం తనలోని తాను! అదే అకహ, అపార, అగాధ, అనామం యొక్క అంశం.

ఇతనా ఊంచా జో కోయీ చఢే, రూప్, రంగ్, రేఖా సే టరే ।

మీరొస్తారు. నాపైన ఒక బాధ్యత ఉంది. నా కర్తవ్యాన్ని నిర్వహించాలను కుంటాను. గురువులు జనతకు సత్యాన్ని చెప్పలేదు. గద్దెలకోసం, తమ తమ గౌరవాదరాలకోసం, రోచక, భయానకమాటలు చెప్పి జనులను తమ వెంట తిప్పుకున్నారు. 30-30, 40-40 సంవత్సరాలనుండి కొందరు అభ్యాసాలు చేస్తుంటారు. ఎవరికీ ఏమీ దొరకలేదు. కొందరు అది తమ తప్పేనని తెలుసుకున్నారు. తరువాత శాంతి లభించింది. తమ లోపం తెలుసుకొనక గురువులను నిందించేవారు కూడా చాలా మందే ఉన్నారు.

అసలైన సత్య గురువు నీలోపలే ఉంటాడు. అది నీ మూలమే! నీవు జీవనమంతా ఏం చేశావోనని ఒకవేళ నీవు నీ జీవితంవైపు దృష్టి ప్రసరిస్తే వాస్తవం, సత్యం గురించి నీకు తెలుస్తుంది. మరి బాహ్య గురువును వదలివేయాలా? అని నీవు ప్రశ్నిస్తావు. విను. ఈ అభిప్రాయం వలన నీకు లాభం కలుగదు. అనుకరించటం వలన ఏమీ జరగదు. ఎవరి అదృష్టంలో వుంటే వారికే ఇది లభిస్తుంది. ధన్నా భక్తునికి రాతిలో నుండి లభించింది. ఇవాళ జనులు రాళ్ళనే పూజిస్తారు. వారికి ఎందుకు ఏమీ లభించటం లేదు? వారి పనులు ఎందుకు నెరవేరటం లేదు? ఇదంతా వ్యక్తుల విశ్వాసంపై ఆధారపడి ఉన్నాయి. కానీ విశ్వసించటం కూడా మన వశంలో లేని విషయం.

జిస్ పర్ దయా ఆద్ కర్తా కీ, సో యహ నేహమత్ పావే ।

ఇవాళ గురుమతం జోరు తగ్గి పోయింది గానీ ఎవరూ సత్యాన్ని చెప్పలేదు. అందుకే జనులు నిరాశకు లోనయ్యారు. ఈ వ్యక్తి రాసినట్లే

ఉత్తరాలు రాస్తుంటారు. ఈ అభిప్రాయం, అవేశం అందిరి లోపలా ఉంటుంది. కానీ ఎవరూ చెప్పరు. బయట అంశాలను చూసేవారి విశ్వాసం ఇవాళైనా తగ్గవచ్చు. రేపైనా తగ్గవచ్చు. అందుకే నేను బోధనా పద్ధతిని మార్చాను. సత్యాన్ని అర్థంచేసుకొనండి. నియమాలపై నడవండి. ఆచరించండి. అప్పుడే గమ్యస్థానానికి చేరుకుంటారు.

మాయా ఛాయా ఏక్ హై, దోనో మే సార్ కీ గమ్ కహాం ।
యహ సమఝ్ ఆ జాయె, హోగా ఫిర్ ఉదాస్ న తూ కభీ ॥

గురువు దయపైన విశ్వాసం పెట్టుకొనండి. గురువు దయ ఏమిటి? గురువు బుద్ధినీ తెలివినీ ఇస్తాడు. మాయ, ఛాయల చిరునామా ఇస్తాడు. నాకిది అర్థమయ్యేదికాదు. ఒక అజ్ఞాన భక్తుడు ఉండేవాడు. మీ అనుభవాల వలన నాకు ఇది బోధపడింది. అందుకే మిమ్మల్ని నేను నా సద్గురువుగా భావిస్తాను. మనలో లోపలి నుండి వెలువడుతున్న ఆశే మాయ. దాని వలన లభించే ఫలమే ఛాయ. ఆయన దయకు కృతజ్ఞతగా సేవించాలనుకున్నాను. ఇప్పుడు హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ శరీరం లేదు. అసలైన దాతా దయాల్ జీ నా లోపల ఉన్నాడు. బయట ఈ సత్సంగీలే నా సత్ గురువులు. నేను మొన్న భీల్‌వాడా వెళ్ళాను. ఎందుకు వెళ్ళాను? ఒకటి - నా లోపల నా సద్గురు స్వరూపులైన సత్సంగీయులను సేవించుకునే హృదయపు ఆవేశం ఉంది. అందుకే అక్కడికి వెళ్ళి కృషన్‌జీకి, దయాల్ దాస్‌లకు తలవంచిమొక్కాను. రెండవది వారికి ఒక విషయం వివరించాలని ఏమని? గౌరవం, ఆదరం, గొప్పదనాలలో చిక్కుకొనవద్దనీ, మీ జీవితం వృధాగా నష్టపరుచుకోవద్దనీ! ఎందుకంటే ఇవాళ రేపటి గురువులు తప్పుగా భావిస్తారు. మూడవది కర్మ పరిభ్రమణం కూడా కారణమే! ఎవరి నుండి తీసుకోవాలో వారి నుండి తీసుకోవాలి. ఎవరికి ఇవ్వాలో వారికి ఇచ్చేయాలి. ఎలాంటి స్థితిలోనూ ఇవ్వాల్సిందే! ప్రపంచపు చక్రంలో ఉన్నవారి అజ్ఞానం నాశనం కాదు. ఎందుకంటే వారికి ప్రపంచం కావాలి. వారికి అజ్ఞానం అపసరం. వారు అలాగే విశ్వాసం పెంచుకుంటే ప్రపంచం లభిస్తుంది. సాంసారిక కోరికలు కలిగి ఉండే వారికై అజ్ఞానం ఆవశ్యకం. తమ నిజగృహానికి వెళ్ళగోరే వారికి జ్ఞానం అవసరం. జ్ఞానం అందరి కోసం కాదు. ఒక్కరి ఆధారం, సహాయం పట్టుకున్నవారు

సఫలురవుతారు. కానీ ఇవాళ రాముణ్ణి పూజించి, రేపు కృష్ణుణ్ణి పూజించి, మరోసారి దేవిని పూజించి, ఇంకోసారి గురువును పూజించి ఈ క్రమంలో ఒకసారి ఒకచోటికి వెళ్తాడు. మరోసారి మరోచోటికి వెళ్తాడు. ఎందుకంటే అతనికి ఎక్కడా విశ్వాసం లేదు. అందుకే అతడు అసఫలుడవుతాడు. ఆ సర్వేశ్వరుడు పరమాత్మ అందరిలో, అన్నిటిలో, అంతటా ఉన్నాడు. కానీ జీవికి విశ్వాసం లేదు.

కైసే అపనే రూప కీ ఆతీ సమఝ్ ప్యారే తుఝే ।
ఆయా వర్ష్ మే పక్ష మాస్ మే గురు కే పాస్ న తూ కభీ ॥

నీవెప్పుడూ గురువు దగ్గరికే రాలేదు. ఇక నీకు వాస్తవం ఎలా అంతుపడుతుంది? లోకులు నన్ను విశ్వసిస్తారు. వారి విశ్వాసం కారణంగా వారి పనులు జరుగుతుంటాయి. కానీ బాబాజీ నా పని చేశాడని లోకులనుకుంటారు. అందుకే వారి అజ్ఞానాన్ని తొలగించేటందుకు నేను సత్యాన్ని చెప్పాను.

నామ్ సే మిట్ తే హై సంకట్, నామ్ గురు కా మంత్ర్ హై
నామ్ సే కాటా హై మాయా జాల్, ఫాఁస్ న తూ కభీ ॥

మరి నామం అంటే ఏమిటి? గురు మంత్రమే నామం. గురువుగారి సలహా పరామర్శ నీ ప్రకృతి ననుసరించి గురువు చెబుతాడు. నీకై అదే నామం. గురువు ఆజ్ఞను ఆచరించని వారికి ఏమీ లభించదు. వారు నామం ఎంతైనా జపించనీ గాక!

అబ్ సంభల్ జా నామ్ మే, విశ్రామ్ ఆఠోఁ యామ్ లే ।
కియా రాధాస్వామీ నామ్ సే, దుఃఖ్ కా నాశ్ న తూ కభీ ॥

సుమిరణతో దుఃఖ నాశనం కాదు. ధ్యానంతో కాదు. చుట్టు ప్రక్కల స్థితులలో ఏదైనా కష్టం దూరం అవుతుంది. కానీ తమ కర్మయొక్క చక్రాన్ని, గతిని విచారంతో, ధైర్యంతో ఎదిరించాలి. నీవు ఆధారం, సహాయం తీసుకోవాలి. అది ప్రేమతోనైనా తీసుకో, జ్ఞానంతో, అనుభవంతోనైనా తీసుకో. మనం మనసుకు సహాయాన్ని, ఆధారాన్ని, ధైర్యాన్ని ఇవ్వాలి. నేను ఇప్పటికీ హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ రూపం సహాయం తీసుకుంటూ ఉంటాను.

గురు మహారాజ్ మంత్రం ఊది స్థితిని మార్చేస్తారని సామాన్యులనుకుంటారు. ఒకప్పుడు నా స్థితి కూడా ఇలాగే ఉంది. కానీ వ్యక్తి యొక్క విశ్వాసం పనిచేస్తుంది. బొంబాయిలో ఉండే ఒక వ్యక్తి మిస్టర్ రసూల్‌లో అన్ని రకాల అవగుణాలుండేవి. నాకు అతడు తెలియదు. నేను బొంబాయికి వెళ్ళాను. అతడు బహుశా నా సత్సంగానికి వచ్చాడు కాబోలు. నా సత్సంగాన్ని విన్నాడు కాబోలు. నాకు తెలీదు. గత సంవత్సరం అతడు హోషియార్ పూర్‌కు నా దగ్గరికి వచ్చాడు. "బాబాజీ! నాలో లేని అవగుణమే లేదు. మీరు బొంబాయికి వచ్చారు. నేను మిమ్మల్ని దర్శించుకున్నాను. మీ సత్సంగం విన్నాను. మీ దయవలన నాలోని అవగుణాలన్నీ తొలగిపోయాయి. ఇప్పుడు నేను ప్రతిదినం రెండు రూపాయల పువ్వులు మీ ఫోటోకు అర్పిస్తాను. ఇప్పుడతడు ప్రతి నెలా ఇక్కడికి నూటాయాభై రూపాయలు పంపుతాడు.

నేను మీకు చెప్పాలనుకుంటున్నాను. నాకు అతడు తెలియదు. అతని అవగుణాలను ఎవరు దూరం చేశారు? నేనైతే ఏమీ చేయలేదు. ఏ వస్తువుకైనా అంశంకైనా సమయం వచ్చినప్పుడు ప్రకృతి ఏదో ఒక ఏర్పాటు చేస్తుంది. ఎవరిలోనుండైనా అవగుణాన్ని నేను తీసేయగలిగితే అందరి అవగుణాలూ దూరం చేస్తాను.

ఓ సర్వాధారుడా! చిన్నప్పటి నుండే నాలో నీ అన్వేషణ ఉంది. నిన్ను, నీ లీలను తెలుసుకునే కోరిక ఉంది. నీ లీలకు అంతం లేదనీ, దానిని ఎవరూ తెలుసుకోలేరనీ బోధపడింది. ఇప్పుడు ఏ మాటపై నిల్చోవాలి? శరణాగతమ్.

తేరీ లీలా కౌన్ సమఝే, తూతో అపరమ్ పార్ హై ।
ఏక్ దృష్టి సే తేరీ, దుఃఖయోఁ కే బేడా పార్ హై ॥

ఆ సర్వాధారుడు ఒక శక్తి. ఆ శక్తి నుండే అన్నీ అవుతాయి. పూర్వజన్మాల కర్మల కారణంగా యశస్సు లభించేదుంటే లభిస్తుంది. కానీ అనుచితరీతిలో దేని లాభాన్నీ నేను పొందలేదు.

*అందరికీ రాధాస్వామి*

# సత్సంగం

## 15–04–1973

# మంగళం అశబ్ద అరూప

మంగళం అశబ్ద అరూప, శబ్ద రూప స్వామీ ।
మంగళం అలఖ అనామ్, అగమ నామ నామీ ॥

మంగళం దీనబంధు, దీన నాథ దాతా ।
మంగళం అభేద భేద, ఆనంద ఘన్ త్రాతా ॥

మహిమా అనంత్ ఆది, అంత్ కౌన్ గావే ।
భేద్ తేరా కౌన్ జానే, కౌన్ కహ సునాయే ॥

సంత్ భేస్ ప్రగట్ జగత్, జీవ్ కో చితాయా ।
కాల్ కర్మ ఫంద్ కాట్, ధుర్ లే పహుఁచాయా ॥

ప్రథమ తత్వ నిజ స్వరూప, పద కమల్ నమామీ ।
గాఁవూఁ ధ్యావూఁ రాత్ దివస్, భజూఁ రాధాస్వామీ ॥

రాధాస్వామి !

సత్‌గురువు బయట ఉన్నాడని అనుకునే వాణ్ణి. ఆయన లాహోర్లో ఉంటారని కొన్నిసార్లు, ధామ్‌లో ఉంటారని కొన్నిసార్లు అనుకునేవాణ్ణి. బస్రేబగ్దాద్‌లో నాకు మూడు నెలల శలవు దొరకగానే ఎంతో ఇష్టంగా సంతోషంగా ధామ్‌లో ఉండేవాణ్ణి. హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ నాకు బోధించేవారు. నా పేరిట శబ్దాలు రాసేవారు.

ఫకీర్ గురు తో తేరే పాస్, తేరే తన్ మే తేరే మన్ మే తేరే స్వాంసో స్వాఁస్।

కానీ నాకు బోధపడేది కాదు. హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ మీ మేలు కోసం నాకీ పని ఇవ్వలేదు. నాకు సత్యాన్ని అనుభవ పూర్వకంగా

తెలియటంకోసం, ఈ మూర్ఖునికి వాస్తవం యొక్క చిరునామా తెలియాలని నాకు గురుపదవిని ఇచ్చారు. ఇవాళ రేపు ప్రతి మనిషీ తను గురువు కావాలనుకుంటాడు. ఎవరైతే సేవ చేసి ఉన్నారో అర్థంచేసుకోలేక పోతున్నారు. ఇంకా ఇప్పటికీ అటూ ఇటూ గాకుండా ఉన్న వారిని గురువులుగా నియమిస్తున్నారు సంతులు. హుజూర్ దాతా దయాల్ జీ మహారాజ్ నాకీ మాటే చెప్పారు. నేనాయన వెనక తిరిగేవాడిని. గురువు రూపం చూసేందుకు ప్రయత్నం చేసేవాడిని. వాణిలో వస్తుంది -

గురు మోహే అపనా రూప్ దిఖావో
యహ రూప్ మోహే ప్యారా లాగే ఇసీసే ఉస్ కో దరసావో ।

నేను కూడా ఇదే వ్యామోహంలో ఉండేవాణ్ణి. కనుక ఆయన నాకీ పని అప్పగించారు. నేను గురువును కాను. మహాత్ముణ్ణీ కాను. గురువును కావాలనే కోరికా నాకు లేదు. ఈ కమాల్ పూర్‌కు చెందిన అమ్మ ఉంది. నేనీమెకేం ఇచ్చాను? నేను తన అంతరంలో దర్శనమిచ్చాననీ, మూడు సంవత్సరాలలో స్థానాలనన్నిటినీ దాటించానని భావిస్తుంది. నేనీమెకు గురు పదవిని ఇచ్చాను. స్త్రీలకు నామదానమిమ్మని ఆజ్ఞాపించాను. ఇప్పుడీమె కళ్ళు తెరుచుకున్నాయి. ఇతరులు తనతో "అమ్మా! మీరు నాకీ పని చేశారు,ఆ పని నెరవేర్చారు" అని చెబుతుంటే అలా వెళ్ళి పనులు సాధించింది తను కాదు గనుక గురువంటే ఎవరో ఆమెకు బోధపడింది. గురువు నా దగ్గర ఎలా ఉన్నాడనేది నాకు అర్థమయ్యేదికాదు. నాకు ఈ తెలివి మీ వలన కలిగింది. నేనిచ్చిన సత్సంగాలలో నేను చెబుతున్నవాటిని ఆలోచించాలి. నేనెక్కడికీ వెళ్ళను. ఎవరి అంతరంలోనూ సాక్షాత్కరించను. సాక్షాత్కరించానని కూడా నాకు తెలియదు. కొందరు తమలో నా రూపాన్ని విశ్వసించి ఏర్పర్చుకుంటారు. ఆ రూపం వారికి సాయపడుతుంది. ఏ మహాత్ముడూ ఈనాటి వరకు ఇలా పబ్లిగ్గా ప్లాట్ ఫారంపైన ఈ రహస్యాన్ని వెల్లడించలేదు. ఇలా చెబితే పైసలు దొరకవు, గౌరవం లభించదు, ఆదరణ లభించదు. గురువు సదా తన దగ్గరే ఉన్నాడని ఏ మనిషి కైనా విశ్వాసం ఏర్పడితే అతడిక ఫకీర్ చంద్ దగ్గరికి ఎందుకు వెళ్తాడు? వెళ్లాల్సిన అవసరం ఏముంటుంది? అలా వెళ్ళాలన్న అంశమే సమాప్తమవుతుంది. గురువు నా దగ్గరే ఉన్నాడన్న విశ్వాసం నాకెలా కుదిరింది? కేవలం మీ వల్లనే మీ

మాటలు, అనుభవాలు విన్నాక నా కళ్ళు తెరుచుకున్నాయి. అహో! అసలు విషయం ఏమై ఉంది? నేనేం అనుకున్నాను? కానీ మీకు శిక్షణ ఒకందుకు హానికారకంగా కూడా అవుతుంది. ఎందుకంటే మీరు ప్రపంచాన్ని కోరుకుంటారు. మీకు ప్రపంచం అవసరం మీలాంటి వారి కోసం సంత్ మతం కాదు. సంత్ మతం ఎవరికి అవసరం?

విషయన్‌సే జో హోయె ఉదాసా, పరమారథ్ కే జా మన్ ఆసా ।
ధన్ సంతాన్ ప్రీతి నహీం జాకే, ఖోజత్ ఫిరే సాధు గురు జాగే ॥

సంత్ మతం యొక్క ఉన్నత శిక్షణ ప్రజలందరి కోసం కాదు. మేం గురువులం. మా పేరు, గౌరవం, ప్రతిష్ట, ఆశ్రమాలు పెంచుకోవడానికి ఎవరొచ్చినా నామదానమిస్తుంటాం. శిష్యులను చేసుకుంటూ పోతాం. మొత్తం ప్రపంచానికి ఈ శిక్షణ ఉద్దేశించలేదు. లోకానికి వేదమార్గం అవసరం. మీరే ఆలోచించండి. ఓ మనిషి తన విశ్వాసంతో నా రూపం ఏర్పర్చుకొని దానితో పనులు నెరవేర్చుకున్నాడు. అలా వెళ్ళింది నేను కాదు గనుక రుజువైపోయిందేమిటంటే మనిషి ఆలోచనావిచారాలలో, కోరికలో, కాంక్షలో ఎంతో శక్తి ఉంది. అది ఒక స్థూల రూపాన్ని పుట్టించగలుగుతుంది. "ఫకీర్! నీ నావను సత్సంగీయులే దాటిస్తారు" అన్నాడు దాతాదయాల్. నిజంగానే దాటించారు. ఆలీగఢ్‌లో యాదవ్ రామ్ ఒక హెడ్ మాస్టర్. చాలా సంవత్సరాల కిందటి విషయం. నేను అక్కడ సత్సంగమిస్తున్నాను. ఈ మాటే ప్రస్తావించాను. జనులు నా రూపాన్ని ఏర్పర్చుకుని దర్శించుకుంటారు. ఆ రూపం వారి పనులు నెరవేరుస్తుంది. కానీ అలా వెళ్ళింది నేను కాను, నాకా విషయమే తెలియదు అని చెబుతుండగా కబీర్ సంప్రదాయానికి చెందిన ఒక వ్యక్తి లేచినిల్చుని "నేను వెళ్ళను అని మీరు చెబుతున్నారు. ఐతే మేం అబద్ధం చెబుతున్నామా?" అన్నాడు. "ఎందుకు"? అన్నాను. అతడో డైరీ తీసి చూపాడు. 26వ జూన్ (సంవత్సరం నాకు జ్ఞాపకంలేదు) నాడు నేను వరేతీ నదీ తీరంలోని ఇసుకలో ఉన్నాను. ఈ సాధువు కూడా నాతోనే ఉన్నాడు, అక్కడికి మీరొచ్చారు. చేతిలో ఇదే కర్ర ఉంది. "మనుష్యబనో" లో మీరిక్కడికి వస్తారని కార్యక్రమ వివరాలేం లేవు గదా? ఇలా వచ్చేరేం? ఎలా వచ్చారు?" అని అడిగాం. మీరన్నారు. "జనులకు నేను తెలుసు. నేను ప్రతిచోటా ఉంటాను.

నీవు నీ ఇంటికి వెనక్కి వెళ్ళిపొమని చెప్పడానికి వచ్చాను" అన్నారు. ఈ మాట చెప్పి మీరు అంతర్ధానమయ్యారు. నేను ఆశ్చర్యచకితుడనయ్యాను ఆ కబీర్ పంథాయి సాధువు, యాదవరామ్ ఇద్దరూ నన్ను చూశారు. నీవు ఇక్కడ వరేతీలో ఎలా వచ్చావు అని అడిగాను. "నేను మీ సత్సంగం సాయంకాలం విని ఎనిమిది గంటలక్కు ఇల్లు చేరుకునే వాణ్ణి. కొందరు సత్సంగీయులు వచ్చారు గనుక ఆరోజు కొంత ఆలస్యం జరిగింది. ఆలస్యంగా ఇంటికి వెళ్ళాను. కనుక భార్య కోపంగా "ఇంట్లో పిల్లలు ఆకలితో ఉండగా నీవు సత్సంగానికి వెళ్తుంటావు. ఆలస్యంగా వస్తుంటావు. ఇళ్ళలో శాంతి నెలకొల్పమని మీకు చెప్పారు" అని అనటంలో నేనేం మాట్లాడక మౌనంగా ఉండిపోయాను. కోపం వచ్చింది. గానీ నేనేం వ్యక్తం చేయలేదు. ఉదయం ఐదు గంటలకు వాహ్యాళికి వెళ్ళి ఏడు గంటలకు తిరిగి వచ్చేవాణ్ణి. ఆ రోజు నేను తిరిగి వెళ్ళలేదు. కోపంతో ఇల్లు వదిలివెళ్లిపోయాను కాబోలని నా భార్య అనుకుంది' అన్నాడతడు. అతని భార్య నన్ను పూజించేది. ఆమె నా ఫోటో ఎదుట ప్రార్థన చేసి స్పృహ తప్పింది. ఆమె భావన, ఆలోచనలోని బలం అక్కడ నా రూపం ధరించి ఇంటికి తిరిగి వెళ్ళమని ఆమె భర్తకు చెప్పింది. ఈ ఉదాహరణ మీకెందుకు చెబుతున్నానంటే మీకు నమ్మకం ఏర్పడాలి. మీ మనసు సంకల్పంతో లేదా నీ భావనలో, ఉహలో, ఆలోచనలో ఒక దృఢమైన బలం ఉంది. మీరు ప్రపంచంలో సుఖంకోరుకుంటే అందుకు మనసులో సత్యమైన కోరిక సత్యమైన భావన, ఆలోచన ఉండాలి. యాదవ రామ్ భార్య యొక్క సత్యమైన భావం నా రూపం ధరించింది. కానీ జనం ఇళ్ళలో పోట్లాడుకుంటూ ఉంటారు. భార్య, భర్తకు పరస్పరం పడదు. నిన్న కూడా నా దగ్గరికి ఇద్దరు స్త్రీలొచ్చారు. తమను బాధిస్తున్నారని భర్తలపై ఫిర్యాదు చేయసాగారు. ద్వేషాల భావనలు మనసులో నుండి వెలువడుతుంటాయి. అవి తమ ప్రభావాన్ని తప్పక చూపుతాయి. ఈ కారణంగా ఇంట్లో శాంతి, సుఖాలుండవు. శరీరాన్ని త్యజించేముందు శిక్షణ మార్చమని దాతాదయాల్ నన్ను ఆదేశించారు గనుక బోధనా పద్ధతిని మారుస్తున్నాను. మనిషీ! నీ నడవడి, ప్రవర్తనను, శుద్ధిగా ఉంచుకో. నీ మనసులో ఎవరిపట్లా వైరం, విరోధం, ఈర్ష్య, ద్వేషం పెట్టుకోకు. నీ భావన, ఆలోచనా విచారం, ఊహ నిన్ను మంచిగానైనా చేస్తుంది. లేదా

నిన్ను చెడుగానైనా చేస్తుంది. మనసు వల నుండి రక్షింపబడాలనుకునేవారు మళ్ళీ ఈ జనన మరణ చక్రంలోకి రాకూడదు. వారు మనసు నుండి పైకి వెళ్లాలి. మనసుకు పైన ప్రకాశం శబ్దాలున్నాయి. అందుకే సంతుల మార్గంలో నివృత్తి మార్గపు ఆలోచనా విచారాలు, భావనలతో ప్రకాశ, శబ్దాల సాధన చూపబడుతుంది. ప్రపంచంలో సరిగా ఉండాలనుకుంటే శివసంకల్పమస్తు సూత్రంపై నడువు, శుభకరమైన ఊహలు, భావనలు, ఆలోచనలు పెట్టుకో. ఎవరికీ చెడుగా ఆలోచించకు. ఎవరి పట్ల ద్వేష భావం పెట్టుకోకు. ఎవరితోనూ జగడాలు పెట్టుకోకు. అందుకే సత్సంగం గొప్ప దనం కలిగి ఉంది. సత్సంగం నుండి సత్యమైన బుద్ధి, సత్యమైన వివేకం, తెలివి లభిస్తాయి. నాపైన ఒక ఋణం ఉంది. ఈ ఋణం తీర్చుకోవడానికి ఈ ప్రయత్నాలన్నీ చేస్తున్నాను. సత్యమేమిటంటే సత్సంగం చేయించటం కూడా మాయాజాలమే! మాయ, దుఃఖం తప్ప ఇందులో మరేమీ లేదు. నేనెంత దుఃఖితుడనో నాకే తెలుసు. ఈ వయసులో హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ కూడా దుఃఖితుడుగానే ఉన్నాడు. ఆయన నవ నిధిరాయ్‌కు ఒక ఉత్తరం రాశారు. "నన్ను ఈ సత్సంగీయుల నుండి దేవుడే రక్షించాలి" అని. మీరు ప్రాపంచిక ఆశలలో నిమగ్నమై గురువుల దగ్గరికి వెళ్ళి వారిని వేధిస్తారు. నన్ను కూడా బాధించిన వారిపట్ల నా మనసులో కూడా భావన వచ్చింది. ఇది నా అనుభవం. నేను సత్యమైన మనిషిని. సత్యం చెబుతున్నాను. అందుకే గురుభక్తి. గురుభక్తి అంటే మీరేం అనుకుంటారో చెప్పనా? బతాశాలు తేవటం, ప్రసాదం తేవటం, బట్టలు తేవటం, డబ్బులివ్వటం - వీటిని మీరు గురుభక్తి అనుకుంటారు. ఇది పిల్లలాట! కానీ తమో గుణం గల జీవులకు ఇది తప్పపని జరగదు. అసలైన గురుభక్తి అంటే ఏమిటి? గురువు సత్సంగంలోకి వెళ్ళు. ఆయన వాణిని విను. దానిని పునఃతలచుకో. ఆచరించు.

సురత్ ప్యారీ కర్ సత్‌గురు కా ధ్యాన్ ।
సతగురు తేరే ఘట్ మే బస్తే తూ ఫిరే చారోఁ ఖాన్ ॥

సత్‌గురువును వ్యాస్‌లో, హోశియార్‌పూర్‌లో, ఆనందపూర్‌లో వెదికే మనిషి తప్పు మార్గంలో ఉన్నాడు. కానీ ఒకటి నిజం. బాహ్య సత్సంగం వలన జీవునికి బుద్ధి, తెలివి లభిస్తుంది. ఇక అతడు బహిర్ముఖి నుండి అంతర్ముఖి

అవుతాడు. నేను బహిర్ముఖునిగా ఉండేవాణ్ణి. దాతాపై నాకు చాలా ప్రేమ ఉండేది. అది తల్లీ, పిల్లల ప్రేమలా ఉండేది.

నేను చెప్పినట్లు దాతాదయాల్ చెప్పి ఉంటే నేను విశ్వసించే వాడిని కాను. "ఫకీర్! నేను నీ అంతరంలోకి వెళ్ళలేదు. సాక్షాత్కరించలేదు." అని ఆయన చెబితే నా విశ్వాసం తొలగిపోయేది. కానీ నా విశ్వాసం తొలగేదికాదు. ఎందుకంటే ఒక దృశ్యం నన్ను అంతగా విశ్వసింపచేసింది. నేనిప్పటికీ, ఈ వయసులో కూడా ఆ భగవంతుణ్ణి దాతా దయాల్ రూపంలో భావిస్తాను. నా గురువు మరణించాడని నేననుకోను. ఏ మాత్రం అనుకోను. నేను మనసులో ఉన్నప్పుడు దాతా దయాల్ రూపాన్ని ధ్యానం చేస్తాను. ఆ రూపాన్ని భగవంతుని రూపంగా నమ్ముతాను. మనసు ఉన్నంతవరకు ధ్యానం చేయటం అది మరవదు. కానీ అసలైన గురువు నా మనసు లోపల ఉంటాడు.

సురత్ ప్యారీ కర్ సత్‌గురు కా ధ్యాన్ ।
సత్‌గురు తేరే ఘట్‌మే బసతే తూ ఫిరే చారోఁఖాన్ ।
భ్రూ కే మధ్య మే తిల్ హై తీసరా వహాఁ హై తౌర్ ఠికాన్ ॥

నీ మనసు చంచలంగా ఉంది. ఓ సారి ఇటు పరుగెత్తుతుంది. మరోసారి మరో వైపు పోతుంది. అది భ్రూమధ్యంలో నిల్చుండి పోయినప్పుడు నీకు నిలకడ లభిస్తుంది. అందుకే మొట్టమొదటి నామం స్మరణ, ధ్యానం. మనిషి తన చిత్తవృత్తి స్మరణ, ధ్యానంలో పెట్టనంత వరకు అతనికి శాంతి లభించదు. నా దగ్గరికి ఎందరో వస్తుంటారు. తమకు శాంతి లేదని చెబుతుంటారు. శాంతి నీకు ఎలా లభిస్తుంది. నీ మనసులోని వృత్తులు ఏకాగ్రమై భ్రూ మధ్యంలో నిలువక పోతే నీ మనసు చంచలత్వం దూరం కాజాలదు. ఈ చంచలత్వాన్ని దూరం చేయాలంటే రాధాస్వామి మతం పద్ధతులను బట్టి మనసు వృత్తులను ఏకాగ్రం చేస్తే మనసుకు శాంతి లభిస్తుంది. నీ ఇష్టమైతే మరేదైనా మతం, పంథ నియామాన్ని బట్టి వృత్తులను ఏకాగ్రం చేసి శాంతిని పొందు. నేను అనుభవంలోకి తెచ్చుకున్నాను. జలంధర్‌కు చెందిన ఓ సివిల్ సర్జన్, అతని భార్య శివరాత్రిని పురస్కరించుకుని నన్ను కలుసుకోవాలని మాస్టర్ మోహన్‌లాల్ ఇంటికి వచ్చారు. అతడు నాతో తన మనసుపై ఫిర్యాదు చేశాడు. "నీవు కాముకుడవు. విషయ వికారాలను

తగ్గించుకో'' అని అతనికి చెప్పాను. మనసు అశాంతికి యాభై శాతం వరకు విషయ వికార జీవనమే మూల కారణం. ఇతడు డాక్టర్ గనుక రాధాస్వామి మతం నామం గురించి చెబితే నమ్మకం పోవచ్చనుకున్నాను. నేనతనికి కొన్ని హితవైన మాటలు చెప్పి "ఒకటి నుండి 100 వరకు అంకెలు లెక్కించు. అ తరువాత 100 నుండి 1 వరకు వెనక్కి లెక్కించు. అరగంట ఉదయం, అరగంట సాయంత్రం రోజూ ప్రాక్టీస్ చేయి'' అన్నాను. ఇలా ఎందుకు అన్నాను? ఒకటి నుండి మనం లెక్కించటం ప్రారంభిస్తే అంకెలన్నీ అలవాటైనవే గనుక ఏకాగ్రత, ధ్యానం ఎటువైపున్నా ఒకటి, రెండు, మూడు, నాలుగు వంటివి చాలా సులభంగా లెక్కిస్తూ పోవచ్చు. కానీ పైనుండి కిందికి 100, 99, 98, 97, 96, 95 ... వంటివి లెక్కించేటప్పుడు ధ్యానం, ఏకాగ్రత పూర్తిగా వాటిలో ఉంటేనే సరిగ్గా లెక్క పెట్టవీలవుతుంది. నలభైరోజుల తరువాత అతడొచ్చి తన కష్టం తొలగిపోయిందని చెప్పాడు. ఇలాగే అశాంతితో బాధపడి, కంగారుపడేవారికి చికిత్స స్మరణ, ధ్యానం, అజపాజపం. మనసును నిలిపి - మనసును స్థిరం చేసి రాధాస్వామి నామాన్ని జపించేవాడివి అయితే రాధాస్వామి అని జపించు. ఓం జపించేలా అయితే ఓమ్ జపించు. వాహె గురు జపించేలా అయితే వాహె గురువు జపించు. మనసును ఏకాగ్రంచేసి, ఒకచోట నిలిపి స్మరణ చేయి. దీని వలన నీ మనసుకు శాంతి లభిస్తుంది. కానీ ప్రాపంచిక స్మరణ చేసేటప్పుడు అభ్యాసం చేసేటప్పుడు వారి ఎదుటి ప్రపంచమే కనిపిస్తుంది. ఒకసారి భార్య వస్తుంది. మరోసారి పిల్లలొస్తారు. మరోసారి కోర్టుకేసులు దావాలు వస్తాయి. లేదా ఇంకేమైనా జ్ఞాపకానికి వస్తాయి. ఈ శిక్షణ, బోధన అర్హులకే బాగుంటుంది. అందుకే నేనెవరికీ నామమివ్వను. లోకులు ఇందుకు సిద్ధంగా లేరని నాకు తెలుసు. నిజం చెబుతాను. నా మాటలను అర్థంచేసుకుని అభ్యాసం చేసే వారికి లాభం కలుగుతుంది. మంచి కీర్తి పేరు నాకు లభిస్తుంది.

మీరు సత్సంగానికి వచ్చారు. మీకు ధన్యవాదాలు. నా దగ్గర ఉన్న దానిని నేను నా వెంట తీసుకువెళ్ళజాలను. ఏ వస్తువునూ నేను దాచి ఉంచలేదు. ఏ పరదానూ పెట్టలేదు దీనివలన ఒక హాని అవశ్యం ఉంది. నేను కూడా పరదా పెడితే నిరంకారీ గురువులపై విమానాలపైనుండి పుష్పవర్షం

కురిసినట్లు నాపై కూడా పుష్ప వృష్టి కురిసేది. కోరినంత ధనం పోగుచేసుకునే వాడిని. కానీ నా గురువు నాకు అలా అనుజ్ఞనివ్వలేదు. నేను సంతుల జీవితాన్ని చూశాను. వారి పిల్లలు ఆజ్ఞాకారులుగా లేరు. వారి ఇళ్ళలో కూడా కలహాలుండేవి. వారిని కూడా రోగాలు బాధించాయి. వారికి ఇవన్నీ ఎందుకు సంభవించాయి అని ఆలోచించాను. ఇవన్నీ వారి వారి కర్మ ఫలితాలేనని ఒప్పుకోకతప్పదు. ఫకీర్ చంద్ గానీ, రాధాస్వామి దయాల్ గానీ, హుజూర్ దాతాదయాల్‌జీ గానీ, గురునానక్ సాహబ్ గానీ, ఎవరైనా గానీ అందరూ తమ తమ కర్మలు అనుభవించారు. ఇది చూసి నేను భయపడ్డాను. "ఫకీర్! నీవు పరదా పెడితే లోకులు నిన్ను గౌరవిస్తారు మర్యాద చూపుతారు. డబ్బులిస్తారు. నీ పేరును ఢంకా మోగిస్తారు. ఈ కర్మలకు ప్రతిఫలంగా నీవెక్కడికి పోతావు? నీకు కూడా ఈ కర్మ అనుభవించక తప్పదు. జనన మరణాల క్రమం సరైనదైతే ఈ కర్మకు ఫలం నాకు ఈ జన్మలోనో లేక వచ్చే జన్మలోనో అనుభవించవలసి వుంటుంది. మీరొచ్చారు. నాపై గడిచిన దానిని నేను చెప్పాలనుకుంటున్నాను. నేను అర్థం చేసుకున్నది, నా పట్ల గడిచినది అంతా తప్పు. ఇది రీసెర్చి పరిశోధన. ఏ దావాలేదు. నేను గురుసేవకుడిని. ఒకవేళ నేను గురువాజ్ఞను పాటించకుంటే నా ఆత్మపై ఒక రకమైన భారం ఉంటుంది. నేను ఆయనకు వాగ్దానం చేశాను. ఆయన శరీరం త్యజించినా నామటుకు ఆయన మృతి చెందలేదు. నేనాయన పేరిట ఒక టెలిగ్రాం పంపాను. అందులో ఇలా రాశాను.

I solomnly promise that I shall spread thy true teachings throughout the Universe to the best of my ability and circumstances.

హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్‌కు ఏ వాగ్దానం చేశానో, ఏ మాట ఇచ్చానో దానిని పూర్తిచేయడానికి, ఆయన ఆజ్ఞను పాటించడానికి ఈ సమస్త ఆట ఆడాను. మీరొస్తారు. మీకు చెప్పాను. మీరు ప్రపంచం వెనక తిరిగితే, ప్రాపంచిక వస్తువులు కావాలనే మీరు కోరుకుంటే ఆ సర్వేశ్వరుని దర్బారులో దేనికీ కొరత లేదు. ప్రపంచం లభిస్తుంది. నీ కోరికలు చాలా ఉంటే అవి నెరవేరడానికి ఆలస్యం అవుతుంది. ఒకే కోరిక ఉంటే నీవు సత్యసంధుడవై దాని వెనక తిరిగితే అది త్వరగా పూర్తవుతుంది. నీ ఏకాగ్రతకు ఫలం నీకు